25-5Pg1exHMNWJQE.qxd:25-5Pg1exHMNWJQE.qxd 1/1/02 7:53 AM Page 1

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
విశాఖపట్నం
fb.com/vaartha Digital
Published from Visakhapatnam, Vijayawada, Hyderabad,Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
26-5-2025 సోమవారం సంపుటి: 31 సంచిక: 114 పేజీలు: 16 వెల: 6.50



ఘనంగా సిఎం చంద్రబాబు గృహప్రవేశం 2లో

## 2014 నుంచి ఎన్డీయే పాలనలో సత్వరాభివృద్ధి

వికసిత్ ఆంధ్రగా రాష్ట్రం ముందడుగు

సుపరిపాలనతో సాగుతున్న 'డబులింజన్' రాష్ట్రాలు

'సిందూర్' విజయం మోడీ సమర్థపాలనకు నిదర్శనం

న్యూఢిల్లీలో జరిగిన ఎన్డీయే సిఎంలు, డి.సిఎంల సమావేశంలో ఏపి డి.సిఎం పవన్ కల్యాణ్



ఆదివారం న్యూఢిల్లీలో జరిగిన ఎన్డిఎ పక్షాల సమావేశం అనంతరం ప్రధాని మోడీతో కలిసి విందు ఆరగించిన డి.సిఎం పవన్

# టాప్-3 దిశగా భారత్

**విజయవాడ,మే25,ప్రభాతవార్త ప్రతినిధి:** భారతదేశం ప్రపంచంలో నాల్గో అతిపెద్దఆర్థిక వ్యవస్థగా ఎదిగిందని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఉద్ఘాటించారు. కేంద్రంలో ఎన్డీఏ వరుసగా మూడోసారి అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి అయిన సందర్భంగా ఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలో ఎన్డీఏ పక్షాల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ మాట్లాడుతూ నీతిఆయోగ్ ప్రకారం, భారతదేశ జిడిపి ప్రస్తుతం 4.18 ట్రిలియన్‌కు చేరుకుందని గుర్తుచేశారు. ఈ చారిత్రాత్మక విజయాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దూరదృష్టి గల నాయకత్వం, అలాగే 2014 నుంచి ఎన్డీఏ ప్రభుత్వ ప్రగతిశీల పాలన నిదర్శనంగా చెప్పుకోవచ్చని తెలిపారు.
గత దశాబ్దంలో, ఎన్డీయే ప్రభుత్వ సుపరిపాలన కింద, భారత్ అభివృద్ధి పయనాన్ని నాలుగు ముఖ్యమైన అంశాలు నడిపించాయన్నారు.. భారత్ వృద్ధి కథ, ఆవిష్కరణ, మౌలిక సదుపాయాలు, చేరిక, డిజిటల్ పరివర్తన ద్వారా నడిచిందని పేర్కొన్నారు. ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించడానికి, వికసిత్ భారత్ 2047 వైపు నడిపించడానికి ఇది ఒక ముఖ్యమైన అడుగని పవన్ కల్యాణ్ ఉద్ఘాటించారు. స్వర్ణ ఆంధ్ర విజన్ 2047 ద్వారా ఆంధ్రప్రదేశ్ ఆవిష్కరణలు, డిజిటల్ మౌలిక సదుపాయాలు, స్థిరమైన అభివృద్ధి ఆశయాలతో జాతీయ అభివృద్ధికి దోహదపడేలా ఆదర్శంగా నిలుస్తుందనిపవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. భారతదేశానికి స్వాతంత్రం సిద్ధించి 100 ఏళ్ళు పూర్తి చేసుకునే నాటికి దేశ లక్ష్యాలకు అనుగుణంగా...మార్గదర్శకత్వం వహించేలా ఏపి ముందుండి నడవడానికి సిద్ధంగా ఉందని పునరుద్ఘాటించారు. సంక్షోభ సమయంలో ధైర్యంగా నిలిచారు. ఏప్రిల్ 22న ఫహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిలో మరణించిన అమాయకులకు సమావేశంలో డిసిఎం నివాళులు అర్పిం >>2



## యోగముద్రలో ఆంధ్ర

### తెలంగాణలో 'డ్రోన్ దీదీ'లు భేష్

### ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ఒక్కటైన భారత్

### మన్ కీ బాత్ 122వ ఎపిసోడ్‌లో ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ, మే 25:** ఆపరేషన్ సింధూర్ చేపట్టి మన దళాలు ప్రదర్శించిన ధైర్యసాహసాలు ప్రతి భారతీయుడిని గర్వపడేలా చేశాయని ప్రధాని మోడీ అన్నారు. ఆదివారం మన్‌కీ బాత్ 122వ ఎపిసోడ్‌లో మోడీ మాట్లాడారు. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత సైన్యం ఆపరేషన్ సింధూర్ పేరుతో పాకిస్థాన్‌లోని, పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేసిన తర్వాత మోడీ మన్‌కీ బాత్‌లో ప్రసంగించడం ఇదే తొలిసారి. ఉగ్రవాదనికి వ్యతిరేకంగా చేసే పోరాటంలో ఆపరేషన్ సింధూర్ కొత్త ఉత్సాహాన్ని నింపిందని ప్రధాని అన్నారు. మన దళాలు ప్రదర్శించిన ధైర్యసాహసాలు ప్రతి భారతీయుడిని గర్వపడేలా చేశాయని చెప్పారు.
దేశ ప్రజలను ఆపరేషన్ సింధూర్ ఎంతగానో ప్రభావితం చేసిందని, అనేక కుటుంబాలు దీనిని తమ జీవితాల్లో భాగం చేసుకున్నాయని తెలిపారు. ఆపరేషన్ సమయంలో జన్మించిన చిన్నారులకు పలువురు సింధూర్ అని పేర్లు పెట్టుకున్నారనిచెప్పారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా దేశమంతా ఏకమైందని, నేడు ప్రతి భారతీయుడు ఉగ్రవాదాన్ని అంతం చేయాలనే సంకల్పంతో ఉన్నాడని ఆయన అన్నారు. ఆపరేషన్ సిందూర్ కేవలం సైనిక చర్య మాత్రమే కాదని, మన ధైర్యం, దేశభక్తితో నిండిన నవభారతానికి నిదర్శనమని ప్రధాని అన్నారు. అనేక నగరాలు, గ్రామాలు, పట్టణాల్లో ప్రజలు తిరంగా యాత్రలు నిర్వహించారని చెప్పారు. పౌర రక్షణ వాలంటీర్లుగా మారేందుకు అనేక నగరాల నుంచి యువత ముందుకు వచ్చారని తెలిపారు. అదేవిధంగా దేశంలో మావోయిస్టుల హింసాత్మక >>2



## మాజీ మంత్రి కాకాణి కేరళలో అరెస్ట్

### అక్రమ మైనింగ్ కేసు

**నెల్లూరు క్రైమ్ మే 25, ప్రభాతవార్త :** మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. నెల్లూరు జిల్లా పొదలకూరు మండలం పరిధిలోని రుస్తుం క్వారీలో జరిగిన అక్రమ మైనింగ్ కేసులో ఆయన నాల్గవ ముద్దాయిగా ఉన్నారు. దీంతో పాటు మరి కొన్ని కేసులు ఆయనపై నమోదయి ఉన్నాయి. తనపై నమోదైన కేసుల్లో తనను అరెస్టు చేయకుండా ముందస్తు బెయిల్ కోసం ఆయన జిల్లా స్థాయి నుండి సుప్రీంకోర్టు వరకు పిటిషన్లు దాఖలు చేశారు. అయితే సుప్రీంకోర్టు కూడా ఆయనకు ముందస్తుబేలు మంజూరు చేయకపోవడంతో అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ఆయన కోసం గత కొంత >>2

# టెక్నాలజీలో ఏపి ముందంజ

- ప్రపంచంలో అత్యుత్తమ రాజధాని కానున్న అమరావతి
- ప్రధానితో జరిపిన చర్చలు సంతృప్తికరం
- విశాఖ మోడల్‌ను అమరావతి, కర్నూలు, తిరుపతికి విస్తరిస్తాం
- డిజిటల్ గవర్నెన్స్‌లో ఎఐ టెక్నాలజీ: సిఎం చంద్రబాబు



**విజయవాడ,మే25,ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రపంచంలో అత్యుత్తమ రాజధానిగా అమరావతిని నిలిపేందుకు చేపట్టిన ప్రతి కార్యచరణ ప్రణాళికబద్ధంగా ముందుకు సాగుతుందని సిఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేసారు.రెండు రోజుల పాటు ఢిల్లీలో జరిగిన పర్యటన విజయవంతమైందన్నారు.రాజధాని నిర్మాణం. పోలవరం-బనచర్ల నిర్మాణం, రాష్ట్రం ఇంధన పునరుత్పత్తి రంగంతో సహా పలు అంశాల్లో ప్రభుత్వం దూరదృష్టితో తీసుకుంటున్న చర్యలను ప్రధాని నరేంద్రమోడీకి వివరించామన్నారు. కీలకరంగాలకు చెందిన ఏడుగురు కేంద్రమంత్రులకు మన రాష్ట్ర విజన్‌పైన., అభివృద్ధి అవసరతలపై సమగ్ర సమాచారాన్ని అందించామన్నారు.
'ఎక్స్' వేదికగా సిఎం చంద్రబాబు ఢిల్లీ పర్యటనపై పలు అంశాలు వివరించారు. స్వర్ణాంధ్ర విజన్ 2047తో 2029 నాటికి రాష్ట్రంలో పేదరికం లేకుండా చేయడమే లక్ష్యంగా ఉన్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. పి4తో ఈ లక్ష్యాన్ని చేరుకునేందుకు బలంగా సంకల్పించామని అన్నారు. వికసిత్ భారత్ 2047 సాకారంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ముందుందని పేర్కొన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థ 4వ నుంచి త్వరలో 3వ స్థానానికి వెళ్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఫ్యామిలీ బెనిఫిట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌తో ప్రతి కుటుంబానికి అందుతున్న లబ్ధిని రాష్ట్ర ప్రభుత్వం డిజిటల్‌గా ట్రాక్ చేస్తోందన్నారు. వన్ ఫ్యామిలీవన్ ఎంట్రప్రెన్యూర్ కార్యక్రమంతో నైపుణ్యాభివృద్ధి, స్వయం ఉపాధి అవకాశాల పెంపునకు కృషి చేస్తున్నామని తెలిపారు.
ప్రతి కుటుంబం నుంచి పారిశ్రామికవేత్త వచ్చేలా పాలసీలు తీసుకొచ్చామని, 175 నియోజకవర్గాల్లో 175 ఎంఎస్ఎంఇ పార్కులు, వన్ డిస్ట్రిక్ట్ వన్ పార్క్‌ను ప్రవేశపెడుతున్నామని వివరించారు. రాష్ట్రంలో టెక్నాలజీ అభివృద్ధికి చేపడుతున్న కార్యక్రమాలను కూడా సిఎం చంద్రబాబు సమావేశంలో వివరించారు. అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలకు అనుగుణంగా విశాఖపట్నంను అభివృద్ధి చేస్తున్నామని, విశాఖ మోడల్‌ను అమరావతి, తిరుపతి, కర్నూలుకు విస్తరించేలా కేంద్రం సహకరించాలని కోరారు. డిజిటల్ గవర్నెన్సులో గూగుల్ ఎఐ టెక్నాలజీ వినియోగిస్తున్నామన్నారు. ప్రతి కుటుంబానికి ఫ్యామిలీ బెనిఫిట్ డిజిటల్ పాస్‌బుక్ క్రియేట్ చేస్తున్నామని వివరించారు. టాటా ఇన్నోవేషన్‌హబ్, ఎఐ ఆధారిత పాలనతో రాష్ట్రం స్టార్టప్‌లకు, ఉద్యోగ సృష్టికి మార్గదర్శకంగా మారిందని అభిప్రాయపడ్డారు.

**జిడిపి, పాపులేషన్ మేనేజ్‌మెంట్, టెక్నాలజీపై చర్చ**

పెట్టుబడులు, తయారీ, ఎగుమతులు,ఉద్యోగ సృష్టి వంటి అంశాలపై దృష్టి పెట్టి, పిపిపి ప్రాజెక్టులకు కేంద్రం వయబిలిటీ గ్యాఫ్ >>2

## జపాన్ కంటే భారత్ ఆధిక్యం

### -మంత్రి సత్యకుమార్ యాదవ్

**విజయవాడ,మే25,ప్రభాతవార్తప్రతినిధి:** భారత్ నిరంతరంగా ఎదుగుతున్నదని,మోడీ నాయకత్వంలో దేశం కీలక ఆర్థిక వ్యవస్థగా మారుతుందని వైద్య,ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు.సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా ట్వీట్ చేశారు. భారత దేశం జపాన్‌ను అధిగమించి ప్రపంచంలో నాలుగవ శక్తివంతమైన ఆర్థిక వ్యవస్థగా నిలిచిందన్న అధికారిక ప్రకటనపై మంత్రి హర్షం వ్యక్తంచేశారు. త్వరలోజర్మనీనికూడా అధిగమించి ప్రపంచంలో అతి పెద్ద మూడవ ఆర్థిక శక్తిగా భారత్‌నిలుస్తుందన్నారు. నరేంద్ర మోడీ ప్రధానిగా బాధ్యతల్ని స్వీకరించినప్పుడు ప్రపంచంలో 11వ స్థానంలో మన దేశ ఆర్థిక వ్యవస్థ నిరంతరం ప్రగతిమార్గంలో పయనించడానికి ప్రధాని మోడీ నాయకత్వంలో 'టీమ్ ఇండియా' చేసిన కృషేకారణమన్నారు. 2047 నాటికి ప్రపంచంలో అతిపెద్ద లేదా రెండవస్థానానికి భారత్ ఎదగడం ఖాయమన్నమంత్రి ఆ దిశగా దేశ ప్రజలంతా ఉమ్మడిగా కృషి చేసి 'వికసిత భారతావని' ఆవిష్కారానికి నడుం బిగించాలని పిలుపునిచ్చారు.

# వాడవాడల్లో యోగా



### నెల రోజులపాటు విస్తృత కార్యక్రమాలు

### రాష్ట్రస్థాయినుంచి గ్రామస్థాయి వరకు యోగాలో శిక్షణలు

### జూన్ 21న అత్యంత భారీగా అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహణ

**విజయవాడ, మే 25 ,ప్రభాతవార్తప్రతినిధి:** జూన్ 21న 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం యోగాంధ్ర 2025 అనే పేరుతో రాష్ట్రవ్యాప్తంగా నెల రోజుల పాటు ప్రచార కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ ఆరోగ్య వైద్య శాఖ ప్రకటించింది.మే 21 నుండి జూన్ 21 వరకు ఒక నెల పాటు రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో యోగా ప్రదర్శనలు, పోటీలు,శిక్షణా కార్యక్రమాలు జరుగుతాయని వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణ బాబు ఒక ప్రకటనలో వెల్లడించారు. ప్రసిద్ధ పర్యాటక కేంద్రాలు మరియు చారిత్రక ప్రాంతాల్లో ప్రత్యేక యోగా ప్రదర్శనలు నిర్వహించి, యోగాభ్యాసం పట్ల ప్రజలలో అవగాహన పెంచాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో రాష్ట్రం, జిల్లా, మండలం, గ్రామ స్థాయిలో వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. యోగా గురువులు, యోగా శిక్షకులు, వాలంటీర్లు,యోగా అభ్యాసకులు,సాధారణ ప్రజలం దరూ ఈ కార్యక్రమాల్లో నమోదు చేసుకుని పాల్గొనవచ్చు.
రాష్ట్రంలోని ప్రముఖ పర్యాటక కేంద్రాల్లో థీమ్ ఆధారిత యోగా ప్రదర్శనలు, పోటీలు, సామూహిక యోగాభ్యాసం వంటి కార్యక్రమాలు జరుగుతాయి.మొదటి వారంలో (మే 2127) అనంతపురం జిల్లాలోని బుగ్గ రామలింగేశ్వర స్వామి దేవాలయం తాడిపత్రిలో, కర్నూల్‌లోని హరిత రాక్ గార్డెన్ ఓర్వకల్‌లో, విజయవాడలోని గాంధీ కొండపై,ప్రకాశం జిల్లాలోని గుండ్లకమ్మ రిజర్వాయర్‌లో యోగా ప్రదర్శనలు జరుగుతాయి. అలాగే అనకాపల్లి, చిత్తూరు, కోనసీమ, శ్రీకాకుళం,పశ్చిమ గోదావరి జిల్లాల్లోని ప్రసిద్ధ క్షేత్రాల్లో కూడా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఈవారంలో యోగా సంఘాలు, యోగాభ్యాసకుల కోసం ప్రత్యేక థీమ్ ఆధారిత కార్యక్రమాలు గుంటూరు >>2



ఆదివారం మహానాడు ఏర్పాట్లపై చర్చిస్తున్న మంత్రులు నారాయణ, మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, గొట్టిపాటి రవికుమార్, రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు తదితరులు

# 'పసుపు' కడప

### మహానాడుకు విస్తృత ఏర్పాట్లు

### రాష్ట్ర మంత్రులంతా అక్కడే మకాం

### నేడు సిఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ రాక

**కడప, మే 25, ప్రభాతవార్త బ్యూరో:** తెలుగుదేశం మహా పండుగ మహానాడుకు 'కడప'ంతా పసుపు మయం అయింది. కడప నగరం అంతా తెలుగుదేశం హోర్డింగులు, బ్యానర్‌లతో పసుపు పండగ లాగా మారింది. ప్రధాన రహదారులు మహానాడు జరిగే కడప-చిత్తూరు జాతీయ రహదారి కూడ పసుపు మయం అయింది. మహానాడుకు ఒక్క రోజే వ్యవధి ఉండటంతో ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. రాష్ట్రమంత్రులు అంతా దాదాపు కడపలోనే మకాం వేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సోమవారం సాయంత్రం 6:20కి కడపకు చేరుకోనున్నారు. రాష్ట్ర ఐటీ మంత్రి నారా లోకేష్ మధ్యాహ్నం >>2



## కలవరపెడుతున్న కొవిడ్ వైరస్

### బెంగళూరులో ఒకరి మృతి

**న్యూఢిల్లీ, మే 25:** దేశంలో మళ్లీ కొవిడ్19 కేసులు కలకలం సృష్టిస్తున్నాయి. కరోనా కారణంగా ఇప్పటికే ఇద్దరు ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు వెల్లడించారు. మరోవైపు పలు రాష్ట్రాల్లో కేసులు నమోదు సంఖ్య ఎక్కువగా ఉన్నట్లు తెలిపారు. కొవిడ్ 19తో మహారాష్ట్రలోని థాణెలో 21 ఏళ్ల యువకుడు మృతి చెందగా, బెంగళూరులో 85 ఏళ్ల వృద్ధుడు ప్రాణాలు కోల్పోయారు. గడచిన 24 గంటల్లో 108 మందికికరోనా పరీక్షలుచేస్తే ఐదుగురికి నిర్ధారణ అయింది. ప్రస్తుతం కర్ణాటకలో 38 కేసులున్నాయి. వీరిలో 32 మంది బెంగళూరు మహానగరంలోనే చికిత్స పొందుతున్నారు. కేరళ, తమిళనాడు, మహారాష్ట్ర, కర్ణాటక, ఢిల్లీలో కరోనా కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయని అధికారులు తెలిపారు. థాణెలో శనివారం కొత్తగా 8 కేసులు నమోదయ్యాయి. ప్రస్తుతం మహారాష్ట్రలో 18 కరోనా యాక్టివ్ కేసులు ఉన్నాయని అధికారులు చెప్పారు. వీరిలో 17 మంది తమ హోం క్వారంటైన్‌లో ఉండి చికిత్స తీసుకుంటున్నారని, ఒకరు మాత్రమే ఆస్పత్రిలో ఉన్నట్లు అధికారులు తెలిపారు. నోయిడాకు చెందిన 55 ఏళ్ల మహిళకు కూడా కరోనా సోకింది. ప్రస్తుతం ఆమె హోం క్వారంటైన్‌లో ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. మధ్యప్రదేశ్‌లో కొత్తగా రెండు కేసులు వెలుగులోకి వచ్చాయి. అలాగే ఉత్తరా ఖండ్‌లోనూ కరోనా కేసులు >>2



# 'రోహిణి'పై వాన తెరలు

### తెలుగు రాష్ట్రాల్లో కమ్ముకుంటున్న కారు మబ్బులు

### ఢిల్లీ, చెన్నై, కేరళలో భారీ వర్షాలు

### దేశ రాజధానిలో 200 విమానాలు నిలిపివేత

**న్యూఢిల్లీ/విజయవాడ, మే 25:** ఎండలు మండించే రోహిణి కార్తెలో భారీ ఎత్తున వర్షాలు కురుస్తున్నాయి. తెలుగురాష్ట్రాలతోపాటు దేశంలోని ఉత్తరాది రాష్ట్రాల్లోకూడా ఇదే పరిస్థితి. మండు వేసవిలో తీవ్రస్థాయి ఉష్ణోగ్రతలు ఉండే రోహిణి కార్తె సహజంగా మేమాసం మూడోవారంలో ఉంటుంది. రోహిణిలో రాళ్ల సైతం పగులుతాయన్న సామెత ఇప్పటికీ నానుతూనే ఉంటుంది. అలాంటి రోజుల్లో ఒక్కసారిగా వర్షాలు కురుస్తున్నాయి. బంగాళా ఖాతం అరేబియా సముద్రాలలో ఏర్పడుతున్న అల్పపీడన ప్రభావంవల్ల ఈ వర్షాలు కురుస్తున్నట్లు అంచనా. దీనికితోడు రావాల్సిన నైరుతి ముందే కూసింది. మేనెల రెండోవారంలోనే అండమాన్ >>2

## పార్టీ, కుటుంబం నుంచి కొడుకును బహిష్కరించిన లాలూ

## కువైట్‌లో 42 వేల మంది పౌరసత్వం రద్దు

5లో

25-5pg2exHMNWJQE.qxd:25-5pg2exHMNWJQE.qxd 1/1/02 7:47 AM Page 1





ఆదివారం కుప్పంలో సిఎం చంద్రబాబు గృహప్రవేశం సదర్భంగా హోమంలో పాల్గొన్న సిఎం కుటుంబ సభ్యులు

# ఘనంగా సిఎం చంద్రబాబు గృహప్రవేశం

## భారీగా తరలివచ్చిన ప్రజలు.. 30 వేల మందికి భోజనాలు

**కుప్పం, మే 25 ప్రభాతవార్త :** చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గంలోని శాంతిపురం మండలం శివపురం వద్ద సిఎం చంద్రబాబునాయుడు సొంతింటి గృహ ప్రవేశ కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. ఆదివారం వేకువజామున ఐదు గంటలనుంచి గృహ ప్రవేశ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, సిఎం సతీమణి నారా భువనేశ్వరి, తనయుడు, రాష్ట్ర ఐటి మంత్రి నారా లోకేష్, మంత్రి సతీమణి నారా బ్రాహ్మణిలు శివపురం వద్ద నిర్మించిన నూతన ఇంటికి దేవతా మూర్తుల ప్రతిమలతో హాజరయ్యారు. అనంతరం నూతన గృహంలో వేదపండితులు పూజాది, హోమాది కార్యక్రమాలు నిర్వహించారు. సిఎం చంద్రబాబు దంపతులు గోపూజ నిర్వహించారు. మంత్రి లోకేష్ సతీమణి నారా బ్రాహ్మణి నూతన ఇంట్లో పాలు పొంగించారు. మధ్యాహ్నం సిఎం చంద్రబాబునాయుడు కుటుంబంతో కలసి భోజనం చేశారు.ముఖ్యమంత్రి గృహ ప్రవేశ కార్యక్రమానికి కుప్పం నియోజకవర్గం నుంచే కాక వివిధ ప్రాంతాలనుంచి సైతం ప్రజలు, కార్యకర్తలు, అభిమానులు ఈ కార్యక్రమంకు హాజరయ్యారు. గృహ ప్రవేశానికి హాజరైన ప్రముఖులు, ప్రజలకు సిఎం చంద్రబాబు నాయుడు, సతీమణి నారా భువనేశ్వరి, మంత్రి నారా లోకేష్, మంత్రి సతీమణి నారా బ్రాహ్మణిలు చక్కటి విందు భోజనాన్ని ఏర్పాటుచేయించారు. దాదాపు ముప్పై వేలమందికి సిఎం కుటుంబీకులు భోజన ఏర్పాట్లు చేశారు. సిఎం చంద్రబాబునాయుడు గృహ ప్రవేశ కార్యక్రమంకు ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్, ప్రభుత్వ విప్ డా॥ థామస్, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, చిత్తూరు ఎంపి దగ్గుమళ్ల ప్రసాదరావు,నగరి ఎమ్మెల్యే భానుప్రకాష్, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి, పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, తిరుపతి ఎమ్మెల్యే జంగాలపల్లి శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యే సికె బాబు, కార్పొరేషన్ ఛైర్మన్ శ్రీదేవి,మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, తదితరులు హాజరయ్యారు. అలాగే జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, కడప ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్, జాయింట్ కలెక్టర్ విద్యాధరి, జిల్లా ఎస్పీ మణికంఠ చ ందోలు తదితరులు హాజరయ్యారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, కడ పిడి వికాస్ మర్మత్, రాష్ట్ర నేత డా॥ బిఆర్ సురేష్‌బాబు, కడ సలహా కమిటీ, కుప్పం టిడిపి సమన్వయకమిటీ, క్లస్టర్,యూనిట్ ఇన్‌చార్జిలతో సమావేశమయ్యారు. రాత్రి కుప్పంలోనే బసచేశారు.

**కుప్పంలో గృహప్రవేశం ఆనందంగా ఉంది : సిఎం సతీమణి నారా భువనేశ్వరి**

కుప్పంలో తమ సొంత ఇంటి గృహప్రవేశం చేయడం ఆనందంగా ఉందని సిఎం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి ఎక్స్‌లో పోస్ట్‌చేశారు. కుప్పం తమ ఇల్లుఅని కుప్పం ప్రజలంతా తమ కుటుంబసభ్యులని పేర్కొన్నారు. 36 ఏళ్లుగా కుప్పం ప్రజలు తమకు అండగా నిలబడ్డారన్నారు. కుప్పం ప్రజలు చూపుతున్న ప్రేమాభిమానాలు, ఆశీస్సులను తాము మరువమని పేర్కొన్నారు. తమ సొంతింటి పండగగా గృహ ప్రవేశంకు నియోజకవర్గ నలుమూలలనుంచి తరలివచ్చిన ప్రజల మధ్య జరిగిన ఈ శుభకార్యం తనకు ఎన్నటికీ గుర్తుండిపోతుందన్నారు.

**ప్రజల ఆశీస్సులు మాకు దీవెనలు : మంత్రి నారా లోకేష్**

ప్రజల ఆశీస్సులు ఎల్లప్పుడూ తమకు దీవెనలుగా నిలుస్తాయని రాష్ట్ర ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఇది తమ కుటుంబ పండగ కాదని అందరి పండగలా ఉందన్నారు. తమ కుటుంబానికి ప్రతి అడుగులో తోడుగా ఉన్న అందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.




ఆదివారం న్యూఢిల్లీలో ఎన్డీయె సిఎంల సమావేశానికి హాజరైన బీహార్ సిఎం నితీశ్ కుమార్, డిప్యూటీ సిఎం సమ్రాట్ చౌధరి

# యోగముద్రలో ఆంధ్ర

>> చర్యలు క్రమంగా తగ్గుతున్నాయని తెలిపారు. దంతెవాడ ఆపరేషన్‌లో జవాన్లు చూపిన సాహసాన్ని ఆయన కొనియాడారు. నక్సలిజానికి వ్యతిరేకంగా పోరాటం ఇకపై కొనసాగుతుందని ప్రధాని స్పష్టంచేశారు. నక్సలిజం నిర్మూలనలో గర్వించే విజయం సాధించామన్నారు.

తెలంగాణలో డ్రోన్ దీదీలపై ప్రధాని మోడీ ప్రశంసలు కురిపించారు. తెలంగాణలోని సంగారెడ్డి జిల్లాలో మహిళలు డ్రోన్లతో వ్యవసాయం చేస్తున్నారన్నారు. గ్రామీణ మహిళలు డ్రోన్ ఆపరేటర్లుగా శిక్షణ పొందారని వివరించారు. పండ్ల తోటలపై పురుగుమందులు, పిచికారీ కోసం డ్రోన్లను వినియోగిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా వీరిని స్కై వారియర్స్‌గా ప్రధాని మోడీ అభివర్ణించారు. సాంప్రదాయ పద్ధతుల కంటే వేగంగా, సమర్థవంతంగా పిచికారీ చేయవచ్చునన్నారు. నీటిని, మందుల వినియోగాన్ని 30-40 శాతంవరకు తగ్గించ వచ్చునని చెప్పారు. మహిళల ఆత్మవిశ్వాసం, స్వావలంబన పెరిగిందని గుర్తు చేశారు. డ్రోన్ టెక్నాలజీని గ్రామీణ స్థాయికి తీసుకెళ్లడంలో ఇది ఒక గొప్ప ముందడుగు అని అభిప్రాయపడ్డారు. కేంద్ర ప్రభుత్వం 'డ్రోన్స్ ఫర్ అగ్రికల్చర్' పథకం కింద మహిళా బృందాలకు రాయితీతో డ్రోన్లు అందిస్తోందని వివరించారు. శిక్షణా కేంద్రాలు, డ్రోన్ లైసెన్సింగ్ సదుపాయాలు కూడా అందుబాటులో ఉన్నాయని ఈ మన్ కి బాత్‌లో ప్రధాని మోడీ చెప్పారు.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 'యోగాంధ్ర'అనేప్రత్యేక ప్రచారాన్ని నెల ముందే ప్రారంభించిందని ఈ సందర్భంగా ప్రధాని మోడీ గుర్తు చేశారు. రాష్ట్రంలోని ప్రజలందరికీ యోగా ప్రాముఖ్యతను తెలియజేయడం, ప్రతి గ్రామానికి, పాఠశాలకు యోగాసాధనను పరిచయం చేయడం ఈ యోగాంధ్ర ఉద్యమం ప్రధానఉద్దేశమని వివరించారు. ఈ ఉద్యమంలో 10 లక్షల మందికిపైగా యోగా అభ్యాసకులు పాల్గొనబోతున్నట్లు ఆయన చెప్పారు. ప్రత్యేక శిబిరాలు, స్కూల్ యోగా ప్రోగ్రామ్‌లు, మెగా ఈవెంట్‌లు ఇప్పటికే ఆంధ్రప్రదేశ్‌లో ప్రారంభమయ్యాయని ప్రధాని మోదీ ఎపి సర్కారుపై ప్రశంసలు కురిపించారు.

# టాప్-3 దిశగా భారత్

>> చారు, సాయుధ బలగాలు చేపట్టిన ఆపరేషన్ సిందూర్ విజయవంతమైందని కొనియాడారు. యుద్ధ వాతావరణం నెలకొన్న సంక్షోభ సమయంలో ప్రధాని మోదీ ధైర్యంగా.. నాయకత్వం వహించారని డిసిఎం ప్రశంసించారు. ఈ చారిత్రక విజయం ప్రధాని నరేంద్ర మోడీ దార్శనిక నాయకత్వానికి, ఎన్డీయే ప్రభుత్వ ప్రగతిశీల పాలనకు నిదర్శనమని పవన్ కొనియాడారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ అధ్యక్షతన భాగస్వామ్య పక్షాల సమావేశం ఆదివారం ఢిల్లీలోని అశోకా హోటల్‌లో జరిగింది. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. "గత దశాబ్ద కాలంగా ఎన్డీయే సుపరిపాలనతో భారత్ అనేక రంగాల్లో వృద్ధి సాధించింది. ఇది కేవలం ఆర్థిక విజయం మాత్రమే కాదు. ప్రపంచంలో నవభారత్‌కు పెరుగుతున్న ప్రాముఖ్యతను ప్రతిబింబిస్తోంది. 3వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగేందుకు, వికసిత్ భారత్2047 వైపు నడిచేందుకు ఇది ఓ ముఖ్యమైన అడుగు" అని పవన్ కల్యాణ్ అన్నారు.అయితే ప్రపంచంలో జపాన్‌ను అధిగమించి భారత్ 4వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించిందని నీతి ఆయోగ్ సిఇఒ బివిఆర్ సుబ్రహ్మణ్యం వెల్లడించిన విషయం పవన్ ప్రస్తావించారు. దేశ స్థూల దేశీయోత్పత్తి 4 ట్రిలియన్ డాలర్లకు చేరుకోవడంతో అమెరికా, చైనా, జర్మనీ తర్వాత స్థానంలో నిలిచిందన్నారు. సమావేశంలో పవన్ మాట్లాడుతూ, ప్రపంచ అస్థిరత, సవాళ్ల నేపథ్యంలో భారత ఆర్థిక వ్యవస్థ స్థిరంగా కొనసాగుతూ ఒక మార్గదర్శిగా నిలుస్తోందని పేర్కొన్నారు. పెట్టుబడులకు గమ్యస్థానంగా దేశం ప్రపంచ దృష్టిని ఆకర్షిస్తుండటంతో ఈ ఘనత సాధ్యమైందన్నారు. 3 ఏళ్లలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించనున్నామని వెల్లడించారు. మోడీ 3.0లో ఏడాది పాలన, ఆపరేషన్ సిందూర్, దేశభద్రత సహా పలు అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో జెపి నడ్డా, అమిత్‌షా, రాజ్‌నాథ్, ఎన్డీఏ సీఎంలు, డిప్యూటీ సిఎంలు పాల్గొన్నారు. ఈ సమావేశానికి ఎపి నుంచి డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ హాజరయ్యారు. ముందస్తు షెడ్యూల్ కారణంగా సమావేశానికి హాజరుకావడం లేదని ఎపి సిఎం నారా చంద్రబాబునాయుడు సమాచారం ఇచ్చారు. ఎన్డీఏ పాలిత రాష్ట్రాల్లో అనుసరిస్తున్న ఉత్తమ విధానాలపై మాట్లాడారు. ఈ భేటీలో ఉత్తమ విధానాలపై పలు రాష్ట్రాల సిఎంలు ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా పవన్ కల్యాణ్ ఓ ట్వీట్ చేశారు. ఇక ఈ సమావేశం అనంతరం ప్రధాని నరేంద్రమోడీతో కలిసి డిసిఎం పవన్ కల్యాణ్ భోజనం చేసారు.ఈ సందర్భంలో పలు అంశాలను,కీలక రాష్ట్రంలో ఉపాధి హామీ పథకానికి నిధుల కేటాయింపు,గ్రామీణాభివృద్ధి డీసీఎం ప్రధానితో మాట్లాడారు.

# 'రోహిణి'పై వాన తెరలు

>> తీరంలో తళుక్కుమన్నాయి. అటుపిమ్మట లక్షద్వీప్, కేరళ తీరాలను తాకాయి. దీనితో ఇక నైరుతి పవనాలు వచ్చేసాయన్న భావన కలుగుతోంది. సహజంగా జూన్‌మొదటివారంలో వచ్చే నైరుతి ఈసారి మే మధ్యస్తంలోనే పలకరించింది. సముద్రతీర జిల్లాల్లో ఈ వర్షాల ప్రభావం మరింతగా ఉంది. ఒక్కసారిగా తెలుగురాష్ట్రాల్లో వేసవి ఉష్ణోగ్రతల ప్రభావం తగ్గిపోయింది.గడచిన మూడురోజులుగా వర్షాలు దంచికొడుతున్నాయి. దేశరాజధాని ఢిల్లీలో అయితే రోడ్లన్నీ కూడా కాలువలమాదిరగా మారిపోయాయి. కార్లు, బైకులు ఇతర అన్ని వాహనాలు కూడా చక్రాలు మునిగేస్థాయిలో వర్షపునీటిలో వెళుతున్నాయి. ఢిల్లీ, తమిళనాడు, కేరళ, హర్యానా, యుపి వంటి రాష్ట్రాల్లో భారీనుంచి అతిభారీ వర్షాలు కురుస్తున్నాయి. ఢిల్లీ అంతర్జాతీయ విమానాశ్రయంలో 200కిపైగా విమానసర్వీసులు నిలిపివేసారు. మరో 49 విమానసర్వీసులను రూటు మళ్లించారు. టెర్మినల్1వద్ద ఉన్న పైకప్పు కూలిపోవడంతో అక్కడ జనసంచారాన్ని కూడా పూర్తిగా నిలిపివేసారు. ఢిల్లీలోని సఫ్దర్‌జంగ్ ప్రాంతంలో 81 మిల్లీమీటర్లు, పాలంలో 68, పూసా 71, మయూర్‌విహార్ 48 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. గంటకు 70నుంచి 80 కిలోమీటర్లవేగంతో గాలులు వీస్తాయని హెచ్చరికలు కూడాజారీచేసారు. కేరళ, తమిళనాడుల్లోని తీరప్రాంత జిల్లాలన్నింటినీ అప్రమత్తంచేసారు.ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని కొన్ని జిల్లాలకు రెడ్ అలర్ట్‌జారీచేసారు. తూత్తుకుడి, పాంబన్‌లలో మూడో నంబరు జారీచేస్తే నీలగిరి, కోయంబత్తూరుల్లో రెడ్ అలర్ట్ జారీ అయింది. కేరళలో 11 జిల్లాలకు వర్షాల ప్రభావం ఎక్కువగా ఉంది. దీనితో స్కూళ్లు ఇతర విద్యాసంస్థలన్నింటిని మూసివేసారు. పతనంతిట్ట, త్రిశూరు, ఇడుక్కి, ఎర్నాకుళం, వాయనాడు, కాసర్‌గడ్ జిల్లాల్లో విద్యాసంస్థలన్నీ మూతపడ్డాయి. వాయనాడు ఎంపి ప్రియాంక గాంధీ వాద్రా తన నియోజకవర్గపరిధిలోని వాయనాడు, మాలాప్పురం, కోజికోడ్‌జిల్లాల కలెక్టర్లతో సమావేశం అయి పరిస్థితిని సమీక్షించారు.

**గంటకు 50 కి.మీ. వేగంతో ఈదురుగాలులు**

బంగాళాఖాంలో అల్పపీడనం ప్రభావంతో రాష్ట్రంలో మూడు రోజులు భారీ వర్షాలు పడే అవకాశముందని విపత్తు నిర్వహణ సంస్థ తెలిపింది. తీరం వెంట గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తాయని తెలిపింది. ఇవాళ అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, కాకినాడ, తూర్పుగోదావరి కర్నూల్, నంధ్యాల శ్రీకాకుళం, ఏలూరు ఎన్టీఆర్ జిల్లాల్లో పిడుగులతో కూడిన వర్షాలు పడతాయని పేర్కొంది. అదేవిధంగా సోమవారం గుంటూరు బాపట్ల ప్రకాశం కర్నూల్ నంద్యాల, అనంతపురం, సత్యసాయి, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో పిడుగులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది. పలు ప్రాంతాల్లో అతి భారీ వర్షాలుకూడా కురుస్తాయని పేర్కొంది. మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. మరోవైపు అరేబియా సముద్రంలో దక్షిణ కొంకణ్-గోవా తీరానికి సమీపంలో తీవ్ర అల్పపీడనం కొనసాగుతోంది. ఇది ఉత్తర దిశగా కదులుతూ వాయుగుండంగా బలపడనుంది. ఇది మరింత బలపడేందుకు అనుకూల వాతావరణం ఉంది. రాబోయే రోజుల్లో తుపానుగా బలపడే అవకాశం కూడా ఉంది. దీంతో ఈ నెల 26,27 తేదీల్లో ఏపీలో భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అంచనా వేసింది

# కేరళలో అరెస్ట్

>> కాలంగా నెల్లూరు పోలీసులతో కూడిన ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం కాకాణిని కేరళ రాష్ట్రంలో నెల్లూరు పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం మేరకు తెలిసింది. ఆయన్ను సోమవారం నెల్లూరు కోర్టులో హాజరు పరిచే అవకాశం ఉందని తెలుస్తోంది. కేరళలో ఎపి పోలీసులు అరెస్ట్ చేసి నట్టు సమాచారం.

# కోవిడ్ వైరస్

>> రెండు నమోదైనట్లు అధికారులు తెలిపారు. చార్‌ధామ్‌యాత్ర సందర్భంగా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు.ఇక మే నెలలో ఇప్పటివరకు ఒక్క కేరళలో అత్యధికంగా 273 కొవిడ్ కేసులు వెలుగుచూశాయి. అటు దిల్లీలో 23 మందికి కరోనా సోకింది. ఎపిలో నాలుగు, తెలంగాణలో 1కేసు నమోదయ్యాయి. అయితే, క్రియాశీలకంగా ఉన్న కేసుల్లో రోగుల పరిస్థితి సాధారణంగా ఉందని అధికారులు చెబుతున్నారు. అందరూ ఇంటి దగ్గరే ఉంటూ చికిత్స తీసుకుంటున్నారని పేర్కొన్నారు.

# పోలవరం ఎత్తిపోతలపై తెలంగాణ అభ్యంతరం

## గోదావరి బోర్డు, చీఫ్ ఇంజినీర్‌కు లేఖలు

**విజయవాడ,మే25,ప్రభాతవార్తప్రతినిధి:** పోలవరం నీటిపారుదల డెడ్ స్టోరేజీ నుంచి నీటిని ఎత్తిపోసేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేసిన ప్రతిపాదనల పట్ల తెలంగాణ ప్రభుత్వం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ మేరకు గోదావరి బోర్డుతో పాటు పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పిపిఎ)కి తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల శాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్ (జనరల్) జి అనిల్‌కుమార్ లేఖ రాశారు. ఎత్తిపోతల పనులు ఆపినట్టు ఏప్రిల్ ఎనిమిదిన జరిగిన పిపిఎ సమావేశంలో పోలవరం చీఫ్ ఇంజనీర్ తెలిపినా, ఈ ఆర్థిక సంవత్సరంలోనే పోలవరం డెడ్ స్టోరేజీ నుంచి నీటిని ఎత్తిపోసేందుకు ఆంధ్రప్రదేశ్ సన్నాహాలు చేపట్టిందని లేఖలో పేర్కొన్నారు. కేంద్ర జలసంఘం (సిడబ్ల్యుసి) అనుమతి లేకుండా ఈ ప్రాజెక్టు చేపడుతున్నారని వివరించారు. దీంతో గోదావరి డెల్టా వ్యవస్థ ప్రయోజనాలకు కూడా నష్టం వస్తుందని లేఖలో తెలియజేశారు. ప్రధానంగా పోలవరం డెడ్‌స్టోరేజీ నుంచి నీటిని పోత్తిపోయడం సబబు కాదని అభిప్రాయపడ్డారు. తెలంగాణ చేపడుతున్న ప్రతి ప్రాజెక్టుకు నీటి లభ్యత లేదంటూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అభ్యంతరం చెబుతూనే ఆంధ్రప్రదేశ్ మాత్రం డెడ్‌స్టోరేజీ నుంచి కొత్తగా ఎత్తిపోతల పథకాన్ని ప్రతిపాదించడం ఎంతవరకు సమంజమని అభ్యంతరం చెప్పారు. డెడ్‌స్టోరేజీ నుంచి ఎత్తిపోతల చేపట్టడం సిడబ్ల్యుసి మార్గదర్శకాలు, అనుమతులకు విరుద్ధమని పేర్కొన్నారు. సిడబ్ల్యుసి వెంటనే జోక్యం చేసుకుని ఆంధ్రప్రదేశ్‌ను అడ్డుకోవాలని కోరారు. పోలవరం ప్రాజెక్టుకు గతంలో కేంద్ర జల సంఘం ఇచ్చిన అనుమతులకు ప్రతిపాదిత ప్రాజెక్టు వ్యతిరేకంగా ఉందని లేఖలో వివరించారు. తక్షణమే గోదావరి నదీ యాజమాన్య బోర్డుతోపాటు పోలవరం ప్రాజెక్టు అథారిటీ జోక్యం చేసుకుని ఈ ప్రాజెక్టుపై ఆంధ్రప్రదేశ్ ముందుకు పోకుండా ఆపాలని విజ్ఞప్తి చేశారు

# వాడవాడల్లో యోగా

>> జిల్లాలో,జైళ్లలో యోగా ప్రోగ్రామ్‌లు తూర్పు గోదావరి జిల్లాలో నిర్వహిస్తారు.రెండవ వారంలో (మే 28 జూన్ 3) గుంటూరు జిల్లాలోని ఉండవల్లి గుహలు, నెల్లూరులోని స్వర్ణల చెరువు, సత్యసాయి జిల్లాలోని పుట్టపర్థి,తిరుపతిలోని ఎస్.వి. జూపార్క్, విశాఖపట్నంలోని తోట్లకొండ వంటి ప్రాంతాల్లో యోగా ప్రదర్శనలు జరుగుతాయి. అంగన్‌వాడీ,ఆరోగ్య కార్యకర్తలు,రైతులు,వైద్య అధికారులు,పోలీసు,మాజీ సైనికులు,రక్షణ శాఖ సిబ్బంది, కుటుంబ యోగా, ఆటో మరియు లారీ సంఘాలు, మత్స్యకారుల కోసం ప్రత్యేక థీమ్ ఆధారిత కార్యక్రమాలు వివిధ జిల్లాల్లో నిర్వహిస్తారు. మూడవ వారంలో (జూన్ 49) అరకులోని గిరిజన మ్యూజియం,కడపలోని సిద్ధవటం కోట,కాకినాడ జిల్లా లోని సామర్లకోట దేవాలయం, విజయనగరంలోని చింతపల్లి బీచ్,అనంతపురంలోని శిల్పరామం వంటి ప్రాంతాల్లో యోగా ప్రదర్శనలు జరుగుతాయి. గిరిజన సమాజం, ఆషా కార్యకర్తలు,స్థానిక సంఘాలు మరియు విబిపీలు, ఉపాధ్యాయులు,వృద్ధులు, సాంస్క ృతిక కళాకారులు మరియు యువజన సంఘాల కోసం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తారు. నాలుగవ వారంలో (జూన్ 1015) గుంటూరు జిల్లా మంగళగిరి ఈకో పార్క్, కర్నూలులోని కొండారెడ్డి బురుజు,తిరుపతిలోని కాళహస్తి,విశాఖపట్నంలోని విశ్వనాథ స్పోర్ట్స్ క్లబ్ వంటి ప్రాంతాల్లో యోగా ప్రదర్శనలు జరుగుతాయి. ఉపాధిహామీ కూలీలు, బ్యాంకర్లు,సహకార సంఘాలు,వ్యాపార సమాజం, దుకాణదారులు,వీధి వ్యాపారులు,పారిశ్రామిక కార్మికులు, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు, వైకల్యులు,ప్రముఖుల కోసం ప్రత్యేక థీమ్ ఆధారిత కార్యక్రమాలు నిర్వహిస్తారు.ఐదవ వారంలో (జూన్ 1621) కోనసీమలోని ఒడపల్లి దేవాలయం, గుంటూరులోని మానస సరోవర పార్క్,అరకులోని మారేడుమిల్లి,తిరుపతిజిల్లా శ్రీహరికోట,నంద్యాలలోని అహోబిలం దేవాలయం, కాకినాడలోని బీచ్ వంటి ప్రాంతాల్లో యోగా ప్రదర్శనలు జరుగుతాయి.గ్రామ మరియు వార్డు సచివాలయ సిబ్బంది, ఇతర ప్రభుత్వ ఉద్యోగులు, పారిశుద్ధ్య కార్మికులు, ఇంజనీరింగ్ విద్యార్థులు, క్రీడాకారులు మరియు యువజన సంఘాలు,స్వయం సహాయక బృంద మహిళల కోసం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తారు.జూన్ 21వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవం రోజున బాపట్లలోని సూర్యలంక బీచ్ మరియు రామాపురం బీచ్‌లలో కార్యక్రమాలు జరుగుతాయి. అలాగే అనంతపురం జిల్లాలోని లేపాక్షి దేవాలయంలో కూడా ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తారు. ఆ రోజున రాష్ట్రవ్యాప్తంగా అన్ని వయస్సుల వారికి యోగా పోటీలు,సామూహిక యోగాభ్యాసం,మిశ్రమ వయస్సుల గ్రూప్ యోగా వంటి కార్యక్రమాలు జరుగుతాయి.ఈ కార్యక్రమంలో భాగంగా 2,600 మంది మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ ఇచ్చి వారి ద్వారా 1,25,000 మంది గ్రామ మరియు పట్టణ స్థాయి శిక్షకులను తయారు చేస్తారు. ఈ శిక్షకుల ద్వారా రాష్ట్రంలో 70 లక్షల మంది ప్రజలకు యోగా శిక్షణ అందించాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించింది.గ్రామ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు వివిధ దశల్లో ఈ యోగా పోటీలు జరుగనున్నాయి.

యోగా పోటీల్లో మూడు వయోవర్గాలు వారు పాల్గొనవచ్చు. 'జూనియర్' వర్గంలో 10 నుండి 18 సంవత్సరాల వరకు, "'యంగ్' వర్గంలో 19 నుండి 35 సంవత్సరాల వరకు, 'సీనియర్' వర్గంలో 35 సంవత్సరాలకు మించిన వారు పాల్గొనవచ్చు. సోలో యోగాలో ఆసనాలు, సూర్యనమస్కారాలు, ప్రాణాయామం,ధ్యానం వంటి విభాగాలు ఉంటాయి. గ్రూప్ యోగా,యోగా పాట, చిత్రలేఖనం, యోగా నాటకం మరియు నాట్యం, క్విజ్, పోస్టర్, నినాదం,వ్యాసం,షార్ట్ ఫిల్మ్,ఫోటోగ్రఫీ,ముగ్గుల పోటీలు కూడా నిర్వహిస్తారు. ఈ పోటీలు ఉదయం 7:30 నుండి సాయంత్రం 6:00 వరకు జరుగుతాయి.రాష్ట్ర స్థాయి పోటీలు ఉదయం 9:00 నుండి సాయంత్రం 6:00 వరకు జరుగుతాయి.

# టెక్నాలజీలోఎపి ముందంజ

>> ఫండింగ్‌కు మద్దతుగా ఉండటంతో జిడిపి వృద్ధికి దోహదపడుతుందని సిఎం అన్నారు. పాపులేషన్ మేనేజ్‌మెంట్‌తో దేశంలో వృద్ధుల శాతాన్ని తగ్గించుకునే అవకాశం ఉందన్నారు. ఈ ఉద్దేశంతోనే స్థానిక ఎన్నికల్లో ఇద్దరు పిల్లల నిబంధన రద్దు, మాతృత్వ సెలవులు పెంపునకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి వందేళ్లు పూర్తి చేసుకునే నాటికి దేశ లక్ష్యాలకు అనుగుణంగా.. మార్గదర్శకత్వం వహించేలా ఎపి ముందుండి నడవడానికి సిద్ధంగా ఉందని పునరుద్ఘాటించారు. వికసిత భారత్2047కి ఆంధ్రప్రదేశ్ వాటాగా 2047 కల్లా 2.4 లక్షల కోట్ల డాలర్ల జిఎస్‌డిపి సమకూర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు సిఎం చంద్రబాబు వెల్లడించారు. ఇందుకోసం చతుర్ముఖ వ్యూహం అనుసరించనున్నట్లు నీతి ఆయోగ్ 10వ పాలకమండలి సమావేశంలో వివరించామన్నారు. తూర్పుతీరాన్ని ఆధారంగా చేసుకొని రాష్ట్రాన్ని ఆగ్నేయాసియా ముఖద్వారంగా మారుస్తామని ప్రకటించారు. ఇంటికో పారిశ్రామికవేత్తను తయారు చేయాలని గమ్యంగా పెట్టుకున్నట్లు సిఎం పేర్కొన్నారు. ఎపిలోని మానవ వనరులు, సహజ వనరుల అనుకూలతను ఉపయోగించుకొని వచ్చే 22 సంవత్సరాల్లో దాదాపు 15 శాతం వరకు వార్షిక వృద్ధి రేటు సాధిస్తామని చంద్రబాబు వివరించామన్నారు.. రాష్ట్ర తలసరి ఆదాయాన్ని 42,000ల డాలర్లకు తీసుకెళ్లాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల మధ్య అంతరాన్ని తగ్గించేందుకు ద్వితీయ, తృతీయశ్రేణి నగరాలనూ గతిశీలంగా తయారుచేయాలన్నది తమ సంకల్పమని ఆయన తెలిపారు.

నైపుణ్యవంతమైన మానవ వనరులు ఎపి ప్రధాన బలమని సిఎం వెల్లడించారు. దేశంలో అందరి కంటే ముందు సాంకేతికతను అందిపుచ్చుకోవడం ద్వారా తెలుగు సమాజం ప్రపంచ వ్యాప్తంగా ప్రభావం చూపుతోందని ఆనందం వ్యక్తం చేశారు. దాన్ని మరింతగా పెంపొందించేందుకు ఆంధ్రప్రదేశ్‌లో ప్రపంచస్థాయి ఐటీ హబ్‌లు, పటిష్ఠమైన డిజిటల్ మౌలిక వసతులు కల్పించి స్టార్టప్స్ సంస్కృతిని ప్రోత్సహించబోతున్నట్లు వివరించారు. ఎపిని అమరావతి, తిరుపతి, కర్నూలు ఓర్వకల్లు, గోదావరి జోన్లుగా విభజించి ప్రాంతీయంగా అభివృద్ధి చేయబోతున్నట్లు సిఎం తెలిపారు. రాష్ట్రంలో అతి పెద్ద నగరమైన విశాఖను ఆర్థిక కేంద్రంగా అభివృద్ధి చేయడానికి మాస్టర్‌ప్లాన్ తయారు చేస్తున్నట్లు వెల్లడించారు.

ప్రస్తుతం అమరావతిలో క్వాంటం వ్యాలీ, ఓర్వకల్లులో డ్రోన్ సిటీ, విశాఖపట్నంలో మెడ్‌టెక్ జోన్లు అభివృద్ధి చేస్తున్నట్లు వివరించారు. వీటికి తోడు విశాఖ చెన్నై, హైదరాబాద్ బెంగళూరు, చెన్నై బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్లలో పారిశ్రామిక నగరాల అభివృద్ధికి శ్రీకారం చుట్టినట్లు తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్‌లో అత్యధిక సంఖ్యలో బ్లూ, వైట్‌కాలర్ జాబ్‌లు సృష్టించి ప్రత్యక్షంగా, పరోక్షంగా పనిచేసే వాతావరణాన్ని కల్పిస్తున్నట్లు చెప్పారు. మోడీ పదేళ్ల పాలన దేశానికి బలమైన పునాదులు వేసిదంటూ ప్రధాని నాయకత్వ పటిమను చంద్రబాబు ప్రశంసించారు. జన్‌ధన్ ఆధార్ మొబైల్, స్వచ్ఛభారత్, జల్‌జీవన్ మిషన్, జిఎస్టీ అమలు, మేకిన్ ఇండియా, ఆత్మనిర్భర్ భారత్, స్టార్టప్, స్టాండప్ ఇండియా, పిఎం గతిశక్తి, నేషనల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పైప్‌లైన్, స్కిల్ ఇండియా కార్యక్రమాలు భారత్‌ను ప్రబలమైన ఆర్థిక శక్తిగా నిలిపేందుకు దోహదం చేశాయని వివరించారు.

## వారం - వర్జ్యం

తేది : 26-05-2025, సోమవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
వైశాఖ మాసం, ఉత్తరాయణం,
వసంత ఋతువు, కృష్ణ పక్షం
చతుర్దశి మ.12.12
భరణి ఉ.8.23, కృత్తిక తె.5.32
వర్జ్యం మ.12.42-3.32
దు.మ.12.31-1.23, 2) మ.3.07-3.59
రాహుకాలం - ఉ.7.30-9.00

## వార్తాఫలం

**మేషం:** కుటుంబంలో శుభకార్యాలు జరుగుతాయి. ఆర్థికాభివృద్ధి సాధిస్తారు. బాకీలు వసూలవుతాయి. వాహనసౌఖ్యం.

**వృషభం :** కీలక నిర్ణయాలలో సొంత ఆలోచనలు శ్రేయస్కరం. దూర ప్రాంతాల నుండి శుభ ఆహ్వానాలు అందుతాయి.

**మిథునం:** ఉద్యోగయత్నాలు ఫలిస్తాయి. నూతన కార్యక్రమాలు చేపట్టి సకాలంలో పూర్తి చేస్తారు. శుభవార్తలు.

**కర్కాటకం:** బంధువులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు. వ్యవహారాలు సత్తనడకన సాగుతాయి.

**సింహం:** నూతన ఒప్పందాల విషయాలలో తొందరపాటు వద్దు. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా వుంటుంది.

**కన్య :** మిత్రులు శత్రువులుగా మారి సమస్యలు సృష్టిస్తారు. ప్రయాణాలలో తొందరపాటు వద్దు. స్వల్ప ధనలాభం.

**తుల :** పనులలో జాప్యం జరిగినా నిదానంగా సాగుతాయి. ఆర్థిక ఇబ్బందులు ఎదురై చికాకులు పెడతాయి.

**వృశ్చికం:** నూతన మిత్రులు పరిచయమై కొత్త కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. సంఘంలో ఆదరణ పొందుతారు.

**ధనుస్సు:** సన్నిహితులను కలిసి కష్ట సుఖాలను పంచుకుంటారు. ప్రముఖుల నుండి విలువైన సమాచారం అందుకుంటారు.

**మకరం:**కుటుంబ సభ్యులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు. వ్యవహారాలలో ఆటంకాలు ఎదురైనా అధిగమిస్తారు.

**కుంభం:** వృత్తి, వ్యాపారాలలో ఆటంకాలు ఎదురై చికాకులు పెడతాయి. ప్రయాణాలు లాభిస్తాయి. వస్తు సేకరణ.

**మీనం:** పెట్టుబడులకు తగిన లాభాలు పొందుతారు. ఇంటా బయటా ప్రోత్సాహం లభిస్తుంది. స్వల్ప ధనలాభం.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# గండవరం జాతీయ రహదారిపై ఘోర ప్రమాదం, ఒకరు మృతి

**కొడవలూరు (నెల్లూరు), మే 25, ప్రభాతవార్త :** మండలంలోని గండవరం జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది.ఆగివున్న ట్రావెల్స్ బస్సును చీమకుర్తి నుంచి చెన్నై పోర్టుకు వెళ్తున్న కంటైనర్ లారీ వేగంగా ఢీకొనింది. విజయవాడ నుండి 40 మంది ప్రయాణికులతో నాగూర్ నాగపట్నం టూర్ వెళుతున్న ట్రావెల్స్ బస్సు ఢీకొనడంఈ ప్రమాదంలో బాబురావు అనే వ్యక్తి మృతి చెందాడు. బస్సులోని 10 మంది ప్రయాణికులకు తీవ్ర గాయాలు చెందారు. కక్ష గాత్రులను 108 ద్వారా నెల్లూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.ఈ సంఘటన తెలుసుకున్న నెల్లూరు రూరల్ డి.ఎస్.పి ఘట్టమనేని శ్రీనివాసరావు పరిశీలన చేశారు. సంబంధిత సీఐ సిఐ సురేంద్రబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# పోలీస్‌స్టేషన్ పైకప్పు కూలిపడి ఎసిపి దుర్మరణం

**ఘజియాబాద్, మే 25:** దేశ వ్యాప్తంగా వర్షాలు దంచి కొడుతున్నాయి. నిన్న రెండు తెలుగు రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు పడ్డాయి. ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, హర్యానాలలోనూ ఇదే పరిస్థితి. శనివారం కురిసిన భారీ వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. పెద్ద పెద్ద చెట్లు నేల కొరిగాయి. ఈ నేపథ్యంలోనే ఉత్తర ప్రదేశ్‌లోని ఘజియాబాద్‌లో పెను విషాదం చోటుచేసుకుంది. భారీ వర్షాల కారణంగా పోలీస్ స్టేషన్ పైకప్పు ఊడిపడిపోయింది. దీంతో ఓ పోలీస్ అధికారి ప్రాణాలు కోల్పోయాడు. సంఘటనకు సంబంధించిన పూర్తి వివరాల్లోకి వెళితే.. ఉత్తర ప్రదేశ్‌లోని ఘజియాబాద్‌కు చెందిన వీరేంద్ర కుమార్ మిశ్రా అంకుర్ విహార్ పోలీస్ స్టేషన్‌లో ఏసీపీగా విధులు నిర్వర్తిస్తున్నాడు. శనివారం రాత్రి పోలీస్ స్టేషన్‌లోనే నిద్రపోయాడు. రాత్రి భారీ వర్షం పడ్డం వల్ల పోలీస్ స్టేషన్ పైకప్పు మొత్తం ఊడి కిందపడింది. ఆ శిథిలాలు మీదపడి వీరేంద్ర అక్కడికక్కడే చనిపోయాడు. ఆదివారంఉదయం కొంతమంది పోలీసులు స్టేషన్‌కు వచ్చారు. స్టేషన్ కుప్పకూలిపోయి ఉండటం గమనించారు. అక్కడే శిథిలాల కింద వీరేంద్ర తీవ్రగాయాలతో కనిపించాడు. ఆ పోలీసులు అతడిని ఆస్పత్రికితీసుకెళ్లారు. వీరేంద్రను పరీక్షించినవైద్యులు అతడు చనిపోయినట్లు ధ్రువీకరించారు.

# 'పసుపు' కడప

>> 2గంటల కల్లా బెంగుళూరు నుంచి విమానంలో కడపకు చేరుకుంటారు. మహానాడు ఏర్పాట్లపై రాష్ట్ర మంత్రుల బృందం కడప స్టేట్ గెస్ట్ హౌస్‌లో చర్చించింది. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, రాష్ట్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, సీనియర్ మంత్రి అచ్చెన్నాయుడు, నీటి పారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస రావు ఇతర మంత్రులు చర్చించారు. మహానాడు వేదికను అచ్చెన్నాయుడు పరిశీలించి ఏర్పాట్లపై పార్టీ పోలిట్ బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసుల రెడ్డి, కడప ఎమ్మెల్యే ఆర్.మాధవిలతో చర్చించారు. మరో వైపు సిఎం పర్యటన నేపథ్యంలో జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్, అన్నమయ్య జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ట్రయిల్ రన్ నిర్వహించారు. మహానాడు వేదిక వద్ద అచ్చెన్నాయుడు, రాజంపేటలో జరిగిన నియోజకవర్గ స్థాయిజనసమీకరణ సమావేశంలో నీటి పారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ తెలుగుదేశం హయాంలోనే రాయలసీమలో సాగునీటి ప్రాజెక్టులు ప్రాణం పోసుకున్నాయి అని వెల్లడించారు. తెలుగు గంగ, కెసి కెనాల్, హంద్రీనీవా సుజల స్రవంతి, గాలేరు నగరి, హెచ్ఎల్‌సీ అన్నమయ్య ప్రాజెక్టు తెలుగుదేశం పార్టీ హయాంలో నిర్మించినవే అని పేర్కొన్నారు. అందుకే సీమ ప్రజలు మహానాడు కోసం ఎదురు చూస్తున్నారని పేర్కొన్నారు. ఇంకా చంద్రబాబు రాయలసీమకు ఏమి చేస్తారో అన్న విశ్వాసంతో కూడ ఎదురుచూపులు చూస్తున్నారని పేర్కొన్నారు. రాయలసీమ ప్రజలు తెలుగుదేశం పార్టీ పట్ల ఉన్న ప్రేమానురాగాలే ఇందుకు నిదర్శణం అన్నారు. రాయలసీమ బిడ్డగా చెప్పుకునే వైఎస్ జగన్‌మోహన్ రాయలసీమకు ఏమిచేశారని ప్రశ్నించారు.

# ఇసుక దాహంతోనే 41మంది జల సమాధి

### యంత్రాలను బయటకు తెచ్చేందుకే అన్నమయ్య ప్రాజెక్టును కొట్టుకుపోయేలా చేశారు: మంత్రి నిమ్మల ధ్వజం

**రాజంపేట అర్బన్, మే 25, ప్రభాతవార్త:** అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకుపోవడానికి వైసీపీ ఇసుక దోపిడినే అని ఇసుకను తరలించేందుకు నదిలో యంత్రాలు, వాహనాలను బయటకు తెచ్చేందుకే ప్రాజెక్టు గేట్లు ఎత్తకుండా 41మంది జల సమాధికి కారకులు అయ్యారని రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. ఆదివారం కడపలో జరిగే మహానాడుకు జన సమీకరణపై రాజంపేట నియోజకవర్గ స్థాయి నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జగన్ హయాంలో ఇసుక దోపిడి పెద్ద ఎత్తున జరిగిందన్నారు. ఇసుక దోపిడితోనే రాజంపేట మండలంలో అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకుపోయిందన్నారు. అన్నమయ్య ప్రాజెక్టు పై భాగాన ఉన్న ఫించా ప్రాజెక్టు కొట్టుకుపోయి పెద్దఎత్తున వరద నీరు వస్తుందని గేట్లు ఎత్తాలని అన్నమయ్య ప్రాజెక్టు అధికారులను కోరిన ఎత్తలేదన్నారు. అందుకు కారణం చెయ్యేరు నదిలో



ఆదివారం రాజంపేటలో మీడియాతో మాట్లాడుతున్న రాష్ట్ర ఇరిగేషన్ మంత్రి నిమ్మల రామానాయుడు, ప్రక్కనే మాజీ మంత్రి పి.పుల్లారావు, జగన్‌మోహాన్ రాజు

ఇసుకను తరలించేందుకు పెద్ద ఎత్తున ఉన్న యంత్రాలు, టిప్పర్లు, ట్రాక్టర్లు ఒడ్డుకు చేరేవరకు గేట్లు ఎత్త వద్దని వైసీపీ నేతలు ఒత్తిడి చేశారన్నారు. దీంతో అధికారులు వెంటనే వరద నీరును కిందికి పంపేందుకు గేట్లు ఎత్తలేదని ఫలితంగానే వరద నీరు విరుచుకుపడి 41మంది మృతి చెందారన్నారు. ప్రాజెక్టు కొట్టుకుపోయి 41మంది మరణించినా సీఎంగా ఉన్న జగన్ ప్యాలస్‌ను వీడి పరామర్శించేందుకు కూడ రాలేదని విమర్శించారు. అయితే ప్రతిపక్ష నేతగా చంద్రబాబు నాయుడు వరదల్లోనే ప్రాజెక్టును పరిశీలించి వరద బాధిత గ్రామాల్లో పర్యటించి వదర బాధితులను పరామర్శించారని గుర్తుచేశారు. ప్రాజెక్టును పునర్నిర్మిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారని ఈ హామీని నెరవేర్చే బాధ్యత తమ ప్రభుత్వమే తీసుకుంటుందని స్పష్టం చేశారు.

కేంద్ర జల సంఘం సూచించిన మేరకు అన్నమయ్య ప్రాజెక్టును పునర్నిర్మిం చేందుకు పరిశీలిస్తున్నామని వెల్లడించారు. అంచానలు కూడ సిద్ధం చేస్తున్నట్లు పేర్కొన్నారు. అంతవరకు రైతు లకు ఇబ్బంది లేకుండా ప్రత్యామ్నాయంగా ఎత్తిపోతలు పథకం ఏర్పాటుచేసే ఆలోచన కూడ ఉందన్నారు. రాజంపేట అసెంబ్లీ ఇంచార్జ్ జగన్‌మోహన్ రాజు మాట్లా డుతూ రాజంపేట నియోజికవర్గం నుంచి 1000వాహనా లను మహానాడుకు జనాన్ని తరలిస్తున్నట్లు పేర్కొన్నారు.

## యోగా డే పేరుతో ప్రజలను విశాఖకు తరలించొద్దు: శ్రీనివాసరావు

**విజయవాడ,మే25,ప్రభాతవార్తప్రతినిధి:** యోగా డే పేరుతో ప్రజలను విశాఖకు తరలించొద్దని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు కోరారు. కోవిడ్ హెచ్చరిక నేపథ్యంలో యోగాపై సర్వే ఆపాలన్నారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. జూన్ 21న విశాఖపట్నంలో ప్రధాన మంత్రి పాల్గొనే యోగా దినోత్సవం కోసం రాష్ట్రమంతటి నుండి ప్రజలను తరలించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాల పట్ల సిపిఎం రాష్ట్ర కమిటీ ఆందోళన వ్యక్తం చేసింది. రాష్ట్రంలో కరోనా కేసులు నమోదవుతున్నాయని, జాగ్రత్తలు పాటించాలని, రాష్ట్ర ఆరోగ్యశాఖ హెచ్చరికలు జారీచేసిన నేపథ్యంలో పెద్దయెత్తున ప్రజలను తరలించడం ద్వారా కరోనా మరింతగా వ్యాప్తిచెందే అవకాశం ఉందని రాష్ట్రప్రభుత్వం గుర్తించాలని కోరారు. కరోనా కేసులు విశాఖ పట్నంలో కూడా నమోదయ్యాయని మంత్రి సత్యకుమార్ స్వయంగా ప్రకటించారని పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగా డే కోసం రాష్ట్ర వ్యాప్తంగా సచివాలయ ఉద్యోగులు ఇంటింటి సర్వే చేస్తూ పెద్ద సంఖ్యలో తరలించేందుకు ప్రయత్నిస్తున్నారని, ప్రధానమంత్రి మెప్పు కోసం చేసే ఇలాంటి చర్యలు ప్రజల ఆరోగ్యానికి హానికరంగా మారుతాయని తెలిపారు. కరోనా హెచ్చరిక నేపథ్యంలో సర్వే తక్షణం నిలిపేయాలని కోరారు.

## కరకట్ట కనెక్టివిటీకి రూ.60లక్షలతో టెండర్లు

**విజయవాడ,మే25,ప్రభాతవార్తప్రతినిధి:** రాజధాని అమరావతిలోని సీడ్ యాక్సెస్ రోడ్డు నుండి కరకట్టకు కనెక్టివిటీ విషయంలో సిఆర్‌డిఏ కీలక నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం సీడ్ యాక్సెస్ రోడ్డు నిలిచిపోయిన దగ్గర నుండి కరకట్ట వరకూ రోడ్డును విస్తరించనుంది. దీనికోసం ప్రభుత్వం టెండర్లను ఆహ్వానించింది. ఈ నెల 26లోపు దరఖాస్తులకు అవకాశం కల్పించింది. ప్రసుత్తం ఉన్న సీడ్ యాక్సెస్ రోడ్డు ప్రారంభం నుండి బికెఎంఎన్ ఆక్వా జంక్షన్ వరకూ కరకట్టకు దక్షిణ భాగంలో కొత్తగా రోడ్డు నిర్మించనున్నారు. తాత్కాలికంగా అయినా రోడ్డును విస్తరించాలనే ఉద్దేశంతో కరకట్టకు ఆనుకుని గతంలో నిర్మించిన మట్టిరోడ్డును తారురోడ్డుగా మార్చి కరకట్టను విస్తరించాలని సిఆర్‌డిఏ నిర్ణయించింది. దీనిలో భాగంగా రూ.60 లక్షలతో టెండర్లను ఆహ్వానించింది. ఈ రోడ్డును వెంకటపాలెంలో సీడ్ యాక్సెస్ రోడ్డుఆగిపోయిన చోట నుండి కరకట్ట దక్షిణ భాగంలో ఆక్వా కంపెనీ వరకూ నిర్మించనున్నట్లు సిఆర్‌డిఏ అధికారులు తెలిపారు. మరోవైపు ఆక్వా కంపెనీ నుండి ఉండవల్లిలో ఇరిగేషన్ వర్క్‌షాప్ వరకూ ఎలివేటెడ్ కారిడార్ రూపంలో రోడ్డును విస్తరించేందుకు అవసరమైన ప్రణాళికను అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సిద్ధం చేస్తోంది. ప్రస్తుతం విజయవా డకు, అమరావతికి అనుసంధానమైన సీడ్ యాక్సెస్ రోడ్డును వెంకటపాలెంలోని ప్రకృతి ఆశ్రమం వరకూ నిర్మించారు. అక్కడ నుండి పెనుమాక రెవెన్యూ పరిధి ఉండటం, రైతులు పూలింగుకు భూములు ఇచ్చేందుకు నిరాకరించడంతో రోడ్డును అంతటితో నిలిపేశారు. ప్రసుత్తం కరకట్ట మీద సింగిల్‌లైను రోడ్డుపైనే ప్రయాణాలు జరుగుతున్నాయి. ముఖ్యమంత్రి కూడా అదే రోడ్డులో వెళ్లాల్సి వస్తోంది. ఇటీవల కాలంలో దీనిపై ట్రాఫిక్ పెరిగింది. రోడ్డు విస్తరణలో భాగంగా పట్టణాభివృద్ధిశాఖ మంత్రి నారాయణ పెనుమాక, ఉండవల్లి పరిధిలో భూములివ్వాల్సిన రైతులతో చర్చలు జరిపారు. కరకట్ట విస్తరించాల్సిన ప్రాంతంలో కొంతమంది ముందుకు వచ్చినా ఇంకా భూములు ఇవ్వాల్సిన రైతులూ ఉన్నారు.

# తిరుమల సమాచారం



## జూన్ 2నుండి తిరుపతి గోవిందరాజస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు

**తిరుమల,మే 25ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలతిరుపతిదేవస్థానమ్ ఆధ్వర్యంలోని తిరుపతిలో శ్రీగోవిందరాజస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు జూన్ 2వతేదీ నుండి 10వతేదీ వరకు వైబవంగా జరగనున్నాయి. ఈ బ్రహ్మోత్సవాలకు 29వతేదీ గురువారం ఉదయం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనున్నారు. బ్రహ్మోత్సవాల్లో ప్రతిరోజూ ఉదయం 7గంటల నుండి 9గంటల వరకు, రాత్రి 7గంటల నుండి 9వరకు స్వామివారి వాహనసేవలు జరగనున్నాయి. వార్షిక బ్రహ్మోత్సవాలకు జూన్ 1వతేదీ ఆదివారం సాయంత్రం సేనాధిపతి ఉత్సవం, అంకురార్పణతో బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుడతారు. జూన్ 2వతేదీ సోమవారం ఉదయం ధ్వజారోహణం ఉంటుంది. గోవిందరాజస్వామికి తొమ్మిదిరోజుల బ్రహ్మోత్సవాల్లో వాహనసేవలు జరిగే వివరాలను టిటిడి వెల్లడించింది. ఈ సందర్భంగా తొమ్మిదిరోజులు టిటిడి అన్నమాచార్యప్రాజెక్టు, దాససాహిత్యప్రాజెక్టుల ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక భక్తి సంగీత కార్యక్రమాలు జరగనున్నాయి. బ్రహ్మోత్సవాల్లో ప్రధానంగా 2జూన్ వతేదీ రాత్రి పెద్దశేషవాహనం, 4వతేదీ ఉదయం సింహవాహనం, 6వతేదీ రాత్రి గరుడవాహనం, 7న రాత్రి గజవాహనం, జూన్ 9న ఉదయం రథోత్సవం, 10న ఉదయం చక్రస్నానంతో ముగుస్తాయి. బ్రహ్మోత్సవాలకు ఆలయాన్ని సర్వాంగసుందరంగా ముస్తాబుచేసే పనులు టిటిడి అధికారులు చేపట్టారు.

# ఒక్క 'లైక్' కోసం ప్రాణాలు వదిలేస్తారా?

### తెలంగాణ ఎమ్మెల్సీ గోరటి వెంకన్న ఆవేదన



'దుఃఖం పండుతున్న నేల' కవితా సంపుటిని ఆవిష్కరిస్తున్న గోరేటి వెంకన్న,రసరాజు,ఘంటశాల నిర్మల తదితరులు

**విజవాడ, మే 25 ప్రభాతవార్త:** రాజ్యాంగ నైతికతను కవులు భుజానికెత్తుకోవాల్సిన అవసరం వుందన్నారు. ప్రజా వాగ్గేయకారుడు, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న. మల్లెతీగ సాహిత్య సేవాసంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం గవర్నరుపేట బాలోత్సవ భవన్లో బంగార్రాజు కంఠ రచించిన "దుఃఖం పండుతున్న నేల "కవితా సంపుటి ఆవిష్కరణ సభ జరిగింది. ఈ సభకు ముఖ్య అతిధిగా వచ్చిన ఆయన పుస్తకాన్ని ఆవిష్కరించిన అనంతరం మాట్లాడుతూ సోషల్ మీడియాలో ఒక లైక్ కోసం జీవితాల్ని కోల్పోతున్న ప్రమాదకరమైన వాతావరణంలో మనం జీవిస్తున్నామన్నారు. ఇలాంటి సమయంలోనే కవులు ఉమ్మడిగా గెంతెత్తాలన్నారు. కవులకు ఏ విషయాన్నయినా కవిత్వం చేసే హక్కు వుందన్నారు. కవుల్ని ఎవరూ శాసించవద్దన్నారు. సభకు అధ్యక్షత వహించిన డా బిక్కి కృష్ణ మాట్లాడుతూ దేశంలో ఎక్కడా క్రమశిక్షణ లేదన్నారు. సినీగేయ రచయిత రసరాజు మాట్లాడుతూ కవికి సొంత డిక్షన్ కావాలన్నారు. సుప్రసిద్ధ కవయిత్రి, విమర్శకురాలు ఘంటశాల నిర్మల మాట్లాడుతూ స్త్రీలను గౌరవించేదే గొప్ప సంస్కృతి అన్నారు. సమాజంలో ప్రతీచోట స్త్రీలపై జరుగుతున్న వివక్షాపూరిత మానసిక మారణకాండను కవులు నిరసించాలన్నారు. ప్రసిద్ధ కవి, విశ్లేషకులు డాక్టర్ కోయకోటేశ్వరరావు కావ్య విశ్లేషణ చేస్తూ ముక్తిని డోర్ డెలివరీ చేస్తున్న నేటి కాలంలో కవులు మూలాల రక్షణ ఎరుకతో రాయడం మౌలిక అవసరమన్నారు. పీడితుల దుఃఖాన్ని కళాతత్వంగా చెప్పడం నేటి సాహిత్యంలో కొత్త అభివ్యక్తి అన్నారు. కవులు వస్తువుతో తపస్సు చేస్తే తప్ప కొత్త కవిత్వం రాదన్నారు. మల్లెతీగ సాహిత్యసేవాసంస్థ అధ్యక్షులు కలిమిశ్రీ మాట్లాడుతూ పుస్తకాలు కొనడమంటే కవులు, రచయితలను గౌరవించడమేనన్నారు. ఇంటి నిర్మాణానికి పరిమితులిచ్చే అధికారులు ఆ ఇంట్లో ఒక పుస్తకాల గది వుండడం తప్పనిసరి చేయాలన్నారు. కార్యక్రమంలో ఐఆర్ఎస్ అధికారి, ప్రముఖ కవి డా జెల్ది విద్యాధరరావు, పోలీసు అధికారి, కవి లోసారి సుధాకర్, పుస్తక రచయిత బంగార్రాజు కంఠ, సాహితీవేత్తలు డా ఘంటా విజయ్ కుమార్, సరికొండ నరసింహరాజు, వీరప్రసాద్, శిఖా ఆకాష్ తదితరులు పాల్గొని మాట్లాడారు. కార్యక్రమాన్ని చొప్పా రాఘవేంద్రశేఖర్ పర్యవేక్షించారు.



## ప్రజాపాలనతో ప్రజలు ఆనందం: తెలంగాణ విప్ ఐలయ్య

**తిరుమల,మే 25ప్రభాతవార్తప్రతినిధి:** తెలంగాణారాష్ట్రంలో ఏడాదికాలంలో ప్రజాపాలన సాగుతోందని, ప్రజలంతా అన్ని విధాలా సంతోషంగా ఉన్నారని ఆరాష్ట్ర విప్ ఐలయ్య తెలిపారు. పేదప్రజలకు సంక్షేమ పథకాలు అమలుచేయడంలో ,ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం, సిఎం రేవంత్‌రెడ్డి కృతనిశ్చయంతో పనిచేస్తున్నారని ఆయన కొనియాడారు. తిరుమలేశుని దర్శనాలలో తెలంగాణ ప్రజలకు టిటిడి మంచి అవకాశం కల్పించి దేవుని దర్శనాలు చేయిస్తుండటం అభినందనీయమన్నారు. రెండు తెలుగు రాష్ట్రాలు అన్ని విధాలా అభివృద్ధిచెందాలని, ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని దేవుని ప్రార్థించినట్లు ఐలయ్య తెలిపారు. ఆదివారం ఉదయం ఆయన కుటుంబంతో కలసి తిరుమలకు చేరుకుని శ్రీవారిని దర్శించుకున్నారు. ప్రజలందరికీ మంచి జరగాలని వేడుకున్నానన్నారు. విఐపి బ్రేక్‌లో ఆయన స్వామివారి ఆశీస్సు లందుకున్నారు. ఆలయ అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

# ప్రారంభమైన గుంటూరు-గుంతకల్లు డబుల్‌లైన్ రైలు మార్గం పనులు-2

**గుంతకల్లు రైల్వే,మే 25,ప్రభాతవార్త:** మర్మ గోవా-బందరు ప్రధాన రైలు మార్గంలో భాగంగా దక్షిణ మధ్య రైల్వే గుంటూరు-గుంతకల్లు మధ్య ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నల్లమల అటవీ ప్రాంతంలో ప్రస్తుతం జరుగుతున్న రెండో రైలు మార్గం ప్రాజెక్టు పనులు అత్యంత కీలకమైంది. నల్లమల అటవీ ప్రాంతంలో రైలు మార్గం నిడివి 28కి.మీల మేర కలిగి ఉంటుంది. ప్రకాశం జిల్లాలోని దిగువమెట్ట-నంద్యాల జిల్లాలోని గాజులపల్లి స్టేషన్‌ల మధ్య రెండు సొరంగ రైలు మార్గాలు నిర్మించాల్సి ఉంటుంది. ఇందులో చలమ వద్ద 0.34కి.మీల సొరంగం ఒకటి కాగా, మరొకటి బొగడ సమీపంలోని దొరబావి వంతెన వరకు 1.6కి.మీల సొరంగం మరొకటి. వీటి నిర్మాణం కోసం ఇప్పటికే అటవీ శాఖ నుంచి గ్రీన్ సిగ్నల్ లభించింది. దిగువమెట్ట-నంద్యాల మధ్య జరుగుతున్న డబ్లింగ్ రైలు మార్గంలో 142వంతెనలు నిర్మిస్తుండగా, ఇందులో ఐదు మేజర్ బ్రిడ్జిలు,137మైనర్ బ్రిడ్జిలు, ఈ రైలు మార్గం 37మలుపులు కలిగి ఉంటుంది. 7లెవెల్ క్రాసింగ్‌లు ఉంటాయి. కొండలను డ్రిల్ జంబో వంటి భారీ యంత్రాలతో ఆస్ట్రేలియన్ టన్నెలింగ్



నల్లమల అడవుల్లో జరుగుతున్న గుంటూరు-గుంతకల్లు డబుల్ లైన్ రైలు మార్గం సొరంగాల పనులు

విధానంలో డ్రిలి ్లంగ్, బ్లాస్టింగ్‌లతో తవ్వకాలు చేపట్టనున్నారు. పర్యావరణంతో పాటు ప్రస్తుతం ఉన్న సొరంగానికి ఎలాంటి నష్టం వాటిల్లకుండా వ్యూహ్యాత్మకంగా ప్రణాళికను రూపొందించారు. కొండపై నుంచి నీరు, మట్టి జారి పడకుండ జియో టెక్స్‌టైల్స్, పివిసి మెమ్బ్రెన్ పొరలు అమర్చి వాటిపై 300మిల్లీమీటర్ల మందంతో పటిష్టమైన కాంక్రీటు లైనింగ్ వేసి సొరంగం నుంచి వెలువడే ఊట నీటిని బయటకు వెళ్లేందుకు సులువుగా కాలువను నిర్మించనున్నారు. కొండలో సొరంగం పనులు చేపడుతున్నందున అక్కడి నేలపటిష్టత భూసామర్థ్యాలను ఎప్పటికప్పుడు అంచనా వేసేందుకు జియాలజిస్టు, ఇన్స్ట్రుమెంటల్, మైనింగ్, సివిల్, ఎలక్ట్రానిక్, ఎలక్ట్రికల్, మెకానికల్ విభాగాలకు చెందిన నిష్ణాతులైన ఇంజనీరియర్ల నిపుణుల బృందం నిత్యం అందుబాటులో ఉంటూ అప్రమత్తంగా ఉండేలా దక్షిణ మధ్య రైల్వే నిర్మాణాల విభాగం ప్రధానాధికారులు పర్యవేక్షణలో పనిచేస్తుంది. గుంటూరు-గుంతకల్లు డబ్లింగ్ రైలు మార్గం చివరిదశ పనులు సుమారు 2వేల మంది కార్మికులతో ముమ్మరంగా జరుగుతున్నాయి. ఈ ప్రాజెక్టును వచ్చే ఆర్థిక సంవత్సరంలో అందుబాటులో తెచ్చేందుకు లక్ష్యంగా పనిచేస్తున్నట్లు సంబంధిత ఉన్నతాధికారులు తెలిపారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే తూర్పు, నైరుతి, పశ్చిమ, దక్షిణాది రాష్ట్రాలకు దాదాపు 2గంటల సమయం కలిసిరావడంతో పాటు కొత్త రైలు సర్వీసులు, వాణిజ్య, వ్యాపారాభివృద్ధి మరింతగా పెరిగేందుకు దోహదపడుతుంది.



## స్వామి ఆశీస్సులతో అందరికీ శుభాలు కలగాలి

**తిరుమల,మే 25ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో ప్రజలకు మంచిరోజులు కలగాలని, సుఖసంతోషాలతోఉండాలని దేవుని ప్రార్థించినట్లు పలువురు ప్రముఖులు తెలిపారు. ఆదివారం ఉదయం ముంబై హైకోర్టు న్యాయమూర్తి జస్టీస్ నితిన్‌సాంబ్రే, చెన్నై హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పుగలేండీ, పంజాబ్‌హర్యానా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అలోక్‌జైన్, కర్నాటక హైకోర్టు జడ్జి జస్టిస్ కామేశ్వరరాజ్, రాష్ట్రమంత్రి శ్రీనివాస్, సింగర్ స్మిత తిరుమలకు చేరుకున్నారు. వీరంతా వేర్వేరుగా ఉదయం విఐపి బ్రేక్‌లో వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. టిటిడి ఆలయ అధికారులు దర్శనం చేయించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

# పాతవిశ్రాంతి గృహాలకు కాలం చెల్లినట్లే!

## త్వరలో పునర్ నిర్మాణానికి టిటిడి వ్యూహం

**ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:** తిరుమలకొండపై ఆరుదశాబ్దాల క్రిందట అప్పటి అవసరాలకు తగ్గట్లు నిర్మించిన పలు కాటేజీలు, విశ్రాంతి గృహాలు ప్రమాదకరంగా మారాయి. చాలావరకు వీటిల్లో కాలం చెల్లిపోవడం, పెచ్చులూడిపడి సీలింగ్‌లు ఊడిపోవడం, వర్షమొస్తే ధారాళంగా నీరు గదుల్లోకి చేరడం వంటి చేదు అనుభవాలు భక్తులు చవిచూస్తున్నారు. అంతేగాక ఈ గదుల్లో దాదాపు నల్లులు, దోమలు, మంచాలు కూడా సరిగా లేకపోవడం అనే ఫిర్యాదులు భక్తుల నుండి వెల్లువెత్తుతున్నాయి. సామాన్యభక్తులకు వసతి కల్పించేందుకు వీలుగా ఎప్పుడోకొన్ని దశాబ్దాల క్రిందట నిర్మితమైన కేంద్రీయ విచారణ కార్యాలయం(సిఆర్‌ఒ)కు సమీపంలోనే ఉన్న సుదర్శన్, గోవర్ధన్, కల్యాణి సత్రాలు, సి టైప్‌క్వార్టర్స్, పద్మావతి విచారణ కార్యాలయం పరిధిలో మ్యూజియం మార్గంలో కొన్ని విశ్రాంతి గృహాలు పూర్తిగా పాతవి కావడం, గోడలు, గదులు పెచ్చులూడే దుస్థితికి చేరాయి. ఈ విశ్రాంతి గృహాలు, కాటేజీలు పూర్తిగా సామాన్యభక్తులకు అందుబాటులో ఉండేవే. అంతేగాక ఈ ప్రాంతాల్లో యాత్రికులు వాహనాల్లో చేరుకున్నా పార్కింగ్



సమస్య తీవ్రంగా ఉంది. కనీసం పార్కింగ్ అనేది లేకపోవడంతో యాత్రికులు రోడ్లపైనే వాహనాలు పార్కింగ్ చేసుకునే పరిస్థితి ఉంది. గదులు కూడా విశాలస్థలాలు లేవు. ఎప్పుడో పాతకాలంనాటి అవసరాలకు తగ్గట్లు, అప్పటి ప్రణాళికల మేరకు నిర్మించడంతో భవనాల ఉనికి ఆందోళనకరంగా మారింది. ఇందులో 50రూపాయలు, 100 రూపాయలు అద్దెగదులు భక్తులకు కేటాయిస్తారు. ఇవన్నీ కూడా ఉపయోగకరంగా లేకపోవడంతో, భక్తుల నుండి వరుసగా ఫిర్యాదులు అందడంతో టిటిడి అధికారులు వీటిని ఆధునీకరించాలని నిర్ణయించారు. ఇందుకోసం త్వరలోనే దాతల నుండి సహకారం కూడా తీసుకునే యోచనలో ఉన్నారు. అంతేగాక టెండర్లు పిలిచినా వాటిని పూర్తిగా పడగొట్టి ఆ స్థానాల్లో అధునాతనంగా భవనాలు, గదులను అన్ని వసతులతో నిర్మించాల్సి కూడా ఉంది. ఆరేడు విశ్రాంతి గృహాలు ఇప్పుడు భక్తులకు పూర్తిగా వినియోగించుకునే పరిస్థితిలో లేవు. దీంతో ఈ విశ్రాంతి గృహాలన్నీ పూర్తిగా పడగొట్టి అద్భుతంగా నిర్మించేందుకు టిటిడి పాలకమండలి అనుమతితో టిటిడి ఇఒ శ్యామలరావు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి కార్యాచరణ రూపొందించారు. ఇందుకోసం త్వరలోనే పునఃనిర్మాణానికి చర్యలు తీసుకునే దిశగా సిద్ధమవుతున్నారు. ఇంకా తిరుమలలో కొన్ని విశ్రాంతి గృహాలను ఆధునీకరించే దిశగా కూడా చూస్తున్నారు.

## భారత్ క్రికెట్ టీమ్ అద్భుతంగా ఆడుతోంది టీమిండియా ఫీల్డింగ్ కోచ్ దిలీప్



**తిరుమల,మే 25ప్రభాతవార్తప్రతినిధి:** భారత్‌క్రికెట్ టీమ్ అద్భుతంగా ఆటల్లో రాణిస్తుందని, ఇప్పటికే మ్యాచ్‌లు ప్రారంభమైతే తమ ప్రతిభను చాటేవారని టీమిండియా ఫీల్డింగ్ కోచ్ దిలీప్ అన్నారు. రానున్న రోజుల్లో భారత్ క్రికెట్ టీమ్ త్వరలోనే ఇంగ్లాంగ్ సిరీస్ ఉందని, ఆ ఆటలో తామే గెలవాలని, ప్రపంచకప్ గెలవాలని ఆకాంక్షించారు. అన్నీమంచి జరగాలని, తమ సత్తాచాటేలా స్వామివారిశక్తిని ప్రసాదించాలని వేడుకున్నానన్నారు. ఆదివారం ఉదయం ఆయన తిరుమలకు చేరుకుని దేవదేవుడు శ్రీవారిని దర్శించుకున్నారు. టిటిడి ఆలయఅధికారులు దర్శనం చేయించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.



గుంతకల్లు రైల్వే స్టేషన్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న పిసిఇ బ్రహ్మానందం

## సీమలో తెలుగు రాష్ట్రాల రైల్వే పిసిఇ విస్తృత తనిఖీలు

**గుంతకల్లు రైల్వే,మే 25,ప్రభాతవార్త:** తెలుగు రాష్ట్రాల దక్షిణ మధ్య రైల్వే జోన్ ప్రిన్సిపల్ చీఫ్ ఇంజనీర్(పిసిఇ) పి.యస్ బ్రహ్మానందం గుంతకల్లు రైల్వే డివిజన్‌లో రెండురోజుల పాటు విస్తృత తనిఖీలు నిర్వహించారు. కర్నూలుకు చెందిన మణికంఠ అనే బాలుడు శుక్రవారం దురదృష్టవశాత్తు జరిగిన ఘటనలో మృతిచెందిన విషయం తెలిసిందే. డిఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా, అదనపు డిఆర్ఎం సుధాకర్, సీనియర్ డిఇఎన్‌లు జిబిఎస్ శ్రీనివాసులు(సమన్వయం), అభిరామ్, నందగోపాల్ స్టేషన్ మేనేజర్ మురారి లాల్ మీనా, ఇంజనీరింగ్ విభాగానికి చెందిన సంబంధిత అధికారులు సీనియర్ సబార్డినేట్లతో కలిసి ఘటనా స్థలాన్ని, స్టేషన్ భవనాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు.

గుంతకల్లు రైల్వే స్టేషన్‌లో ప్లాట్ ఫాం నెంబర్ 4,5,6,7ల ప్రాంతంతో పాటు వివిధ కార్యాలయాల్లో పర్యటించి అణువణువు క్షుణ్ణంగా పరిశీలించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని రైల్వేలో పాతబడిన పాత భవనాలపై ప్రత్యేకంగా దృష్టి సారించి మరమత్తులు చేపట్టా లని ఆదేశించారు. అనంతరం ఆయన నిఖీల నిమిత్తం రేణిగుంటకు బయలుదేరి వెళ్లారు.

## భవన నిర్మాణ రంగ కార్మికుల నమోదుకు వెబ్‌సైట్...

**విజయవాడ, మే 25 ప్రభాతవార్త ప్రతినిధి:** భవన నిర్మాణ రంగ కార్మికుల సంక్షేమంపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. భవన, ఇతర నిర్మాణ కార్మికులసంక్షేమ బోర్డులో పేర్ల నమోదుకు వెబ్‌సైట్ రూపొందించింది. దీన్ని జూన్ మొదటి వారంలో అందుబాటులోకి తీసుకు రానుంది. దీనిద్వారా కార్మికులు తమ పేర్లను బోర్డులో నమోదుచేసుకోవచ్చు. సెల్‌ఫోన్ నుంచి కూడా వివరాలు నమోదు చేసుకునేలా రూపొందించారు. రాష్ట్రంలో నిర్మాణ రంగ కార్మికులు సుమారు 50 లక్షల మంది వరకు ఉంటారు. వీరిలో బోర్డులో నమోదైన వారు 20.22 లక్షల మంది ఉండగా, అందులో పనులు చేయగలిగిన సామర్థ్యం ఉన్నవారు 18.21లక్షల మంది. పేర్లు నమోదైన వారు బోర్డు అమలుచేసే సంక్షేమ పథకాలు పొందేందుకు వీలుంటుంది. వెబ్‌సైట్ ద్వారా గుర్తింపు కార్డును సైతం వెంటనే పొందొచ్చు. ప్రస్తుతం బోర్డులో పేర్లు నమోదు చేసుకోవాలంటే సహాయ కార్మిక అధికారిని సంప్రదించాలి. వారికి వివరాలు అందించినా నమోదుకు చాలా సమయం పడుతోంది. ఇకపై ఈ తరహా సమస్యలు తీరనున్నాయి. వెబ్‌సైట్ ద్వారా మరింత పకడ్బందీగా నిర్మాణ కార్మికులసంక్షేమ బోర్డు పన్ను వసూళ్లు చేపట్టనున్నారు. శ్రామికుల సంక్షేమానికి కార్మిక శాఖ భవన నిర్మాణదారుల నుంచి 1% పన్ను వసూలుచేస్తోంది.

## సిట్ పిలిస్తే మరికొన్ని విషయాలు చెబుతా: ఎంపి రమేష్

**విజయవాడ, మే 25 ప్రభాతవార్త ప్రతినిధి:** వైకాంగ్రెస్‌పార్టీ హయాంలో జరిగిన మద్యం కుంభకోణంలో ని చాలా విషయాలపై సిట్ ఇంకా దృష్టిసారించనట్టు కనిపిస్తోందని భాజపా ఎంపీ సీఎం రమేష్ అభిప్రాయపడ్డారు. సిట్ ఆహ్వానిస్తే తాను వెళ్లిగత కుంభకోణానికి సంబంధించిన విషయాలు చెప్పడానికి సిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు. మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో ఏంపీ సీఎం రమేష్ గత ప్రభుత్వంపై తీవ్ర ఆరోపణలు చేసారు. వైకాంగ్రెస్‌పార్టీ పాలనలో మద్యం దుకాణాల్లో కాంట్రాక్ట్ విధానంలో పనిచేసిన ఉద్యోగుల జీతాల నుంచి ప్రతి నెలా రూ.5 కోట్లు జగన్ మనుషులు కమీషన్ రూపంలో వసూలు చేశారు. మద్యం దుకాణాలు డిపోల వద్ద నియమించిన దాదాపు 11 వేల మంది సెక్యూరిటీ సిబ్బంది వేతనాల నుంచి కూడా కమీషన్ల రూపంలో నెలకు రూ.3 కోట్లు వసూలు చేసినట్లు నా దగ్గర సాక్ష్యాధారలు ఉన్నాయి అని సీఎం రమేష్ వెల్లడించారు. చంద్రబాబు నాయుడు అప్పుల స్మార్ట్ అని జగన్ ఇటీవల చేసిన వ్యాఖ్యలపైనా ఆయన స్పందించారు విద్యుత్ కొనుగోళ్లలో అవకతవకలు జరిగినట్లు నిరూపిస్తే తాను రాజకీయ సన్యాసం తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నానని, లేదంటే జగన్ రాజకీయాల నుంచి వైదొలుగుతారా? అని సీఎం రమేష్ సవాల్ విసిరారు.

## ప్రశాంతంగా ముగిసిన యూపీఎస్సీ సివిల్స్ ప్రిలిమినరీ పరీక్ష: కలెక్టర్ లక్ష్మీశ

**విజయవాడ మే 25 ప్రభాతవార్త ప్రతినిధి:** యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించే సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసినట్లు జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ తెలిపారు.

10381 మంది అభ్యర్థులకుగాను ఉదయం పేపర్-1కు 5716 మంది, మధ్యాహ్నం పేపర్-2కు 5665 మంది అభ్యర్థులు పరీ క్షకు హాజరయ్యారని కలెక్టర్ తెలిపారు. జిల్లాల్లో 25 పరీ క్షాకేంద్రాలలో ప్రిలిమినరీ పరీక్ష నిర్వహించామన్నారు. కలెక్టరేట్లో ఏర్పాటుచేసిన ప్రత్యేక కంట్రోల్ రూమ్ ద్వారా పరీక్ష నిర్వహణను పర్యవేక్షించామన్నారు. పరీక్ష నిర్వహణకు సంబంధించి లోకల్ ఇన్స్పెక్టింగ్ కమ్ లైజన్ ఆఫీసర్ రూట్ అధికారులు, సూపర్‌వైజర్లు, స్ట్రాంగ్ రూమ్ భద్రతా సిబ్బంది తదితరులు సమన్వయంతో పనిచేసిన పరీక్షను విజయవంతంగా నిర్వహించారన్నారు. అభ్యర్థులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా పరీక్ష కేంద్రా లలో అన్ని మౌలిక వసతులు కల్పించామన్నారు. ఎటు వంటి లోటుపాట్లు లేకుండా సజావుగా సక్రమంగా ప్రశాం తంగా ప్రిలిమినరీ పరీక్ష నిర్వహించిన అధికారులు, సిబ్బందికి కలెక్టర్ లక్ష్మీశ అభినందనలు తెలిపారు.

## 90వేలమంది భక్తులకు దర్శనం సర్వదర్శనానికి 25గంటలుపైగానే

**తిరుమల,మే 25 ప్రభాతవార్తప్రతినిధి:** వేసవి సెలవుల రద్దీ కొనసాగుతున్న నేపథ్యంలో శనివారం ఒక్కరోజే 90,211మంది భక్తులకు టిటిడి అధికారులు స్వామివారి దర్శనంచేయించారు. గతంలో 91వేలమంది దాటినా గత ఐదేళ్ళలో వేసవిసెలవుల్లో ఇంతమందికి దర్శనం చేయించడం రికార్డుగా నమోదైంది. భక్తులకు సంతృప్తికరంగా ఆలయంలోపల దర్శనం చేయించడంలో టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి స్వీయపర్యవేక్షణ, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, పేష్కార్ రామకృష్ణ, వింగ్ విఎస్‌ఒ ఎస్టీవిరామ్‌కుమార్ సహకారంతో ప్రశాంతంగా దర్శనం చేయించారు. టోకెన్‌లేని భక్తులకు వెంకన్న దర్శనానికి 25గంటలపైగానే భక్తులు నిరీక్షించాల్సిన పరిస్థితిఉంది. సాయంత్రానికి 52వేలమంది భక్తులకు మహాలఘు దర్శనం చేయించారు. ఈనెల 24రోజుల్లో 51లక్షలమంది భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీ జరిగింది. ప్రతి రోజూ సగటున 2.5లక్షల అన్నప్రసాదాలు, 90వేలకుపైగా అల్పాహారాలు, పానీయాలుఅందిస్తున్నారు. 24వతేదీ శనివారం ఒక్కరోజే వెంగమాంబ అన్నదానభవనంలో 93,950మంది భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు. గత మూడురోజుల్లో 2.40లక్షమంది భక్తులకు వెంకన్న దర్శనం చేయించారు.

ACHARYA N.G. RANGA AGRICULTURAL UNIVERSITY
ADMINISTRATIVE OFFICE, LAM, GUNTUR-522034; A.P.
NOTIFICATION
POLYTECHNIC ADMISSIONS - 2025-26
No.001657/Polytechnics/A1/2025 Dated: 23.05.2025
Online applications are invited from the candidates who passed SSC or its equivalent examination and who are seeking admission into Diploma courses offered by ANGRAU, Lam, Guntur for the academic year 2025-26. No separate entrance examination will be conducted by ANGRAU.
Important Dates: Commencement of online Registration: Dt.28.05.2025, Last Date of Registration Dt.16.06.2025. For detailed information, online application and regular updates, please visit our website: www.angrau.ac.in. Please note that no further newspaper notification will be given regarding admissions, 2025-26.
Sd/- REGISTRAR
DIPR.No.4139PP/CL/Advt/1/1/2021-22, Date: 23.05.2025


పోటీని ఎప్పుడూ తక్కువగా అంచనా వేయకూడదు. పోరాటం లేకపోతే అభివృద్ధి ఉండదు.

న-ఫ్రెడరిక్ డగ్లస్

# ముదురుతున్న అంతర్యుద్ధం!

ముస్లిం దేశాల్లో పాలకులు ఎవరున్నా ఆర్మీయే పెత్తందారు అన్నది అందరికీ తెలిసిన విషయమే. వారి అండదండలు లేనిదే ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేని పరిస్థితి . ఇప్పుడు అదే జరిగింది బంగ్లాదేశ్ లో. తాత్కాలిక ప్రభుత్వ సారధి మహమ్మద్ యూనస్ కు, ఆర్మీ చీఫ్ వకార్ ఉజ్ జమాన్ కు మధ్య పొత్తు పొసగదు. కారణం ఏదైనా ముస్లిం దేశాల్లో ఇలాంటి పరిస్థితులు తలెత్తినప్పుడు ఆయా దేశాల్లో పాలన అనిశ్చితికి గురైనట్లే లెక్క. ఏడాది డిసెంబర్ లోగా ఎన్నికలు నిర్వహించాల్సిందేనని బంగ్లాదేశ్ ఆర్మీ చీఫ్ హుకుం . ముందు సంస్కరణలు తర్వాతే ఎన్నికలు అనే ధోరణి యూనస్‌ది. అంటే బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వం సంక్షోభంలో పడిందన్న మాట. ఏరికోరి నోబెల్ గ్రహీత మహమ్మద్ యూనస్‌కు బంగ్లాదేశ్ రాజకీయ పక్షాలు పదవీ పగ్గాలు అందించాయి. దేశ ఆర్థిక పరిస్థితిని పెద్దగా సరిదిద్దిందేమీ లేదు. చేయాల్సింది చేయలేకపోవడమే కాదు. సత్వరమే, ఎన్నికలు పెట్టాల్సిన తాత్కాలిక ప్రభుత్వాల బాధ్యతను కూడా మర్చిపోయినట్లున్నారు. ఇప్పుడు ఆయనకు ఇతర రాజకీయ పక్షాలకు మధ్య పరిస్థితి బెడిసి కొట్టింది. షేక్ హసీనాను పదవీచ్యుతు రాలిని చేసిన సందర్భంలో యూనస్ కు ఆర్మీ చీఫ్ కు సత్సంబంధాలు ఉండేవి. తర్వాత తర్వాత క్రమంగా వారిద్దరి మధ్యన సంబంధాలు బెడిసి కొట్టాయి. ఇప్పుడు వారిద్దరూ వేర్వేరు వర్గాలుగా విడిపోయారని వారు వ్యవహారశైలి చెప్పకనే చెబుతోంది. యూనస్‌తో కలిసి పని చేసిన చాలా మంది ఇప్పుడాయనతో లేరు. రాజీనామా చేసేశారు. బంగ్లాదేశ్ విషయాని కొస్తే ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, ఆర్థిక సవాళ్లను తాత్కాలిక అధ్యక్షుడు యూనస్ ఏమాత్రమూ ఎదుర్కోలేక పోయారు. అయినా ఆయన మద్దతుదారులు యూనస్ ప్రభుత్వాన్ని మరి కొంత కాలం ఎలాగైనా నిలబెట్టాలని చూస్తున్నారు. తాజా పరిస్థితిని తట్టుకోలేక యూనస్ ఉన్నట్టుండి రాజీనామా మంత్రం జపించారు. అది కేవలం బెదిరించ డానికేనని కొన్ని వర్గాలు భావిస్తున్నాయి. యూనస్‌కు మద్దతుగా రాజధాని ఢాకాలో నిరసన ర్యాలీని నిర్వహిం చారు. దీని నిర్వాహకులు యూనస్ మరికొంత కాలం ఉండాలని కోరుకుంటున్నారు. ఆయనమాత్రం విపక్షాలకు కొరకరానికొయ్యగా మారాడు. తాత్కాలిక ప్రభుత్వం ఎక్కువ కాలం మనజాలదని ఆర్మీ చీఫ్ జమాన్ అభిప్రాయపడుతున్నారు. ఎన్నికలు జరిగితే కచ్చితంగా యూనస్ తప్పుకోవాల్సి వస్తుందని ,అందుకే ఎన్నికలు నిర్వహించ డానికి వెనుకాడుతున్నట్లు భావిస్తున్నారు. మళ్లీ విద్యార్థుల ఉద్యమం ద్వారా ఆర్మీని తన చేతిలో పెట్టుకు నేందుకే అయి ఉంటుందని విశ్లేషకుల అభిప్రాయం. ఎన్నికకు జరిగితే తన హోదాకు గండి ఏర్పడుతుందని, ఎన్నికకు నిర్వహించకుండా తాత్సారం చేయాలన్న యోచనలోనే యూనస్ కొత్త నాటకాన్ని మొదలెట్టారనే వెల్లడవుతోంది. బంగ్లాదేశ్ ఆర్మీ చీఫ్ జనరల్ వాకర్‌ఉజ్‌జమాన్, ప్రధాన సలహాదారు ముహమ్మద్ యూనస్ మధ్య ప్రస్తుత వివాదం వెనుక అనేక అంశాలు ముడిపడి ఉన్నాయి.. యూనస్‌ను విదేశీ సంస్థల కీలు బొమ్మగా భావించి, సైన్యం విదేశీ జోక్యం గురించి ఆందోళన చెందుతోంది. ఎన్నికైన ప్రభుత్వ అనుమతి లేకుండా ఆర్థిక కారిడార్లను మంజూరు చేయడానికి, విదేశీ సంస్థ లకు కాంట్రాక్టులను ఇవ్వడానికి యూనస్ ప్రణాళికల గురించి జమాన్ ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్మీ చీఫ్‌ను సంప్రదించకుండా జాతీయ భద్రతా సలహాదారుడిని నియమించడానికి యూనస్ చేసిన ప్రయత్నం పట్ల సైన్యం అసంతృప్తిగాఉంది, ఇది సైన్యాన్ని విభజించే ప్రయత్నంగా వారు భావిస్తున్నారు. కానీ ఎన్నికల నిర్వహణ, సైనికజోక్యం, యూనస్ తీసుకుంటున్న వివాదాస్పద నిర్ణయాల కారణంగా ఇద్దరి మధ్య దూరం పెరిగింది. అనంతరం జరిగిన చర్చల్లో రిజర్వేషన్లలో సంస్కరణలు చేపడతామంటూ గతంలో ఇచ్చిన హామీలను పక్కన పెట్టడంతో వీరి మధ్య దూరం బాగా పెరిగినట్లు తెలుస్తోంది. అంతేకాకుండా ఇస్లామిస్ట్ నాయకులతో పాటు, బంగ్లాదేశ్ రైఫిల్స్ తిరుగుబాటు దారులను జైలు నుంచి విడుదల చేయడంలో యూనస్ కీలకంగా వ్యవహరించారు. ఈ అంశం ఆర్మీ చీఫ్‌ను తీవ్ర కలవరపాటుకు గురిచేసింది. దీంతో యూనస్‌తో ఆయన అంటిముట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని సమాచారం. పరిపాలన, చట్ట అమలు సంస్థల పతన ప్రస్తావనతో దేశ పరిస్థితి దిగజారుతున్నట్లు ఆర్మీ చీఫ్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఉద్రిక్తతలు ఉన్నప్పటికీ, అత్యవసర చర్చలతర్వాత యూనస్ ప్రస్తుతానికి పదవిలో ఉంటారని ఆయన సలహాదారులు ధృవీకరించారు. ఈ పరిస్థితులన్నీ అక్కడి తాత్కాలిక ప్రభుత్వం ఇంకెంతో కాలం మనజాల దని రుజువు చేస్తున్నాయి. ఇప్పటికే దేశంలో తాజాగా రాజకీయ అస్థిర పరిస్థితులు నెలకొన్నాయి.. అలాంటి వేళ యూనస్ రాజీనామా ప్రస్తావన తెచ్చారు. ప్రస్తుత పరిస్థితుల్లో కొనసాగలేనని ఆయన పేర్కొన్నట్లు తెలిపారు. గత రెండు రోజులుగా యూనస్ ప్రభుత్వం పలు నవాళ్లను ఎదుర్కొంటోంది. వారిద్దరి మధ్య విభేదాలు తారాస్థాయికి చేరుకున్నాయి. తాత్కాలికంగా రాజీనామాకు సిద్ధమైన యూనస్ తాత్కాలికంగా మెత్తబడినా ఎంతోకాలం వీరికి సయోధ్య ఉండే పరిస్థితులు కనిపించడం లేదు. యూనస్ రాజీనామా చేసే అవకాశం లేదా పాలనలో సైన్యం మరింత ముఖ్యమైన పాత్ర పోషించే అవకాశం ఉన్నందున, సంఘర్షణ ఫలితం అనిశ్చితంగానే ఉంది. వీరిద్దరి మధ్య వైరుధ్యాలు బంగ్లాదేశ్ రాజకీయాలను ఏ తీరానికి చేరుస్తాయో!

పని చేసే తత్తమూ, పని పట్ల విశ్వాసమూ విజయానికి మూలకారణాలు.



హెన్రీఫోర్ట్

పోగొట్టుకున్న ధనాన్ని తిరిగి సంపాదించుకోవచ్చు. కానీ పోగొట్టుకున్న కాలాన్ని తిరిగి సంపాదించలేం.



కర్టీస్

# ప్రజావాక్కు



## మద్యం షాపులు దూరంగా ఉండాలి

ఇటీవల ఏపిలో కొత్తగా ఏర్పాటుచేసిన మద్యం విక్రయ కేంద్రాలుకొన్నినగరాలలో జనవాడలమధ్య ఉంటున్నాయి. దీనికితోడు వివిధ జంక్షన్‌లో వచ్చే జనం ఆ మార్గం గుండా వస్తారు. మద్యసేవకులు మోతాదు ఎక్కువై అక్కడ ఇతరులతో ఘర్షణలు శృతిమించి కొట్టుకుంటున్న ఆ దృశ్యం భయం కలుగుతున్నది. కొందరు రహదారి ప్రక్కన అసహ్యంగాపడిపోయి అక్కడే పడుకుంటున్నారు. కుటుంబాల ప్రజలు స్థానిక ప్రజా ప్రతినిధులకు ఫిర్యాదు చేస్తున్నారు. దుకాణదార్లు ఏమి చేయలేకపోతున్నారు . ఇకపై కొత్త షాప్‌లకు ప్రదేశం కాస్త దూరంగా ఉంటే ఈ సమస్య కొంత తగ్గుతుంది.

- బొల్లోజు మేఘనాథ్, విశాఖపట్నం

## రైళ్ల సంఖ్యను పెంచాలి

ప్రపంచంలో ఎక్కువ జనాభా కలిగిన దేశం మన భారత దేశం.1853వసంవత్సరంలో భారతదేశంలోరైలు ప్రయాణం ప్రారంభం అయినది.140 కోట్లకు పైగా జనాభా కలిగిన దేశంలోని ప్రజలు వివిధ పనుల నిమిత్తం ప్రయాణ సాధనాలలో ప్రధానమైన రైలు మార్గం ముఖ్యమైనది. జనాభా పెరిగిన నిష్పత్తిలో వారి ప్రయాణాల అవసరాల నిమిత్తం ప్రస్తుతం ఉన్నరైళ్ల సంఖ్యతో పాటుగా మరికొన్ని రైళ్లను ప్రారంభించాలి. ప్రతి రైల్వేస్టేషన్‌లో ప్రస్తుతం ఆగుతున్న రైళ్లతోపాటుగా ప్రజల ప్రయాణ అవసరాల నిమిత్తం నూతన రైళ్లకు ప్రతి రైల్వే స్టేషన్ లో హాల్టింగ్ ఉండాలి.ప్రతిరైళ్లకు రైలు భోగీల సంఖ్య కూడా పెంచాలి. గ్రామాల విస్తీర్ణాన్ని బట్టి రైల్వేట్రాక్‌కు సమీపంలో ఉన్న గ్రామాలలో కొన్నిచోట్ల కూడా నూతనంగా రైల్వే స్టేషన్‌లను ఏర్పాటుచేసి మరికొన్ని గ్రామాలకు రైలు ప్రయాణ సౌకర్యం కల్పించాలి.

- ఈదునూరి వెంకటేశ్వర్లు, నెక్కొండ, వరంగల్ జిల్లా

## బదలీలకు షెడ్యూల్ ప్రకటించాలి

ఆంధ్రప్రదేశ్ మోడల్ స్కూల్స్‌లో పనిచేస్తున్న ప్రిన్సిపల్స్,పీజీటీలు,టీజీటీల బదిలీలను నిర్వహించాలని, దీనికి సంబంధించిన షెడ్యూల్ విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని టీచర్స్ కోరుతున్నారు. డీఎస్సీ 2025 నిర్వహణకు ముందు బదలీప్రక్రియ పూర్తయ్యేలాచూడాలి. డీఎస్సీ ఇప్పటికైనా పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలి.

- టి. సురేష్, ఆంధ్ర ప్రదేశ్

## జనరిక్ మందులను ప్రోత్సహించాలి

ఈ రోజు పెరుగుతున్న వైద్య వ్యయాల నేపథ్యంలో జనరిక్ మందుల వినియోగాన్ని ప్రోత్సహించడం అత్యంత అవసరం. ప్రత్యేకించి ఆర్థికంగా బలహీనంగా ఉన్న కుటుంబాల ఆరోగ్య సంరక్షణకు ఇది ఎంతో ఉపయుక్తం. వాణిజ్య బ్రాండ్ మందుల ధరలు అధికంగా ఉండటం వల్లపేద ప్రజలకు చికిత్స అందడం కష్టమవుతోంది. జనరిక్ మందులు తక్కువధరలో, అదే నాణ్యతతో, అనుమతించబడిన ప్రమాణాలతో తయారవుతాయి. ఇవి బ్రాండ్ మందులంతటితో సమానమైన ప్రభావం కలిగి ఉంటాయి. ప్రభుత్వం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ ఆసుపత్రులు, జన ఆషుకేంద్రాల ద్వారా వీటినివిస్తృతంగా అందుబాటులోకి తేవాలి.వైద్యులు, ఫార్మసిస్టులు జనరిక్ మందులపై ప్రజల్లో అవగాహన పెంచాలి.

-సి. హెచ్. ప్రతాప్. శ్రీకాకుళం

## శిక్షణా కార్యక్రమాలు వాయిదా వేయాలి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రభుత్వ ఉపాధ్యాయ బదిలీలు పదోన్నతులు జరుగుతున్న నేపథ్యంలో ఉపాధ్యాయ శిక్షణా కార్యక్రమాలు, ఎఫ్.ఎల్.ఎన్ ట్రైనింగు వాయిదా వేయాలని ఉపాధ్యాయులుకోరుతున్నారు. టీచర్లబదిలీలు,పదోన్నతులు జరుగుతున్న సందర్భంలో ఉపాధ్యాయులు బదిలీ అప్లికేషన్ పెట్టుకోవటానికి, వివిధప్రాంతాల్లో ఉన్నపాఠశాలల వివరాలు తెలుసుకోవడానికి, ఎస్జీటీ ఉపాధ్యాయులు మాన్యువల్ కౌన్సిలింగ్ కు హాజరు కావడానికి, స్కూల్ అసిస్టెంట్స్, ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయులు,సెకండరీ గ్రేడ్‌టీచర్స్ వారిప్రమోషన్స్ ట్రాన్స్ఫర్లకు వెబ్ ఆప్షన్స్ ఇవ్వవలసి ఉంటుంది. కాబట్టి ఎఫ్.ఎల్.ఎన్ శిక్షణా కార్యక్రమాలు వాయిదా వేసి ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల అనంతరం ప్రభుత్వం నిర్వహించాలి.

- వాసిలి సురేష్ నెల్లూరు జిల్లా ఆంధ్రప్రదేశ్

## మండలి సభ్యుల వల్ల ఏమి ప్రయోజనం?

ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుని ఉపాధ్యాయులకు ఈ శాసనమండలి సభ్యుల వల్ల ఏమీ పెద్దగా ప్రయోజనం ఉండదు. ముఖ్యమంత్రి గారు ఏం తలుచుకుంటే అదే అవుతుంది.శాసనమండలి సభ్యులు ఎలాంటి మంచి ఆలోచనా ముఖ్యమంత్రి గారికి అందించలేరు. ఒకవేళ మంచి ఆలోచన చెప్పినాలవి చెవిటివానిముందు శంఖంఅవుతుంది.మేమే సాధించాం మావల్లే ఇవన్నీ ప్రభుత్వఉపాధ్యాయుని ఉపాధ్యాయులకు ప్రయోజనాలు కలిగాయి.

-వీరగంట భాస్కర్ రావు, బొబ్బిలి

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్


(e-mail: editpage@vaartha.com)

# విద్యపై అన్నీ విఫల ప్రయోగాలే!

***2010 ఏప్రిల్ నుండి అమల్లోకి వచ్చిన విద్యా హక్కు చట్టా నికి కూడా మన రాష్ట్రాల్లో తూట్లు పొడిచారు. పాలకుల చేతిలో ఈచట్టం అపహాస్యమైంది. తపస్ మజుందార్‌కమిటీ చేసిన సిఫార్సులన్నీ మన దగ్గర బుట్టదాఖలు అయినాయి. 14 ఏళ్లవరకు ఉచిత విద్య అందించడమే కాక రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగుంటే ఉన్నత విద్య కూడా వారికి ఉచితంగా అందించాలని ఆ చట్టం ప్రవచించింది. ప్రైవేటు పాఠశాలల్లో సైతం 25 శాతం సీట్లు రిజర్వుడు కేటగిరికి అంటే బడుగు బలహీన వర్గాలకు కేటాయించాలి కానీ ఆ కేటాయింపులు ఆ ఖర్చును ప్రభుత్వం భరించడం అన్నీ కూడా అమలుకు నోచుకోవడం లేదు. నిర్బంధఉచిత విద్య మన దగ్గర నగుబాటుకు గురైంది.***

శ్రీ శ్రీ కుమార్

విద్యలో ప్రయోగాలు ఉండడం సహజం. కానీ విద్య మీద ప్రయోగాలు జరగడం మనదేశంలో ముఖ్యంగా మన తెలుగు రాష్ట్రాల్లో మాత్రమే సాధ్యమవుతుంది. ప్రభుత్వాలు మారినప్పుడల్లా మంత్రులు మారినప్పుడల్లా నడుస్తున్న విద్యావిధానానికి కాలం చెల్లి కొత్త విద్యా విధానానికి నాంది పలుకుతారు. ఆ కొత్త విధానానికి రూపకల్పన చేసే ముందు ఒక ప్రజాస్వామికి చర్చ జరగదు. విద్యావేత్తలతో సలహా సంప్రదింపులు, మంచి చెడులు, పరిణామాలగూర్చి ఒక డిబేట్ ఉండదు. కొన్నిసార్లు తమకు అనుకూలమైన తమ విధానాలను తప్పక సమర్థించే వారితో ఒక మొక్కు బడి సమావేశం జరుపుతారు. ఎవరుఎప్పుడైనా విద్యా విధానాన్ని మార్చవచ్చు. అనేక రకాలుగా తమకు ఇష్టం వచ్చిన రీతిలో దాని నిర్మాణ క్రమాన్ని మార్చవచ్చు. ఆశ్చర్య మేమంటి ఎన్ని విధానాలు రూపొందించినా విద్యార్థి అభ్యసన స్థాయిలో లేశమాత్రమైనా మార్పులేకపోవడమే! ఒక ప్పుడు పాఠశాల విద్యలో +2 స్థాయివరకు ఉండేది. కొంత కాలం డిగ్రీ కళాశాలలోనే ఇంటర్మీడియట్ కలిసి ఉండేది. దాన్ని విడదీసి జూనియర్ కళాశాలలు ఏర్పరిచారు. సాధించిన మార్పు కానీ అభివృద్ధి కానీ ఏమీలేదు. ఓపెన్ బుక్ సిస్టంలో పరీక్షలు జరపాలని నాలుగు దశాబ్దాల క్రితంనాటి విద్యాశాఖ మంత్రి ప్రతిపాదించారు. కారణమేమైనా ఆ విధా నం అమలుకు నోచుకోలేదు. 10+2+3 విద్యా విధానం కొనసాగుతున్న పరిస్థితుల్లోనే రాజశేఖర్ రెడ్డి హయాంలో పాఠశాల విద్యలోనే ఇంటర్ విద్యను విలీనం చేసే ప్రతి పాదన గట్టిగానే నడిచింది. నిరసనలు నిరాహారదీక్షల పర్య వసానంగా అది వాయిదా పడింది. ఇంతలో సిసిఈ (కంటి న్యూస్ అండ్ కాంప్రెహెన్సివ్ ఈవ్యాల్యూయేషన్) అమల్లోకి వచ్చింది. దీని ప్రకారంగా సంవత్సరం పొడవునా విద్యార్థి పరీక్ష అని భావించకుండా పరీక్షలు రాస్తూనే ఉంటాడు. ప్రశ్నకు సంబంధించిన జవాబు కచ్చితంగా తెలవకపోయినా లేక రాయకపోయినా మార్కులు వేస్తారు అంటే అభ్యసనం లేకుండానే విద్యార్థి పైతరగతులు చదివే అవకాశం ఉంది. ఈ విధానాన్ని డ్రాపవుట్లు అరికట్టడానికి అంటూ సమర్థిం చుకున్న వారు ఉన్నారు. కొన్ని పాఠశాలల్లో ప్రయోగాత్మ కంగా కొన్ని వృత్తి విద్య కోర్సులు ప్రవేశపెట్టారు. అవి 8వ తరగతిలో ప్రారంభమయ్యేవి. వీటికి శాశ్వత ప్రాతిపదికన ఉపాధ్యాయుల నియామకాలు జరగలేదు. ప్రయోగశాలలేదా కార్యశాలలు ఏర్పాటు చేయలేదు. దాంతో అవి ఆదరణకు నోచుకోలేదు. ఇంటర్మీడియట్ స్థాయిలో కూడా కొన్ని కళాశాలలో వృత్తి విద్యా కోర్సులు ప్రవేశ పెట్టడం జరిగింది. అక్కడ కూడా రెగ్యులర్ సిబ్బంది లేకపోవడం, తక్కు వేతనాలకే సిబ్బందిని పార్ట్ టైం ప్రాతిపదికన నియమించడం, కొన్ని కోర్సులకు అవసరమైన అర్హత గల అభ్యర్థులు దొరకకపోవడంతో అవి కూడా మూలనపడ్డాయి. అంటే ఏర్పాటు చేసే సమయంలో అధ్యయనం ఆలోచన లేకపోవడం సామాజిక అవసరాలు గుర్తించకపోవడం దీనికి కారణంగా చెప్పవచ్చు. టైలరింగ్, మెడికల్ ల్యాబ్ టెక్నాలజీ, మొబైల్ రిపేరింగ్, టీవీ రిపేరింగ్, ఎలక్ట్రిషియన్ లాంటి కోర్సులకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉంది. కంప్యూటర్ కోర్సులకు కూడా మంచి డిమాండ్ ఉంది. ఇంటర్మీడియట్ పూర్తి చేయగానే కొందరు తమ కాళ్లమీద తాము నిలబడి సంపాదించే జీవించే కోర్సులను ప్రోత్సహించాలి. విద్యార్థులు కూడా వాటిని ఆదరిస్తారు. అదేవిధంగా మెడికల్ ల్యాబ్ టెక్నాలజీ నేర్చుకున్న విద్యార్థినీ విద్యార్థులు డయాగ్నస్టిక్ సెంటర్లు నెలకొల్పుకోవడం లేదా వాటిలో పనిచేయడం ఆసుపత్రులలో పని చేయడం గమనించాం. ప్రభుత్వం ఇలాంటి కోర్సులను చాలా పరిమిత సంఖ్యలోనే అందించడంతో ఆశావహులకు ఆశాభంగం అవుతున్నది. ఎవరైతే ఉన్నత చదువులు చదవలేని వారు ఉంటారో అలాంటి వారికి ఈ కోర్సులు చాలా ఉపయోగపడతాయి. దశాబ్దాలుగా ఎవరూ



పట్టించుకోని ఐటిఐలను స్కిల్ సెంటర్లుగా మార్చుతామని ప్రస్తుత ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించింది కానీ అమలుకు వచ్చేసరికి ఇంకా ఆమడదూరంలో ఉంది. ఒక స్పష్టమైన విధానం అంటూ లేకుండా పోతుంది. దాంతో విద్యార్థులు అయోమయానికి గురవుతున్నారు. ప్రతి సంవత్సరం లక్షల కొద్ది బయటకు వస్తున్న ఇంజనీరింగ్ పట్టభద్రులు ఎంత మంది నైపుణ్యాలు కలిగి ఉన్నారనేది నిజంగా ప్రశ్నార్థకమే! నైపుణ్యం లేకుండా కేవలం పట్టా తీసుకుని మార్కెట్లో నిరుద్యోగులుగా నిలబడ్డం శోచనీయం. ఇబ్బడి ముబ్బడిగా అనుమతులు ఇచ్చారే కానీ ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలో ప్రయోగశాల వసతులు, మౌలిక సౌకర్యాలు, అర్హులైన ఫ్యాకల్టీ గురించి ఏనాడు పట్టించుకున్న దాఖలాలు లేవు. వాసి తగ్గి రాసి మాత్రం పెరిగింది. ఇంజనీరింగ్ విద్య అందరికీ అందుబాటులోకి వచ్చిందని సంతోషించాలా లేక నైపుణ్యం లేని విషయ పరిజ్ఞానం లేని పట్టభద్రులు సమాజానికి పెను సవాలుగా మారనున్నారని మారుతున్నారని బాధపడదామా? ఈ మధ్య ఒక నియామక పత్రాల పంపిణీసభలో మాట్లాడుతూ ముఖ్యమంత్రిప్రభుత్వ పాఠశాలల్లో సిబ్బంది బాగా అర్హతలు ఉన్నవారిని శిక్షణ పొందిన వారిని చెప్పుకొచ్చారు. అంతవరకు బాగానే ఉంది. ప్రైవేట్ పాఠశాలల్లో ఇంటర్ డిగ్రీ ఫెయిల్ అయిన వాళ్లే బోధిస్తుంటారని అక్కడ అభ్యసనం ఆశించినంతగా ఉండదని పేర్కొంటూ తల్లిదండ్రులు ప్రభుత్వ విద్యాసంస్థలను ప్రోత్సహించాలని కోరారు. అసలు విద్యార్థులకు అవసరమైన చోట అందుబాటులో ప్రభుత్వ విద్యాసంస్థలు ఉంటే ఏ తల్లిదండ్రులు కూడాతమ పిల్లలను శ్రమకోర్చి డబ్బు ఖర్చు పెట్టుకుని ప్రైవేటు విద్యాసంస్థల్లో చేర్పించరు. అందరికీ ప్రభుత్వ విద్యాసంస్థల్లో చేరే అవకాశం ఉందా?అన్ని మౌలికవసతులు కలిగి అవసరాలకు తగినన్ని విద్యాసంస్థలు నడిపించే పరిస్థితి ప్రభుత్వాలకి ఉన్నదా అనేది సామాన్యుడుఅడుగుతున్నప్రశ్న.స్వాతంత్ర్యం సిద్ధించక ముందు నుండి కూడా కొన్ని సంస్థలు ప్రైవేట్ పాఠశాలలు నడుపుతూ విద్యా సేవ చేస్తున్నారు. కేవలం ప్రభుత్వ నిర్లక్ష్యం అసమర్థత వల్లనే నేడు ప్రైవేటు విద్యా సంస్థలు రాణిస్తున్నాయి.సామాన్యుడు సైతం తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలల్లోనే చేర్పించడానికి ఇష్టపడుతున్నాడు. అక్కడ కూడా అర్హత శిక్షణపొందిన వేలాదిమంది ఉపాధ్యాయులు పని చేస్తున్నారనేది వాస్తవం. కాగా విద్య నేడు కార్పొరేట్ శక్తులకు మంచి వ్యాపార వస్తువుగా తయారైంది. ప్రభుత్వ విద్య నీరుగార్చారు అది నిర్వీర్యమైంది. ఈ నేపథ్యంలోనే ప్రైవేటు విద్య సంస్థలు మరింతగా రాణించాయి. ఇంటర్మీడియట్ స్థాయిలో కార్పొరేట్ కళాశాలల దందాకు అడ్డుఅదుపు లేకుండా పోయింది. అదేసమయంలో ప్రభుత్వ కళాశాలల్లో పోటీ పరీక్షలకు అవసరమైన శిక్షణ, సామాగ్రి ఇవ్వకపోవడం కార్పొరేట్ కళాశాలలకు మరింతఊతమిచ్చింది. మరి ప్రభుత్వ కళాశాలలోని అర్హతలు అనుభవంఏమైనట్లు? నేడు చివరికి కార్పొరేట్ శక్తులే ఇంటర్మీడియట్ విద్యను శాసిస్తున్నాయనడంలో సందేహం లేదు. ముఖ్యమంత్రి ప్రకటన ప్రభుత్వ పాఠశాలలను ప్రోత్సహిస్తూ ప్రైవేటు పాఠశాలల్లో అంత హంగు ఆర్భాటమే కానీ సత్తా లేదని చెప్తుంటే నిన్న మొన్న ఒక మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో 1000 ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేటు వాటికి దీటుగా నెలకొల్పనున్నట్లు ప్రకటించారు. అంటే ఆయన దృష్టిలో ప్రైవేటు విద్యాసంస్థలు ఎంతో మెరుగ్గా ఉన్నత స్థితిలో ఉన్నట్లే. ముఖ్యమంత్రి మాటలకు మంత్రి ప్రకటనలకు పూర్తి వైరుధ్యం స్పష్టంగా కనబడుతోంది. ఒకరు ప్రైవేటు పాఠశాలలు పనికిమాలినవిగా వర్ణిస్తే మరొకరు వాటితో పోటీపడి ప్రభుత్వ పాఠశాలలను మరింత మెరుగ్గా నడుపుతామని ప్రకటించడం పరస్పరం భిన్నంగా ఉంది. ఎవరి మాటలను మనం అవగాహన రాహిత్యంగా పరిగణించాలి? 2010 ఏప్రిల్ నుండి అమల్లోకి వచ్చిన విద్యా హక్కు చట్టానికి కూడా మన రాష్ట్రాల్లో తూట్లు పొడిచారు. పాలకుల చేతిలో ఈచట్టం అపహాస్యమైంది. తపస్ మజుందార్‌కమిటీ చేసిన సిఫార్సులన్నీ మన దగ్గర బుట్టదాఖలు అయినాయి. 14 ఏళ్ల వరకు ఉచిత విద్య అందించడమే కాక రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగుంటే ఉన్నత విద్య కూడా వారికి ఉచితంగా అందించాలని ఆ చట్టం ప్రవచించింది. ప్రైవేటు పాఠశాలల్లో సైతం 25 శాతం సీట్లు రిజర్వుడు కేటగిరికి అంటే బడుగు బలహీన వర్గాలకు కేటాయించాలి కానీ ఆ కేటాయింపులు ఆ ఖర్చును ప్రభుత్వం భరించడం అన్నీ కూడా అమలుకు నోచుకోవడం లేదు. నిర్బంధఉచిత విద్య మన దగ్గర నగుబాటుకు గురైంది.డ్రాపవుట్లు జరగకుండా పెరగకుండాచూడడం కూడా ఇందులో ముఖ్యఅంశం.ప్రభుత్వం కొత్తగా అంగన్వాడీ కేంద్రాల్లో కూడా ప్రాథమిక విద్య అందించే ఆలోచన చేస్తున్నట్టు తెలిసింది. అందులో శిక్షణపొందిన ఉపాధ్యాయులతో బోధన జరుగుతుందా అనేది సందేహాస్పదమే! ●

# పాకిస్థాన్ బుద్ధి ఇక మారదా?

కనుమ ఎల్లారెడ్డి

ఆపరేషన్ సిందూర్‌తో కకావికలం అయిన పాక్ దిక్కుతోచని స్థితిలో ఉంది. ఏం మాట్లాడుతున్నారో అర్థం కావడం లేదు. తాజాగా ఆ దేశ ఆర్మీ అధికారి చేసిన వ్యాఖ్యలు అతని స్థాయిని పెంచేవిగా లేవు. భారత్‌తో సయోధ్య పెంచుకోవాల్సింది పోయి 'ఊపిరి' ఆపేస్తాం అని మాట్లాడతాడా! అతనికి భారత్ అంటే ఎంత 'కసి'అన్నది అర్థమవుతోంది. నీళ్ల లేక పాక్ అల్లాడుతోంది. భారతతో కాళ్ల బేరానికి రావాల్సింది పోయి వితండ వాదం చేస్తున్నాడు. అతనికి లష్కారే తోయిబా హాఫీద్ సయుద్ తో సంబంధాలు ఉన్నట్లు అతని మాటలు తేట పరుస్తున్నాయి. దీనికి తోడు బిలావల్ భుట్టో కూడా వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం గమనార్హం. మొత్తానికి పాక్, ఆపరేషన్ సిందూర్ ద్వారా చాలా వరకు నష్టపోయింది. అయినా ఆ దేశ నేతలకు బుద్ధి రాలేదు. పొరుగున ఉన్న భారత్ చాలా వరకు సంయమనమే పాటించింది. భారత్ తల్చుకుంటే ఇక పాక్ ఉండదు. అది పాక్ గమనించాలి. ప్రస్తుతం పాక్‌లోఎయిర్ బేస్‌లో భారీగా నష్టపోయింది. వాటి పునరుద్ధరణకు భారీ వ్యయం అవసరం. ఇటీవలే రుణం మంజూరు అయినా భారత్ కొన్ని షరతులు పెట్టింది. ఇది పాక్ పెద్ద దెబ్బ. షరతులకు పాక్ అంగీకరించాలి. ఉగ్రవాదంకు మద్దతు ఇవ్వం, ఉగ్రవాద నిర్మూలనకు భారత్‌తో కలసి పని చేస్తామని చెప్పాలి. భారత్‌తో పని చేయడానికి పాక్‌కు నామోషీ,



అందుకే చైనా పంచన చేరింది. ఒక వైపు అమెరికా ఉగ్ర చర్యలు ఎక్కడా కూడా సహించమని చెబుతున్న పాక్‌కు జ్ఞానోదయం కాలేదు. సింధు నదిలో రక్తం పారుతుంది అని పాక్ నాయకులు మొండిగా చెబితే, భారత్ దాడి పాక్ ఊహకు అందదు. ప్రపంచ చిత్రపటంలోనే దాని ఆనవాళ్లు ఇక ఉండవు. శాంతితో భారత్ మసలుకుంది కాని భయంతో కాదు. పాక్ అంతా ఏకమైన భారత్ ఇంచును కూడా కదిలించలేరు. భారత్ త్రివిధ దళలా, పౌరుల మాట అది. కనుక పాక్ నాయకులు, ముఖ్యంగా ఆ దేశం ఆర్మీ అధికారి, బిలవల్ భుట్టో ఆచి తూచి మాట్లాడితే మంచిది. పాక్ లక్ష్యం ఒక్కటే భారత్‌ను అస్థిర పరచాలి. ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోవాలని, అదిచేసే ట్రిక్కులు ఎన్నో.అయిన భారత్ స్థిరంగా ఉంటుంది. పాక్‌లో మాదిరి ఎన్నటికీ ఆర్థిక సంక్షోభం ఎదుర్కోదు. భారత్ బలం ముందుపాక్ ఎప్పటికి బలాదుర్. సుస్థిర శాంతి, ఆర్థిక ప్రగతి, దేశ సార్వభౌమత్వ పరిరక్షణ, అన్నిటికన్నా దేశ పౌరుల క్రమ శిక్షణ, దేశాల మధ్య సఖ్యత, ఇతర దేశాలకు చేతనైనా సహాయ, సహకారాలు అందించటం భారత్ విదేశాంగ లక్షణాలు. వీటి కే భారత్ ప్రాముఖ్యత ఇస్తుంది.ఉగ్రవాదానికి కాదు. ఇంకొక్కసారి రక్తం, గిక్తం అని నోరు పారేసుకుంటే భారత్ దెబ్బ మాములుగా ఉండదు. ముందు పాక్, భారత్‌తో స్నేహం కాంక్షించాలి అంతే కాని యుద్ధం కాదు. త్వరలోనే భారత్, పాక్ మధ్య మంచి చర్యలు ఉంటాయని ఆశిద్దాం. ●

# మతానికి శత్రువు మానవుడే!

పుల్లెంల గణేష్

మానవ నాగరికత అభివృద్ధి పరిణామ క్రమంలో అనివార్యంగా మతాన్ని, దేవుడిని సృష్టించుకోవాల్సిన అవసరత నాటి మానవుడికి ఏర్పడింది అనే విషయం జగమెరిగిన సత్యం. విశ్వాన్ని ఏ దేవుడు సృష్టించలేదు. పంచభూతాల పరివర్తన క్రమంలో విశ్వ అభివృద్ధి నాటి ప్రాచీన కాలం నుండి నేటి ఆధునిక సమాజం వరకు దశలవారీగా అభివృద్ధి చెందుతూ వస్తున్నది. అయితే అనాటి ప్రాచీన అనాగరిక సమాజంలో మానవ అభివృద్ధి పరివర్తన క్రమంలో భాగంగా ప్రకృతిధర్మాల ప్రకారం ఏర్పడిన భయభ్రాంతులను నుండి తమను తాము రక్షించుకోవడానికి, స్వీయ క్రమశిక్షణతో కూడిన ఉన్నతమైన జీవితాన్ని గడపడానికి మానవుడు మతాన్ని, దేవుడిని సృష్టించాడు. అందులో భాగంగానే నేటి ఆధునిక సమాజంలో అనేక మతాలు, దేవతా, దేవుళ్ల మానవుడి చేత సృష్టించబడినాయి. ఐతే ఏ మత దేవుళ్ల కూడా స్వేచ్ఛ సమానత్వ సోదరభావ విలువలతో కూడిన మానవుడి మనుగడ ఉన్నతంగా ఉండాలని ఆయా మత సృష్టికర్తలు మంచిని మాత్రమే బోధిస్తారు. కానీ నేటి ఆధునిక సమాజంలో ఏ ఉద్దేశంతో అయితే మానవుడి చేత మతం కనిపెట్టబడినదో ఆ విలువలపై మతాన్ని అనుసరించకుండా ప్రకృతి నియమాలకు పూర్తి విరుద్ధంగా మత విలువలని అతివాద,వాద సిద్ధాంతాలతో కలుషితం చేసుకొని చివరికి మానవ మనుగడకే ప్రమాదం కొనితెచ్చుకున్నారు. నేడు మతం మత్తులో ఉన్న ఆధునిక మానవుడు ఎలా తయారయ్యాడు అంటే మానవ మనుగడ ముఖ్యమా, మతం ముఖ్యమా అంటే..? మతమే ముఖ్యం అనేలా ప్రకృతి నియమాలకు విరుద్ధంగా పరివర్తన చెందుతూ నిర్మాణం అవుతున్నారు. కానీ నేటి ఆధునిక సమాజంలో మతం మత్తులో మునుగుతూ తీవ్రవాద భావాలు కలిగిన పాకిస్థాన్ దేశానికి చెందిన టెర్రరిస్టులు చేసిన దాడిలో తాజాగా భారతదేశ ప్రాంతానికి చెందిన పహెల్గాంలో దాదాపుగా 26 మంది భారతీయులు మరణించారు. అయితే ఈ సంఘటనలో పాకిస్థాన్ కేంద్రంగా తీవ్రవాదులుగా మారిన వ్యక్తులు హిందూ పురుషులని లక్ష్యంగా చేసుకొని కిరాతకంగా చంపివేయడం భారతదేశాన్ని మాత్రమే కాదు, ప్రపంచం మొత్తాన్ని భయ భ్రాంతులకి గురిచేసింది. పహెల్గాం దాడి సంఘటనకి బదులుగా భారతీయ వాయు సైన్యం 100 మందికి పైగా ఉగ్రవాదులను హతమార్చమని భారతీయ కేంద్ర ప్రభుత్వం కూడా చెప్పడం జరిగింది. పహెల్గాం దాడి సంఘటనపై లోతుగా ఆలోచిస్తే ముస్లిం మత విలువలకి విరుద్ధంగా నిర్మాణమైన కొందరు తీవ్రవాదులు అతివాద భావాలు కలిగి మతం పేరుతో, అల్లా పేరుతో,జిహాద్ పేరుతో మెజార్టీగా హిందూ మతాన్ని విశ్వసించే భారతదేశంపై ఉన్న అసూయ, శత్రుత్వంతో భారతీయుల పై అనేక సందర్భాల్లో దాడి చేస్తూనే ఉన్నారు. పాకిస్థాన్‌కి చెందిన ఉగ్రవాదులు చేసిన దాడికి, బదులుగా భారతీయ ప్రభుత్వం చేసిన దాడిని కూడా హిందూ మత పురుషులపై చేసిన దాడికి ప్రతిదాడిగా ఆపరేషన్ సింధూర్ పేరుతో పాకిస్థాన్ ఉగ్రవాద స్థావరాలని భస్మం చేయడం జరిగింది. అంటే ఇక్కడ భారతీయులపై జరిగిన దాడికి ప్రతిదాడులు చేసినం అని చెప్పుకోకుండా పాకిస్థాన్‌కి చెందిన ముస్లిం తీవ్రవాదులు చేసిన దాడికి ప్రతిదాడిగా హిందూ మతం నుండి విశ్వసిస్తున్న వ్యక్తులుగా ప్రతిదాడి చేశాం అని భారత ప్రభుత్వం అనివార్యంగా చెప్పుకోక తప్పని పరిస్థితి నెలకొన్నది. పెహల్గాం దాడి తర్వాత జరిగిన పరిణామ క్రమం చూస్తే మూడో ప్రపంచ యుద్ధం జరగబోతున్నదా అనే ధోరణిలో చాలామంది భారతీయులు వివిధ ప్రపంచ దేశాలు భావించాయి. ఈ పెహల్గాం సంఘటన నుండి భారతదేశం మాత్రమే కాదు, ప్రపంచ దేశాలన్ని కూడా గ్రహించాల్సిన సత్యం ఏమిటంటే ఆయా మతాల నుండి ఆవిర్భవిస్తున్న అతివాద, తీవ్రవాద సంస్థల నుండి చివరకు ఆయా మతాలకి, మానవ మనుగడకి ప్రమాదం జరుగుతున్నది. అంతేకాదు మానవుడి చేత కనిపెట్టబడిన మతమే మానవుడికి శత్రువై ఉన్నదని నిరూపితం అవుతున్నది. కాబట్టి మానవ మనుగడ ఎల్లకాలం కొనసాగాలి అంటే ఏ మతాన్ని విశ్వసించే వారు ఐన ప్రాథమికంగా మానవ ఉనికికి ప్రాముఖ్యత ఇచ్చి, ఆతర్వాతనే మతానికి రెండో ప్రాముఖ్యత ఇవ్వాల్సిన చారిత్రక అవసరత ఉన్నది. లేకుంటే మతం పేరుతో, దేవుళ్ల పేరుతో యుద్ధాలుచేసుకుంటే అంతిమంగా నాశనం అయ్యేది మానవుడే అని నేడు ప్రపంచంలో ఉన్న అయా దేశ ప్రభుత్వాలని నడుపుతున్న పాలకులు గ్రహించాల్సిన సత్యం.ఎందుకంటే మానవుడి కోసం మతం ఉండాలి తప్ప, మతం కోసమే మానవుడు పోరాటం చేయకూడదు. ఒకనాడు ఉన్నతమైన జీవితాన్ని, క్రమశిక్షణ జీవితాన్ని గడపడానికి మతాన్ని సృష్టించుకున్న మానవుడునేడు అదే దేవుళ్ల మతం మత్తులో పడి అసలైన మత విలువల మార్గంలో వెళ్లకుండా, ఆయా మత విలువలకు విరుద్ధమైన మార్గంలో ప్రయాణించడం అంటే బుద్ధిజీవి ఐన మానవుడు బుద్ధిహీనుడైన క్రూర మృగాలతో సమానమైన జీవిగామారుతున్నాడని చెప్పని తప్పని పరిస్థితి. నాటి ప్రాచీన మానవ ఆదిమ యుగంలో క్రూర మృగల నుండి రక్షణ కోసంవివిధ ఖనిజాల నుండి ఆయుధాలను తయారు చేసుకున్న మానవుడు నేడు సాటి మానవుల నుండి రక్షణ పొందడానికి భయంకరమైన మరణాయుధాలు తయారు చేసుకోవడం అంటే ఆధునిక సమాజంలో బ్రతుకుతున్నామని చెప్పుకోవాలా లేకుంటే మానవ అభివృద్ధి తిరోగమన దారిలో ప్రయాణం చేస్తుందని చెప్పుకోవాలా అనేది లోతుగా ఆలోచించాల్సిన విషయం. కాబట్టి ప్రపంచ శాంతి పరిరక్షణ కోసం ఏర్పడిన ఐక్యరాజ్య సమితి కూడా నేడు యుద్ధ ప్రాతిపదికన అన్ని దేశాల అధిపతులని ఒకే వేదికపై కూర్చోబెట్టి ఉమ్మడి కార్యచరణలో భాగంగా మానవ మనుగడని ప్రమాదంలో నెట్టివేసే ఉగ్రవాద సంస్థల పై ఐక్యంగా పోరాటం చేసి, మళ్లీ ఏ ఒక్క ఉగ్రవాద సంస్థ కూడా ఏ మతంనుండి పుట్టకుండా బలమైన సంస్కరణలు తీసుకురావాలి. మారణహోమం సృష్టించే రక్షణ ఆయుధాలు అవసరం లేని స్వేచ్ఛగా సమానత్వంతో సోదరభావంతో ప్రపంచ దేశాలన్నీ కూడా వాణిజ్యం చేసుకునేలా మతం కేంద్రంగా కాకుండా, మనిషి కేంద్రంగా విప్లవాత్మక సంస్కరణలు తీసుకురావాల్సిన బాధ్యత నేడు ఐక్య రాజ్యసమితిపై, అన్ని దేశాల అధిపతులపై ఉన్నది. అంతిమంగా అయా దేశ ప్రభుత్వాల పాలనలో కొన్ని వైఫల్యాలు ఉన్న ప్రభుత్వల బాధ్యతల కంటే సామాజిక, నైతిక బాధ్యత ముఖ్యం కాబట్టి ప్రతి మానవుడు మతం, దేవుడిని రెండో ప్రాధాన్యతగా చూస్తూ, మొదటి ప్రాధాన్యత మానవత్వానికి, మానవ మనుగడకి ఇవ్వాల్సిన అనివార్యత, బాధ్యత ప్రతి వ్యక్తిపై ఉన్నదనే విషయాన్ని గుర్తు ఎరిగి సాటి మనుషుల పట్ల ప్రేమ ఆప్యాయత కరు ణ విలువలు కలిగి ఉండాలి. ●

# బంగ్లాను అమెరికాకు అమ్మేస్తున్న యూనస్!

## మాజీ ప్రధాని షేక్ హసీనా ధ్వజం




**న్యూఢిల్లీ, మే 25:** బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వాధినేత మహమ్మద్ యూనస్ దేశాన్ని అమెరికాకు అమ్మేస్తున్నారని, ఉగ్రవాదుల అండతో ప్రభుత్వాన్ని నడుపుతున్నారని సంచలన ఆరోపణలు చేశారు. డిసెంబర్‌లో ఎన్నికలు నిర్వహించాలని సైన్యం కోరడంతో రాజీనామా చేస్తానని యూనస్ బెదిరించినట్లు వార్తలు వచ్చాయి. దీంతో బంగ్లాదేశ్‌లో మళ్లీ నిరసనలు వెల్లువెత్తాయి. ఈ క్రమంలోనే హసీనా ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. సెయింట్ మార్టిన్ దీవిని అమెరికాకు ఇచ్చేందుకు తన తండ్రి ఒప్పుకోకపోవడం వల్లే ప్రాణాలు కోల్పోవాల్సి వచ్చిందని షేక్ హసీనా ఫేస్‌బుక్ పోస్ట్‌లో గుర్తుచేసుకున్నారు. "అమెరికా సెయింట్ మార్టిన్ దీవిని అడిగినప్పుడు మా నాన్న అంగీకరించలేదు. అందుకే ఆయన ప్రాణాలు అర్పించాల్సి వచ్చిందని. అధికారంలో ఉండటం కోసం దేశాన్ని అమ్ముకోవాలనే ఆలోచన నాకు ఎప్పుడూ లేదు. జాతిపిత బంగబంధు షేక్ ముజిబుర్ రెహ్మాన్ పిలుపునకు స్పందించి ఆయుధాలు చేపట్టి, పోరాడి, మూడు మిలియన్ల మంది ప్రాణ త్యాగాలతో విముక్తి పొందిన ఈ దేశపు మట్టిలో అంగుళం కూడా ఎవరికీ వదులుకునే ఉద్దేశం ఎవరికీ ఉండదు. కానీ ఈరోజు ఎంత దురదృష్టకరం. దేశ ప్రజలందరి అభిమానం పొందిన వ్యక్తి, ప్రపంచం ప్రేమించిన వ్యక్తి అధికారంలోకి వచ్చాక ఏమైపోయారని హసీనా ప్రశ్నించారు. యూనస్ ఉగ్రవాదుల సాయంతో అధికారాన్ని చేజిక్కించుకున్నారని హసీనా ఆరోపించారు. ఉగ్రవాదుల సాయంతో, అంతర్జాతీయంగా నిషేధానికి గురైన ఉగ్రవాదుల అండతో ఆయన అధికారం చేపట్టారు. బంగ్లాదేశ్ ప్రజలను మేం వీరి నుంచి కాపాడాం. ఒకే ఒక్క ఉగ్రదాడి తర్వాత మేం కఠిన చర్యలు తీసుకున్నాం. చాలా మందిని అరెస్టు చేశాం. ఇప్పుడు జైళ్లు ఖాళీ అయ్యాయి. అందరినీ విడుదల చేశారు. బంగ్లాదేశ్ ఇప్పుడు మళ్లీ ఆ ఉగ్రవాదుల రాజ్యంగా మారిందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. తమ పార్టీ అయిన అవామీ లీగ్‌పై విధించిన నిషేధాన్ని షేక్ హసీనా తీవ్రంగా ఖండించారు. ఇది పూర్తిగా చట్టవిరుద్ధమన్నారు. మా గొప్ప బెంగాలీ జాతి రాజ్యాంగాన్ని సుదీర్ఘ పోరాటం, విముక్తి యుద్ధం ద్వారా సాధించుకున్నాం. చట్టవిరుద్ధంగా అధికారం చేపట్టిన ఈ ఉగ్రవాద నాయకుడికి రాజ్యాంగాన్ని తాకే హక్కు ఎవరిచ్చారు. ఆయనకు ప్రజల మద్దతు లేదు, రాజ్యాంగబద్ధమైన ఆధారం లేదు. ఆయన పదవికి కూడా ఎలాంటి ఆధారం లేదు, అది ఉనికిలోనే లేదు. అలాంటప్పుడు పార్లమెంటు లేకుండా ఆయన చట్టాన్ని ఎలా మార్చగలరు ఇది చట్టవిరుద్ధమని హసీనా తీవ్రంగా విమర్శించారు.



## పార్టీ, కుటుంబం నుంచి కొడుకును బహిష్కరించిన లాలూ

**పాట్నా, మే 25:** ఆర్జేడీపార్టీ అధ్యక్షుడు, బీహార్ మాజీ ముఖ్యమంత్రి లాలూ ప్రసాద్ యాదవ్ ఆదివారం సంచలన ప్రకటన చేశారు. తన పెద్ద కొడుకు తేజ్ ప్రతాప్ యాదవ్ ను పార్టీ నుంచి ఆరేళ్లపాటు బహిష్కరిస్తున్నట్లు ప్రకటించారు. అదేవిధంగా కుటుంబం నుంచి కూడా అతడిని బహిష్కరిస్తున్నట్లు తెలిపారు. కుటుంబ విలువలు, సాంప్రదాయాలకు విరుద్ధంగా నడుచుకుంటున్నందుకు, బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నందుకు తేజ్ ప్రతాప్‌ను పార్టీ నుంచి, కటుంబం నుంచి బహిష్కరిస్తున్నామని లాలూ యాదవ్ తన ఎక్స్ ఖాతా ద్వారా ప్రకటించారు. తాను 12 ఏళ్లుగా అనుష్క యాదవ్ అనే మహిళతో రిలేషన్‌లో ఉన్నట్లు తెలుపుతూ తేజ్ ప్రతాప్ యాదవ్ తన ఫేస్‌బుక్ ఖాతాలో శనివారం చేసిన పోస్టు వైరల్ అయ్యింది. ఆ మరుసటి రోజే లాలూ యాదవ్ అతడిపై బహిష్కరణ వేటు వేశారు. అయితే తన ఫేస్‌బుక్ పోస్టుపై ఆదివారం ఉదయమే తేజ్ ప్రతాప్ యాదవ్ స్పందించారు. ఆ పోస్టు తాను పెట్టింది కాదని, తన ఫేస్‌బుక్ ఖాతాను ఎవరో హ్యాక్ చేశారని ఆయన పేర్కొన్నారు. ఆ పోస్టుతో జత చేసిన ఫొటో కూడా ఒరిజినల్ కాదని, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను ఉపయోగించి ఎడిట్ చేశారని ఆరోపించారు. తమ కుటుంబ పరువు తీయడానికే ఎవరో ఇలా చేశారని విమర్శించారు. అయినా ఆ పోస్టును కారణంగా చూపుతూ అతడి తండ్రి లాలూ ప్రసాద్ యాదవ్ తేజ్ ప్రతాప్‌పై బహిష్కరణ వేటు వేయడం గమనార్హం. ప్రస్తుతం విదేశాల్లో ఉన్న తేజ్‌ప్రతాప్ యాదవ్ ఫేస్‌బుక్‌లో అనుష్క యాదవ్ అనే అమ్మాయితో ఉన్న ఫోటోను షేర్ చేశారు. తమ ఇద్దరి మధ్య 12 ఏళ్లుగా రిలేషన్‌షిప్ ఉందని, ఇంతకాలం ఈ విషయం చెప్పాలనుకున్నా ఎలా చెప్పాలో తెలియలేదని, ఇప్పుడు ఈ విషయాన్ని తెలియజేస్తున్నానని అందులో పేర్కొన్నారు. అయితే, తేజ్‌ప్రతాప్‌కు ఇప్పటికే వివాహం కావడంతో ఈ ఫోటో ఒక్కసారిగా వైరల్ అయింది. బీహార్ మాజీ ముఖ్యమంత్రి దరోగా రాయ్ మనుమరాలినే తేజ్‌ప్రతాప్ పెళ్లి చేసుకున్నారు. అయితే గృహహింస, కుటుంబ కలహాల కారణంగా వీరి వివాహబంధం విచ్ఛిన్నమైంది. హ్యాకింగ్ వ్యవహారంపై తేజ్‌ప్రతాప్ ఫిర్యాదు చేశారా అనేది వెంటనే తెలియలేదు.

# ప్రపంచంలో నాలుగో అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా భారత్



**న్యూఢిల్లీ, మే 25:** భారతదేశ ఆర్థిక వ్యవస్థ మరో కీలక మైలురాయిని అధిగమించిందని జపాన్‌ను వెనక్కి నెట్టి ప్రపంచంలోనే నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరించిందని నీతి ఆయోగ్ సిఇఒ బీవీఆర్ సుబ్రహ్మణ్యం ప్రకటించారు. దేశ స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ) నాలుగు లక్షలకోట్ల డాలర్ల మార్కును తాకిందని, ప్రస్తుతం అమెరికా, చైనా, జర్మనీ మాత్రమే మనకంటే ముందున్నాయని ఆయన తెలిపారు. నీతి ఆయోగ్ పదో పాలక మండలి సమావేశం అనంతరం సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ దేశంలో చేపట్టిన సంస్కరణలు, ప్రపంచవ్యాప్తంగా భారత్‌కు అనుకూలంగా మారుతున్న పరిస్థితులే ఈ వృద్ధికి కారణమని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం మనం ప్రపంచంలో నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్నాం. మన ఆర్థిక వ్యవస్థ 4 ట్రిలియన్ డాలర్లకు చేరుకుందని ఆయన అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) తాజా అంచనాలను ఉటంకిస్తూ వివరించారు. ఇదే ప్రగతిని కొనసాగిస్తే, మరో రెండున్నర, మూడేళ్లలో మూడో స్థానానికి చేరుకునే అవకాశం ఉందని సుబ్రహ్మణ్యం ధీమా వ్యక్తం చేశారు. ప్రపంచ ఆర్థిక చిత్రపటంలో భారత్ కీలకమైన ప్రత్యామ్నాయ తయారీ కేంద్రంగా ఎదుగుతున్న తరుణంలో ఈ ఘనత సాధించడం విశేషం. అమెరికాలో విక్రయించే ఐఫోన్లు భారత్ వంటి దేశాల్లో కాకుండా స్వదేశంలోనే తయారు చేయాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల చేసిన వ్యాఖ్యలపై సుబ్రహ్మణ్యం స్పందించారు. భవిష్యత్తులో అమెరికా సుంకాల విధింపు ఎలా ఉంటుందో స్పష్టత లేదని, అయినప్పటికీ, ఆ పరిస్థితులతో సంబంధం లేకుండా భారత్ తక్కువ ఖర్చుతో కూడిన తయారీ కేంద్రాన్ని అందిస్తూనే ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. మరోవైపు, ప్రభుత్వం త్వరలో మరిన్ని ఆస్తుల నగదీకరణ కార్యక్రమాలను చేపట్టనున్నట్లు సుబ్రహ్మణ్యం తెలిపారు. ఆగస్టులో రెండో విడత ఆస్తుల నగదీకరణ కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయని ఆయన తెలిపారు. మేక్ ఇన్ ఇండియా కార్యక్రమం ద్వారా ప్రపంచ సరఫరా గొలుసులో తన పాత్రను మరింత బలోపేతం చేసుకోవాలని, కొత్త పెట్టుబడులను ఆకర్షించాలని భారత్ చూస్తున్న ప్రస్తుతం రాజకీయంగా కీలకమైన తరుణంలో ఈ ఆర్థిక విజయం మరింత ప్రాధాన్యతను సంతరించుకుంది.



## మాకు ఆ విద్యార్థుల వివరాలు కావాలి..

### హార్వర్డ్ వర్సిటీపై ట్రంప్ పోస్టు

**వాషింగ్టన్, మే 25:** హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో మొత్తం 31 శాతం మంది విదేశీ విద్యార్థులు ఉన్నారని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయా విద్యార్థుల పేర్లు, దేశాల వివరాలు తమకు అందజేయాలని కోరారు. ఇటీవల హార్వర్డ్‌లో విదేశీ విద్యార్థులను చేర్చుకోవడానికి ఉన్న అనుమతిని రద్దు చేస్తూ ట్రంప్ నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. దీన్ని అక్కడి ఫెడరల్ న్యాయమూర్తి అడ్డుకున్నారు. ఈ క్రమంలోనే ట్రంప్ తన నిర్ణయాన్ని సమర్థించుకుంటూ ఆదివారం ట్రూత్ సోషల్‌లో పోస్టు చేశారు. 'మొత్తం 31 శాతం మంది విదేశీ విద్యార్థులున్నారనే విషయాన్ని హార్వర్డ్ ఎందుకు చెప్పడంలేదు. వారిలో అమెరికా వ్యతిరేకదేశాల నుంచి వచ్చిన వాళ్లూ ఉన్నారు. ఆయాదేశాలు వారి విద్యార్థుల చదువు కోసం ఎలాంటి సొమ్ము చెల్లించడం లేదు. ఆ విదేశీ విద్యార్థుల వివరాలు తెలుసుకోవాలనుకుంటున్నాం. హార్వర్డ్ యూనివర్సిటీకి మేము బిలియన్ డాలర్లు చెల్లించాం. వారి వివరాలు తెలుసుకోవాలనే మా అభ్యర్థన సరైనదే. మాకు ఆ విద్యార్థుల పేర్లు, దేశాల వివరాలు కావాలి. మీ దగ్గర రూ. 442కోట్లు ఉన్నాయిగా వాటినే ఉపయోగించుకోండి. డబ్బు కోసం ఫెడరల్ ప్రభుత్వానికి ఎలాంటి విజ్ఞప్తులు చేయకండి' అని ట్రంప్ రాసుకొచ్చారు. ఈ క్రమంలోనే గురువారం ఏకంగా విదేశీ విద్యార్థులను చేర్చుకోవడానికి ఉన్న అనుమతిని రద్దు చేసింది. దీన్ని వ్యతిరేకిస్తూ యూనివర్సిటీ కోర్టులో పిటిషన్ దాఖలుచేసింది. ట్రంప్ చర్య నిబంధనలు ఉల్లంఘించడం అవుతుందని హార్వర్డ్ పేర్కొంది. 'ఒక్క సంతకంతో యూనివర్సిటీలోని మొత్తం విద్యార్థుల్లో పావువంతు మందిని తొలగించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది' అని వెల్లడించింది. దీనిపై విచారణ జరిపిన ఫెడరల్ కోర్టు న్యాయమూర్తి ట్రంప్ నిర్ణయాన్ని నిలుపుదల చేస్తూ ఆదేశాలు జారీ చేశారు.

# ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తే పాక్‌కు తీవ్రపరిణామాలే!

### మజ్లిస్ ఎంపి అసదుద్దీన్ ఒవైసీ



**మనామా(బహ్రెయిన్), మే 25:** పాకిస్థాన్‌ను ఒక విఫలదేశంగా అభివర్ణిస్తూ, ఆ దేశం ఉగ్రవాదాన్ని ప్రోత్సహించడం మానుకోకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని మజ్లిస్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ పాకిస్థాన్‌పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. బీజేపీ ఎంపీ బైజయంత్ పాండా నేతృత్వంలోని భారత అఖిలపక్ష బృందం నిన్న బహ్రెయిన్‌లో పర్యటించింది. ఈ సందర్భంగా ఒవైసీ మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా భారత్ ఎదుర్కొంటున్న ఉగ్రవాద ముప్పు గురించి ప్రపంచానికి తెలియజేయడానికే మా ప్రభుత్వం మమ్మల్ని ఇక్కడికి పంపింది. దురదృష్టవశాత్తు ఈ ఉగ్రవాదం వల్ల మేం ఎంతోమంది అమాయకుల ప్రాణాలను కోల్పోయాం. ఈ సమస్యకు పాకిస్థాన్ మూలకారణం. ఆ దేశం ఉగ్రవాద గ్రూపులకు మద్దతు ఇవ్వడం, నిధులు సమకూర్చడం ఆపేంత వరకు ఈ సమస్య పరిష్కారం కాదని ఒవైసీ స్పష్టం చేశారు. ప్రతి భారతీయుడి ప్రాణాలను కాపాడేందుకు తమ ప్రభుత్వం అన్ని చర్యలూ తీసుకుంటోందని ఒవైసీ తెలిపారు. పాకిస్థాన్ మరోసారి ఇలాంటి దుస్సాహసానికి పాల్పడితే వారు ఊహించని దానికంటే తీవ్రమైన ప్రతిస్పందన ఉంటుందని హెచ్చరించారు. తీవ్రమైన కవ్వింపు చర్యలు ఎదురైనా భారత్ ఎప్పుడూ సంయమనం పాటిస్తూ వస్తోందని గుర్తుచేశారు. పహల్గామ్ దాడిని ప్రస్తావిస్తూ ఉగ్రవాదం సృష్టిస్తున్న మానవ విషాదాన్ని ఆయన వివరించారు. ఆరు రోజుల క్రితం పెళ్లయిన మహిళ ఏడో రోజే వితంతువుగా మారింది. రెండు నెలల క్రితం వివాహమైన మరో మహిళ కూడా ఈ దాడిలో తన భర్తను కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. మా రాజకీయ అభిప్రాయాలు వేరైనా, దేశ సమగ్రత విషయంలో మేమంతా ఒక్కటే. ఈ విషయాన్ని మా పొరుగు దేశం ఇప్పటికైనా అర్థం చేసుకోవాలని ఒవైసీ అన్నారు. భారతదేశానికి తన పౌరులనే కాకుండా, దేశంలో నివసించే ప్రతి ఒక్కరి భద్రతను కాపాడటానికి కావలసిన శక్తిసామర్థ్యాలున్నాయని ఒవైసీ నొక్కిచెప్పారు. పాకిస్థాన్ లాంటి విఫలదేశం నుంచి వస్తున్న అన్ని రకాల ముప్పులను మన వాయు రక్షణ వ్యవస్థలు, సాంకేతిక పరిజ్ఞానం సమర్థవంతంగా ఎదుర్కొంటున్నాయని ఆయన అన్నారు. ఉగ్రవాదానికి అందుతున్న నిధులను అరికట్టేందుకు అంతర్జాతీయ సహకారం చాలా అవసరమని ఒవైసీ పేర్కొన్నారు. బైజయంత్ పాండా నేతృత్వంలోని ఈ ప్రతినిధి బృందంలో ఒవైసీతో పాటు గులాం నబీ ఆజాద్, బీజేపీ ఎంపీలు నిషికాంత్ దూబే, ఫాంగ్నాన్ కొన్యాక్, ఎన్‌జేపీ ఎంపీ రేఖా శర్మ, ఎంపీ సత్నామ్ సింగ్ సంధు, రాయబారి హర్ష్ ష్రింగ్లా తదితరులు ఉన్నారు.

# కువైట్‌లో42 వేలమంది పౌరసత్వం రద్దు



**కువైట్‌సిటీ, మే 25:** కువైట్‌లో ఇటీవలికాలంలో దాదాపు 42,000 మంది పౌరసత్వం రద్దు చేసారు. డిసెంబర్ 2023లో అధికారం చేపట్టిన కొత్త ఎమిర్, 84 ఏళ్ల మిషాల్ అల్‌అహ్మద్ అల్‌జాబర్ అల్‌సబా నాయకత్వంలో ఈ అణచివేత ప్రారంభమైంది. ఈ పౌరసత్వం రద్దులో ఎక్కువ మంది మహిళలే ఉన్నారు. ప్రభుత్వం ఇప్పుడు నిజమైన కువైటీలు మాత్రమే కువైట్‌లో నివసిస్తారని వారికి మాత్రమే ఇక్కడి నుండి రక్త సంబంధాలు ఉంటాయని చెబుతోంది. ఈ విధానం చట్టవిరుద్ధంగా కువైట్ పౌరసత్వం పొందిన విదేశీయులను లక్ష్యంగా చేసుకుందన్న విమర్శలు వెల్లువెత్తాయి. కువైట్ పాలకులు తీసుకున్న నిర్ణయం వల్ల ఎక్కువగా ప్రభావితమయ్యే మహిళలు కువైట్ పురుషులను వివాహం చేసుకున్న తర్వాత ఇక్కడి పౌరులుగా మారారు. వాళ్లను టార్గెట్‌గా చేసుకొని ఈ నిర్ణయం తీసుకున్నట్లుగా తెలుస్తోంది. పౌరసత్వం కోల్పోయిన తర్వాత ఈ వ్యక్తులు ఇకపై ఏ దేశ పౌరులు కారు. వారికి ప్రభుత్వ ఆరోగ్య సేవలు, పిల్లల పాఠశాల ఫీజులు, భూమి కొనుగోలు లేదా కంపెనీలో వాటాలను పంచుకోవడం వంటి హక్కులు తొలగించబడతాయి. కొంతమంది డ్రైవింగ్ లైసెన్స్‌లు కూడా రద్దుచేసారు. బ్యాంకు ఖాతాలను యాక్సెస్ చేయడంపై ఆంక్షలు విధించారు. ఈ మహిళల విషయంలో కూడా అదే జరిగింది. వారు చెల్లింపు చేయడానికి ప్రయత్నించినప్పుడు వారి ఖాతాలు స్తంభింపజేసారు. కువైట్‌లో నివసిస్తున్న దాదాపు 50 లక్షల మందిలో మూడింట ఒక వంతు మంది మాత్రమే నిజమైన కువైటీలు అని ఎమిర్ ఒక ప్రసంగంలో అన్నారు. అటువంటి పరిస్థితిలో ఆగస్టు నుండి వేలాది మంది ప్రజల పౌరసత్వం రద్దు చేయనున్నారు. వారిలో 26 వేల మంది వివాహం తర్వాత ఇక్కడ పౌరసత్వం పొందిన మహిళలు ఉన్నారు. ఇది కువైట్ అధికారిక నివేదిక అయితే వాస్తవ సంఖ్య ఇంకా ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. డిసెంబర్ 2023లో కొత్త ఎమిర్ షేక్ మెషాల్ అల్ అహ్మద్ అల్ సబా ఎమిర్ అయిన వెంటనే పార్లమెంట్‌ను రద్దు చేసి రాజ్యాంగంలోని కొన్ని భాగాలను నిలిపివేశారు. నైతిక అశాంతి నిజాయితీ లేకపోవడం లేదా ధనవంతులు, మతపరమైన వ్యక్తుల విమర్శలు వంటి కారణాల వల్ల పౌరసత్వాన్ని రద్దు చేయడానికి అనుమతించే చట్టం డిసెంబర్‌లో సవరించబడింది. దీని కింద హోం మంత్రి నేతృత్వంలోని అత్యున్నత కమిటీ ఎవరి పౌరసత్వం చెల్లుబాటు అవుతుందో నిర్ణయిస్తుంది. పౌరసత్వం తొలగించబడిన వారి పేర్లను ప్రతి వారం బహిరంగపరుస్తారు. కువైట్‌లో ద్వంద్వ పౌరసత్వం అనుమతించబడదు. కాబట్టి కువైట్ పౌరసత్వం తీసుకునే వారు తమ అసలు పౌరసత్వాన్ని వదులుకోవాలి.

## రోగ నిరోధకశక్తి పెంచుతున్న 'పగటి వెలుతురు'

### మన ఆరోగ్యంలో అదే కీలకపాత్ర



**ఆక్లాండ్, మే 25:** పగటిపూట వెలుతురు మన ఆరోగ్యంలో కీలక పాత్ర పోషిస్తుందని తాజా అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. శరీరంలోకి ప్రవేశించే ఇన్ఫెక్షన్లతో పోరాడే రోగనిరోధక వ్యవస్థ సామర్థ్యాన్ని సూర్యకాంతి గణనీయంగా పెంచుతుందని పరిశోధకులు కనుగొన్నారు. ఈ ఆవిష్కరణ భవిష్యత్తులో అనేక వ్యాధులకు నూతన చికిత్సా విధానాల అభివృద్ధికి మార్గం సుగమం చేస్తుందని భావిస్తున్నారు. న్యూజిలాండ్‌లోని వైపప టౌమాట రౌ, ఆక్లాండ్ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తల బృందం ఈ పరిశోధన చేపట్టింది. మన శరీరంలో అత్యధికంగా ఉండే రోగనిరోధక కణాలైన న్యూట్రోఫిల్స్ పై వీరు ప్రధానంగా దృష్టి సారించారు. ఈ తెల్ల రక్త కణాలు ఇన్ఫెక్షన్ సోకిన ప్రాంతానికి వేగంగా చేరుకుని, హానికర బ్యాక్టీరియాను నాశనం చేస్తాయి. పగటి వెలుతురు ఉన్నప్పుడు ఈ న్యూట్రోఫిల్స్‌లోని సిర్కాడియన్ గడియారం అంటే జీవగడియారం ఉత్తేజితమై, వాటి పనితీరును మెరుగుపరుస్తుందని సైన్స్ ఇమ్యునాలజీ జర్నల్‌లో ప్రచురితమైన ఈ అధ్యయనం వెల్లడించింది. పరిశోధకులు ఈ అధ్యయనం కోసం జీబ్రాఫిష్‌ను నమూనాగా ఉపయోగించారు. వీటి జన్యు నిర్మాణం మనుషులను పోలి ఉండటం, శరీరం పారదర్శకంగా ఉండటంతో జీవ ప్రక్రియలను గమనించడం సులభమని వారు తెలిపారు. పగటిపూట జీవులు చురుకుగా ఉంటూ, బ్యాక్టీరియా బారిన పడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి కాబట్టి, ఉదయం పూట రోగనిరోధక స్పందనలు అధికంగా ఉండటాన్ని గతంలో గమనించామని మాలిక్యులర్ మెడిసిన్ అండ్ పాథాలజీ విభాగానికి చెందిన అసోసియేట్ ప్రొఫెసర్ క్రిస్టోఫర్ హాల్ వివరించారు. శరీరంలోని చాలా కణాలు బయటి ప్రపంచంలో సమయాన్ని తెలుసుకోవడానికి సిర్కాడియన్ గడియారాలను కలిగి ఉంటాయి. ఈ గడియారాలను రీసెట్ చేయడంలో వెలుతురు ప్రధాన పాత్ర పోషిస్తుంది. వాపు సంబంధిత ప్రాంతాలకు మొదటగా చేరుకునేవి న్యూట్రోఫిల్సే కాబట్టి, మా ఆవిష్కరణ అనేక వాపు సంబంధిత వ్యాధులకు చికిత్సా ప్రయోజనాలను అందించడంలో చాలా విస్తృతమైన చిక్కులను కలిగి ఉంది అని హాల్ పేర్కొన్నారు. న్యూట్రోఫిల్స్‌లోని సిర్కాడియన్ గడియారంపై వెలుతురు నిర్దిష్టంగా ఎలా ప్రభావం చూపుతుందనే అంశంపై ప్రస్తుతం పరిశోధన సాగుతోంది. ఈ దిశగా మరిన్ని ఆవిష్కరణలు జరిగితే, ఇన్ఫెక్షన్లతో పోరాడే సరికొత్త ఔషధాల తయారీకి ఆస్కారం ఏర్పడుతుంది.


### యుఎస్‌లో నకిలీ వీసా రాకెట్ గుట్టురట్టు

## ఇద్దరు పాకిస్థానీయుల అరెస్టు



**వాషింగ్టన్, మే 25:** అమెరికాలో నకిలీ ధ్రువీకరణ పత్రాలు, ఉద్యోగాలు సృష్టించి వాటిని చూపించి అక్రమంగా వీసాలు పొందుతున్న కేటుగాళ్ల గుట్టు రట్టయింది. ఇలా అక్రమంగా పొందిన వీసాలను విదేశీయులకు విక్రయించి డబ్బు సంపాదిస్తున్న ఇద్దరు పాకిస్థాన్ జాతీయులను అమెరికా ఎఫ్‌బిఐ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఈ విషయాన్ని ఎఫ్‌బిఐ డైరెక్టర్ కాశ్ పటేల్ వివరించారు. టెక్సాస్‌లోని పాకిస్థాన్‌కు చెందిన అబ్దుల్ హది ముర్షిద్ (39), మహమ్మద్ సల్మాన్ (35)లను ఎఫ్‌బిఐ అధికారులు అరెస్టు చేశారు. వీరు ఉద్యోగాలు సృష్టించినట్లు నకిలీ పత్రాలు సమర్పించి అక్రమంగా వీసాలు పొంది వాటిని విదేశీయులకు పెద్దఎత్తున అమ్ముకునే వారు. ఇందుకు ఇబి-2, ఇబి-3, హెచ్1బి వీసా ప్రోగ్రామ్‌లను ఉపయోగించేవారు. అమెరికన్లకే ఉద్యోగాలు ఇస్తున్నట్లు లేబర్ డిపార్ట్‌మెంట్‌కు సంబంధించిన అన్ని నిబంధనలు పాటిస్తున్నట్లున్న నకిలీ ఉద్యోగ ప్రకటనలను పత్రికల్లో పబ్లిష్ చేయించారు. ఒక్కసారి అక్కడి నుంచి అనుమతులు వచ్చిన తర్వాత వారు వీసా కోరుకుంటున్న వారి కోసం గ్రీన్‌కార్డులను మంజూరు చేయాలని అమెరికా ఇమ్మిగ్రేషన్ విభాగాన్ని అభ్యర్థిస్తారు. వీరి గుట్టు కాస్త బయట పడటంతో ఎఫ్‌బిఐ అధికారులకు చిక్కారు. విచారణలో ముర్షిద్ చట్టవిరుద్ధంగా అమెరికా పౌరసత్వం పొందేందుకు యత్నించినట్లు తేలింది. వీరు కొన్ని సంవత్సరాల నుంచి ఈ కార్యకలాపాలు సాగిస్తున్నారని ఎఫ్‌బిఐ డల్లాస్ స్పెషల్ ఏజెంట్ ఒకరు పేర్కొన్నారు. జాతీయ భద్రతను కాపాడటానికి, ఇమ్మిగ్రేషన్‌కు బలమైన చట్టాలు అవసరమని ఆయన నొక్కి చెప్పారు. నిందితులను కోర్టులో హాజరుపరచగా కస్టడీకి ఇవ్వాలని అధికారులు కోరారు. దీనిపై ఈ నెల 30న తదుపరి విచారణ జరగనుంది. వీరు దోషులుగా తేలితే దాదాపు 20 యేళ్ల జైలుశిక్ష పడే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.


## కొచ్చితీరంలో మునిగిన నౌకలో ప్రమాదకర రసాయనాలు



**కొచ్చి, మే 25:** కొచ్చి తీరంలో మునిగిపోయిన నౌకలో ప్రమాదకర రసాయనాలు ఉండటంతో ఇండియన్ కోస్ట్ గార్డ్ అధికారులు ఆ ప్రాంతంలో హైఅలర్ట్ ప్రకటించారు. లైబీరియాకు చెందిన ఓ భారీ నౌక శనివారం కేరళలోని కొచ్చి తీరానికి 38 నాటికల్ మైళ్ల దూరంలో ప్రమాదానికి గురైంది. ఆ నౌక ముందుగా ఒకవైపు ఒరిగిపోయి ఆ తర్వాత మెల్లగా మునిగిపోయిందని ఇండియన్ కోస్ట్ గార్డ్ స్పష్టం చేసింది. మునిగిపోయిన నౌకలో మొత్తం 640 కంటెయినర్‌లు ఉండగా, వాటిలో 13 కంటెయినర్లలో ప్రమాదకర రసాయనాలు, 12 కంటెయినర్లలో కాల్షియం కార్బైడ్, మిగిలిన వాటిలో 84.44 మెట్రిక్ టన్నుల డీజిల్, 367.1 మెట్రిక్ టన్నుల ఫర్నేస్ ఆయిల్ ఉన్నట్లు ఇండియన్ కోస్ట్ గార్డ్ అధికారులు తెలిపారు. ఆ రసాయనాలు లీకైతే సముద్ర జలాలు తీవ్రంగా కలుషితమయ్యే ప్రమాదం ఉండడంతో అధికారులు కొచ్చి తీరంలో హై అలర్ట్ ప్రకటించారు. కంటెయినర్లను గానీ, వాటిలో నుంచి బయటకు వచ్చిన ఇంధనం గానీ తీరం వైపునకు వస్తే తాకొద్దని ప్రజలను కేరళ విపత్తు నిర్వహణ సంస్థ హెచ్చరించింది. సముద్ర జలాల్లో ఇంధనం లీకై ఎంత మేరకు వ్యాపించిందనే విషయాన్ని తెలుసుకోవడానికి ఆయిల్ స్పిల్ మ్యాపింగ్ టెక్నాలజీ ని వినియోగించే విమానం సముద్రంపై చక్కర్లు కొడుతోందని అధికారులు తెలిపారు. రసాయనాల నౌక మునక కారణంగా తలెత్తే పర్యావరణ సమస్యలను ఎదుర్కోవడానికి ముందస్తుగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. విజింజమ్ పోర్టు నుంచి శుక్రవారం బయల్దేరిన 184 మీటర్ల పొడవున్న ఎంఎస్‌సీ ఎల్సా 3 నౌక శనివారం మధ్యాహ్నానికి కొచ్చిన్ తీరానికి చేరుకోవాల్సి ఉండగా.. కొద్దిసేపటి ముందు సముద్రంలో మునిగిపోయింది. కాగా, కంటెయినర్ నౌక సముద్రంలో మునగడాన్ని గమనించిన ఇండియన్ కోస్ట్ గార్డ్ (ఐసిజి) వెంటనే స్పందించి సహాయక చర్యలు చేపట్టింది. అందులో ఉన్న మొత్తం 24 మంది సిబ్బందిని సురక్షితంగా తీరానికి చేర్చినట్లు కోస్ట్ గార్డ్ అధికారులు తెలిపారు.

## ఉగ్రవాదానికి పాక్ సైన్యం, ఐఎస్‌ఐల మద్దతు

### మాజీ ముఖ్యమంత్రి, సీనియర్‌నేత గులాంనబీ ఆజాద్



**మనామా(బహ్రెయిన్), మే 25:** జమ్ముకశ్మీర్‌లో దశాబ్దాలుగా కొనసాగుతున్న ఉగ్రవాద కార్యకలాపాలకు పాకిస్థాన్ సైన్యం, అక్కడి గూఢచార సంస్థ ఐఎస్ఐ, పాకిస్థాన్ రాజకీయ నాయకులే పూర్తి బాధ్యత వహించాలని జమ్మూకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత గులాం నబీ ఆజాద్ పాకిస్థాన్‌పై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బహ్రెయిన్‌లో జరిగిన అఖిలపక్ష ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాకిస్థాన్ ఈ శక్తుల చేతిలో కీలుబొమ్మగా మారిందన్నారు. తాను విద్యార్థి దశ నుంచీ, రాజకీయాల్లోకి ప్రవేశించినప్పటి నుంచీ సరిహద్దు ఆవలి నుంచి ప్రేరేపిత ఉగ్రవాదాన్ని చూస్తూనే ఉన్నానని ఆజాద్ తెలిపారు. ఒకప్పుడు కశ్మీర్‌లో ఏం జరుగుతుందో ఢిల్లీలోని ప్రభుత్వ ఏజెన్సీలకు తప్ప సాధారణ ప్రజలకు తెలిసేదికాదు. కానీ, మీడియా రంగంలో వచ్చిన విప్లవాత్మక మార్పుల వల్ల ఇప్పుడు దేశవ్యాప్తంగా, ప్రపంచవ్యాప్తంగా అందరికీ తెలుస్తోంది" అని ఆయన పేర్కొన్నారు. గత మూడు దశాబ్దాల్లోనే జమ్మూకశ్మీర్‌లో 40,000 మందికి పైగా స్థానికులు ఉగ్రవాద దాడుల్లో ప్రాణాలు కోల్పోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఒకసారి నేను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు జిల్లా, ప్రావిన్షియల్ కమాండర్లను దాదాపుగా ఏరివేశాం. నెల రోజుల పాటు వారికి కమాండర్లే లేరు. కానీ, నెల తిరిగేలోపే జూనియర్ కమాండర్లతో ఆ స్థానాలను భర్తీ చేశారని ఆయన తెలిపారు. పాకిస్థాన్‌కు నిజానికి సైన్యం అవసరమే లేదు. ఇలాంటి పనులు చేయకపోతే పాక్ సైన్యం అప్రస్తుతం అయిపోతుంది. ప్రస్తుతం పాకిస్థాన్‌లో అత్యంత ధనవంతులు రాజకీయ నాయకులు కాదు, సైన్యాధికారులే. ప్రపంచంలో ఎక్కడైనా అవినీతిపరులైన రాజకీయ నాయకులు ధనవంతులు అవ్వడం చూస్తాం. కానీ, సైనిక అధికారులు శ్రీమంతులు కావడం పాకిస్థాన్‌లోనే చూస్తాం. ఒక్క భారత సైన్యాధికారికి కూడా లండన్‌లో ఇల్లు ఉండకపోవచ్చు, కానీ లండన్‌లో గానీ, ప్రపంచంలో మరెక్కడైనా గానీ ఇల్లు లేని పాకిస్థాన్ జనరల్ ఒక్కరు కూడా ఉండరని ఆయన తీవ్రస్థాయిలో విమర్శించారు.

## ఉక్రెయిన్ నగరాలపై డ్రోన్లు, క్షిపణులతో రష్యా దాడి: 12 మంది మృతి



**మాస్కో, మే 25:** ఉక్రెయిన్-రష్యాల మధ్య ఓవైపు యుద్ధ ఖైదీల మార్పిడి జరుగుతున్నప్పటికీ ఇరు దేశాల మధ్య దాడులు మాత్రం ఆగడం లేదు. ఆదివారం వందలాది మంది సైనికులు, పౌరులను విడిచిపెట్టిన రష్యా ఉక్రెయిన్‌పై భీకర దాడులకు తెగబడింది. దాదాపు 367 డ్రోన్లు, క్షిపణులతో దాడులు చేయగా.. వీటిల్లో 12 మంది మృతి చెందారు. మూడేళ్ల యుద్ధంలో ఒకేసారి ఈ స్థాయిల్లో డ్రోన్లు, క్షిపణులతో దాడులు చేయడం ఇదే తొలిసారి అని ఉక్రెయిన్ సైనిక వర్గాలు వెల్లడించాయి. యుద్ధ ఖైదీల అప్పగింతలో భాగంగా శుక్రవారం ఇరుపక్షాలు 390 మంది చొప్పున మార్పిడి చేసుకోగా శనివారం 307 మందిని ఇరుదేశాలు మార్పిడి చేసుకున్నాయి. తాజాగా మరో 303 మంది సైనికులను పరస్పరం అప్పగించుకున్నట్లు రష్యా రక్షణ శాఖ వెల్లడించింది. ఈ ప్రకటన రాకముందు కీవ్‌తోపాటు ఇతర ప్రాంతాలపై మాస్కో భీకర దాడులు చేసింది. ఒకేరోజు 69 క్షిపణులతోపాటు 298 డ్రోన్లతో విరుచుకుపడింది. వీటిలో ఇరాన్ రూపొందించి షాహెద్ డ్రోన్లు కూడా ఉన్నట్లు సమాచారం. మొత్తంగా ఈ దాడుల్లో 12 మంది చనిపోగా అనేకమంది గాయాలపాలయ్యారు. ఉక్రెయిన్‌లోని 30 నగరాలు, గ్రామాలపై ఉద్దేశపూర్వక దాడులు జరిగాయని అధ్యక్షుడు జెలెన్స్కీ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో రష్యాపై ఆంక్షలు విధించాలని పాశ్చాత్య దేశాలను అభ్యర్థించారు. రష్యా నాయకత్వంపై బలమైన ఒత్తిడి తీసుకువస్తే తప్పితే ఈ దారుణాలకు అడ్డుకట్ట వేయలేమన్నారు.

6-5Pg6exHMNWJQE.qxdo/p:26-5Pg6exHMNWJQE.qxd 1/1/02 7:54 AM Page 1



# యాంగ్మోకు రాయపాటి శైలజ అభినందనలు

**విజయవాడ, మే 25 ప్రభాతవార్త ప్రతినిధి:** అంధత్వం లక్ష్యసాధనకు అడ్డు కాదని నిరూపించిన హిమాచల్‌ప్రదేశ్‌కు చెందిన గిరిజన అంధురాలు ఛోంజిన్ యాంగ్మోకు ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ అభినందనలు తెలిపారు. ఎక్స్ వేదిక ఆమె ప్రపంచంలోనే ఎవరెస్ట్‌ను అధిరోహించిన ఐదోవ అంధ మహిళగా రికార్డ్ సృష్టించిన నీకు తరపున అభినందనలన్నారు.

మహిళలు తలుచుకుంటే ఎంతటి కష్టసాధ్యమైన పనైనా సాధిస్తారని మరోసారి నిరూపించినందుకు అభినందనలు. దేశంలోని కోట్లాదిమంది మహిళలకు ఆదర్శంగా ఛోంజిన్ యాంగ్మో నిలవటం దేశానికే గర్వకా రణమని ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ ఛైర్మన్ రాయపాటి శైలజ అన్నారు.



శ్రీకాళహస్తీశ్వరుని సన్నిదిలో రాహుకేతుదోష నివారణ పూజలు జరుపుకుంటున్న దృశ్యం

# రికార్డు స్థాయిలో రాహుకేతుదోష నివారణ పూజలు

**శ్రీకాళహస్తి, మే 25 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తీశ్వరాలయం ఆదివారం భక్తులతో కిట కిట లాడింది. స్థానిక శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి సూచించిన సంస్కరణలతో ఆలయ ఆదాయాలు గణనీయంగా పెరుగుతున్నాయి. ఆదివారం వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బంది కల్గకుండా ఇఓ డి.బాపిరెడ్డి వారి సిబ్బందిని పరుగులు తీయించారు. దేవస్థానం అందించిన సమాచారం మేరకు సుమారు 30 వేల మంది స్వామి అమ్మవార్లను దర్శనం చేసుకున్నారని ఆలయాధికారులు చెబుతున్నారు. రికార్డు స్థాయిలో ఆరువేల రాహుకేతుదోష నివారణ పూజలు జరిగినట్లు వివరించారు. సంస్కరణలతో ప్రతి ఒక్కరు టిక్కెట్టు కొనుగోలు చేయాలనే నిబంధనలతో ప్రత్యేక దర్శన టిక్కెట్టు కొనుగోలు చేసి ప్రవేశించిన వారు పది వేల మందిగా ఆలయ ఇఓ బాపిరెడ్డి వివరించారు. తిరుమలేశుని సన్నిధికి వచ్చిన భక్తులకు దర్శనం ఆలస్యం కావటంతో సమీపంలోని ముక్కంటీశుని దర్శనానికి విచ్చేస్తున్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ఎలాంటి ఇబ్బంది లేకుండా సిబ్బంది ఆలయ ఎఇఓలు సతీష్‌మాలిక్, లోకేష్‌రెడ్డి, టెంపుల్ ఇన్స్పెక్టర్లు హరియాదవ్, సుదర్శనం, వెంకటముని, సహచరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.



ఆదివారం మీడియాతో మాట్లాడుతున్న డా కరణం రాజేష్‌కుమార్

# 'దక్షిణ భారతంపై కేంద్రం వివక్ష'

**విజయవాడ, మే 25, ప్రభాతవార్త :** దక్షిణ భారతంపై కేంద్ర ప్రభుత్వం చూపిస్తున్న వివక్ష వల్ల ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి దక్షిణ భారతమంతా ఏకమై పోరాడాలని జస్టిస్ ఫర్ సౌతిండియా మూమెంట్ ఫౌండర్ డా కరణం రాజేష్ కుమార్ పిలుపునిచ్చారు. విజయవాడలో ఆదివారం రాజకీయ పార్టీల నేతలతో జరిగిన సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ 33 శాతం స్థానాలు దక్షిణావనికి కేటాయించాలన్నారు. ఈ సందర భంగా ఆర్గనైజేషన్‌కు ఏపి అధ్యక్షుడుగా జిఎస్ ఫణిరాజును నియమిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఫణికుమార్ మాట్లాడుతూ 17శాతంకు దక్షిణ భారతంలో జనాభా పడిపోయిందని అందువల్ల 33శాతం స్థానాలు కేటాయించాలన్నారు. 1970లో డా కెఎల్ రావు ప్రతిపాదించిన నదుల అనుసంధానం ప్రాజెక్టులపై ఎటువంటి ప్రతిస్పందన ఇప్పటివరకు లేదన్నారు, గంగా, యమునా నదులకు చెందిన మిగులు జలాలను దక్షిణ భారతంలోని నదుల అనుసంధానం చేయాలని, దేశ రెండో రాజధాని, సుప్రీంకోర్టు బెంచ్ దక్షిణాధిలో వుండాలని డిమాండ్ చేశారు. దక్షిణ భారత రాష్ట్రాలు ఉత్తరాది రాష్ట్రాలకంటే ఎక్కువ పన్నులు చెల్లిస్తున్నాయని, కానీ కేంద్రం దక్షిణాదికి మద్దతు తక్కువగా వుందన్నారు.

కార్యక్రమంలో అమరావతి జెఎసి అధ్యక్షుడు బాలకోటయ్య, ఏపి కోఆర్డినేషన్ జైహింద్ పార్టీ దశరధి రామిరెడ్డి, కనకం శ్రీనివాసులు, డిఎస్ఎన్వి ప్రసాద్ 27 రాష్ట్ర పార్టీల నేతలు పాల్గొన్నారు.



వేసవి ఈత శిక్షణ పూర్తిచేసుకున్న బాలలు, మహిళలకు శిక్షణ పూర్తి సర్టిఫికెట్లు అందజేసిన కోచ్ పాండురంగారావు, నేత్ర వైద్య నిపుణులు డాక్టర్ దీపక్‌కుమార్

# ప్రభుత్వం విద్యాసంస్థల్లో ఈత శిక్షణ తరగతులు నిర్వహించాలి

**జగ్గయ్యపేట, మే 25, ప్రభాతవార్త :** ప్రతి సంవత్సరం వేసవి సెలవుల్లో విద్యార్థులు నీటి కుంటలు, చెరువులు, ఏర్లు, నదుల్లోకి దిగి ప్రమాదాలకు గురవుతూ ఈత తెలియక అకాల మృత్యువుకు బలవుతున్నారని, ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించి కనీసం హైస్కూళ్ళ స్థాయిలో ఈత శిక్షణ తరగతులు నిర్వహించాలని పలువురు విద్యావంతులు, స్విమ్మర్లు విజ్ఞప్తిచేశారు. ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట పట్టణంలో డ్రీమర్స్ స్విమ్మర్ అసోసియేషన్ (డిఎస్ఏ) కోచ్ దంపతులు పొట్టాబత్తిన పాండురంగారావు-లక్ష్మి సారధ్యంలో విడతల వారీగా నెల రోజుల్లో 78 మందికి వేసవి ఈత శిక్షణ ఉచితంగా నిర్వహించారు. ఈత శిక్షణ పూర్తిచేసుకున్న బాలలు, మహిళలకు ఆదివారం ఫైనల్ పరీక్షలు పూర్తిచేసి వారికి సీనియర్ స్విమ్మర్ డాక్టర్ సామినేని దీపక్‌కుమార్ చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందజేశారు. పట్టణశివారులోని ఓంకారేశ్వరస్వామి దేవాలయ పాలేటి ఘాట్ సమీపంలోగల గంగమ్మ ఆలయం వద్ద ఈకార్యక్రమం జరిగింది. ఫ్రీసై ట్ల్, బ్రెస్ట్, బటర్‌ఫ్లై, బ్యాక్‌స్ట్రోక్ విభాగాల్లో ఈత శిక్షణ పొందిన వారిని అతిధులు, సీనియర్ స్విమ్మర్లు అభినందించారు. విద్యార్థి దశలోనే ఈత శిక్షణ పొందాలని, క్రీడా విభాగంలో కూడా విద్యార్థుల భవిష్యత్తుకు ఈ అర్హత ఉపయోగపడుతుందని పలువురు వక్తలు అన్నారు. ప్రభుత్వం ఈవిషయంలో ప్రత్యేక దృష్టి సారించి విద్యాసంస్థల్లో క్రీడా మైదానాలతోపాటు స్విమ్మింగ్ పూల్స్ ఏర్పాటుకు కూడా ప్రాధాన్యతనివ్వాలని వారు కోరారు.

కాగా డిఎస్ఏ అధ్యక్ష, కార్యదర్శులు ఎం శ్రీనివాసరావు, కలాలి నరేష్, టీమ్ మేనేజర్ అన్నంనీడి కళ్యాణ్, కోశాధికారి పి రమాదేవి, సహాయకోచ్‌లు అడ్డగొట్టం రమేష్, ప్రభుత్వ ఉపాధ్యాయులు పర్చా లక్ష్మణరావు, పొట్టాబత్తిన సందీప్ సభా కార్యక్రమాలు నిర్వహించారు. స్విమ్మర్స్ కోఆర్డినేటర్ యలదండి శ్రీనివాసరావు, సభ్యులు కూరపాటి సరిత, గంధం రాంబాబు, తుమ్మడపు నారాయణ, వై ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# సినిమా పరిశ్రమను బెదిరించకండి

## సిపిఐ(యం) రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

**విజయవాడ,మే25,ప్రభాతవార్తప్రతినిధి:** సినిమా పరిశ్రమని బెదిరిస్తూ వాళ్లు తమ దగ్గరికి చర్చలకు రావాలని, గౌరవాన్ని నిలబెట్టుకోవాలని కోరటం బెదిరించే పద్ధతిలో ఉన్నదని సిపిఐ(యం) రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. రాష్ట్రంలో సింగిల్ థియేటర్ యజమానులు తమ సమస్యల పరిష్కారం కోసం థియేటర్ల బంద్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో మొత్తం ఫిల్మ్ ఇండస్ట్రీపై విరుచుకుపడటం సరికాదన్నారు. ఈ మేరకు పత్రికా ప్రకటన విడుదల చేశారు. బాధ్యతాయుత స్థానంలో ఉన్న ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అదే సినిమా రంగం నుండి వచ్చి ఈ రకంగా మొత్తం పరిశ్రమనే బెదిరించి తమ వద్దకు తెచ్చుకోవాలనే పద్ధతిలో వ్యవహరించడం సరికాదన్నారు. సినిమా నిర్మాతలు, థియేటర్ల యజమానుల సమస్యలు ఏమిటో తెలుసుకొని సినీ పరిశ్రమ అభివృద్ధికి దోహదం చేయాలని, అందుకోసం ఆయా సంఘాలను రాష్ట్ర ప్రభుత్వం ఆహ్వానించి చర్చించాలని కోరారు. రాష్ట్రం విడిపోయి 10సంవత్సర్కాలెనా ఇంతవరకు ఇక్కడ సినీపరిశ్రమ అభివృద్ధి కాలేదన్నారు. సినీ పరిశ్రమ అభివృద్ధికిరాష్ట్రంలో ఎన్నో అవకాశాలు ఉన్నాయని తెలిపారు. కావున వేలాది మంది కళాకారులు, ప్రత్యక్షంగా,పరోక్షంగా లక్షల మంది ఆధారపడే సినీ పరిశ్రమ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకచర్యలు తీసుకోవాలని కోరారు. ఆ రంగంలోని ప్రముఖులను, థియేటర్లు, 24 క్రాఫ్ట్స్‌కు సంబంధించిన సంఘాలను పిలిచి పరిశ్రమ అభివృద్ధికి తీసుకోవాల్సి న చర్యలపై చర్చించాలని రాష్ట్ర కమిటీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది.

# ప్రభుత్వ కార్యాలయాల్లో జగన్ ఫోటోను తొలగించాలి

## మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్.రాజు డిమాండ్

**అనంతపురం, మే 25 ప్రభాతవార్త బ్యూరో:** రాష్ట్రంలో ఎక్కడైనా ప్రభుత్వ కార్యాలయాల్లో వైసిపి అధినేత వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఫోటో ఉంటే తొలగించాలని టిడిపినేత, మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్.రాజు విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కాలం అవుతోందని ఇంకా అక్కడక్కడ సచివాలయాల్లోనూ, ప్రభుత్వ కార్యాలయాల్లోనూ జగన్‌మోహన్‌రెడ్డి ఫోటోలు ఉంటున్నాయని, ఇంకా అక్కడ ఎక్కడైనా ప్రభుత్వ కార్యాలయాల్లో ఫోటోలు ఉంటే వాటిని వెంటనే తొలగించాలని ఆయన అధికారులకు, కార్యకర్తలకు విజ్ఞప్తి చేశారు. ఆదివారం, స్థానిక రహదారులు, భవన అతిథి గృహంలో మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్.రాజు విలేకర్లతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అనంతపురం జిల్లా పరిషత్ చైర్మన్ ఛాంబర్‌లో



వైఎస్.జగన్ ఫోటోను చూసి వెంటనే తొలగించాలని జడ్పి చైర్మన్ బోయ గిరిజమ్మకు విజ్ఞప్తి చేశామన్నారు. జగన్ ఫోటో తీసి వేసి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఫోటో పెట్టాలని మేము స్వయంగా జడ్పి చైర్మన్‌కు సీఎం ఫోటోను ఇచ్చి వచ్చామన్నారు. అయినప్పటికీ వైఎస్.జగన్‌ఫోటోను తొలగించలేదని, ఇటీవల జిల్లా పరిషత్ సమావేశానికి వెళ్లినప్పుడు నేను, కళ్యాణదుర్గం ఎమ్మెల్యే సురేంద్రబాబు, అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌లు కలిసి జడ్పి సిఇఓ రామచంద్రారెడ్డిని ప్రశ్నించామన్నారు. ఎందుకు వైఎస్.జగన్‌ఫోటోను తొలగించలేదని గట్టిగా ప్రశ్నించామన్నారు. వైఎస్.జగన్ ఫోటోను పూర్తిగా తొలగించి సీఎం చంద్రబాబు ఫోటోను ప్రధానంగా పెట్టాలని మేము గట్టిగా ప్రశ్నించిన మాట వాస్తవమేనని, ఇందులో తప్పేముందని ఎమ్మెల్యే ఎంఎస్.రాజు ప్రశ్నించారు. వైసిపి జిల్లా అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, మాజీ ఎంపి గోరంట్ల మాధవ్ తదితరులు ఈ విషయంలో పోలీసులకు ఫిర్యాదులు చేయడంలో ఏమైనా న్యాయం ఉందా అని ఆయన ప్రశ్నించారు. అనంతపురం జడ్పి చైర్మన్ ఛాంబర్‌లో మేము జడ్పి సిఇఓతో ఏం మాట్లాడామో అన్నది వీడియోల్లో రికార్డు అయిందని, ఆ వీడియోలను జిల్లా పోలీసు అధికారులు పరిశీలించి తప్పుంటే కేసు పెట్టుకోవచ్చని ఎమ్మెల్యే ఎంఎస్.రాజు విజ ్ఞప్తి చేశారు. వాస్తవాలన్ని ప్రజలకు తెలుసని ప్రజలను వైసిపి నాయకులు తప్పుదోవ పట్టిస్తే నమ్మేస్థితిలో వారు లేరని ఆయన వెల్లడించారు.

# రైతు శ్రేయస్సే లక్ష్యం: ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్

**జగ్గయ్యపేట, మే 25, ప్రభాతవార్త :** రాష్ట్రంలో రైతులను అన్ని విధాలుగా ఆదుకునేందుకు కూటమి ప్రభుత్వం పరిశ్రమిస్తోందని తెలుగుదేశంపార్టీ జాతీయ కోశాధికారి, జగ్గయ్యపేట ఎంఎల్ఏ శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) అన్నారు. ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట పట్టణంలోని ప్రాంతీయ పశువైద్యశాలలో ఆదివారం 50 శాతం సబ్సిడీ ధరలతో రైతులకు పశువుల దానా పంపిణీ చేశారు. నియోజకవర్గ పరిధిలోని 500ల మంది రైతులకు 50 కిలోల వంతున పశువుల దానా అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే రాజగోపాల్ మాట్లాడుతూ రైతులు పశుదానాను ఉపయోగించుకుని పాల దిగుబడి అధికంగా సాధించాలన్నారు. రైతులకు ఏ కష్టం వచ్చినా ప్రభుత్వం వెన్నంటే ఉంటుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ సహాయ



యాభైశాతం సబ్సిడీతో రైతులకు పశువుల దానా కట్టలు పంపిణీచేస్తున్న ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్

సంచాలకులు డాక్టర్ భవానీప్రసాద్, డాక్టర్ లక్ష్మీప్రసన్న, డాక్టర్ శ్రీనునాయక్, డాక్టర్ మురళీకృష్ణ, రావూరి శ్రీను, గుమ్మ వెంకటేష్, పశుపోషకులు, సిబ్బంది పాల్గొన్నారు.

# క్లాక్‌రూం కాంట్రాక్టర్‌పై విచారణ చేస్తాం: ఇఓ

**ఇంద్రకీలాద్రి, మే 25, ప్రభాతవార్త:** అమ్మలగన్నమ్మ బెజవాడ కనకదుర్గమ్మవారిని దర్శించుకోటానికి కడప నుండి వచ్చిన భక్తులతో ఆదివారం ఇఓ వికె శీనా నాయక్ ముచ్చటించారు. ఈ సందర్భంగా వారు తమ బ్యాగులను కౌంటర్లలో భద్రపరచ డానికి ఎక్కువ రుసుము వసూలు చేసినట్లు ఆరోపించడంతో వెంటనే ఇఓ సదరు కాంట్రాక్టర్‌పై విచారణకు ఆదేశించారు. ఆదివారం ఇఓ ఆలయంలోని సుబ్రహ్మణ్య స్వామివార్ల ఆలయం పరిశీలించి అక్కడ అపరిశుభ్రంగా వున్న చోట శుభ్రం చేయాలన్నారు. ఉదయం 11.30నుండి మద్యాహ్నం 1.30 లోపు వచ్చిన భక్తులకు విఐపి దర్శనం కుదరదని తెలిపారు.

ప్రోటోకాల్ ఆఫీసులో సమాచారం ఏఇఓకు ఇవ్వకుండా నేరుగా ఆలయానికి వచ్చిన వారికి విఐపి దర్శనం ఆ సమయంలో లేదన్నారు. ఆదివారం సం దర్భంగా భక్తుల తాకిడి ఎక్కువగా వుండడంతో ఇఓ ఆలయమంతా పరిశీలిస్తూ క్యూలైన్లలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకున్నారు. ప్రోటోకాల్ విఐపి దర్శనాలను కట్టడి చేశారు. భక్తులతో ముచ్చటించి వారికందుతున్న సౌకర్యాలు తెలుసుకున్నారు.

**నిత్యాన్నదానానికి విరాళం:** దుర్గమ్మవారి ఆలయంలో జరిగే నిత్యానదాన పథకానికి ఆదివారం విజయవాడకు చెందిన వి వెంకట అప్పారావు తమ కుటుంబసభ్యులతో కలిసి



దాతలనుండి విరాళం అందుకుంటున్న ఇఓ శీనా నాయక్

రు.2లక్షల విరాళాన్ని ఇఓ వికె శీనా నాయక్‌కు అందించారు. ఈ సందర్భంగా దాతలకు, వారి కుటుంబసభ్యులకు దుర్గమ్మవారి దర్శనం ఏర్పాటు చేసి, ప్రసాదం, శేషవస్త్రం, మెమెంటోలు అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.

**వేదోక్తంగా సూర్యోపాసన:** దుర్గమ్మ వారి ఆలయంలో వేదోక్తంగా సూర్యోపాసన ను ఆదివారం పండితులు నిర్వహించారు. ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. ఆలయంలో ఉదయాస్తమాన సేవలను శాస్త్రోక్తంగా జరిపారు.

**జగన్మాతకు నృత్యనీరాజనం:** యనమలకుదురుకు చెందిన శ్రీ హనుమాన్ నృత్య కళానిలయం ఆచార్య కె శ్రీనివాస్ నేతృ త్వంలో 14 మంది శిష్యబృందం ఆదివారం కళావేది కపై అద్భుతంగా దుర్గమ్మవారికి నృత్య నీరాజనాలర్పించారు. అనంతరం వారికి దుర్గ మ్మవారి దర్శనం కల్పించి ప్రసాదాలు అందించారు.



హైదరాబాద్‌లో ఆదివారం మీడియాతో మాట్లాడుతున్న అల్లు అరవింద్

# ఆ నలుగురిలో నేను లేను

## థియేటర్లు బంద్ చేస్తామనడం కరెక్ట్ కాదు
## మంత్రి దుర్గేశ్ స్పందన సమంజసమైందే
## సినీనిర్మాత అల్లు అరవింద్ వివరణ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 25:** తెలుగు సినీ పరిశ్రమలో తాజాగా చోటు చేసుకుంటున్న పరిణామాలపై నిర్మాత అల్లు అరవింద్ స్పందించారు. రెండు రోజులుగా 'ఆ నలుగురు' అంటూ వార్తలు వచ్చాయని.. వారి కబంధ హస్తాల్లో ఇండస్ట్రీ ఉన్నట్లు చిత్రీకరించారని.. కానీ ఆ నలుగురికి తనకు ఎలాంటి సంబంధం లేదని హైదరాబాద్‌లో ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో అల్లు అరవింద్ అన్నారు. ఈ 'ఆ నలుగురు' అనే మాట 15 ఏళ్ల క్రితం ప్రారంభమైందని.. నలుగురు కాస్త.. ఇప్పుడు పది మంది అయ్యారని అన్నారు. అది ఎవరూ పట్టించుకోవట్లేదని పేర్కొన్నారు. 'ఆ నలుగురి' నుంచి తాను ఎప్పుడో బయటకు వచ్చానని.. తెలంగాణలో తనకు కేవలం ఒకే థియేటర్ ఉందని, తెలుగు రాష్ట్రాల్లో మొత్తం కలిపి 15 థియేటర్లు ఉన్నాయని తెలిపారు. లీజ్ పూర్తయిన తర్వాత వాటిని రెన్యువల్ చేయవద్దని తన స్టాఫ్ చెబుతుంటానని అన్నారు. 50 ఏళ్లుగా సినిమాలు నిర్మించడమే తన వృత్తి అని అల్లు అరవింద్ తెలిపారు. ఒకటో తేదీ నుంచి థియేటర్లు మూసేస్తామని ఏకపక్షంగా ఎలా అంటారని ప్రశ్నించారు. థియేటర్లు మూసివేస్తామని ఎగ్జిబిటర్లు తీసుకున్న నిర్ణయంపై ఏపి సినిమాటోగ్రాఫీ మంత్రి కుందుల దుర్గేశ్ స్పందన సమంజసమైనదే అని అన్నారు. తాజాగా జరిగిన ఏ సమావేశానికి తాను వెళ్లలేదని.. గీతా ఆర్ట్స్‌కి సంబంధించిన డిస్ట్రిబ్యూటర్లు, అసోసియేటెడ్ ప్రొడ్యూసర్లని కూడా వెళ్లవద్దని చెప్పినట్లు తెలిపారు. సింగిల్ స్క్రీన్ థియేటర్లు కష్టాల్లో ఉన్నాయని. యజమానులు ఫిల్మ్ ఛాంబర్, ప్రొడ్యూసర్ గిల్డ్ సంప్రదించాలని సూచించారు. పవన్ కళ్యాణ్ సినిమా వస్తున్న సమయంలో థియేటర్లు మూసివేస్తా అనే నిర్ణయం దుస్సాహసమే అని అరవింద్ పేర్కొన్నారు. ఇండస్ట్రీ నుంచి వెళ్లి పోరాడుతున్న వ్యక్తి పవన్‌కళ్యాణ్ అని.పవన్ ఇవాళ ఇండస్ట్రీకి సాయం చేస్తున్న వ్యక్తి. అలాంటిది ఇండస్ట్రీ నుంచి వెళ్లి ప్రభుత్వ పెద్దలను కలవాలి, డిప్యూటీ సీఎం పవన్, సీఎం చంద్రబాబు కలుద్దాం అని పేర్కొన్నారు. కానీ ఛాంబర్ వాళ్లు ఎవరూ వెళ్లలేదు. ప్రభుత్వం ఏర్పాటు అయ్యాక కలిసి వెళ్లాలి కదా ఎవరూ వెళ్లలేదని అన్నారు. ఏపీలో కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది గడుస్తున్నా తెలుగు సినిమా పెద్దలు కనీసం మర్యాదకైనా సీఎం చంద్రబాబును కలవలేదని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేయడం తెలిసిందే. గత ప్రభుత్వం నుంచి వేధింపులకు గురైన సినీ రంగాన్ని తమ కూటమి ప్రభుత్వం ఏవిధంగా ఆదుకుందో మర్చిపోయారా అంటూ మండిపడ్డారు. సినీ పరిశ్రమ నుంచి ఇలాంటి రిటర్న్ గిఫ్ట్‌కు తాము కూడా తగిన రీతిలోనే స్పందిస్తామని పవన్ ఘాటుగా హెచ్చరించారు. తాను కూడా సినీ పరిశ్రమ నుంచి వచ్చిన వ్యక్తే కావడంతో టాలీవుడ్ పై ఎప్పుడూ సానుకూలంగా ఉండే పవన్ ఒక్కసారిగా ఉగ్రరూపం ప్రదర్శించడంతో తెలుగు ఇండస్ట్రీలో కలకలం రేగింది. పవన్ ఖిహరిహర వీరమల్లుఖి సినిమా రిలీజ్ కానున్న సమయంలోనే థియేటర్ల మూసివేత నిర్ణయం తీసుకోవడంతో చిత్ర పరిశ్రమలో ఏదో జరుగుతోందన్న వాదనలకు బలం చేకూర్చుతోంది.

ఈ నేపథ్యంలోనే అల్లు అరవింద్ మీడియాతో మాట్లాడి తన స్పందనను తెలియజేశారు. ప్రభుత్వానికి సంబంధం లేదని కొందరు అంటున్నారని... అలాంటప్పుడు గత ప్రభుత్వ పెద్దలను ఎందుకు కలిశారని అల్లు అరవింద్ నిలదీశారు. "మనకు కష్టం వచ్చిందనే కదా అప్పటి ముఖ్యమంత్రిని కలిశారు... మరి ఇవాళ సినీ పరిశ్రమలో చాలా సమస్యలు ఉన్నాయి. ఇలాంటప్పుడు అందరూ కూర్చుని ఏం చేయాలనేది చర్చించాలి కదా! నిర్మాత, డిస్ట్రిబ్యూటర్, ఎగ్జిబిటర్ మధ్య సమస్యలుంటే చర్చించుకోవాలి" అని హితవు పలికారు.

# సిపిఎస్‌ని రద్దుచేసి ఓపిఎస్‌ని అమలుచేయాలి

## ఎఐఎఫ్‌టిఒ జాతీయ కార్యవర్గ సమావేశంలో ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్‌రెడ్డి

**హైదరాబాద్, మే 25, ప్రభాతవార్త:** దేశ వ్యాప్తంగా ఉద్యోగులు, ఉపాధ్యాయులకు తీవ్ర నష్టం కలిగిస్తున్న కాంట్రీబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సిపిఎస్)ని రద్దు చేసి.. ఓల్డ్ పెన్షన్ స్కీమ్(ఓపిఎస్)ని పునరుద్ధరించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం జార్ఖండ్ రాష్ట్రం దేవగఢ్‌లో ఆల్ ఇండియా ఫెడరేషన్ ఆఫ్ టీచర్స్ ఆర్గనైజేషన్స్ (ఏఐఎఫ్‌టివో) జాతీయ కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సిపిఎస్‌ని రద్దు చేసి ఓపిఎస్‌ని పునరుద్ధరించాలని కోరారు. సిపిఎస్ రద్దుకోసం ఏఐఎఫ్‌టివోని ఇంకా బలోపేతం చేసుకోవాలని సూచించారు. దేశంలోని అన్ని రాష్ట్రాల ఉపాధ్యాయ సంఘాలను ఒక్కతాటిపైకి తీసుకురావాలని కోరారు. ఏఐఎఫ్‌టివో బలోపేతం గురించి పిఆర్‌టియు టిఎస్ సంఘం పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో పిఆర్‌టియు టిఎస్ రాష్ట్ర సంఘ అధ్యక్షుడు గుండు లక్ష్మణ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుల్గం దామోదర్ రెడ్డితోపాటు ఏఐఎఫ్‌టివో బాధ్యులు గీత, త్రివేణి, విజయలక్ష్మీతోపాటు దేశంలోని వివిధ రాష్ట్రాలకి చెందిన ఉపాధ్యాయ సంఘాల నేతలు పాల్గొన్నారు.

# జస్వంతరావుకు భార్యా వియోగం

**విజయవాడ,మే25,ప్రభాతవార్తప్రతినిధి:** సమైక్యాంధ్ర క్షీర విప్లవ పితామహుడు,ఆంధ్రా కురియన్ డాక్టర్ వీ.జస్వంతరావుకు భార్యా వియోగం కలిగింది. ఆయన సతీమణి స్వర్ణకుమారి(86) మరణించారు. ఈమెకు భర్త,ముగ్గురు కుమారులున్నారు. ఆమె త్రిదండి చినజీయర్ స్వామి అనుంగు శిష్యురాలిగా వ్యవహరించారు. స్వర్ణకుమారి కూడా క్షీర విప్లవంలో క్రియాశీలకంగా వ్యవహరించారు.

# అణ్వాయుధాలను భారీగా పెంచుకుంటున్న పాకిస్థాన్

## అమెరికా రక్షణ నిఘా సంస్థ నివేదిక వెల్లడి

**హైదరాబాద్, మే 25, ప్రభాతవార్త:** భారత్‌ను అస్తిత్వ ముప్పుగా భావిస్తున్న దాయాది దేశం పాకిస్తాన్ ఈ క్రమంలోనే భారీగా అణ్వాయుధాలను పోగేసుకుం టుందని అమెరికా రక్షణ నిఘా సంస్థ వెల్లడించింది. వరల్డ్ వైడ్ థ్రెట్ అసెస్‌మెంట్ పేరుతో అమెరికా రక్షణ నిఘా సంస్థ తాజాగా విడుదల చేసిన నివేదికలో ఈ విషయాలను వెల్లడించింది. భారత సైనిక శక్తితో పాక్ సైనిక శక్తి ఎంతమాత్రం సరిపోకున్నా, కేవలం అస్తిత్వ ముప్పుగా భావిస్తుండడంతో పాకిస్తాన్ ఈ చర్యల కు పాల్పడుతోందని ఆ నివేదిక తెలిపింది. స్వదేశంలో ప్రజలు ఆకలితో అలమటిస్తున్నా, అష్టకష్టాలు పడుతున్నా అణు ఆయుధాగారాన్ని మాత్రం ఆధునీకరిస్తో ందని అమెరికా రక్షణ నిఘా సంస్థ పేర్కొంది. ఈ క్రమంలోనే పాక్ అణు పదార్థాల భద్రత, న్యూక్లియర్ కమాండ్ కంట్రోల్ నిర్వహణతో పాటు భారీ విధ్వం సాలను సృష్టించే పదార్థాలను విదేశీ సరఫరాదారులతో పాటు మధ్యవర్తుల నుంచి దండిగా సొమ్ము చెల్లిస్తూ సేకరిస్తోందని ఆ సంస్థ తెలిపింది. కాగా ఈ ఆయు ధాల అభివృద్ధికి అవసరమైన వస్తువులు, సాంకేతికతను చైనా నుంచి పాకిస్తాన్ పొందుతోందని అమెరికా రక్షణ సంస్థ ఆ నివేదికలో పేర్కొంది. వీటిలో కొన్ని నేరుగా కాకుండా, హాంకాంగ్, సింగపూర్, తుర్కియే, యునైటెట్ అరబ్ ఎమిరెట్స్ దేశాల ద్వారా మళ్లిస్తోందని ఆ నివేదికలో వుంది. అయితు పాక్‌కు సైనిక పరి కరాల ప్రధాన సరఫరాదారుగా వున్న చైనా, పాకిస్తాన్‌లో తమ దేశీయులపై జరుగుతున్న ఉగ్రదాడులపై మరోవైపు ఆగ్రహంగానే వుందని అమెరికా రక్షణ సంస్థ నివేదిక పేర్కొంది. ఈ అంశం పాక్, చైనా సంబం ధాలను దెబ్బతిస్తోందని ఆ సంస్థ వెల్లడించింది.

కాశ్మీర్‌లోని పహల్గాంలో ఏప్రిల్ నెలలో జరిగిన ఉగ్రదాడి గురించి కూడా అమెరికా రక్షణ సంస్థ ప్రస్తావించింది. ఈ దాడి తరువాత పాక్‌లో ని ఉగ్రవాద స్థావరాలపై భారత్ దాడి చేయడం, దీనికి ప్రతిగా పాక్ డ్రోన్లతో దాడులకు దిగడం, భారత్ ఎదురుదాడి చేసిన అంశాన్ని కూడా ఆ నివేదికలో ప్రస్తావించారు. నాలుగు రోజుల తరువాత కాల్పుల విరమణ జరిగినా సరి హద్దు వివాదం మాత్రం అపరిష్కృతంగానే వుందని ఆ సంస్థ పేర్కొంది.

### రాహుల్ ఎప్పుడూ దేశం తరపున మాట్లాడ లేదు: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్, మే 25, ప్రభాతవార్త:** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఎప్పుడు భారతదేశం తరుపున మాట్లాడలేదని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్టు చేశారు. గత కొన్ని సంవత్సరాలుగా రాహుల్ గాంధీ ప్రకటనలను గమనిస్తే, అవి భారతదేశ సాయుధ దళాలను బలహీనపరచడానికి, మన స్వదేశీకరణ ప్రయత్నాలకు అడ్డంకులు సృష్టించడానికి ఒక సంఘటిత ప్రయత్నంగా ఉన్నట్లు ఉందన్నారు. ఇతర దేశాల డ్రోన్‌లను ప్రశంసించడం మొదలు రాఫెల్ కొనుగోలును ఒక కుంభకోణం అని మాట్లాడటం వరకు, అగ్నివీర్‌ను విమర్శించారన్నారు.



## ఉచిత మెడికల్ క్యాంపు ప్రారంభించిన ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

**విశాఖపట్నం, మే 25, ప్రభాతవార్త**

29 వార్డ్ పరిధిలో సెంచరీ క్లబ్ రోడ్‌లో మూడు గుళ్ళు వద్ద స్థానిక జనసేన యువ నేత బమ్మిడి భార్గవ్ జన్మదినోత్సవ వేడుకలో బాగంగా ఏర్పాటు చేసిన ఉచిత మెడికల్ క్యాంపును దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సేవా దృక్పథంతో మెలగాలని, ఆదర్శమైన సమాజ మార్పు కు యువత ముందుండాలని అన్నారు. కార్యక్రమంలో పలువురికి ఎమ్మెల్యే వంశీకృష్ణ చేతులమీదగా ఉచిత మందులు అందజేశారు. అనంతరం కేక్ కట్ చేసి భార్గవ్ కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో 29వ వార్డు ఇంచార్జి దువ్వి గోవిందరావు, 29వ వార్డు కార్పొరేటర్ ఉరికిటి నారాయణ రావు, మాజీ కార్పొరేటర్ బుద్ధల అనురాధ, జనసేన అధ్యక్షులు అంగటి శ్రావణ్ కుమార్, కూటమి నాయకులు కర్రి చిన్ని, లక్ష్మణ్, కిషోర్, వర్ధన్, లలితా, బాబురావు, పద్మ, గోపి, లక్ష్మీ, సుబ్బలక్ష్మీ, నిర్వాహకులు భార్గవ్, నక్కిళ్ళ రాజేశ్, వినయ్, పవన్ పాల్గొన్నారు.




విశాఖపట్నం అనకాపల్లి అల్లూరి సీతారామరాజు 26

వార్త


## పలు అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొన్న ఎంపీ శ్రీ భరత్

**విశాఖపట్నం, మే 25, ప్రభాతవార్త**



శృంగవరపుకోట నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో విశాఖ ఎంపీ మతుకుమిల్లి శ్రీభరత్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి, డీసీఎంఎస్ చైర్మన్ గొంప కృష్ణ, ఆంధ్రప్రదేశ్ టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్ సుధారాణి పాల్గొన్నారు. ఎల్.కోట మండలం గేదలవానిపాలెం గ్రామంలో రూ.40 లక్షల వ్యయంతో నిర్మించిన బ్రిడ్జి మరియు సీసీ రోడ్డు ప్రారంభోత్సవాన్ని నిర్వహించారు. ఇది గ్రామ ప్రజలకు మెరుగైన రవాణా సదుపాయాలను కల్పించనుంది అని ఎంపీ శ్రీభరత్ పేర్కొన్నారు. అలాగే వేపాడ మండలం వీలుపర్తి గ్రామం లో రూ.50 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన సచివాలయం మరియు రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభించారు. గ్రామస్థులకు పరిపాలన సేవలను మరింత సులభంగా అందించే విధంగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తుంది అని ఎంపీ శ్రీభరత్ పేర్కొన్నారు. అలాగే వేపాడ మండలం పాటూరు గ్రామంలో రూ.20 లక్షల వ్యయంతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం ఎస్.కోట మండలం బొడ్డవర నుంచి చిట్టెంపాడు వరకు మిగతా 8లో..

## యోగాంధ్ర కార్యక్రమం విజయవంతం చేయాలి

### - మాస్టర్ ట్రైనర్లు బాధ్యత కీలకం - జిల్లా కలెక్టరు విజయకృష్ణన్

**అనకాపల్లి, మే 25, ప్రభాతవార్త**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమం విజయవంతం చేయడంలో మాస్టర్ ట్రైనర్ల పాత్ర కీలకమని జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ తెలిపారు. స్థానిక రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తున్న రెండురోజుల యోగా మాస్టర్ ట్రైనర్లు శిక్షణా కార్యక్రమాన్ని జిల్లాకలెక్టరు విజయ కృష్ణన్ ఆదివారం ఉదయం సందర్శించారు. ఈ కార్యక్రమంలో యోగా మాస్టర్ ట్రైనర్లను ఉద్దేశించి జిల్లా కలెక్టరు మాట్లాడుతూ యోగా శిక్షణా శిబిరంలో చక్కగా యోగా శిక్షణ తీసుకొని, తదుపరి మండలాలలో యాభై మందికి శిక్షణ అందించాలని తెలిపారు. మండల స్థాయిలో శిక్షణ అందించుటకు మాస్టరు ట్రైనర్లకు రెండు రోజుల శిక్షణా కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమం విజయవంతం చేయడంలో మాస్టర్ ట్రైనర్లు బాద్యత కీలకమని, మండలంలో శిక్షణ తీసుకున్న ట్రైన్లర్లు గ్రామాలలో కనీసం యాభైమందికి తక్కువ కాకుండా యోగా నేర్పించాలని సూచించారు. ప్రతి ఒక్కరు యోగాంధ్ర యాప్ నందు నమోదు కావాలని, అదేవిధంగా ప్రజలు పెద్దఎత్తున యాప్ లో రిజిస్ట్రేషను చేసుకొని, ఈ కార్యక్రమంలో భాగస్వాములు చేసేవిధంగా అవగాహన, ప్రచారం కల్పించాలన్నారు. ప్రతి ఒక్కరు యోగా చేసేవిధంగా ప్రోత్సహించాలని, యోగాతో ఆరోగ్యం వస్తుందని ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా టూరిజం అధికారి కె. మనోరమ, జిల్లా ఆయుష్ అధికారి డా. కె. లావణ్య, యోగా సంస్థల అబ్యాసకులు, మాస్టరు ట్రైనర్లు పాల్గొన్నారు.






## సేంద్రియ మామిడి పండ్ల మేళాకు మంచి స్పందన

### - విశాలాక్షి నగర్ జీవీకే కళాశాలలో రెండు విడతలుగా మేళా

8 లో

## స్పీకర్ అయ్యన్నపాత్రుడు కు కృతజ్ఞతలు తెలిపిన డీలర్లు

**నర్సీపట్నం, మే 25, ప్రభాతవార్త**

రేషన్ మొబైల్ వాహనాలు రద్దు చేసి, డీలర్లకు పాత విధానాన్ని మళ్లీ అమలు చేసినందుకు స్పీకర్ అయ్యన్నపాత్రుడుని నర్సీపట్నం రేషన్ డిపో అసోసియేషన్ సభ్యులు ఆదివారం క్యాంప్ కార్యాలయంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ వృద్ధులకు, వికలాంగులకు రేషన్ సరఫరా విషయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండానే వారి నివాసాల వద్దకే సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని, డీలర్లకు సూచించారు.



## వాహనాల ద్వారా రేషన్ పంపిణీ చేయాలి

### - ఏఐటీయుసి రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ డిమాండ్




**విశాఖపట్నం, మే 25, ప్రభాతవార్త**

రాష్ట్ర ప్రభుత్వం ఇంటింటికి రేషన్ పంపిణీ చేసే వాహనాలు ఎం.డీ.యూ విధానాన్ని రద్దు చేయడం ద్వారా 20 వేల కుటుంబాలు రోడ్డున పడతాయని కాబట్టి ఆ నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తొలగించిన డ్రైవర్లును కొనసాగించి ఉపాధి కల్పించాలని ప్రజా పంపిణీ వ్యవస్థను పటిష్టపరిచి వాహనాల ద్వారానే రేషన్ సరఫరా చేయాలని కోరుతూ ఆదివారం విశాఖ జిల్లా ఎండియు ఆపరేటర్స్ ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహంవద్ద నుండి నిరసన ప్రదర్శన నిర్వహించి జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పడాల రమణ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థ బలోపేతం చేయాలి అనే ఉద్దేశం ఉంటే, కేరళ రాష్ట్రం వలె పేద ప్రజలకు 16 రకాల నిత్యవసర సరుకులను పంపిణీ చేయొచ్చు అన్నారు. అంతేగాని గత ప్రభుత్వంలో నియమించారు కాబట్టి వారిని తొలగించాలని కక్ష సాధింపు చర్యలు కరెక్ట్ కాదని హితవు పలికారు. గత ప్రభుత్వం రేషన్ డీలర్లను కొనసాగిస్తూనే ఎం.డి.యు విధానాన్ని అమలు చేసిందని గుర్తు చేశారు. కాబట్టి అదే విధంగా ఇప్పుడు రేషన్ డీలర్ల తో పాటు ఏం డి యు విధానం కూడా అమలు చేయవచ్చునని అన్నారు. ప్రభుత్వం అకస్మాత్తుగా ఇంటింటి రేషన్ పంపిణీ విధానం రద్దు చేయడం వలన ఎం.డి.యులు వందల మంది హెల్పర్లు సుమారు 20 వేల మంది కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. 2027 వరకు రాష్ట్ర ప్రభుత్వంతో వీరికి అగ్రిమెంట్ ఉన్నదని గుర్తు చేశారు ఇప్పటికీ వాహనాలపై వీరు ఈఎంఐ లు కడుతున్నారని మంత్రి నాదెండ్ల మనోహర్ గారు ఉచితంగా వీటిని అందజేస్తున్నామని గొప్పలు చెబుతున్నారు 10 డౌన్ పేమెంట్ గా 62000/ వేల రూపాయలు కట్టారు వీరికి ఇస్తున్నటువంటి 21000/ వేల జీవితంలో ఎండియు ఆపరేటర్లకు 10,000/ హెల్పర్లు 5000/ పెట్రోల్ ఖర్చులు 3000/ పోగా మిగిలిన 3000/ రూపాయలను 30 సబ్సిడీ కింద ఏండియు ఆపరేటర్లు చెల్లిస్తున్నారు కానీ ఈ ప్రభుత్వం ఉచితంగా వాహనాలను ఇచేస్తున్నామని గొప్పలు చెప్తోంది ఏ విధంగా ఉచితంగా ఇచ్చారు అని ప్రశ్నించారు. రేషన్ పంపిణీ విధానములో ఏమైనా లోపాలు ఉంటే వాటిని సరిదిద్ది ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాల్సిన ప్రభుత్వం " ఇంట్లో ఎలుకలు ఉన్నాయని ఇంటిని తగలబెట్టిన చందంగా " ప్రజలకు దగ్గరగా పంపిణీ జరుగుతున్న ఎం డి యు వ్యవస్థను రద్దు చేయడం ప్రభుత్వ అనాలోచిత నిర్ణయానికి నిదర్శనమని.రాష్ట్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఎం.డి. యులు చేస్తున్న న్యాయమైన పోరాటానికి ఏఐటీయూసీ సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందని అన్నారు. ఏం డి యు ఆపరేటర్స్ నిర్వహిస్తున్న ర్యాలీ లో వైయస్సార్సీపి జిల్లా అధ్యక్షులు కేకే రాజు. దక్షిణ నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు వాసుపల్లి గణేష్ కుమార్ తదితరులు పాల్గొని డ్రైవర్లకు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆపరేటర్స్ అసోసియేషన్ నాయకులు ఎన్.బి సతీష్. ఫరూక్.. స్వామి. ప్రసన్న. గోపి. జగన్నాధం ఏఐటీయూసీ నాయకులు కే సత్యనారాయణ టి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులను అభినందించిన స్పీకర్ అయ్యన్నపాత్రుడు

**నర్సీపట్నం, మే 25, ప్రభాతవార్త**



యూనివర్శిటీ స్థాయిలో మొదటి రెండు స్థానాలను సాధించిన నర్సీపట్నం అల్లూరి సీతారామరాజు ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు హృదయపూర్వక శుభాకాంక్షలు, అభినందనలు తెలిపారు. ఈ విజయం ఎంతో గర్వకారణమని ప్రశంసించారు. ఈ సందర్భంగా బీకాం చదువుతున్న విద్యార్థి చీమల దుర్గాప్రసాద్ యూనివర్శిటీ స్థాయిలో మొదటి ర్యాంకు, అనిమిరెడ్డి సత్య హేమలత రెండవ ర్యాంకు సాధించినట్లు పేర్కొన్నారు. నర్సీపట్నం పేరు విద్యారంగంలో ప్రతిష్టాత్మ కంగా నిలిపిన ఈ విద్యార్థులు అందరికీ ఆదర్శంగా నిలుస్తారని అన్నారు. విద్యార్థుల కృషి, అధ్యాపకుల నిబద్ధత వల్లనే ఈ ఘనత సాధ్యమైందని కొనియాడారు. నందమూరి తారకరామారావు గారి ఆశీస్సులతో నేను నర్సీపట్నానికి తీసుకొచ్చిన ఈ కళాశాల నుండి విద్యారంగంలో ప్రతిభ చూపిన విద్యార్థులు వెలువడుతున్న విషయం ఎంతో హర్షదాయకం. తద్వారా నర్సీపట్నం విద్యా ప్రగతికి ఇది ఒక గొప్ప మైలురాయిగా నిలుస్తుందని విశ్వాసం, ఆనందం వ్యక్తం చేశారు.

## ఫిల్మ్ నగర్ కల్చరల్ సెంటర్‌కు త్వరలో భూమి పూజ

### - భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

**భీమిలి, మే 25, ప్రభాతవార్త**

విశాఖ ఫిల్మ్ నగర్ కల్చరల్ సెంటర్‌కు రామానాయుడు స్టూడియో దగ్గర ప్రభుత్వం కేటాయించిన అయిదెకరాల భూమి లీజు కాలాన్ని ఖరారు చేయాల్సిందిగా ప్రభుత్వ దృష్టికి తీసుకు వెళ్లినట్టు భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు చెప్పారు. తిమ్మాపురంలోని కల్చరల్ సెంటర్‌లో కమిటీ సభ్యులతో ఆదివారం సమావేశమైన ఆయన మాట్లాడుతూ ఫిల్మ్‌నగర్ కల్చరల్ సెంటర్ కోసం 2014 2019లో టీడీపీ ప్రభుత్వం భూమిని కేటాయించిందని, లీజు నిమిత్తం రూ. 22 లక్షలు చెల్లించిన విషయాన్ని గుర్తుచేశారు. అయితే లీజు కాలాన్ని ఆ ఉత్తర్వుల్లో మిగతా 8లో..



## పవన్ కళ్యాణ్ పై విమర్శలు చేస్తే సహించేది లేదు

### - ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్

**విశాఖపట్నం, మే 25, ప్రభాతవార్త**

వైసీపీ నాయకులు పవన్ కళ్యాణ్ పై విమర్శలు చేస్తే సహించేది లేదని ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ అన్నారు. ఆదివారం సీతంపేటలో గల జనసేనపార్టీ నగర కార్యాలయంలో జరిగిన ప్రెస్ మీట్ లో యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ మాట్లాడుతూ సినిమా ఇండస్ట్రీ అసోసియేషన్ ద్వారా వస్తే సమస్యలను పరిష్కరిస్తాం అని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారని, దీనిని వక్రీకరించి మాట్లాడటం కరెక్ట్ కాదని అన్నారు. తమ నాయకుడి పై ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే సహించబోమని, తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. సినిమా ఆటోగ్రఫీ మంత్రిగా ఉన్నప్పుడు నువ్వు ఏం అభివృద్ధి చేశావని పేర్ని నానిని నిలదీశారు. మంత్రి గా ఉన్నప్పుడు సినీ పెద్దలందరిని బ్లాక్ మెయిల్ చేసి ఇండస్ట్రీని నిర్వీర్యం చేసారని నాని పై మండిపడ్డారు. గడచిన ఐదేళ్ల వైసిపి పాలనలో అన్ని వ్యవస్థలు నిర్వీర్యం అయ్యాయని ఆరోపించారు. తమ వెన్నెముక సినిమా ఇండస్ట్రీ అని, సినిమా పరిశ్రమ అంటే చాలా అభిమానం అని అన్నారు. తమ నాయకుడు సినిమా ఇండస్ట్రీ నుండి వస్తె.. మీ నాయకుడు ఫ్యాక్షన్ ఇండస్ట్రీ నుంచి వచ్చారని విమర్శించారు. వ్యవస్థలను పెంచుకుంటూ పోయే పార్టీ మాది.. వ్యవస్థలను తుంచుకుంటూ పోయే పార్టీ మీది.. అందుకే చిత్తుగా ఓడి ఇంటికే పరిమితం అయ్యారని ఎమ్మెల్యే విజయ్ కుమార్ వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమం లో విశాఖ సౌత్ పాయింట్ ఆఫ్ కాంటాక్ట్ శివ ప్రసాద్ రెడ్డి, పెతకంశెట్టి శ్యామ్ పాల్గొన్నారు.



## ఫిల్మ్‌నగర్ కల్చరల్ సెంటర్‌కు త్వరలో భూమిపూజ

**తరువాయిలు** ప్రస్తావించకపోవడంతో జాప్యం చోటు చేసుకుందని వివరించారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ అంశాన్ని కనీసం పట్టించుకోలేదన్నారు. సముద్ర తీరాన కేటాయించిన స్థలంలో విశాఖ పేరు, ప్రతిష్టలు ఇనుమడింపజేసేలా అధునాతన కల్చరల్ సెంటర్ నిర్మించాలని సూచించారు. ఇప్పటికే సిద్ధం చేసిన భవనాల డిజైన్లను గంటా శ్రీనివాసరావు పరిశీలించారు. కన్వెన్షన్ సెంటర్, ఓపెన్ ఎయిర్ థియేటర్, రూంలు, స్పోర్ట్స్ ఎరీనా, బ్యాంకెట్ హాల్స్, స్విమ్మింగ్ పూల్ వంటి ఆధునిక సౌకర్యాలతో ఫిల్మ్ నగర్ కల్చరల్ సెంటర్ ను అందుబాటులోకి తీసుకురావాలని కమిటీ సభ్యులకు సూచించారు. పక్కనే రూ. 172 కోట్లతో యూనిటీ మాల్ నిర్మించనున్న నేపథ్యంలో ఆ ప్రాంతానికి ఒక ల్యాండ్ మార్క్ గా గుర్తింపు రానుందన్నారు. కల్చరల్ సెంటర్ భవన నమూనా ఆకర్షణీయంగా ఉండేలా డిజైన్ చేయించాలని చెప్పారు. ఫిల్మ్ నగర్ సెంటర్ కు భూ కేటాయింపు అనేది సభ్యుల పదేళ్ల కలగా ఆయన పేర్కొన్నారు. వాల్తేర్ క్లబ్, గోల్ఫ్ క్లబ్ మాదిరిగా అత్యాధునిక హంగులతో ఫిలిం నగర్ కల్చరల్ సెంటర్ ను నిర్మించాలని పేర్కొన్నారు. దేశంలోని ప్రముఖ క్లబ్ లలో అమలవుతున్న ఉత్తమ నియమావళిని ఫిల్మ్ నగర్ కల్చరల్ సెంటర్ లో అమలు చేయడం ద్వారా మోడల్ క్లబ్ గా తీర్చి దిద్దాలని చెప్పారు. కల్చరల్ సెంటర్ లో నిర్మాణానికి తగినన్ని నిధులు ఉన్నందున, లీజు కాలం నిర్ధారణ తర్వాత భూమి పూజ చేసి వేగంగా నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. దీని ద్వారా స్థానిక యువతకు ఉపాధి కలుగుతుందని, టూరిజం అభివృద్ధికి ఊతంగా ఉంటుందని తెలిపారు. అనంత రం కల్చరల్ సెంటర్ లో సౌకర్యాలను గంటా పరిశీలించారు. ఆదాయ వనరులను పెంచుకోవాలని, సభ్యులకు నాణ్యమైన సేవలు అందించాలని కమిటీ సభ్యులకు చెప్పారు. సమావేశంలో అధ్యక్షుడు ఆర్.వి. చంద్రమోళి ప్రసాద్ (కిన్ను), కోశాధికారి కె. బాలాజీ శివప్రసాద్, సభ్యులు ఎ.ఎల్.ఎన్. రాజు, కంటిపూడి వెంకటేశ్వరరావు, శ్రీధర్ రాజు, జాస్తి శ్రీకాంత్ పాల్గొన్నారు.

## పలు అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొన్న ఎంపి శ్రీభరత్



రూ.11 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించనున్న బీటీ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. ఈ రహదారి నిర్మాణం ద్వారా స్థానిక గ్రామాలకు మెరుగైన అనుసంధానం లభించనుంది. ఎస్.కోట పట్టణ కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో రూ.6 కోట్ల వ్యయంతో నిర్మించనున్న అదనపు వసతుల భవనానికి శంకుస్థాపన చేశారు. రానున్న రోజుల్లో పుణ్యగిరి డిగ్రీ కళాశాల ను మరింత అభివృద్ధి చేస్తామని, అందుకు తగిన ప్రణాళికలను మరియు ఆలోచనలను విద్యార్థులు అందించాలి అని కోరారు. పుణ్యగిరి డిగ్రీ కళాశాల కు వైభవం తెచ్చేందుకు కృషి చేస్తామని ఆయన పేర్కొన్నారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం, ఎస్.కోటలో ముఖ్యమంత్రి సహాయనిధి కింద అర్హులైన లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. దాదాపు 8 లక్షల రూపాయల చెక్ లను ఆయన అందజేశారు. అలాగే జామి మండలం తానవరం గ్రామంలో రూ.2 కోట్ల వ్యయంతో నిర్మించనున్న బ్రిడ్జి నిర్మాణానికి ఎంపీ శ్రీభరత్ గారు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రిడ్జి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని, అని ప్రజలకు ఉపయోగపడే విధంగా కూటమి ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహిస్తుంది అని ఆయన అన్నారు. అదే మండలం రామభద్రపురం అగ్రహారం గ్రామంలో రూ.1 కోట్ల వ్యయంతో నిర్మించనున్న బీటీ రోడ్డుకు ఎంపీ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ, ప్రతి ప్రాంత అభివృద్ధికే మా ప్రాధాన్యతని, ప్రజల అవసరాలను గుర్తించి ప్రభుత్వం మంజూరు చేసిన నిధులను సమర్ధవంతంగా వినియోగిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమాలు ప్రజల జీవితాల్లో నాణ్యతను మెరుగుపరచే దిశగా కీలకంగా నిలుస్తాయి అని ఆశిస్తున్నాం," అని తెలిపారు.

## సేంద్రియ మామిడి పండ్ల మేళాకు మంచి స్పందన

**- విశాలాక్షి నగర్ బీవీకే కళాశాలలో రెండు విడతలుగా మేళా**

**విశాఖపట్నం, మే 25, ప్రభాతవార్త**



ఈ నెల 24, 25 తేదీ లలో రెండో పర్యాయం నిర్వహించిన సేంద్రియ మామిడి పండ్ల మేళా విజయవంతమైంది. విశాఖపట్నం విశాలాక్షి నగర్ లోని బివికె కళాశాలలో నిర్వహించనున్నట్టు గో ఆధారిత ప్రకృతి ఆధారిత రైతుల సంఘం నిర్వహించిన మేళాను విశేషంగా ఆదరించిన విశాఖ వాసులకు సంఘం కార్యదర్శి చవ్వాకుల అశోక్ ధన్యవాదాలు తెలిపారు. రెండు విడతలుగా నిర్వహించిన ఈ మేళ ఆదివారం రాత్రి తో ముగిసింది. ఈ మేళా నగరవాసులు, అరుదైన మామిడి రకాలను సేంద్రీయ పద్ధతుల్లో పండించి తీసుకువచ్చిన రైతుల సహకారంతో విజయవంతం అయ్యిందని పేర్కొన్నారు. ఇంత జయప్రదంగా ఆరోగ్యకరమైన మామిడి పండ్ల మేళాకు సహకారం అందించిన వారిందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. అరుదైన మామిడి రకాలు ఈ మేళా ద్వారా నగరవాసులకు పరిచయమయ్యాయని, ఇవన్నీ రసాయనాలు లేకుండా సేంద్రియంగా పండించినవని తెలిపారు. మన దేశంలో అనేక రకాల దేశీయ మామిడి కాయలు ఉన్నాయని వాటిని కాపాడుకోవడం మన బాధ్యత అని విశాఖ వాసులు వాటిని బాగా ఆదరిస్తున్నారని మేళాలో పలు రకాల మామిడిపళ్ళను అందించిన సేంద్రియ రైతు పేరి రామకృష్ణమూర్తి పేర్కొన్నారు. పంచదార కలిశాలు, పండూరి మామిడి, కొత్తపల్లి కొబ్బరి, స్వాగతం, అమృతం, పాపారాజు గోవా, నాగులపల్లి ఇరసాలు, హైదర్ సాయిబు, జహంగీర్, పెద్ద రసాలు, చిన్న రసాలు, బంగినపల్లి, సువర్ణ రేఖ కొబ్బరి అంటు, ముంత మామిడి ,సన్నాకులు, దొండకాయ , ఇమామ్ పసంద్ తదితర రకాలు ఈ మేళాలో విశాఖపట్నం కొనుగోలు చేసి రుచి చూశారని తెలిపారు. విశాఖవాసులు అందించిన సహకారంతో భవిష్యత్తులో మరిన్ని సేంద్రీయ పంటలను ఈ రకమైన సంతల ద్వారా విశాఖ వాసుల ముందు ఉంచుతామని నిర్వాహకులు తెలిపారు.

## జివిఎంసిలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం

**- విశాఖ నగర మేయర్ పీలా శ్రీనివాసరావు**

**- జివిఎంసి ఇన్చార్జి కమిషనర్ ఎమ్ ఎన్. హరేంధిర ప్రసాద్**

**విశాఖపట్నం, మే 25, ప్రభాతవార్త**



మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోను, అన్ని జోనల్ కార్యాలయాలలోనూ "ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం" 2025 మే 26 వ తేదీ సోమవారం ఉదయం 11.00 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంట వరకు నిర్వహించబడునని విశాఖ నగర మేయర్ పీలా శ్రీనివాసరావు, జివిఎంసి ఇన్చార్జి కమిషనర్ ఎమ్ ఎన్.హరేంధిర ప్రసాద్ పత్రికా ప్రకటన ద్వారా ఆదివారం తెలిపారు.కావున, నగరంలో పారిశుద్ధం, పట్టణ ప్రణాళిక విభాగం, మొక్కల విభాగం, రెవిన్యూ, యు సి డి, ఇంజినీరింగ్ మొదలగు జీవీఎంసీ విభాగాలకు సంబంధించిన సమస్యలపై మే 26 వ తేదీ సోమవారం ఉదయం 11.00 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంట వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో నగర ప్రజలు అర్జీల ద్వారా సమస్యలను తెలియపరుచుకోవచ్చునని నగర ప్రజలకు విశాఖ నగర మేయర్ పీలా శ్రీనివాసరావు, జివిఎంసి ఇన్చార్జి కమిషనర్ ఎమ్ ఎన్.హరేంధిర ప్రసాద్ తెలియచేశారు.

# సాగర్ తీరాన జయహో భారత్

**- ఈవెంట్ మేనేజర్స్ నేతృత్వంలో భారీ టార్చ్ లైట్ ర్యాలీ - వందలాదిమంది ప్రజానీకం సమేకం**

**విశాఖపట్నం, ప్రభాతవార్త**




పాకిస్తాన్ తీవ్రవాదులపై వీరోచితమైన దాడులు చేసి దేశ రక్షణలో ప్రతిభ చాటిన వీర జవాన్ల సేవలను కొనియాడుతూ విశాఖ సాగర తీరాన శనివారం సాయంత్రం టార్చ్ లైట్ ర్యాలీ భారీ ఎత్తున జరిగింది. ఈవెంట్ మేనేజర్స్ అసోసియేషన్ విశాఖ చాప్టర్ నేతృత్వంలో ఆర్కే బీచ్ జంక్షన్లో గల కాళీమాత విగ్రహం దగ్గర నుంచి వై ఎం సి ఏ వరకు ఈ టార్చ్ లైట్ ర్యాలీ కొనసాగింది. దీనికి ముందు ఆర్కే బీచ్ జంక్షన్లో ఏర్పాటు చేసిన వేదికపై వీర జవాన్ల త్యాగాలను ప్రతిబింబించే నృత్య రూపకాలు ప్రదర్శించడం జరిగింది. ఈ డాన్సులు వందలాదిమంది వీక్షకుల హృదయాలను స్పందింప చేశాయి. ఈవెంట్ మేనేజర్స్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు సందీప్ కుమార్, షరీఫ్ ఖాన్ తదితర కార్యవర్గ సభ్యులు నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఏపీ టూర్స్ అండ్ ట్రావెల్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కే. విజయ మోహన్, వైజాగ్ హోటల్స్ అసోసియేషన్ కార్యదర్శి పవన్ కార్తీక్, సీనియర్ ఈవెంట్ మేనేజర్లు మీనాక్షి అనంత రామన్, అజయ్ అగర్వాల్, దాడి రవికుమార్, ఎన్ ఆర్ కె బాబురావు , జయ చంద్ర వర్మ ఈమా అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# అభివృద్ధికి రాజకీయాలతో ముడి పెట్టకూడదు

**- డాక్టర్ రహమాన్,షిరీన్ రహమాన్ దంపతుల 75 వసంతాల వేడుకలో ఎమ్మెల్యే వంశీ**

**విశాఖపట్నం మే 25.ప్రభాతవార్త**

అభివృద్ధికి రాజకీయాలతో ముడి పెట్టరాదని ప్రగతి పనులు రాజకీయాలకు అతీతంగా చేయగలిగి ఉండాలని అప్పుడే ఆ నాయకుని జీవితం సార్ధకత అవుతుందని ఆ కోవకు చెందిన మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎస్. ఎ. రహమాన్ ధన్యులని విశాఖపట్నం దక్షిణ నియోజకవర్గం శాసనసభ్యులు సి.హెచ్.వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఆదివారం మెయిన్ రోడ్లోని శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానం ఎదురుగా ఉన్న క్రాంతి పిక్చర్స్ కన్వెన్షన్ హాల్లో వుడా మాజీ చైర్మన్ డాక్టర్ రహమాన్, షిరీన్ రహమాన్ దంపతుల 75 వసంతాల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరిగింది. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ ఎమ్మెల్యేగా ప్రజాసేవ చేయడంలో రహమాన్ తనకు తానే సాటి అనిపించుకున్నారని కొనియాడారు. చైతన్య స్రవంతి స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా డాక్టర్ షిరీన్ రహమాన్ ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టి విశేష ప్రజాభిమానాన్ని చూరగొన్నారని ఆ దంపతులు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని అన్నారు. రాజ్యసభ మాజీ సభ్యులు డాక్టర్ యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ మాట్లాడుతూ సంఘటనలు, దుర్ఘటనల సమ్మేళనమే రాజకీయమని ఈ రెండు సంఘటన వల్ల ఎంతో మంది నాయకులు ఉన్నతమైన పదవులు అలంకరించాలని అన్నారు. రహమాన్ కు ఎమ్మెల్యే టికెట్ రావడం వెనుక తాము పడ్డ శ్రమను పక్కన పెడితే దివంగత ఎన్టీ రామారావు రహమాన్ ను ఈ స్థాయికి తెచ్చారని చెప్పారు. రాజకీయాల్లో డబ్బు సంపాదన ముఖ్యం కాదని నిజాయితీగా పనిచేసినప్పుడే ప్రజల ఆదరణ చూరగొనగలరని ఆ కోవకు చెందిన రహమాన్ దంపతులు నాటి నుండి నేటి వరకు ప్రజల హృదయాల్లో నిలిచిపోయారని ఇందుకు నేటి ఆత్మీయ సమ్మేళనమే నిదర్శనమని అన్నారు.ఉడా మాజీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎస్. ఎ. రహమాన్ మాట్లాడుతూ రాజకీయాల్లో ఎన్ని మెట్లు ఎక్కామన్నది ప్రక్కన పెడితే ఎంతవరకు నేతల మనసులకు దగ్గరయ్యామన్నది ముఖ్య మన్నారు. ప్రజలకు సేవ చేయడంలోనే సంతృప్తి ఉందని పేర్కొన్నారు. చైతన్య స్రవంతి అధ్యక్షురాలు డాక్టర్ షిరీన్ రహమాన్ మాట్లాడుతూ ఒక స్వచ్ఛంద సేవా




సంస్థ ద్వారా ఇన్ని కార్యక్రమాలు చేపట్టామంటే అది ప్రజల సహకారమేనని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత మాజీ అధ్యక్షులు నార్నె నరసింహారావు, లీడర్ దినపత్రిక సంపాదకులు వి.వి. రమణమూర్తి కూటమి పార్టీల నాయకులు డబ్ల్యూ. భాస్కరరావు, అత్తిలి శంకర్రావు, గొలగాని రవీశ్వరరావు, కృష్ణారెడ్డి, విన్నర్ ఎంటర్ప్రైజెస్ ఎండి ఫర్హాన్,డి. భారతి, అబ్దుల్ చిన్న రహమాన్,మున్నం బాలాజీ,కె. ఎం. రసూల్, బొడ్డేటి అప్పారావు, విజయ, రుకియాభాను,హోటల్ బుదిల్ పార్క్ మేనేజర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.వివిధ పార్టీల నేతలు, కార్యకర్తలు, ముస్లిం ప్రతినిధులు డాక్టర్ రహమాన్ దంపతులను శాలువలు, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు.

# వాసుపల్లి చొరవతో బాధితురాలికి మోక్షం

**- 41వార్డులో కూటమినేతల దళారి వ్యవస్థ ను నిర్మూలించండి**

**- వాసుపల్లి తో ఉద్యోగ సిఫార్స్ లెటర్ అందించిన కార్పొరేటర్ పూర్ణిమ, శ్రీధర్**



**విశాఖపట్నం, మే 25, ప్రభాతవార్త**

జీవీఎంసీ పరిధి 41 వ వార్డులో ఓ పేద మహిళ బాధితురాలకు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ శ్రీధర్లు అండగా నిలిచి మోక్షం కల్పించారు. ఈ మేరకు బాధితురాలు విస్సారపు నాగమణికి జీవీఎంసీలో ఉద్యోగం కల్పిస్తూ ఇచ్చిన సిఫార్స్ లెటర్ ను మాజీ ఎమ్మెల్యే వాసు పల్లి గణేష్ కుమార్ చేతుల మీదుగా జ్ఞానాపురం కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ శ్రీధర్ కార్యాలయంలో ఆదివారం ఉదయం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో 2022 జూన్ 11వ తేదీ న జ్ఞానాపురం జేఎన్ఎన్యూఆర్ఎం కాలనీలో విద్యుత్ షాక్ తో విస్సారపు నాగమణి 8 ఏళ్ల కుమారుడు చైతన్య మృతి చెందారు. కాగా అప్పటినుండి కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ, శ్రీధర్ వారికి అండగా నిలిచారు. ఈపీడీసీఎల్ సంస్థ ద్వారా బాధితులకు రూ. 5లక్షల రూపాయలను ఆనాడు అందజేయడం జరిగిందన్నారు. అలాగే బాధితురాలు నాగ మణికి జీవీఎంసీలో ఉద్యోగం కల్పించడానికి కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ చేసిన కృషికొనియాడారు. ప్రమాదవశాత్తు జరిగిన విపత్తుల్లో బాధితులకు అండగా నిలిచిన ఏకైక ప్రభుత్వం వైసిపి మాత్రమే అన్నారు. కానీ నేడు కూటమి ప్రభుత్వం అందిస్తున్న రాక్షస పాలన ఏడాదిలోనే ప్రజలకు తెలిపోయిందని అన్నారు. చంద్రబాబు దుర్మార్గపు పాలన అన్ని వర్గాల ప్రజలను, ముఖ్యంగా మహిళలను అమలు కాని హామీలు ఇచ్చి మరోసారి చంద్రబాబు తన దుర్బుద్ధిని ప్రదర్శించుకున్నాడన్నారు. కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ శ్రీధర్ మాట్లాడుతూ ఎమ్మెల్యేగా వాసుపల్లి గణేష్ కుమార్ అన్ని విధాల సహకరించడం వలన పేదలకు సంక్షేమంతో పాటు వార్డులో సుమారు రూ. 11 కోట్ల పైగా అభివృద్ధి పనులు చేశామని చెప్పారు. ఆయన అందించిన సహాయ సహకారాల వలన బాధితురాలికి న్యాయం చేయగలిగామని వారు తెలియజేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక వార్డులో అవినీతి తాండవిస్తోందని కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ ఆరోపించారు. పేదలు ఇళ్ల కట్టుకున్న, వారికి ప్రభుత్వ పనులు జరగాలన్న స్థానిక నేతలు లంచాలు లేనిదే పనిచేయడం లేదన్నారు. దళారి వ్యవస్థను నమ్మొద్దని ప్రజలకు సూచించారు. వార్డులో డ్రైనేజీ, రోడ్లు, పలు అభివృద్ధి పనులు జరగాల్సి ఉందని, తమ వార్డుకు జీవీఎంసీ అదనంగా నిధులు కేటాయించాలని కోరారు. అధికారం ఉన్నా లేకున్నా ప్రజల కోసం అవినీతి రహితంగా పనిచేయడమే తమ లక్ష్యం అని కోడిగుడ్ల పూర్ణిమ శ్రీధర్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో వార్డు నాయకులు వేలంగిని రావు, కుమార్, శ్రీను, మహిళా నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

### ఎల్ వీపీఈఐ ఆధ్వర్యంలో బీచ్ రోడ్డు నందు

# వైటాథాన్ రన్

**విశాఖపట్నం మే 25 ప్రభాతవార్త**



ఎల్ వి ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ ఆధ్వర్యంలో (ఎల్‌విపిఇఐ) రెటినోబ్లాస్టోమా (కంటి క్యాన్సర్) యొక్క ముందస్తు గుర్తింపు అవగాహన కల్పించడానికి, దానితోపాటు చికిత్స కోసం నిధులను సేకరించడానికి "వైటాథాన్" రన్ యొక్క నాల్గవ ఎడిషన్‌ను నిర్వహించింది. ఈ కార్యక్రమం మే 1117 మధ్య వారం పాటు నిర్వహించి రెటినోబ్లాస్టోమా అవగాహన వారాన్ని పురస్కరించుకోడానికి నిర్వహించ బడింది. ఈ రన్‌ను ఆదివారం ఉదయం ఆర్ కె బీచ్ రోడ్డులోని కాళీ మాత ఆలయం వద్ద ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎల్ వీపీఈఐ జిఎమ్ఆర్ వరలక్ష్మి క్యాంపస్‌లో అడ్జంక్ట్ ఆప్తమాల జిస్ట్ డాక్టర్ సునీత మాట్లాడుతూ రెటినోబ్లాస్టోమా లక్షణాల గురించి ప్రజలలో అవగాహన కల్పించాల్సిన అవసరాన్ని వివరించారు. రెటినోబ్లాస్టోమా లక్షణాల గురించి ప్రజలకు, ముఖ్యంగా యువత తల్లిదండ్రులకు అవగాహన చాలా ముఖ్యం అన్నారు. పిల్లల కంటిలో తెల్లని ప్రతిబింబం కనిపించిన వెంటనే, కంటి నిపుణుడితో పరీక్షించడం అవసరం అని, ముందస్తు గుర్తింపు చికిత్స పిల్లల ప్రాణాన్ని, కళ్ళని, కంటి దృష్టిని కాపాడగలదు" అని అన్నారు. విశాఖపట్నంలోని జిఎమ్ఆర్ వరలక్ష్మి క్యాంపస్ ముఖ్యస్థులైన డాక్టర్ వీరేంద్ర సచ్దేవ మాట్లాడుతూ రెటినోబ్లాస్టోమా లక్షణాల గురించిన అవగాహనను పెంచాలని అందరినీ కోరారు. వైటాథాన్‌లో పాల్గొనడం ద్వారా పొందిన అవగాహనను మన సన్నిహితులతో పంచుకుంటే, కేసులను ముందస్తుగా గుర్తించి చికిత్స చేయడం ద్వారా కంటి దృష్టినీ, ప్రాణాన్ని కాపాడడంలో పెద్ద మార్పు తీసుకొచ్చే అవకాశం ఉందని అన్నారు. వైటాథాన్ రన్ ద్వారా సేకరించిన నిధులను ఆర్థికంగా వెనుకబడిన పిల్లలకు రెటినోబ్లాస్టోమా చికిత్సను ఉచితంగా అందించడానికి మరియు భవిష్యత్ పరిశోధనకు ఉపయోగిస్తారు. ఈ సంవత్సరం, 450 మందికిపైగా ఔత్సాహిక భాగస్వాములు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

### కళాకారులను ప్రోత్సహించడమే

# కళాభారతి ముఖ్య ఉద్దేశ్యం

**జగదాంబ, మే 25, ప్రభాతవార్త**

మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో నేడు ఆదివారం ఆల్ ఇండియా రేడియో గుర్తింపు పొందిన టేటా బిహై బి గ్రేడ్ కళాకారుని 67 మందిని ఘనంగా సత్కరించి కళాకారులను ప్రోత్సహించింది. ఏ టాబ్లెట్ నలుగురు కళాకారులు, ఏ గ్రేడ్ 8 మంది బీహార్ 27 మంది, బి గ్రేడ్ 27 మంది కళాకారులు సన్మానం పొందారని కళాభారతి సెక్రటరీ డా. రాంబాబు అన్నారు. ఇది కళాభారతి యొక్క ఆశయం అని, అనేక రకాల కార్యక్రమాలు నిర్వహిస్తూ సంగీతం, సాహిత్యం,నృత్యం, నాటకం, హరికథ,బుర్రకథ, తోలుబొమ్మలాట,జానపద, సాహిత్య కార్యక్రమాలు నిర్వహిస్తుందని, అన్ని కలలను పోషించాలనె దృక్పథంతో కళాభారతి కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. ఇంతమంది సీనియర్ వర్ధమాన కళాకారులని సన్మానించి సత్కరించడం ఈ ప్రక్రియ మొట్టమొదటగా చేయడం మాకు సంతోషంగా ఉందని కళాభారతి అధ్యక్షులు మంతెన సత్యనారాయణ రాజు అన్నారు. అతి త్వరలోనే ఇవ్వాళ సన్మాన గ్రహీతలుతో వంకాయల వెంకటరమణ మృదంగం గ్లోబల్ ఆర్టిస్ట్ వారి ఆధ్వర్యంలో మరికొన్ని మృదంగాలు కొన్ని సన్నాయిలు, డోళ్లు కలిపి ఒక చక్కటి లయ విన్యాస కార్యక్రమం నిర్వహించబోతున్నామని ప్రకటించారు.అలాగే డివోషనల్ లైట్ మ్యూజిక్ కాల్డకారులతో కూడా, ఎవరైనా లీడ్ తీసుకొని వస్తే, నిర్వహిస్తామని అన్నారు. కళాభారతి యాజమాన్యం కళలను కళాకారులను ప్రోత్సహించడమే ప్రముఖ ధ్యేయమని అన్నారు. తర్వాత ప్రముఖ గాత్రవిద్వాన్సులు డాక్టర్ ద్వారా త్యాగరాజు గారు అద్భుతమైన గాత్రకచేరి చేసి



హాజరైనందున వారందరినీ ఆనంద పరిచారు. వారికి సహకారం విద్వాన్ ఎం నీలాద్రి రావు విజయనగరం వైలెన్ పైన అలాగే శ్రీ ఎం ఏడుకొండలు ప్రసంగం పైన విజయనగరం వాస్తవ్యులు అలాగే బోర్సింగ్పై స్థానిక కళాకారులు ఏ గ్రేడ్ కళాకారులు వెంకటేష్ సహకరించి ఉన్నత స్థాయికి తీసుకువెళ్లి అందరి మన్ననలను పొందారు.




## సామెతలపై విద్యార్థులకు అవగాహన

నక్కపల్లి, ప్రభాతవార్త




మండలం లోని చిన దొడ్డి గళ్ళు శాఖా గ్రంధాలయంలో ఆదివారము వేసవి విజ్ఞాన శిక్షణా తరగతులు పురస్కరించుకొని గ్రంథాలయ అధికారి కే. జనార్ధన్ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు నేటి ఆధునిక జీవన విధానంలో మరుగున పడుతున్న తెలుగు భాషలో ఉండే సామెతలు వాటిలో ఉండే చమత్కారాలు గొప్పతనాన్ని సందర్భాన్ని బట్టి సామెతలను ఎలా ఉపయోగించి మాట్లాడాలో వివరించారు. విద్యార్థులతో పుస్తక పఠనం నిర్వహించారు. ఈ పోటీలో విద్యార్థులు నీతి కథలకు సంబంధించిన పుస్తకాలు చదివించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది, రవణమ్మ విద్యార్థులు పాల్గొన్నారు.

## భారత జవానులకు
## కసింకోట ప్రజలు సంఘీభావం ర్యాలీ

కసింకోట, మే 25, ప్రభాతవార్త



ఇటీవల పాకిస్తాన్ టెర్రరిస్టులు తలపెట్టిన బహల్గా న్ ఘటనకు భారత ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ సింధూర్ విజయవంతం కావడంతో భారత జవానులకు, భారత ప్రభుత్వానికి కసింకోట మాజీ సైనిక ఉద్యోగులు, భారతీయ జనతా పార్టీ నాయకులు ప్రజలు ఆదివారం సంఘీభావం తెలుపుతూ భారత జాతీయ జెండాలతో తరంగయాత్ర ర్యాలీ నిర్వహించారు. ఈ తిరంగ యాత్ర కసింకోట పెద్ద బజారు నుండి మెయిన్ రోడ్ జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహిస్తూ భారత్ మాతాకీ జై అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతీయులు ప్రతి ఒక్కరూ దేశ రక్షణ కొరకు మద్దతుగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు ద్వారపరెడ్డి పరమేశ్వరరావు, మాజీ సైనిక ఉద్యోగులు అధ్యక్షులు గొంతిన రమణ, కూటమి నాయకులు దాసరి బాబు, సిద్ది రెడ్డి శ్రీనివాసరావు, ప్రగడ నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

## త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారంకు మంచి స్పందన

అనకాపల్లి, మే 25, ప్రభాతవార్త



త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక విశాఖపట్నం కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో మండలం లోని సుందరయ్య పేట, అచ్చయ్య పేట గ్రామాల్లో త్రైత సిద్ధాంత భగవద్గీత, అనుబంధ త్రైత సిద్ధాంత జ్ఞాన గ్రంథాల ప్రచారంకు మంచి స్పందన లభించింది. ఈ సందర్భంగా జ్ఞానవేదిక అధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ దైవ జ్ఞానం ప్రకారం కులాలు అహేతుకం అని, మతాలు నిషిద్ధం అని ప్రతి ఒక్కరు తెలుసుకోవాలి అన్నారు. త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథం శ్రీకృష్ణుడి అసలైన జ్ఞానం ను తెలియజేస్తుందని, ప్రతి ఒక్కరూ కర్మ యోగం విశిష్టత, త్రైత సిద్ధాంత జ్ఞానం తెలుసుకోవాలి అనే ముఖ్య ఉద్దేశంతో భగవద్గీత ప్రచారం చేస్తున్నాము అని తెలిపారు. మన శరీరంలో దేవుడు మూడు ఆత్మలు గా విభజింపబడి ఉన్నాడని, జీవాత్మ, ఆత్మ, పరమాత్మ ల గురించి తెలుసుకోవడమే త్రైత సిద్ధాంతం అని తెలిపారు. భగవద్గీత లో కర్మయోగం, బ్రహ్మయోగం, భక్తియోగం అనేవి దైవ ధర్మాలు అని వాటి ప్రకారం నడుచుకుంటే కర్మ నుండి బయట పడేసి మనిషికి ముక్తిని ఇస్తాయి అని తెలిపారు. కార్యక్రమం లో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక విశాఖపట్నం కమిటీ సభ్యులు శ్రీనివాస్, రమణ, నాగమణి, పద్మ, లక్ష్మీ, త్రైత, సర్వధారి, దేవి, సత్యవతి, మీనాక్షి లు పాల్గొన్నారు.

## పేదలకు దుప్పట్లు పంపిణీ

నక్కపల్లి, ప్రభాతవార్త



అమ్మ నాన్న చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని బుచ్చిరాజుపేట శివారు నల్లమట్టి పాలెం గ్రామంలో 50 కుటుంబాల పేద ప్రజలకు దుప్పట్లు పంపిణీ చేశారు. అమ్మానాన్న చారిటబుల్ ట్రస్ట్ సేవలను ఆ గ్రామ సర్పంచ్ కాళ్ళ శ్రీనివాసరావు చారిటబుల్ ట్రస్ట్ డైరెక్టర్ ఎలమంచిలి రమణ, సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో అమ్మా నాన్న చారిటబుల్ ట్రస్ట్ డైరెక్టర్ యలమంచిలి రమణ, గ్రామ పెద్దలు గొర్ల లోవరాజు, యలమంచిలి సత్తిబాబు, యలమంచిలి పెద్ద సత్తిబాబు, గొర్ల అప్పారావు, కాళ్ల దేవుళ్ళు, నల్లమంటి రాము, నాగేశ్వరావు, శ్రీనులు పాల్గొన్నారు.

## సమస్యలను ప్రజలు టోల్ ఫ్రీ నెంబర్ 1100 ద్వారా నమోదు చేసుకోవచ్చు

### - జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్

అనకాపల్లి, మే 25, ప్రభాతవార్త



ప్రజా సమస్యల పరిష్కార వేదిక సంబంధించి ఫిర్యాదులను నేరుగా గానీ, టోల్ ఫ్రీ నెంబర్ 1100కు ఫోన్ చేసి ఫిర్యాదుల నమోదు చేయించుకోవచ్చని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇచ్చిన ఫిర్యా దులకు సంబంధించిన స్థితిని తెలుసుకునేందుకు మరియు సమాచారం తెలుసుకొనుటకు టోల్ ఫ్రీ నెంబర్ 1100 కు ఫోన్ చేసి తెలుసుకోవాలన్నారు. నేడు సోమవారం యధావిధిగా జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మరియు అనకాపల్లి, నర్సీపట్నం ఆర్డీఓ కార్యాలయలలో, అన్ని మండలాల్లోను, ప్రజా సమస్యల పరిష్కార వేదిక కొనసాగుతాయని కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

## ప్రతి ఇంటికి ఆధార్ అనుసంధానం : సెక్రటరీ గంగాధర్

చోడవరం, మే 25, ప్రభాతవార్త




చోడవరం మండలం వెంకన్నపాలెం గ్రామ పంచాయతీలో స్వర్ణ పంచాయతీలో భాగంగా ప్రతి ఇంటింటికి ఆధార్ అనుసంధానం చేస్తున్నారు. ఈ సందర్భంగా సెక్రటరీ గంగాధర్ మాట్లాడుతూ ప్రతి ఇంటికి ఆధార్ అనుసంధానం చేయడం వలన ఇకపై ఇంటి పనులు ఆన్లైన్లో కట్టవచ్చునని తెలిపారు వెంకన్నపాలెం పంచాయతీలో సుమారు 782 ఇళ్లకు ఆధార్ అనుసంధానం చేస్తున్నామని ఆదివారం పని దినము సెలవు అయినా త్వరితగతిన పూర్తి చేయాలనే ఉద్దేశంతో చేస్తున్నామని అలాగే ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందుతాయని, అభివృద్ధి కూడా చేయవచ్చని, ప్రజలందరూ సహకరిస్తున్నారని తెలిపారు సెలవు దినములలో పనిచేయడం వల్ల అధికారులు హర్షం వ్యక్తం చేశారు.

## ప్రమాదవశాత్తు బావిలో పడి బాలుడు మృతి

నక్కపల్లి, ప్రభాతవార్త



ప్రమాదవశాత్తు కాలుజారి నేల బావిలో పడి మృతి చెందిన సంఘటన మండలంలోని జీ. జగన్నాథ పురం గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. పదో తరగతి చదువుతున్న జగతా గంగాద్రి సాయి గణేష్ అనే బాలుడు ఊరు సమీపంలో పొలంలోని పశువుల మేపుతుండగా త్రాగడానికి మంచినీరు కోసం నేల బావి వద్దకు వెళ్లి డొక్కుతో తోడు తుండగా కాలుజారి బావిలో పడిపోయాడు. ఈ పడిపోయిన సంఘటన పొలంలో ఉన్న కొంతమంది చూసి ఫటాహుటిన బావి వద్దకు చేరుకొని



బాలుడిని రక్షించే ప్రయత్నం చేశారు. బయటకి తీసి స్థానిక 50 పడకల ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తండ్రి శ్రీను ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై సన్నీ బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



## ఎమ్మెల్యే కెఎస్ఎన్ రాజుని కలిసిన రోలుగుంట రేషన్ డీలర్లు





రోలుగుంట, మే 25, ప్రభాతవార్త

రాష్ట్ర ప్రభుత్వం రేషన్ ఎండియు వాహనాలు రద్దు చేయడంపై డీలర్లు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం రోలుగుంట డీలర్ ఆసోసియేషన్ అధ్యక్షులు గోర్ల నాయుడు, మండల కార్యదర్శి ముత్యాల పోతురాజుతో పాటు తోటి డీలర్లు చోడవరం నియోజకవర్గం శాసనసభ్యులు కేఎస్ఎన్ రాజుని సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ రేషన్ వాహనాలను రద్దు చేసి మళ్లీ చౌక ధరల దుకాణాల ద్వారా సరుకులు పంపిణీ చేయాలన్న నిర్ణయంపై రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్, పౌరసరఫరాల శాఖమంత్రి నాదెండ్ల మనోహర్‌కు ప్రత్యేకమైన కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. గత ప్రభుత్వం డోర్ డెలివరీ పేరుతో అనాలోచితంగా తెచ్చిన రేషన్ వాహనాల వల్ల ఆర్థిక భారంతో పాటు అనేక సమస్యలు ఉత్పన్న మయ్యాయన్నారు. ఇప్పుడు వాటిని రద్దుచేసి తిరిగి రేషన్‌షాపుల ద్వారా సరుకుల పంపిణీ చేయాలనే నిర్ణయం ఎంతో హర్షణీయమన్నారు. కార్యక్రమంలో మండలం రేషన్ షాప్ డీలర్ పాల్గొన్నారు.

## పలు సేవ కార్యక్రమాల్లో ఏజీ ఫౌండేషన్ సేవలు

నక్కపల్లి, ప్రభాతవార్త

మండలంలోని ఎస్. రాయవరం గోకులపాడు గ్రామానికి చెందిన ఏజి ఫౌండేషన్ అధినేత నానితన పుట్టినరోజు సందర్భంగాప్రజల కోసం తన ప్రేమను సేవారూపంలో సహాయం అందజేశారు. తన సొంత ఊరు గోకులపాడు, అడ్డరోడు బస్టాండ్ పరిసర ప్రాంతాలలో ప్రయాణికులకు గ్రామస్తులకు ప్రయోజనం కలిగేలా సుమారు లక్ష రూపాయల విలువైన సిమెంట్ కూర్చునే



బల్లలను అంబేద్కర్ బిల్డింగ్ వద్ద డిజైన్ వాల్ మొక్కలు, గవర్నమెంట్ స్కూల్లో గచ్చులు, మహిళా రైతులకు సన్మానం వస్త్రాలు అందించారు. సేవలో ఉన్నతమైన దృక్పథాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమాన్ని చూసి గ్రామ వృద్ధులు ఆనందంతో చిందులు



వేయగా,ప్రయాణికులు నాని మానవతా హృదయాన్ని ప్రశంసించారు. నాని సేవా పరమార్థాన్ని చూసి ప్రతి ఒక్కరూ కీర్తిస్తూ,ఇదే నిజమైన జన్మదినోత్సవ వేడుకఅంటూ కొని యాడారు. నాని లాంటి వ్యక్తులు సమాజంలో పెరిగితేప్రతి ఊరూ అభివృద్ధి బాటలో ముందడుగు వేస్తుంది. నాని జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ ఆయన సేవలు మరెన్నో కొనసాగాలని కోరుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ శ్రీనివాసు, నాగంబొయిన శేషారావు అద్దెపల్లి ఈశ్వరరావు జనసేన పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు నక్కా శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

## వికాస్ తరంగణి ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు విశేష స్పందన

నక్కపల్లి, ప్రభాతవార్త

మండలంలోని అమలాపురం శివారు పాటిమీద గ్రామంలో శ్రీ శ్రీ శ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి వారి మంగళాశాసనాలు తో వైజాగ్ వికాస తరంగిణి మహిళా ఆరోగ్య వికాస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఆదివారం వైద్యులు కుసుమ కుమారి, కృష్ణ వేణి, ఉమ, మాధవీలత సహాయ






సహకారాలుతో వేంపాడు వికాస తరంగిణి ఆధ్వర్యం లో మహిళా ఆరోగ్య వికాస్ కార్యక్రమంలో భాగంగా మహిళలు క్రిబ్రెస్ట్ క్యాన్సర్, గర్భాశయ, ముఖద్వార క్యాన్సర్, సంబంధిత పరీక్షలు నిర్వహించారు. ఇన్ఫెక్షన్ ఉన్న వారికి ఉచితంగా మందులు అందజేశారు. సివియర్ గా ఉన్న వారిని డాక్టర్ మాధవీలత సలహావికాసతరంగిణి సభ్యులు సహాయం తో తదుపరి పరీక్షలు కోసం విశాఖ పట్నం తరలించారు. కార్యక్రమంలో పాయకరావుపేట వికాస తరంగిణి శాఖ సభ్యులు చిక్కాల శ్రీనివాస్, నక్కపల్లి వికాస తరంగిణి శాఖ సభ్యులు సుభాష్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జగతా శ్రీనివాస్, తిరుమ లేశ్వరావు (బుజ్జి) పాల్గొని సేవలు అందజేశారు.

## దానబోయినపాలెంలో ఉచిత మెగా వైద్య శిబిరం

### - హాజరైన ప్రముఖ వైద్యులు

అగనంపూడి, ప్రభాతవార్త

జీవీఎంసీ 85 వార్డు అగనంపూడి పునరావాస కాలనీ దానబోయిన పాలెం సీతారామాలయం ప్రాంగణంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. యూజు, దానబోయినపాలెం గ్రామ కమిటీ సంయుక్తంగా నిర్వహించిన ఈ శిబిరాన్ని 85వ వార్డు ఇంచార్జ్ కార్పొరేటర్ ఇల్లపు ప్రసాద్ ప్రారంభించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రముఖ కిడ్నీ వ్యాధి నిపుణులు, ఒంగోలులోని రిమ్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శ్యామ్ రావ్ అత్తోట మాట్లాడుతూ ఆరోగ్యం విషయంలో అశ్రద్ధ వహించొద్దని సూచించారు. యూజ్ సంఘం వ్యవస్థాపకులు కె. పరంధామయ మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్ ప్లాంట్ నిర్మాణం కోసం ఇళ్లు, భూముల్ని త్యాగం చేసిన ఉక్కు నిర్వాసితులపై అభిమానంతో ఈ శిబిరం ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ఇంత సేవా కార్యక్రమం చేసిన కే పరంధామయ్య దంపతులను ఏ డి సి చైర్మన్ బలిరెడ్డి సత్యనారాయణ ఇల్లపు ప్రసాదు సన్మానించితిరి. వైద్య శిబిరంలో పాల్గొన్న వైద్య నిపుణులు న్యూఢిల్లీలోని ఎయిమ్స్ నూర్యాలజీ విభాగ డాక్టర్లు కొప్పోలు ప్రణతి వి సిద్ధార్థ జి సంధ్య సురేష్ పి సురేష్ బి లీలా బాయి వీ ప్రమీల వి గోపికృష్ణ పద్మజ కే లలిత పి ఆశ్రీ నవ్య శ్రీ బత్తుల అన్నపూర్ణ మాకినేని కొత్తపల్లి యామిని రేణుక ఎస్ మోనిక ఫార్మసిస్ట్ పి



శంకర్ దానబోయినపాలెం కమిటీ ప్రతినిధులు అమరుపిన్ని అప్పారావు అమర పిన్ని త్రినాథ్ ఎల్వి రమణ అర్జున్ దుల్ల ఈశ్వరరావు దానబోయిని సన్యాసిరావు అగనంపూడి స్వచ్ఛంద సంస్థ నాయకులు కడిమి హనుమంతరావు, మాడుగుల నర్సింగరావు, డాక్టర్ కేజే నాయుడు, బండారు చందు రమేష్, పలక అచ్యుత్, వంకర రాము, విందు నారాయణరావు, ఈగల నరసింహారావు తదితరులు పాల్గొన్నారు. చికిత్స కు వచ్చిన 300 మంది పేషెంట్లుకు ఉచితంగా మందులు మధ్యాహ్నం భోజనము ఏర్పాటు చేయడం జరిగినది. వైద్య శిబిరమునకు వచ్చిన డాక్టర్లను దుశాలో సన్మానించితిరి.

## భక్తులతో కిటకిటలాడిన నూకాంభిక ఆలయం





అనకాపల్లి, మే 25, ప్రభాతవార్త

ఉత్తరాంధ్ర ఇలవేల్పు గవరపాలెం లోవెలిసిన శ్రీ నూకాంబిక అమ్మవారి దేవస్థానంలో ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. అమ్మవారికి ప్రత్యేక అలంకరణ ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా చుట్టుపక్కల నుండి పట్టణ గ్రామీణ ప్రాంతాలు నుండి అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకోవడంతో క్యూ లైన్లు భక్తులతో పోటెత్తాయి. ఆలయ ఆవరణలో వంటలు వండుకొని అమ్మవారికి ముక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో. ఉత్సవ కమిటీ చైర్మన్ పీలా నాగ శ్రీను, ఆలయ సహాయ కమిషనర్ వెంపలి రాంబాబు, ఆలయ ధర్మకర్తలు సూరేసతీష్,దాడి రవికుమార్ పొలిమేర ఆనంద్, మారిశెట్టి శంకర్రావు, కాండ్రేగుల రాజారావు,మజ్జి శ్రీనివాసరావు కొడుకుల శ్రీకాంత్,వడ్డాది మంగ,కోనేటి సూర్యలక్ష్మీ, ఎర్రవరపు లక్ష్మీ, కూటమి నాయకులు, భక్తులు తదిరులు పాల్గొన్నారు.




## శ్రీశ్రీ కళావేదిక రాష్ట్ర కార్యాదర్శిగా మన్యం కవి నూనె.రమేష్

**వి.ఆర్.పురం, మే 25, ప్రభాతవార్త**

అంతర్జాతీయ సాహిత్య, సాంస్క ృతిక, సామాజిక సేవా సంస్థ శ్రీశ్రీ కళావేదిక రాష్ట్ర కార్యాదర్శిగా ప్రముఖ మన్యం కవి,ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి గ్రహీత, జాతీయ యువతేజం అవార్డు గ్రహీత, అధ్యాపకులు వి.ఆర్.పురం మండలం, రేఖపల్లి వాసి నూనె.రమేష్ నియమితులయ్యారు. ఆదివారం శ్రీ శ్రీ కళావేదిక ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నూతన కమిటిని ప్రకటించింది. ఇందులో భాగంగా మన్యం కవి నూనె.రమేష్ నియామకాన్ని ఆ సంస్థ అంతర్జాతీయ చైర్మన్, కళారత్న కత్తిమండ.ప్రతాప్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు గుత్తా.హరిసర్వోత్తమనాయుడు, జాతీయ యువజన విభాగం అధ్యక్షుడు గరిమెళ్ళ.రాజేంద్రప్రసాద్ లు రమేష్ నియామకాన్ని వెల్లడించారు. నూతన కమిటిలో యువతకు అత్యధిక ప్రాధాన్యత కల్పించారు. అంత ర్జాతీయ గుర్తింపు పొందిన శ్రీ శ్రీ కళావేదిక సాహితీ సంస్థకు నూనె.రమేష్ రాష్ట్ర కార్యాదర్శిగా నియమితులు కావటం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. హర్షం వ్యక్తం చేసిన వారిలో స్థానిక సర్పంచ్ పూనెం.సరోజిని, ఎంపిపి కారం. లక్ష్మి, జడ్.పిటిసి వాళ్ళ.రంగారెడ్డి, వైసిపి సీనియర్ నేత మాచర్ల.గంగయ్య, సిపిఎం మండల కార్యాదర్శి పులి.సంతోష్ కుమార్, టిడిపి మండల అధ్యక్షులు ఆచంట.శ్రీనివాస్ రావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు అండిమేలి.లీలా కృష్ణ నాగేంద్ర ప్రసాద్, సిపిఐ మండల కార్యాదర్శి కర్నాటి యేసు (రాంబాబు), సీనియర్ పాత్రికేయులు ఎస్.కె.ఇబ్రహీం (వార్త), రమేష్ తల్లిదండ్రులు అజరయ్యశాంతి, బంధు మిత్రులు తదితరులు ఉన్నారు.



## సారాని అరికట్టాలంటూ గిరిజన మహిళలు పోలీసులకు మొర

**రాజవొమ్మంగి, మే 25, ప్రభాతవార్త**

లోదొడ్డి పంచాయతీ కొత్త పూదేడు గ్రామంలో సారా విచ్చలవిడిగా ఉండ టం వల్ల రాత్రయితే ప్రతీ ఇంటా గొడవలతో కనీస ప్రశాంతత ఉండటం లేదని గిరిజన మహిళలు వెలుచూరి సుజాత, పోలిశెట్టి చిన్నమ్మ, పొత్తూరి రమణమ్మతో బాటు 15 మంది మహిళలు ఆదివారం జడ్డంగి పోలీస్ స్టేషన్ కు వచ్చి ఎస్. ఐ. చిన్నబాబు కు మొర పెట్టుకొన్నారు. 30 కి. మీ అటవీ ప్రాంతం నుండి ప్రవేటు వాహనంలో వచ్చామంటే మాకు ఎంత విసిగి పోయామో అర్థం చేసుకోవాలని గోము వసంత కుమారి, వంతల సింహాచలం ఆవేదనను వ్యక్తం చేశారు. ఇంటిలో రేషన్ కార్డులు తనఖాలు పెట్టడం, చిన్న పిల్లలు కూడా త్రాగుడు బానిసలు అయ్యారని వంతల అప్పలకొండ, వెలు సూరి చిన్న నూకాలమ్మ బాధను వెల్లడించారు. రెండురోజుల్లో సారా నియంత్రణకు చర్యలు చేపడతామని ఎస్.ఐ. చిన్నబాబు గిరిజన మహిళలకు హామీ ఇచ్చారు. 30 కి. మీ స్వగ్రామానికి తిరిగి వెళ్లారు.



## గ్రామ పెద్దలతో రాకాసమ్మ జాతర పోస్టర్ విడుదల

**చింతపల్లి, మే 25, ప్రభాతవార్త**

లంబసింగి గ్రామంలో శ్రీశ్రీశ్రీ రాకాశమ్మ జాతర మహోత్సవం జూన్ 1 నుండి 3 వ తేదీల్లో వైభవంగా జరుగనున్నది .లంబసింగి గ్రామంలోశ్రీ శ్రీశ్రీ రాకాశమ్మ జాతర మహోత్సవం ఈ ఏడాది జూన్ 1, 2, 3 తేదీల్లో అత్యంత



వైభవంగా నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు ప్రకటించారు. ఈ సందర్భంగా జాతర మహోత్సవం పోస్టర్‌ను గ్రామ పెద్దలు విడుదల చేశారు. ఈ జాతరకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై,శ్రీ శ్రీశ్రీ రాకాశమ్మ అమ్మవారి దర్శనం చేసుకోవాలని వారు కోరారు.గ్రామ పెద్దలు తెలిపిన వివరాల ప్రకారం, జాతర నిర్వహణ కోసం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు, దర్శన ఏర్పాట్లు, భద్రతా చర్యలు, పార్కింగ్ సౌకర్యాలు మరియు ఇతర అవసరమైన సదుపాయాలను సిద్ధం చేస్తున్నారు. ఈ జాతరలో పాల్గొనే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు గ్రామ పెద్దలు తెలియజేశారు.శ్రీ శ్రీశ్రీ రాకాశమ్మ అమ్మవారి జాతర లంబసింగి గ్రామంలో సంప్రదాయ వైభవం తో జరుగుతూ, భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతిని అందిస్తుంది. ఈ మహో త్సవంలో పాల్గొని అమ్మవారి కృపాకటాక్షాలు పొందాలని గ్రామ పెద్దలు భక్తులను ఆహ్వానించారు.ఈ జాతర సందర్భంగా గ్రామంలో సాంస్కృతిక కార్యక్రమాలు, భక్తి సంగీత కచేరీలు, అన్నదానం వంటి కార్యక్రమాలు కూడా నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు.

## బిజెపి కార్యాలయాన్ని ప్రారంభించిన జిల్లా అధ్యక్షులు





**రంపచోడవరం, మే 25, ప్రభాతవార్త**

అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం లో శుక్రవారం నూతన బిజెపి కార్యాలయాన్ని బిజెపి జిల్లా అధ్యక్షులు మఠం శాంత కుమారి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో శాంత కుమారి మాట్లాడుతూ గిరిజన గ్రామాల అభివృద్ధి బిజెపితోనే సాధ్యమని కేంద్ర ప్రభుత్వ పథకాలు ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. భారతీయ జనతా పార్టీని గ్రామస్థాయిలో బలోపేతం చేయడానికి తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు కారం సీతారామన్న ధర (ఢిల్లీ బాబు) మాట్లాడుతూ ప్రతి కార్యకర్తకు బిజెపి పార్టీ అండగా ఉంటుందని కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా ముందుగా మేము ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ ఈక బుల్లి కొండల దొర, జిల్లా కార్యదర్శిలు స్వప్న కుమారి, కొండల కృష్ణారెడ్డి, గురు ప్రసాద్, మంగ రౌతు వీరబాబు కారు లక్ష్మి మడకం లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## వైయస్సార్సీపి ఆధ్వర్యంలో మహిళలకు చీరలు పంపిణీ

**గాజువాక,మే 25,ప్రభాతవార్త**

జీవీఎంసీ 87 వార్డు పరిధిలో కణితి కాళింగ వీధి గాంధీ బొమ్మ జంక్షన్ లో 87వార్డు వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు ఇల్లపు రాము ఆర్థిక సహాయంతో ప్రగడ వేణుబాబు ఆధ్వర్యంలో నిరుపేదల మహిళలకు ఆదివారం చీరల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిలుగా గాజువాక వైఎస్ఆర్సిపి సమన్వయకర్త తిప్పల దేవన్ రెడ్డి,గాజువాక మొదట శాసనసభ్యులు చింతలపూడి వెంకటరామయ్య పాల్గొన్నారు. అనంతరం గాజువాక ఇంచార్జ్ తిప్పల దేవన్ రెడ్డి మాట్లాడుతూ వైయస్ జగన్మోహన్ రెడ్డి పాలనలో విద్యాదీవెన రూపంలో ప్రతి విద్యార్థికి 15000రూ వేసి ఆర్థికంగా ఆదుకున్నారని, అంతేకాకుండా ప్రతి పేదవాడికి మంచి జరిగిందని, ప్రతి పథకంలో ప్రజల సొమ్ము ప్రజలకు చేరే విధంగా అనునిత్యం ప్రజాపాలనందించారని కొనియాడారు. అనంతరం చింతలపూడి వెంకట రామయ్య మాట్లాడుతూ వైఎస్ఆర్సిపి పార్టీ అధికారంలో ఉన్నప్పుడు అవ్వ తాతలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రతి నెల 1వ తేదీన వాలంటరీ వ్యవస్థ ఇంటికి వచ్చి పింఛన్ సొమ్ము అందజేసేవారు అని కానీ ఇప్పుడు అవ్వ తాతలు పింఛన్లు తీసుకోవడానికి అనేక ఇబ్బందులు పడుతున్నారని, ఇప్పుడున్న అధికారి పార్టీ పింఛన్ సొమ్ములు అందజేయడంలో పూర్తిస్థాయిలో విఫలం అయిందని అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు వైఎస్ఆర్సిపి సీనియర్ దుగ్గపు దానప్పలు, మహిళలు కార్యకర్తలు పాల్గొన్నారు.



## భాషా భేదాలు లేకుండా భావాలను వ్యక్తీకరించే సాధనమే చిత్రక

**గాజువాక,మే 25,ప్రభాతవార్త**

భాషా భేదాలతో పని లేకుండా మనసులోని భావాలను స్పష్టంగా వ్యక్తీకరించే సాధనమే చిత్రకళ అని ప్రముఖ చిత్రకారులు ద్వారపూడి శ్రీనివాస మనోహర్ అన్నారు. మల్కాపురంలోని శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న బాలల వేసవి శిక్షణా శిబిరంలో ఆదివారం చిత్రకళపై ఆయన శిక్షణ ఇస్తూ మన చరిత్ర , సంస్క ృతి లో చిత్రకళకు ఎంతో ప్రాధాన్యత ఉందని, రంగులను ఎంచుకోవడంలో, ప్రకృతి దృశ్యాలను చిత్రీకరించడంలో, చిత్రకారుడి ప్రతిభ దాగి ఉంటుందని అన్నారు. అనంతరం వివిధ రకాల చిత్రాలను తేలికైన పద్ధతిలో ఎలా చిత్రీకరించాలో బాలలకు తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రకృతి దృశ్యాలపై బాలలు వేసిన చిత్రాలను ఆయన ప్రశంసించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి అజయ్ కుమార్, జాతీయ సేవా పథకం వాలంటీర్లు సునీత, జ్యోతిర్మయి , గ్రంథాలయ పాఠకులు,చిన్నారులు పాల్గొన్నారు. అంతా చిత్రీకరించిన చిత్రాలను ప్రదర్శించారు.



## చాపరాయి జలపాతం వద్ద పర్యటకుల సందడి

**డుంబ్రిగుడ,రూరల్ మే 25, ప్రభాతవార్త**



ప్రముఖ పర్యాటక ప్రాంతం చాపరాయి జలపాతం వద్ద పర్యటకులతో ఆదివారం సందడి నెలకొంది. విద్యార్థిని, విద్యార్థులకు వేసవి సెలవులు కావడంతో మైదాన ప్రాంతం నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దీంతో చాపరాయి, అంజుడ సిల్క్ ఫారం వద్ద పర్యాటకుల తాకిడితో సందడి నెలకొంది. అక్కడ వ్యాపారం చేసుకుంటున్న చిరు వ్యాపారాలకు ఆర్థికంగా ఎంతో లాభాలు వస్తున్నాయని చిరు వ్యాపారాలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## శాఖ గ్రంధాలయంలో కబడ్డీ పోటీలు

**డుంబ్రిగుడ రూరల్, మే25, ప్రభాతవార్త**

మండలం లోని శాఖ గ్రంధాలయం లో విద్యార్థిని, విద్యార్థులకు ఆదివారం శాఖ గ్రంధాలయ అధికారిని శెట్టి సునీత ద్వారా ఈ కబడ్డీ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థు లకు ఇటువంటి పోటీలో పాల్గొంటే మంచి క్రీడాలతోనే మానసిక ఉల్లాసం కలిగిస్తుంది. దని ఆమె అన్నారు. సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమం లో విద్యార్థులు పాల్గొన్నారు.



## ఘనంగా కిండంగి అమ్మవారి ఉత్సవాల పందిరి రాట కార్యక్రమం

**పాడేరు, మే 25, ప్రభాతవార్త**

వచ్చేనెల 8,9,10 తేదీల్లో నిర్వహించనున్న పాడేరు మండలం కిండంగి పంచాయతీ నక్కలపుట్టు శ్రీ మోదకొండమ్మ అమ్మవారి ఉత్సవాలు ఘంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ ఏర్పాట్లు చేస్తుంది. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారి పందిరి రాటకు ప్రత్యేక పూజలు నిర్వహించి పందిరిరాట ను సర్పంచ్, ఉత్సవ కమిటీ, గ్రామస్తులు వేశారు. పందిరిరాట కార్యక్రమంలో కిండంగి సర్పంచ్ కూడా శ్రీలక్ష్మి, పాడేరు ఎంపీపీ సోనారి రత్నకుమారి, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొర్రా నాగరాజు, ఆలయ స్థల ధాత మాజీ సర్పంచ్ దుంబేరి నారాయణమ్మ, ఉత్సవ కమిటీ అధ్యక్షులు మొస్య పాలవెల్లి, ఎస్ వి.వి.రమణమూర్తి, దుంబేరి విశ్వనాథ్, గుజ్జెలి కనకరాజు, బుక్క జగదీష్, కొత్తల అప్పారావు, పాపారావు, యువత, గ్రామస్తులు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు



## గాయపడిన వ్యక్తిని పరామర్శించిన రాష్ట్ర ఎస్టీ చైర్మన్

**రంపచోడవరం మే 25 ప్రభాతవార్త**

అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి మండలం గుర్రమామిడికి చెందిన కాకూరి వీరపురెడ్డి ఆదివారం సాయంత్రం బైక్ అదుపు తప్పడంతో రోడ్డు ప్రమాదం లో తీవ్ర గాయాలు పాలయ్యారు. విషయం తెలుసుకున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ చోళ్ల బొజ్జిరెడ్డి హుటా హుటిన రంపచోడవరం ఏరియా ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. తీవ్ర గాయాలు కావడంతో మెరుగైన వైద్య సేవలు కోసం రాజమండ్రి తరలించగా రాజమండ్రి జిల్లా ఆసుపత్రి సూపర్డెంట్‌తో మాట్లాడి మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు. ఆయనతో పాటు బిజెపి నాయకులు కారం సీతారామన్న దొర ఢిల్లీ బాబు ఉన్నారు.



## తల్లిదండ్రుల విజ్ఞప్తి మేరకే చిన్నారి మృత దేహం తరలింపు

- విచారణకు ఆదేశం..నివేదిక ఆధారంగా చర్యలు
- జిల్లా కలెక్టర్ ఏ ఎస్ దినేష్ కుమార్


**పాడేరు,మే24, ప్రభాతవార్త:**

కేజీహెచ్‌లో మృతి చెందిన అర్జున్, శైలు దంపతుల కుమార్తె మృత దేహ్నాను కేజీహెచ్ నుండి అంబులెన్సు లో కొత్తవలస వరకు తీసుకువచ్చి వదిలేశారు అని కొన్ని పత్రికలలో ప్రచురతమైన వార్తలో నిజం లేదని జిల్లా కలెక్టర్ ఏ ఎస్ దినేష్ కుమార్ స్పష్టం చేశారు. చిన్నారి తల్లిదండ్రులు వారి సొంత వాహ్నానలో ఇంటికి తీసుకెళ్తామని చెప్పడంతో వారి విజ్ఞప్తి మేరకు మృతదేహాన్ని వారి తల్లిదండ్రులకు అప్పగించడం జరిగిందని ప్రాధమిక విచారలో తెలిందని వివరించారు. అయినప్పటికీ విచారణ అధికారం నియమించి సమగ్ర దర్యాప్తు చేసిన నివేదిక అందించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జమాల్ బాషాను ఆదేశించినట్లు కలెక్టర్ తెలిపారు. అదేవిధంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వారి కార్యాలయంలో డిప్యూటీ సివిల్ సర్జన్‌గా పనిచేస్తున్న అందత్వ నివారణ సంస్థ జిల్లా మేనేజర్ డాక్టర్ విశ్వేశ్వర నాయుడను విచారణాధికారిగా నియమించినట్లు తెలిపారు. విచారణ అధికారి నివేదిక ఆధారంగా తగు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు.

## బీచ్ వద్ద సూర్య నమస్కారాలు, హోమాలు

**జగదాంబ, మే 25 ప్రభాతవార్త**

శ్రీ స్వామి వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపలో భాగంగా ఋషికొండ బీచ్ వద్ద ట్యూషన్ విద్యార్థులు సూర్య నమస్కారములు,కూచిపూడి డాన్స్ లు, సంస్థ సభ్యులచే గాయత్రి హోమాన్ని, అనంతరం విద్యార్థులు ప్రకృతి పరంగా మొదట సూర్య నమస్కారములు చేసి కూచిపూడి డాన్స్ ని అభినయించారు. భక్తిశ్రద్ధలతో గాయత్రి హోమాన్ని నిర్వహించారు. రామ నామాలతో సంకీర్తనలను చేశారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షులు అప్పారావు మాట్లాడుతూ కూచిపూడి డాన్స్ ని, గాయత్రి హోమాన్ని కేవలం సంస్థ ఆవరణలోనే కాకుండా, ఇలా ప్రకృతి ఒడిలో ప్రకృతి మాత ఆశీస్సులతో విద్యార్థులు ఆనందంగా గడిపారన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు, ట్యూషన్ విద్యార్థులు పాల్గొన్నారు.



## నల్లజాతి పశువులకు గొంతువాపు వ్యాక్సిన్ వేయించండి

- డా. తరుణ్ కుమార్

**రాజవొమ్మంగి, మే 25, ప్రభాతవార్త**

ప్రతీ గ్రామంలో నల్లజాతి పశువులు గొంతువాపు వ్యాధి నివారణకు ముంద స్తుగా వేస్తున్న హెచ్. ఎస్ వ్యాక్సిన్ ను తప్పనిసరిగా వేయిం చాలని రైతులకు రాజ వొమ్మంగి పశువైద్యా ధికారి డా. తరుణ్ కుమార్ తెలియజేస్తు న్నారు. గొంతువాపుకు గురయ్యే పశువులు గొంతువాచి గురక, జ్వరంతో మేత మేయ కుండా ఊపిరాడక చనిపోయే పరిస్థితి వస్తుం దని అన్నారు. ప్రతీ సచివాలయ పశు వైద్య సహాయకులు గ్రామాల్లో వేస్తున్న హెచ్. ఎస్ వ్యాక్సిన్ కార్యక్రమాన్ని వినియోగించు కోవాలని రైతులను పశువైద్యాధికారి డా. తరుణ్ కుమార్ కోరుతున్నారు.



## జాతీయ రహదారిపై వరుస ప్రమాదాలు

- ట్రాలీను ఢీకొన్న ఆటో మహిళ మృతి

**చింతూరు, మే 25 ప్రభాతవార్త**



చింతూరు మండలం కూనవరం జంక్షన్ వద్ద జాతీయ రహదారిపై గత రెండు రోజు లుగా వరస ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. ఆదివారం ట్రాలీ లారీని ఆటో ఢీకొన్న ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న మహిళ మృతి చెందింది. ఈ ఘటకు సంబంధించిన వివరాలు ఎలా ఉన్నాయి. చింతూరు మండలం చట్టి సమీపంలోని కూనవరం జంక్షన్ వద్ద జాతీయ రహదారి ఎన్ హెచ్ 30 నిర్మాణ పనులు జరుగుతున్నాయి. కూనవరం జంక్షన్ నుంచి జాతీయ రహదారిపైకి వాహనాలు వెళ్లే ప్రదేశం వద్ద కసింత ప్రమాదకర వాతావరణం ఉండటంతో శనివారం మధ్యాహ్నం జరిగిన ప్రమాదంలో ఆటో బుల్లోరో ఢీకొని ఆటో డ్రైవర్ కాలు విరిగింది. ఆదివారం అదె ప్రాంతంలో ట్రాలీ లారీని ఆటో ఢీకొన్న ఘటనలో మహిళ ప్రాణాలు కోల్పోయింది. మృతురాలు చింతూరు మండలం వెగిసగండి గ్రామానికి చెందిన కదల లచ్చమ్మ (50).

## గౌరవ వేతనాలు చెల్లించక పోవడం ఎంపీటీసీ లను అగౌరవ పరచడమే

- ఎంపీటీసీ సభ్యుడు సత్తిబాబు

**చింతపల్లి, మే 25, ప్రభాతవార్త**

ప్రజా ప్రతినిధులకు (ఎంపి టిసి) చెల్లించవలసిన గౌరవ వేతనాన్ని చెల్లించక పోవడం ఒక విధంగా వారిని అగౌరవ పరచడమే నని ఎర్ర బొమ్మల ఎంపీటీసీ సభ్యుడు సెగ్గే సత్తిబాబు అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ప్రజలకు సేవ చేసేందుకు ప్రత్యక్ష రాజకీ యాలలో ప్రజలచేత ఎన్నుకోబడిన ఎంపీటీసీ లకు ప్రతి నెల చెల్లించవలసిన గౌరవ వేతనాల ను ఏ నెలకు ఆ నెల చెల్లించవలసి ఉండగా గత ప్రభుత్వంలో ఏడు నెలలు, ఈ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుండి ఏ ఒక్క నెలలోనూ ఎంపీటీసీ లకు వేతనాలు విడుదల చేయలేదని ఆయన ఆరోపించారు. ఇప్పటి వరకు సుమారు పదిహేను మాసాలుగా ఎంపీటీసీ లకు వేతనాలు చెల్లించకుండా ప్రభుత్వాలు తమను అగౌరవ పరుస్తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రత్యక్ష రాజకీయాలలో ప్రజల చేత ఎన్నుకోబడిన తమకే ప్రభుత్వం వేతనాలు విడుదల చేయకుంటే ప్రజల సంక్షేమానికి, తమ పరిధిలో అభివృద్ధి కార్యక్రమాలను తాము ఏ విధంగా నిర్వహించగలమని ఆయన ప్రశ్నించారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి ఎంపీటీసీలకు చెల్లించవలసిన గౌరవ వేతనాలు తక్షణమే విడుదల చేయాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.



26-5P□g7exHMNWJQE.qxd:26-5P□g7exHMNWJQE.qxd 1/1/02 8:01 AM Page 1



# డీలర్లకు తప్పని ఇబ్బందులు

### దొడ్డుబియ్యం ఓవైపు.. మరోవైపు మూడునెలల స్టాక్

### 200 క్వింటాళ్లకు మించి నిల్వచేయలేం

**హైదరాబాద్, మే 25, ప్రభాతవార్త:** కేంద్రప్రభుత్వం వర్షాకాలంలో ప్రజా పంపిణీ వ్యవస్థలో ఆటంకాలు తలెత్తకుండా మూడు నెలల నిత్యవసరాలు రేషన్‌దుకాణాలలో నిల్వచేయాలనే ప్రతిపాదన రేషన్ డీలర్లకు ఇబ్బందిగా మారింది. తెలంగాణ ప్రభుత్వం జూన్30లోగా మూడు నెలల బియ్యం నిల్వలు రేషన్‌దుకాణాల్లో నిల్వచేయాలని ఆదేశించింది.స్థలాభావం సమస్య తెరపైకి రావడంతోపాటు ప్రస్తుతం భారీ మొత్తంలో బియ్యం రవాణా చేసేందుకు వారి వద్దనున్న వాహనాలు కూడా సరిపోవని తెలుస్తోంది. తెలంగాణలోని 17256 రేషన్‌దుకాణాలు ఉండగా అందులో అత్యధికభాగం ఇప్పటి దొడ్డుబియ్యం నిల్వలు ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం రెండు నెలల నుంచి సన్నబియ్యం వినియోగదారులకు పంపిణీ చేస్తోంది. అప్పటివరకు చౌకధరల దుకాణాల్లో ఉన్న దొడ్డు బియ్యం నిల్వలను ఇంతవరకు తీసుకెళ్లలేదు. వచ్చేనెలలో మూడునెలల బియ్యం ఒకేసారి పంపిణీ చేయాలంటే డీలర్లకు ఇబ్బందులు తప్పవు. రేషన్ దుకాణాలలో గరిష్ఠంగా 300క్వింటాళ్ళనుంచి 200క్వింటాళ్ళు నిల్వచేసుకొనే వసతి మాత్రమే ఉండటంతో డీలర్లు ఇబ్బంది పడుతున్నారు. మూడునెలల బియ్యం నిల్వ చేసుకోడానికి సరిపడా గదులు అందుబాటులో ఉండవని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వినియోగదారులు విడతల వారీగా తీసుకెళ్లేందుకు వెసులుబాటు కల్పించాలని వారు కోరుతున్నారు. వర్షాకాలంలో భారీ వర్షాలతో వరదలు, వాగులు,వంకలు పొంగడం వంటి సమస్యలు ఎదురైతే పేదలకు ఆహారధాన్యాలు చేరవేయడం ఇబ్బందిగా మారుతుంది. ఈ నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తుగానే బియ్యం పంపిణీ చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. జూన్ నెలలోనే మూడు నెలల బియ్యాన్ని అందించాలని ఆదేశాలు జారీ చేయడంతో సంబంధిత అధికారులు ఆ ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. బియ్యాన్ని గిడ్డంగుల్లో నిల్వచేసి ప్రజలకు అందించే దిశగా పౌరసరఫరాల శాఖ అధికారులు కసరత్తు మొదలుపెట్టారు.. మే నెలకు సంబంధించిన బియ్యం పంపిణీ తుదిదశకు చేరుకోవడంతో మూడునెలల బియ్యం పంపిణీపై దృష్టిసారించారు. జూన్, జులై, ఆగస్టు నెలలకు బియ్యాన్ని వచ్చే నెలలో పంపిణీ చేసేలా ప్రణాళిక తయారు చేస్తున్నారు. వచ్చే బియ్యాన్ని మండలాల్లో ఉన్న గిడ్డంగులలో నిల్వచేసేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. మరోవైపు శనివారం నుంచే కొన్ని జిల్లాలో ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి రేషన్ దుకాణాలకు బియ్యం తరలింపు కార్యక్రమం మొదలైంది.ఒకేసారి మూడు నెలలకు నెలలకు సరిపడా బియ్యం పంపిణీ చేయడం ద్వారా రవాణా చార్జీల ఖర్చుడీలర్లు, హమాలీ కూలీ కలిసొచ్చే అవకాశం ఉంది.

# మెడికల్ షాపులపై డిసిఎ దాడులు

### 142 దుకాణాలకు నోటీసులు

**హైదరాబాద్, మే 25, ప్రభాతవార్త:** తెలంగాణలోని మెడికల్ షాపులపై తెలంగాణ డ్రగ్ కంట్రోల్ కొరడా ఝుళిపిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా మెడికల్ షాపులపై తెలంగాణ డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్(డిసిఎ) తనిఖీలు నిర్వహిస్తూ నిబంధనలు పాటించని వాటిపై కఠిన చర్యలు తీసుకుంటున్నారు. డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ యాక్ట్ 1940, డ్రగ్స్ ప్రైస్ కంట్రోల్ ఆర్డర్ 2013, డ్రగ్స్ అండ్ మ్యాజిక్ రెమెడీస్ యాక్ట్ 1954 చట్టాల ప్రకారం.. మందుల నాణ్యత, సరైన ధరలు, ప్రిస్క్రిప్షన్ లేకపోయినా విక్రయాలు, నకిలీ మందులు, అక్రమ నిల్వలను నియంత్రిస్తూ ఈ దాడులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఒక్క మేడ్చల్ మల్కాజ్గగిరి జిల్లాలోనే ప్రిస్క్రిప్షన్ లేకపోయినా విక్రయాలు జరుపుతున్న 142 షాపులకు నోటీసులు జారీ చేశారు. అల్వాల్లో లైసెన్స్ లేని ఓ మెడికల్ షాపు నుండి 30,000 విలువైన యాంటీఫంగల్, పెయిన్ కిల్లర్స్, అంగస్తంభన మందులను అధికారులు. స్వాధీనం చేసుకున్నారు నిజామాబాద్, రంగారెడ్డి, మహబూబాబాద్, ఆదిలాబాద్, సిద్దిపేట తదితర జిల్లాల్లో దాడులు చేసి అక్రమ మందులను స్వాధీనం చేసుకొని, నోటీసులు జారీ చేశారు.

# తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

### తెలంగాణ ఉద్యమకారుల ఫోరం డిమాండ్

**హైదరాబాద్, మే 25,ప్రభాతవార్త:** ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం డిమాండ్ చేసింది. ఈమేరకు ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం అధ్యక్షుడు డా. చీమ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశానికి, బీసీ కమిషన్ మాజీ చైర్మన్ డా. వకుళాభరణం కృష్ణ మోహన్ రావు, సాంస్కృతిక సారథి చైర్మన్ వెన్నెల గద్దర్, ఎంబిసి కార్పొరేషన్ మాజీ చైర్మన్ తాడూరి శ్రీనివాస్ తదితరులు హాజరై ప్రసంగించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఉద్యమకారులకు 250 గజాల స్థలం, పెన్షన్ సౌకర్యాలు కల్పిస్తామని ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలనాననరు. ఈ హామీలను ఎన్నికల మ్యానిఫెస్టోలోనూ పొందుపరిచి కూడా ఇప్పటివరకు చర్యలు తీసుకోకపోవడం దురదృష్టకరం అన్నారు. అలాగే ప్రజాభవన్‌కు మహాత్మా జ్యోతిరావ్ పూలే పేరు పెట్టినప్పటికీ, అక్కడ లభిస్తున్న దరఖాస్తులు ఎక్కడకు వెళ్లుతున్నాయో, వాటి ఫలితాలపై ఎలాంటి స్పష్టత లేదని విమర్శించారు. జూన్ 2 లోగా ప్రభుత్వం ఉద్యమకారులకు స్పష్టమైన హామీ ఇవ్వాలి. లేనిపక్షంలో ఉద్యమకారుల ఆగ్రహానికి ప్రభుత్వం ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో నాయకులు కొండస్వామి, ఐలయ్య, కృష్ణరావు తదితరులు పాల్గొన్నారు.

# మున్నూరుకాపు ఆత్మగౌరవ భవననిర్మాణ స్థలాన్ని పరిశీలించిన విప్ ఆది శ్రీనివాస్

**హైదరాబాద్,మే25,ప్రభాతవార్త:** హైదరాబాద్ కొకపేటలోని తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు ఆత్మ గౌరవ భవన నిర్మాణ స్థలంను ఆదివారం రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పరిశీలించారు. మున్నూరు కాపు ఆత్మ గౌరవ భవన నిర్మాణం కోసం త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారినీ కలసి భవన నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని కోరడం జరుగుతుందని ఆదిశ్రీనివాస్ తెలిపారు.భవన నిర్మాణం పూర్తయితే మున్నూరు కాపు కులంలోనీ పేద విద్యార్థులకు ఎంతో ఉపయోగ పడుతుందని ఆయనతెలిపారు. పేదవారు ఇక్కడ ఫంక్షన్స్, కుల అభ్యున్నతి కోసం సభలు సమావేశాలు నిర్వహించడం కోసం వీలుగా ఉంటుందని పేర్కొన్నారు. హైదారాబాద్ మాజీ మేయర్ బొంత్ రామ్మోహన్, కరీంనగర్ జిల్లా గ్రంథాలయ చైర్మన్ సత్తు మల్లేష్,నర్సింగి మాజీ కౌన్సిలర్ గోపాల గణేష్ కుమార్,మాజీ రాష్ట్ర గృహా నిర్మాణ చైర్మెన్ బొమ్మ శ్రీరామ్ విప్ వెంట ఉన్నారు.

# కోల్‌కత్తానైట్‌రైడర్స్‌ను ఊదిపారేసిన సన్‌రైజర్స్

### 110 పరుగుల తేడాతో కెకెఆర్ ఓటమి

**న్యూఢిల్లీ, మే 25:** ఐపిఎల్ 18వ సీజన్‌లో 68వ మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు కోల్‌కత్తా నైట్‌రైడర్స్‌ను ఊదిపారేసింది. తొలుత బ్యాటింగ్‌చేపట్టిన ఆరెంజ్ ఆర్మీ మూడు వికెట్ల నష్టానికి 278 పరుగులుచేసింది. తదనంతరం బ్యాటింగ్ చేసిన కోల్‌కత్తానైట్‌రైడర్స్ జట్టు బ్యాటింగ్‌లో పూర్తిగా విఫలం కావడంతో భారీ తేడాతోనే ఓటమి పాలయింది. నిర్ణీత 20 ఓవర్లలో 168 పరుగులే చేయగలిగింది. దీనితో సన్‌రైజర్స్ హైదరాబాద్ 110 పరుగుల తేడాతో విజయం సాధించింది. అయితే ఐపిఎల్‌సీజన్‌ను సన్‌రైజర్స్ భారీ విజయంతో మాత్రమే ముగించింది.ప్లేఆఫ్స్ రేసునుంచి తప్పుకున్నతర్వాతజోరందుకున్న హైదరాబాద్ కోల్‌కత్తా నైట్‌రైడర్స్‌తో జరిగిన తమ ఆఖరి మ్యాచ్‌లో అంతకుమించిన దూకుడు ప్రదర్శించి వరుసగా మూడో విజయవంతో ఈసీజన్‌కు టాటాచెప్పింది. ఢిల్లీ వేదికగాజరిగిన మ్యాచ్‌లో కెకెఆర్‌జట్టును ఊదిపారేసింది. హెన్రిచ్‌క్లాసెన్ 39 బంతుల్లో 7 ఫోర్లు, తొమ్మిది సిక్స్‌లతో 105 పరుగులుచేసి మెరుపుశతకం బాదాడు. తొలుత సన్‌రైజర్స్ మూడు వికెట్ల నష్టానికి 278 పరుగులు భారీస్కోరుచేసింది. లక్ష్యఛేదనలో 18.4 ఓవర్లలోనే కెకెఆర్ ఆలౌట్ అయింది. మనీశ్‌పాండే 37, టాప్ స్కోరర్, హర్షిత్‌రాణా 34పరుగులుచేసాడు. ఓపెనర్ సునీల్ నరైన్ 16 బంతుల్లో 3 ఫోర్లు, మూడు సిక్స్‌లతో 31 పరుగులుచేసి దూకుడుగా ఆడినా భారీఇన్నింగ్స్‌గా మార్చలేకపోయాడు. అజింక్య రహానె15, అంగ్‌క్రిష్ రఘువంశీ 14, రమణ్‌దీప్‌సింగ్ 13 క్వింటన్ డీకాక్ 9, రింకుసింగ్ 9 పరుగులుచేసారు. రస్సెల్ ఎదుర్కొన్న తొలిబంతికే గోల్డెన్ డక్‌గా వెనుదిరిగాడు. సన్‌రైజర్స్ జట్టులో క్లాసెన్ శతకానికితోడు ట్రావిస్ హెడ్ 40 బంతుల్లోనే ఆరుఫోర్లు, ఆరుసిక్స్‌లతో 76 పరుగులుచేసాడు. అభిషేక్‌శర్మ 32పరుగులతో



క్రీజులో ఉన్నంతసేపూ మెరుపులు మెరిపించాడు. ఇషాన్‌కిషన్ 20 బంతుల్లో 4 ఫోర్లు ఒకసిక్స్ 29పరుగులుచేసాడు. కోల్‌కత్తా బౌలర్లలో సునీల్‌నరైన్2, వైభవ్ అరోరా ఒక వికెట్‌తీసారు.

# తెలంగాణలో కాంగ్రెస్‌పై మొదలైన వ్యతిరేకత



### పంపకాల్లో తేడాల వల్లే ఎపిలో షర్మిల, తెలంగాణలో కవిత అసంతృప్తి

### అన్నలపైకి చెల్లెళ్లను ఉసిగొల్పడంలో కాంగ్రెస్ వ్యవహారశైలి కీలకం: బిజెపి ఎంపి డా.లక్ష్మణ్

**హైదరాబాద్, మే 25, ప్రభాతవార్త:** తెలంగాణలో కాంగ్రెస్‌కు వ్యతిరేకత మొద లైందని బిజెపి ఎంపి డా.లక్ష్మణ్ అన్నారు. ఆదివారం జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ప్రజలలో ఉన్న వ్యతిరేకతను మళ్లించేందుకు కాంగ్రెస్ ప్రయత్నం చేస్తుందన్నారు. టిఆర్ఎస్ పుట్టి మునిగిపోయిందని, దేశంలో బిజెపి వెలిగిపోతుందన్నారు. తెలంగాణలో బిజెపి బలపడింది.. భవిష్యత్‌లో అధికారంలోకి సైతం రానున్నదని అన్నారు. కవిత లేఖ రాసింది వాస్తవమే అన్నారు. కవిత కెసిఆర్‌ను కలిసే పరిస్థితి లేదా? అంటూ ప్రశ్నించారు. కెసిఆర్ ప్రతిపాదిస్తున్న కెటిఆర్‌ను సవాలు చేస్తున్నట్టుగానే కవిత సవాలు అర్థం అవుతుందన్నారు. కెటిఆర్ నాయకత్వాన్ని అంగీకరించను అని చెప్పకనే చెపతుందన్నారు. అన్న ఆధిపత్యాన్ని సవాలు చేయడమే లేఖాస్త్రం అన్నారు. కవిత సామాజిక తెలంగాణ గురించి మాట్లాడటం, దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగానే ఉందన్నారు. తెలుగు రాష్ట్రాల్లో రాజకీయాలు రసవత్తరంగా ఉన్నాయని, రెండు రాష్ట్రాల్లో ఒకేలా సీన్లు రిపీట్ అవుతున్నాయన్నారు. తండ్రులు సంపాదించిన ఆస్తుల పంపకాల్లో, రాజకీయ పదవుల్లో పంపకాల్లో తేడాలే అన్నారు. అన్నలు వదిలిన బాణాలు, అన్నల మీదికే చెల్లెలు గురివేస్తున్నాయన్నారు. ఏపిలో జగన్‌పై చెల్లి, షర్మిల బాణం ఎక్కుపెడితే, తెలంగాణలో కెటిఆర్‌పై కవిత గురి పెట్టిందన్నారు. తమ అస్తిత్వాన్ని కాపాడుకోవడాని, ప్రజల అవసరాల కంటే, కుటుంబ అవసరాలే కీలకం అన్నట్లు వ్యవహరిస్తున్నారన్నారు. మొన్న వైఎస్సార్ కుటుంబం ఇప్పుడు కెసిఆర్ కుటుంబం అన్నారు. అన్నలపైకి చెల్లెలను ఉసిగొల్పడంలో కాంగ్రెస్ కీలకంగా వ్యవహరిస్తుందన్నారు. దేశం ఆర్థికంగా అత్యంత బలోపేతంగా నిలుస్తుందన్నారు. భారత దేశం 4వ ఆర్థిక అతిపెద్ద దేశంగా గుర్తింపు పొందిందన్నారు. జపాన్‌ను భారత్ అధిగమించిందన్నారు. దీనికి మోడీ నాయకత్వానికి తార్కాణం అన్నారు. వికసిత భారత్ కూడా కచ్చితంగా సిద్ధిస్తుందన్నారు. ఆసియా ఫసిఫిక్ ప్రాంతీయ వర్క్ షాప్ ముగిం చుకుని వచ్చానని, పిఎసి ఛైర్మెన్ వేణుగోపాల్, మెంబర్ తాను పాల్గొన్నాం అన్నారు. పార్లమెంట్ వ్యవస్థలో పిఎసి చాలా కీలకమైందన్నారు. ప్రభుత్వం ప్రతిపక్షం అనే వత్యాసం లేకుండా పని చేస్తున్నాం అన్నారు. కవిత పార్టీతో ఒరిగేదేమీ లేదన్నారు. ఆమె అస్తిత్వం కోసమే పార్టీ అనే అంశం అన్నారు. 14 రాష్ట్రాల్లో అధ్యక్షుల ప్రకటన జరిగిందని, ఆలిండియా ప్రెసిడెంట్‌తో పాటూ ఇతర రాష్ట్రాల అధ్యక్షుల ఎంపిక జరగనుందన్నారు. పహల్గాం ఘటన తర్వాత తలెత్తిన పరిస్థులతో. సంస్థాగత ఎన్నికల ప్రక్రియ ఆలస్యం అయిందన్నారు.

# అన్నిరకాల అధ్యాపకుల సమస్యలను పరిష్కరించాలి

### ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి టిఎస్‌టిసిఇఎ లేఖ

**హైదరాబాద్, మే 25, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో వృత్తి విద్య కోరుసలైన ఇంజనీరింగ్, ఫార్మసీ, ఎంబీఏ, ఎంసీఏ కాలేజీల్లో పనిచేస్తున్న అధ్యాపకుల సమస్యలను పరిష్కారించాలని తెలంగాణ స్కూల్స్ టెక్నికల్ కాలేజెస్ ఎంప్లాయీస్ అసోసియేషన్(టిఎస్‌టిసిఈఏ) డిమాండ్ చేసింది. ఈ మేరకు టిఎస్‌టిసిఈఏ అధ్యక్షులు అయినేని సంతోష్ కుమార్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. ప్రైవేట్ ఇంజనీరింగ్, ఫార్మసీ, ఎంబీఏ, ఎంసీఏ కాలేజీల్లో పనిచేస్తున్న అధ్యాపకుల సమస్యల పరిష్కారం కోసం కొన్ని సంవత్సరాలుగా పోరాడుతున్నామని అయినేని సంతోష్ కుమార్ తెలిపారు. రాష్ట్రంలోని సాంకేతిక కాలేజీల్లో పని చేస్తున్న అధ్యాపకులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొచ్చినట్టు తెలిపారు. రాష్ట్రంలో ఉన్న సాంకేతిక కాలేజీలో వేతన సంఘ జీతాలు చెల్లించడం లేదని.. కానీ వారికి వేతన సంఘం చెప్పిన మేరకు వేతనాల చెల్లిస్తున్నట్టు తప్పుడు నివేదికలు తయారు చేసి టిజిఏఎఫ్ఆర్‌సి, జేఎన్‌టియుహెచ్, ఏఐసిటిఈ, టిజిసిహెచ్ఈకి అందజేశారని తెలిపారు.

ఆ నివేదకలపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టాలని లేఖలో కోరారు. 7వ వేతన సంఘ జీతాలు ఇస్తున్న ట్టు ఫామ్-16, 26ఏఎస్‌లు ఇచ్చారని.. అవి పూర్తిగా చట్ట విరుద్ధంగా తయారు చేయడం జరిగిందన్నారు. వాటిపై కూడా పూర్తి విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకోవాలని సీఎంకి రాసిన లేఖలో పేర్కొన్నారు. కొన్ని కాలేజీల్లో 2 నుంచి 6 నెలల వరకు జీతాలు చెల్లించడం లేదన్నారు.

తెలంగాణ ఎడ్యుకేషన్ యాక్ట్ 1982, చాప్టర్ 14, సెక్షన్ 84 ప్రకారం ప్రతినెల ఒక తేదీన జీతాలు ఇవ్వాలని ఉన్న ప్పటికీ 90 శాతం కాలేజీల్లో అమలు చేయడం లేదన్నారు. మరికొన్ని కాలే జీల్లో అయితే జీతాలు వేసి తిరిగి తీసుకోవడం జరు గుతుందన్నారు.

రాష్ట్రంలోని ప్రైవేటు ఇంజనీరింగ్, ఫార్మసీ, ఎంబీఏ, ఎంసిఏ కాలేజీల్లో పనిచేస్తున్న అధ్యాపకులకి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు.

# రాష్ట్రాన్ని సమగ్ర అభివృద్ధి దిశగా నడిపించడమే లక్ష్యం

### వైద్యులకు అండగా ఉంటాం: మంత్రి శ్రీధర్‌బాబు

**కరీంనగర్ టౌన్, ప్రభాతవార్త:** తెలంగాణను సమగ్ర అభివృద్ధి దిశగా నడిపించడమే ప్రభుత్వ లక్ష్యమని,అందులో భాగంగానే విద్య, వైద్య రంగానికి పెద్దపీట వేస్తున్నామని రాష్ట్ర ఐటి పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. తెలంగాణ హాస్పిటల్స్,నర్సింగ్ హోమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కరీంనగర్ లోని ప్రతిమ మల్టీప్లెక్స్ లో నిర్వహించిన 11వ వార్షిక సదస్సు ముగింపు కార్యక్రమానికి మంత్రి శ్రీధర్ బాబు హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యం సేవా దృక్పథంతో కూడినదని, వైద్యులు సమాజ శ్రేయస్సు కోరుకుంటారని తెలిపారు. రాష్ట్రంలో వైద్య రంగ అభివృద్ధికి ప్రభుత్వ పరంగా అండగా ఉంటామన్నారు. వైద్యులు ఎదుర్కొంటున్న సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. సదస్సులో వైద్యులు ఇచ్చిన సూచనలు సలహాలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ దృష్టికి తీసుకెళ్లి సమస్యలపై సుదీర్ఘంగా చర్చించేందుకు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసేలా చూస్తానని అన్నారు.




క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్, అనుమతులు, లైసెన్స్ తదితర పరిపాలన సంబంధిత సమస్యలపై వైద్యులు ఎదుర్కొంటున్న ఇబ్బంది లను ప్రభుత్వం పరిష్కరిస్తుందని తెలిపారు. వైద్యులు సమాజంలో ఎంత ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నారో ప్రభుత్వానికి బాగా తెలుసని, వైద్యులకు అండగా నిలబడడం తమ బాధ్యత అని అన్నారు. తానాకాన్ పదకొండవ రాష్ట్ర సదస్సు ద్వారా వైద్యులు తమ సమస్యలను సమగ్రంగా చర్చించుకోవడం హర్షణీయమని, ఇలాంటి వేదికల ద్వారా ప్రభుత్వానికి చక్కటి సూచనలు అందించే అవకాశం కల్పిస్తాయన్నారు. వైద్యులు సూచించిన సమస్యలను జిల్లా స్థాయిలో పరిష్కరించేందుకు కలెక్టర్లతో చర్చించి తక్షణమే చర్యలు తీసుకుంటామన్నారు. వైద్యరంగంలో కూడా ప్రజల ఆరోగ్యాలు కాపాడేలా అవసరమైన మార్పులను చేపట్టామని తెలిపారు. ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు సమగ్ర ప్రణా ళికలు అమలు చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో సౌకర్యాలు పెంచి నిపుణుల సేవలను అందు బాటులోకి తీసుక వస్తామన్నారు. అనంతరం ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్యేలు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, డాక్టర్ హరీశ్‌బాబు, డాక్టర్ సంజయ్ కుమార్, డాక్టర్.సంజయ్(కోరుట్ల ఎమ్మెల్యే) మాట్లాడుతూ సామాన్యులకు అతి తక్కువ ధరలో వైద్యం అందిస్తున్న చిన్న, మధ్యతరగతి ఆస్పత్రులు పలు సమస్యలతో ఇబ్బందులు పడుతున్నాయని, ప్రభుత్వం సానుకూలంగా స్పందించి వారి సమస్యలును పరిష్కరించాలని కోరారు. వాటిని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. సదస్సులో సుడా ఛైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, ఆర్డీవో మహేశ్వర్, తానాకాన్ రాష్ట్ర అధ్యక్షుడు అరుణ్‌కతారి, ఆర్గనైజింగ్ చైర్మన్ ఎలగందుల శ్రీనివాస్,కార్యదర్శి చాట్ల శ్రీధర్, ఆర్గనైజింగ్ ట్రెజరర్,డాక్టర్ రాజకుమార్, ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నరేష్ పాల్గొన్నారు.

# కాళేశ్వరం ప్రాజెక్టు పునరుద్ధరణ, మరమ్మతుల ఖర్చు ప్రభుత్వం భరిస్తుందా?

### బిజెపి ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ ప్రశ్న

**హైదరాబాద్, మే 25, ప్రభాతవార్త:** కాళేశ్వరం ప్రాజెక్టు పునరుద్ధరణ, మరమ్మతుల ఖర్చు ప్రభుత్వం భరిస్తుందా? అని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని బిజెపి చీఫ్‌విప్ డా.పాల్వాయి హరీశ్‌బాబు ప్రశ్నించారు. ఆదివారం మీడియాతో మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతిపై ఒకవైపు చర్చ జరుగు తుంటే సందట్లో సడేమియా అన్నట్టు గుత్తేదారు సంస్థలు కాళేశ్వరం పున రుద్ధణ ఖర్చంతా ప్రభుత్వమే భరించాలని లేఖ రాయడం పలు అనుమా నాలకు తావిస్తుందన్నారు. రెండు రోజుల క్రితం మేడిగడ్డ బ్యారేజ్ నిర్మాణ సంస్థ అయిన ఎల్అండ్‌టి పిఇఎస్, అన్నారం బ్యారేజ్ నిర్మాణ సంస్థ అయిన ఆఫ్కాన్స్, కాళేశ్వరంలోని మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీల పున రుద్ధరణ ఖర్చు అంతా ప్రభుత్వమే భరించాలని లేఖ రాశారని అన్నారు. బ్యారేజీలపై ఎన్‌డిఎస్‌ఏ సిఫార్సుల ప్రకారం పరీక్షలు నిర్వహిస్తే రూ.40 కోట్ల వరకు ఖర్చు కావచ్చని, ఆ ఖర్చులు కూడా ప్రభుత్వమే భరించాలని గుత్తేదారులు తెలియజేయడంతో ప్రభుత్వం అసమర్థతకు నిదర్శనం అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవకతవకలు, అవినీతిని కక్కిస్తామని, వృథా అయిన ప్రభుత్వ ధనాన్ని రికవరీ చేస్తామని ఒకవైపు ముఖ్యమంత్రి, సాగునీటి శాఖ మంత్రి చెప్తుంటే, ఇంకోవైపు గుత్తేదారు సంస్థలు ప్రభుత్వం నుంచి పునరుద్ధరణ ఖర్చులు కూడా రికవరీ చేస్తామని ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కాళేశ్వరం అవినీతిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, బాధ్యులైన ఆనాటి గుత్తేదారు సంస్థలు, ఆనాటి ప్రభుత్వంలో పెద్దల నుంచి రికవరీ చేయాలని డిమాండ్ చేశారు.

# బిఆర్‌ఎస్ ఆత్మహత్య చేసుకొని బిజెపిని బతికించుకొంటోంది!

### కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

**హైదరాబాద్, మే 25, ప్రభాతవార్త:** బిఆర్ఎస్ ఆత్మహత్య చేసుకొని బిజెపిని బ్రతికించు కొంటుందని కాంగ్రెస్ వర్కింగ్ ప్రసిడెంట్ తూర్పుజయప్రకాశ్ రెడ్డి ఆరోపించారు. ఆదివారం విలేఖరుల సమావేవంలో జగ్గారెడ్డి మాట్లాడుతూ ఇంట్లో పంచాయితీ వల్ల రాష్ట్రంలో ఉనికిలేని బిజెపి బలపడుతోందని ఆయన ఆవేదన చెందారు.కవిత తండ్రి మీద దండయాత్ర చేస్తూ... కేసీఆర్ కొంప ముంచి బీజేపీ కి బలం ఇస్తుందని ఆయన ఆపాదించారు. భవిష్యత్ నీ దృష్టిలో పెట్టుకుని కాంగ్రెస్ అలెర్ట్ అవ్వాలని జగ్గారెడ్డి అన్నారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు మూడేళ్లు ఉందని అన్ని రాజకీయ పార్టీల్లో అంతర్గత విషయాలు ఉంటాయని, అయితే వారం నుండి కవిత రాసిన లేఖల గురించి చర్చ జరుగుతుందని అన్నారు. కెసిఆర్ కుటుంబం లో లేఖల కలకలంనడుస్తుంది అని ఆయన అన్నారు . తెలంగాణ రాజకీయాల్లో కాంగ్రెస్ బలంగానే ఉంటదని ఆయన ఆశాభావం వ్యక్తంచేశారు . రాష్ట్ర విభజన తర్వాత కేసిఆర్ కి పదేళ్లు అవకాశం ఇచ్చారని గుర్తు చేసుకొన్నారు. తర్వాత కాంగ్రెస్ కి ఇచ్చారు కాంగ్రెస్ పార్టీకి రాజకీయంగా ఇబ్బంది లేదని తెలిపారు. కవిత లేఖ తో కాంగ్రెస్ కి వచ్చే నష్టం కూడా ఏం లేదని ఆయన భాష్యం చెప్పారు. పార్టీ బలంగా ఉంది బలంగా లేని పార్టీ బిజెపి అని ఆయన అన్నారు. కెసిఆర్‌కు రాష్ట్ర విభజన అంశం తో ఓటేశారు . కాంగ్రెస్ కి పాలన చూసి ఓటేస్తారని అన్నారు. మతం పేరుతో బిజెపి రాజకీయం చేస్తుంది అని అన్నారు. కాంగ్రెస్ నాయకత్వం బిఆర్ఎస్ శ్రేణులు కాంగ్రెస్ వైపు తెచ్చుకునే ప్రయత్నం చేయాల్సి ఉందని ఆయన అన్నారు. సమయం వచ్చినప్పుడు సీఎం రేవంత్, పిసిసి చీఫ్ మహేష్ గౌడ్ కి చెప్తా కొన్ని విషయాలు ఇంచార్జి నటరాజన్ తో కూడా పంచుకుంటా అని ఆయన అన్నారుజ కెసిఆర్ కి లోతుగా ఆలోచన చేస్తాడు కానీ కెసిఆర్ పిల్లలు దారి తప్పారు అనుకోవచ్చు కెసిఆర్ గురించి కవిత కు పూర్తి అవగాహన లేకపోవడం దురదృష్టకరం అని అభిప్రాయపడ్డారు. కవిత వల్ల ఏం కాదు..రాజకీయాలను ఆమె ఏం తిప్పేయదు అని అన్నారు. కేసీఆర్ కూతురు కాబట్టి మీడియాలో ప్రాధాన్యత ఆమె వల్ల రాజకీయాలు ఏం తారుమారు కావు అనిఆయన అన్నారు.




సభ్యత్వ నమోదును ప్రారంభిస్తున్న మధుసూదనాచారి, చిరంజీవులు, కృష్ణమోహన్, దాసు సురేష్ తదితరులు

# రాష్ట్రంలో బిసిల సంఘటితశక్తి దిశగా అడుగులు

### 'బిసిల కోటి సభ్యత్వ నమోదు' కార్యక్రమం

### వివిధ పార్టీల నేతలు, మేధావులు

**హైదరాబాద్, మే 25,ప్రభాతవార్త:** రాష్ట్రంలో బిసిల సంఘటిత శక్తిని చాటే సమయం ఆసన్నమైందని అందుకు 'బిసిల కోటి సభ్యత్వ నమోదు' ఉపయోగపడుతుందని వివిధ పార్టీలు నేతలు, మేధావులు అభిప్రాయపడ్డారు. ఈ మేరకు ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన సమావేశంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన బిసిల కోటి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని శాసన మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి, విశ్రాంత ఐఎఎస్ చిరంజీవులు, మాజీ బిసి కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్ చేతుల మీదు ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా విచ్చేసిన మధు సూదనాచారి మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలు ఎక్కువ మొత్తంలో ప్రజాప్రతినిధులు కావడానికి ఈ సభ్యత్వ కార్యక్రమం చాలా ఉపయోగపడుతుందని అన్నారు. బిసి ఇంటెలెక్చువల్ ఫోరమ్ చైర్మన్ రిటైర్డ్ ఐఎఎస్ చిరంజీవులు మాట్లాడుతూ నేడు బిసిలు చాలా చైతన్యవంతంగా ముందుకు వెళ్తున్నారన్నారు. వకుళాభరణం కృష్ణమోహన్ మాట్లాడుతూ ప్రతి బిసి బిడ్డ నేను బిసి రాజ్యాధికార సమితిలో ఒక సభ్యత్వం పొందిన వ్యక్తినని సగర్వంగా చెప్పుకునే విధంగా కోటి బిసిల సభ్యత్వాలను నిర్ణీత కాలంలో పూర్తిచేసి నాయకులకు శిక్షణా తరగతులను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంబీసీ చైర్మన్ తాడూరి శ్రీనివాస్, బిసి సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, ఎర్ర సత్యనారాయణ, నందగోపాల్ , శ్రీనివాస్ యాదవ్, వంశీ కృష్ణ, అరుణశ్రీ, వైద్య రాజగోపాల్, గండి వీరేందర్ గౌడ్, వంగ రవి, చిలువేరు రవీందర్, బండారు పద్మావతి, బొమ్మ నరేందర్, మంద వెంకటస్వామి, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

# ఉన్నతి ఫౌండేషన్‌తో ఎస్సీ గురుకుల సొసైటీ ఒప్పందం

### గురుకుల విద్యార్థుల భవిష్యత్ భద్రతకు ప్రత్యేక శిక్షణ

### ఎస్సీ గురుకుల సొసైటీ కార్యదర్శి అలగు వర్షిణి

**హైదరాబాద్, మే 25, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ఎస్సీ గురుకుల సొసైటీ సంస్థ ఉన్నతి ఫౌండేషన్‌తో అవగాహన ఒప్పందం(ఎంవోయు) చేసుకుంది. విద్యార్థుల భవిష్యత్ భద్రతకు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు. అందులో భాగంగా జూన్ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా 238 కేంద్రాల్లో ప్రత్యేక శిక్షణను ఇవ్వనున్నట్టు తెలిపారు. ఇందుకోసం ఫైనల్ ఇయర్ విద్యార్థులు, పూర్వ విద్యార్థులు రిజిస్టర్ చేసుకోవాలని గురుకుల సొసైటీ కార్యదర్శి డాక్టర్ విఎస్ అలగు వర్షిణి సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లల చదువుపై శ్రద్ధ చూపుతూ, వారు జీవితంలో నిలదొక్కుకునే స్థాయికి చేరుకోవాలని ఎలా కృషి చేస్తారో.. అదే విధంగా రాష్ట్ర ప్రభుత్వం గురుకులాల్లో చదువుతున్న, చదివిన విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని, ఉపాధి అవకాశాలను కల్పించే దిశగా సమగ్ర కార్యక్రమాలను చేపడుతోందని ఎస్సీ గురుకులాల కార్యదర్శి అలగు వర్షిణి తెలిపారు.

10వ తరగతి , ఐటిఐ, పాలిటెక్నిక్, డిగ్రీ పూర్తి చేసిన వారు, ఫైనల్ ఇయర్ డిగ్రీ చదివే విద్యార్థులతో పాటు పూర్వ విద్యార్థులు.. ఎలాంటి ఉద్యోగం లేక ఇబ్బందులు పడే వారికోసం అలాగే వెంటనే ఉద్యోగాల కోసం ఎదురు చూసే వారి కోసం వారి కష్టాలను తొలగించేందుకు ప్రత్యేక శిక్షణా ప్రణాళికను రూపొందించామన్నారు. ఈ లక్ష్యంతోనే ఎస్‌జిబిఎస్ ఉన్నతి ఫౌండేషన్‌తో తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఎంఓయూ కుదుర్చుకున్నదని పేర్కొన్నారు.

ఈ క్రమంలో "యూ ఎన్ ఎక్స్ టి" సంస్థ ఆధ్వర్యంలో 165 గంటల నైపుణ్య శిక్షణ అందించనున్నారు. ఇందులో 90 గంటలు తరగతి గదిలో ప్రత్యక్షంగా శిక్షణ కాగా, 75 గంటలు సెల్ఫ్ లెర్నింగ్ విధానంలో ఉంటుందని కార్యదర్శి తెలిపారు. 25 సంవత్సరాల లోపు వయస్సు కలిగిన పూర్వ విద్యార్థులు, ఫైనల్ ఇయర్ పరీక్షలు రాసిన విద్యార్థులు ఈ శిక్షణ కార్యక్రమానికి అర్హులని తెలతిపారు.

శిక్షణలో స్పోకెన్ ఇంగ్లీష్, లైఫ్ స్కిల్స్, విలువ ఆధారిత జీవన నైపుణ్యాలు, హెచ్ఆర్ సంబంధిత విషయాల్లో స్కిల్స్, ఉద్యోగ ఇంటర్వ్యూలకు కావలసిన ప్రతిభ పెంపు వంటి అంశాలు ఉంటాయని వివరించారు. ఈ శిక్షణ అనంతరం విద్యార్థుల వివరాలు ఎంప్లాయబిలిటీ పోర్టల్‌లో నమోదు చేయబడతాయని.. దాని ఆధారంగా మల్టీ నేషనల్ కంపెనీలు, ఎంఎస్ఎంఇలు పరిశీలించి ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నాయని సెక్రటరీ తెలిపారు.

ప్రత్యేక శిక్షణ జూన్ మూడో వారం నుంచి ప్రారంభమవుతుందన్నారు. ఒక్కో బ్యాచ్‌లో 40 మంది చొప్పున 45 రోజులు శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా 238 గురుకుల కేంద్రాల్లో ఈ శిక్షణా కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. ప్రతీ సంవత్సరం 36 వేల మంది విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్నే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని అమలు చేయనుందన్నారు.

# అల్పపీడన ప్రభావంతో భారీ వర్షాలకు అవకాశం..

**-అధికారులంతా అప్రమత్తంగా ఉండాలి**
**-జిల్లా కలెక్టర్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్**

విజయనగరం, మే 25, ప్రభాతవార్త ప్రతినిధి: పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో మే 27వ తేదీ ప్రాంతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉన్నందున దీని ప్రభావంతో కోస్తా జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల యాజమాన్య సంస్థ తెలియజేసిందని ఈ నేపథ్యంలో అన్ని మండలాల తహశీల్దార్లు, ప్రత్యేక అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆదేశించారు. అల్పపీడన ప్రభావంతో 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో పెనుగాలులు వీచే అవకాశం ఉందని, పలుచోట్ల పిడుగులు పడే అవకాశం ఉందని హెచ్చరించిన దృష్ట్యా ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. అన్ని మండలాలు డివిజన్ కేంద్రాల్లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

విజయనగరం వార్త
పార్వతీపురం మన్యం

## కడప మహానాడుకు తరలిరండి: ప్రభుత్వ విప్ జగదీశ్వరి



కురుపాం, మే 25 ప్రభాతవార్త: కురుపాం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు కడప మహానాడుకు తరలిరండని తెలుగుదేశం పార్టీ నాయకులకు ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి పిలుపునిచ్చారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ ఈ నెల 27, 28, 29 తేదీలలో కడపలో తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా నిర్వహించే మహానాడుకు తరలిరావాలని ఆమె అన్నారు. తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులకు, ముఖ్య నాయకులకు, కార్యకర్తలకు, క్లస్టర్, యూనిట్, బూత్, ఇన్‌చార్జ్‌లకు పిలుపునిచ్చారు. 27,28 లలో పార్టీ కార్యకలాపాలు ప్రభుత్వం పనితీరు తదితర అంశాలపై చర్చ జరుగుతుందన్నారు. మే 29న సుమారు 5 లక్షల మంది శ్రేణులతో భారీ బహిరంగ సభ నిర్వహిస్తారని అన్నారు. మహానాడులో పాల్గొనే వారందరికీ ఆహారం,వసతి ఏర్పాటు చేశారని తెలిపారు. నియోజకవర్గంలోని ముఖ్య నాయకులు, కార్యకర్తలు, క్లస్టర్ ఇన్చార్జులు, యూనిట్ ఇన్చార్జులు, బూత్ ఇన్చార్జులు మహానాడులో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## రైల్వే 3వ లైన్‌తో చిరు వ్యాపారులకు తప్పని ముప్పు

**-దుకాణాలు తొలగించాలని నోటీసులు**
**- చిల్లర వర్తకుల కుటుంబాల భవితవ్యం ప్రశ్నార్థకం**

గరివిడి, మే 25 ప్రభాతవార్త: గరివిడి నడిబొడ్డున రైలు పట్టాలకు సమీపంలో గత 50 ఏళ్లుగా వ్యాపారులు చేసుకుంటున్న చిల్లర వర్తకుల భవితవ్యం ప్రశ్నార్థకం కానుంది. రైల్వే మూడో లైన్ ఏర్పాటుకి రైల్వే శాఖ నిర్ణయించిన నేపథ్యంలో వారు భవిష్యత్తు అగమ్యగోచరంగా మారనుంది. వ్యాపారమే జీవనాధారంగా బతికే 72 మంది వ్యాపారులు, వారి కుటుంబాలు వీధిన పడే దయనీయ పరిస్థితి కనిపిస్తోంది. ఈ నెల 14న దుకాణాలు తొలగించాలని రైల్వే శాఖ నుండి ఆదేశాలు జారీ అయ్యాయి. దీంతో 72 మంది దుకాణ యజమానులు లబోదిబోమంటూ చీపురుపల్లి శాసనసభ్యులు కిమిడి కళా వెంకటరావు, విజయనగరం పార్లమెంట్ సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు లను కలసి తమ గోడు వెళ్లగక్కారు. ఇద్దరు ప్రజాప్రతినిధులు సానుకూలంగా స్పందించారు. డిఆర్ఎంతో మాట్లాడతామన్నారు. అవసరమైతే రైల్వే మంత్రితో మాట్లాడుతామని ఎంపీ వర్తకులకు స్పష్టమైన హామీ ఇచ్చారు. అయితే పాలకులు హామీ ఇచ్చినా రైల్వే అధికారులు మాత్రం రైల్వే మూడో లైన్ నిర్మాణం నేపథ్యంలో అక్కడ షాపులు తొలగించక తప్పదన్న సంకేతాలు అందిస్తున్నారు. దీంతో గత ఐదు దశాబ్దాలుగా ఇక్కడ చిల్లర వ్యాపారాలు చేసుకుంటూ బతుకుతున్న 72 మంది వ్యాపారులు, మూడు వందల వ్యాపారుల కుటుంబాల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది.వారంతా వీధిన పడే పరిస్థితి ఏర్పడింది. ఉపాధి కోల్పోయే దుస్థితి ఏర్పడనుందని వారంతా ఆందోళన చెందుతున్నారు. పాలకులు, ప్రజాప్రతినిధులు వద్ద తమ గోడు వెళ్లగక్కుకున్నా షాపులు తొలగింపు అనివార్యమన్న రైల్వే అధికారుల సంకేతాలతో అక్కడ చిరు వ్యాపారులు తీవ్ర వేదనకు లోనవుతున్నారు. ఏళ్లనాటి బంధం ఒక్కసారిగా తెగి పోనుందని వారు మదన పడుతున్నారు.షాపులు తొలగింపు లేకుండా రైల్వే లైన్ వేయాలని వారు కోరుతున్నారు.లేని పక్షంలో పాక్షికంగా షాపులు తొలగించి కొంత మేరకైనా షాపులు కొనసాగించే వెసులుబాటు కల్పించి రైల్వే లైన్ నిర్మిస్తే వ్యాపారులకి కొంత ఉపాధి పొందే అవకాశం ఉంటుందని వ్యాపారులు భావిస్తున్నారు. రైల్వే అధికారులు, పాలకులు ఏ మేరకు ఇక్కడి వర్తకులకు న్యాయం చేస్తారో వేచిచూడాల్సిందే. వారి భవిష్యత్తు ఉపాధి కి ఏ విధంగా మార్గాలు చూపిస్తారో నిరీక్షించాల్సిందే.



## దిగుబడి పతనం: ధరలేక కోకో రైతుల ఢీలా!

శృంగవరపుకోట, మే 25 ప్రభాతవార్త: ఒకపక్క దిగుబడి తగ్గిపోవడం మరోపక్క గిట్టుబాటు ధర లేకపోవడంతో కోకో రైతులు విలవిలలాడుతున్నట్లు తెలుస్తుంది. మండలంలోని సుమారు 300ఎకరాలు పైగా రైతులు కోకో సాగుచేస్తున్నారు. సాధారణంగా ప్రతి పంట సీజన్‌లో ఎకరాకు నాలుగైదు క్వింటాళ్ళ దిగుబడి వస్తుంది. కానీ ఈ ఏడాది అది దాదాపు రెండు క్వింటాళ్ళకు పడిపోయింది. అయితే ఉత్పత్తి తగ్గినా డిమాండ్ ఏర్పడి మార్కెట్ లో మంచి ధర లభిస్తుందని రైతులు భావించారు. కానీ ప్రైవేటు కొనుగోలు సంస్థలు సిండికేట్ అయి రైతుల ఆశలపై నీళ్ళు జల్లారు. గత ఏడాది ఇదే సమయంలో కోకో గింజలకు 1050 చెప్పున ధర పలికింది. ఈసారి కూడా ధర ఆశాజనకంగా ఉంటుందని రైతులు ఎంతో ఆశ పడ్డారు.కొన్ని కొనుగోలు కేంద్రాల్లో ప్రస్తుతం కిలో 500 వరకు ధర చెల్లిస్తున్నట్లు సమాచారం.ప్రతి ఏడాది ఎకరానికి 60వేల రూపాయల వరకు పెట్టుబడి పెడుతున్నామని ఇక ఇటువంటి పరిస్థితుల్లో ఇటు దిగుబడి అటు ధర తగ్గిపోవడంతో నష్టాలు చవిచూడాల్సి వస్తుందని ప్రస్తుతం మండలంలోని కోకో రైతులు వాపోతున్నారని తెలుస్తోంది.



## పిడుగుపాటుకు రెండు మూగజీవాలు మృతి



బలిజిపేట, మే 25 ప్రభాతవార్త: బలిజిపేట మండలం పెద్దింపేట గ్రామంలో ఆదివారం పిడుగుపాటుతో రెండు మూగజీవులు మృతి చెందాయి. అకాల వర్షంతో కురిసినటువంటి పిడుగుపాటు కారణంగా మధ్య కృష్ణ చెందిన ఒక ఆవు, తీయాల సూర్యనారాయణ చెందిన ఒక ఆవు పొలంలో అకస్మాత్తుగా పిడుగుపాటు పడటంతో అక్కడికక్కడే మృతి చెందడం జరిగింది. గ్రామ సచివాలయం సిబ్బంది మరియు మండల వెటర్నరీ డాక్టర్ పరిశీలించిన అనంతరం దర్యాప్తు నిర్వహిస్తున్నారు.

## 'కూటమి' ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం: ఎంపీ భరత్

శృంగవరపుకోట, మే 25 ప్రభాతవార్త: రాష్ట్రాభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ తెలిపారు. ఈసందర్భంగా ఆదివారం ఆయన నియోజకవర్గంలో పలు అభివృద్ధి, శంఖుస్థాపన కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు చేశారు. ఇందులో భాగంగా ఎస్.కోట మండలంలోని బొడ్డవర గ్రామ జంక్షన్ నుంచి దారపర్తి గిరిజన గ్రామం వరకు సుమారు 11కోట్ల రూపాయలతో నిర్మాణం చేపట్టనున్న బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అదేవిధంగా ఎస్.కోటలోని



ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో అదనపు వసతుల భవన నిర్మాణాల కొరకు సుమారు ఆరు కోట్ల రూపాయలతో పనులుకు ఎంపీ భరత్ శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నేతృత్వంలో కూటమి ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధి కోసం ఎనలేని కృషి చేస్తుందని ప్రభుత్వం ఏర్పాటు చేసి ఏడాదిలోనే పేద, బడుగు, బలహీన తదితర వర్గాల అభివృద్ధి కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారని తెలిపారు. ఈకార్యక్రమంలో ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, రాష్ట్ర టీడీపీ అధికార ప్రతినిధి గొంప క్రిష్ణ, రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి కోళ్ల రాంప్రసాద్,రాష్ట్ర టూరిజం డైరెక్టర్ ఇందుకూరి సుధారాణి, జనసేన పార్టీ నియోజకవర్గ కన్వీనర్ వబ్బిన సత్యనారాయణ, గ్రామ సర్పంచ్ వన్నెపూరి మీనా, మండల టీడీపీ పార్టీ అధ్యక్షుడు జీఎస్ నాయుడు,రాష్ట్ర టీడీపీ కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్ పలువురు మండల అధికారులు,కూటమి నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న ఎంపీ, ఎమ్మెల్యే

లక్కవరపుకోట, మే 25 ప్రభాతవార్త: గేదెలవానిపాలెం గ్రామపంచాయతీలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో విశాఖ ఎంపీ భరత్ ఆదివారం పాల్గొన్నారు. గేదలవానిపాలెం గ్రామంలో సీసీ రోడ్లు, బ్రిడ్జి, నీళ్ల కొళాయిలు కొరకు 40 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన వాటిని రాష్ట్ర నిర్వాహక



కార్యదర్శి కోళ్ల బాలాజీ, అప్పల రాంప్రసాద్, డీసీఎంఎస్ చైర్మన్ గొంప కృష్ణ, పార్లమెంట్ అధ్యక్షులు గండి బాబ్జి, ఏపీ టూరిజం బోర్డు డైరెక్టర్ ఇందుకూరి సుధారాణి మరియు స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులతో కలిసి ఎంపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధి ధ్యేయంగా కలిసికట్టుగా పని చేస్తూ ముందుకు వెళుతుందని అన్నారు. ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి మాట్లాడుతూ ఎస్.కోట నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో మౌలిక వసతులు కల్పనకు పెద్దపీట వేస్తున్నామని దీనికి సహకరిస్తున్న ఎంపీ భరత్‌కి కూటమి ప్రభుత్వ అధినేత చంద్రబాబుకి ఆమె నియోజకవర్గ ప్రజల తరపున కృతజ్ఞతలు తెలియజేశారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

రామభద్రాపురం, మే 25 ప్రభాతవార్త:రామభద్రపురం మండలం పరిధిలో గల రావివలస పంచాయతీ గ్రీన్ ఫీల్డ్ హైవే రోడ్డు 386 మైల్ రాయి వద్ద శనివారం రాత్రి 8:30 గంటలకు రెండు డంపర్ లారీలు ఎదురెదురుగా ఢీకొనగా రెండు లారీలు మధ్య పనిచేస్తున్న వ్యక్తి పడిపోయి చనిపోయినట్లు ఎస్ఐ వెలమల ప్రసాదరావు చెప్పారు. రామభద్రపురం పోలీసులు అందించిన వివరాలు ప్రకారం చనిపోయిన వ్యక్తి పేరు సైలేష్ సహో నవోటోలియా గ్రామం, దవాలా టౌన్, హగారియా జిల్లా, బీహార్ రాష్ట్రం. మృతుడు గ్రీన్ ఫీల్డ్ హైవే పనులు చేస్తూ జీవిస్తున్నాడు. ఇంకొక వ్యక్తికి గాయాలయ్యాయి. చనిపోయియిన వ్యక్తికి భార్య, ఒక బాబు, పాప కలరు. ఎస్ఐ వెలమల ప్రసాద్‌రావు కేసు నమోదు చేసి మృతదేహాన్ని బాడంగి హాస్పిటల్‌కి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

## నేడు పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

నెల్లిమర్ల, మే 25, ప్రభాతవార్త: మండలంలోని కొండవెలగాడ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ల నిర్వహణ పనులు, చెట్ల తొలగింపు పనుల కారణంగా పలు గ్రామాలకు ఈ నెల 26వ తేదీ సోమవారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని విజయనగరం టౌన్ డివిజన్ ఈఈ పి.త్రినాదరావు ఒక ప్రకటనలో తెలిపారు. పారసాం రూరల్ ఫీడర్ పరిధిలోని చినబూరాడపేట, పారసాం, గెద్దపేట, నడుపూరు. భూపాలపురం, ఆనందపురం గ్రామాలకు విద్యుత్ అంతరాయం జరుగుతుందని తెలిపారు.

## 'దళితులపై దాడులు చేసిన వారిపై చర్యలు చేపట్టాలి'

నెల్లిమర్ల, మే 25 ప్రభాతవార్త: అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం దొంకాడలో దళిత యువకులపై కర్రలతో దాడి చేసిన అగ్రవర్ణాలవారిపై కేసు నమోదు చేసి తక్షణమే శిక్షించాలని జైభీమ్ రావ్ భారత్ పార్టీ జిల్లా అధ్యక్షుడు టొంపల నర్సయ్య, ప్రధాన కార్యదర్శి కనిగిరి శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేసినా ఇంత వరకు పట్టించుకోకపోవడం దారుణమని అన్నారు. ఈ నెల 15వ తేదీ రాత్రి గ్రామంలోని వివాహ కార్యక్రమానికి లైటింగ్ పనుల కోసం గ్రామానికి వచ్చిన 8 మంది దళిత యువకులపై సెల్ ఫోన్ చోరీ అభియోగం మోపి దాడులకు పాల్పడ్డారని అన్నారు. నిందితులపై ఎస్సి ఎస్టి అట్రాసిటీ కేసు నమోదు చేసి చర్యలు చేపట్టాలని నర్సయ్య, శ్రీనివాసరావు డిమాండ్ చేశారు.

## శభాష్ అనిపించుకున్న పురపారిశుద్ధ్య కార్మికులు!

సాలూరు, మే 25 ప్రభాతవార్త:సాలూరులో ఇటీవల జరిగిన శ్రీశ్యామలాంబ అమ్మవారి పండగలో మున్సిపల్ కార్మికుల సేవలు మరవలేనివని 26వ వార్డు కౌన్సిలర్ కర్రి సన్యాసమ్మ అన్నారు.



ఆదివారం ముగ్గురు పారిశుధ్య కార్మికులకు కౌన్సిలర్ దంపతులు సన్యాసమ్మ అప్పలస్వామి చిరుసత్కారం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ పండగలో వెంకటేశ్వరకాలనీ ఇంకా దండిగాం రోడ్డులో యుద్ధ ప్రాతిపదికన చెత్తను ఎప్పటికప్పుడు క్లీన్ చేసారని వారి సేవలను కొనియాడారు. అలాగే వార్డును పరిశుభ్రంగా ఉంచినందుకు స్థానికులతో పారిశుధ్య కార్మికులు శభాష్ అనిపించుకున్నారన్నారు. ఈ సందర్భంగా కమీషనర్ కృష్ణారావు శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణకు కౌన్సిలర్ దంపతులు ధన్యవాదాలు తెలిపారు. స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## నేడు సాయి సిద్దార్థ కళాశాలలో రక్తదాన శిబిరం

గజపతినగరం, మే 25, ప్రభాతవార్త: స్థానిక సాయి సిద్ధార్థ కళాశాల ప్రాంగణంలో రక్తదాన శిబిరం ఈ నెల 26వ తేదీ సోమవారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు కళాశాల కరస్పాండెంట్ ఎస్.చంద్రశేఖర్ ఆదివారం తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు, రక్త దాతలు స్వచ్ఛందంగా ఈ శిబిరంలో పాల్గొని రక్తదానం చేయాలని, మరొకరికి ప్రాణదాతలు కావాలని కోరారు.

## ఘనంగా సూపద జ్ఞానయజ్ఞ తరగతులు

లక్కవరపుకోట, మే 25 ప్రభాతవార్త: మండల కేంద్రంలోని శ్రీసీతారామ ఆలయ ప్రాంగణంలో గత 21 రోజులుగా సుపద ఆశ్రమం అలాగే జగద్గురు పీఠం విజయనగరం ఆధ్వర్యంలో నిర్వహించిన వేసవి ఉచిత శిక్షణా తరగతులు ఆదివారంతో ఘనంగా ముగిసాయి. ఈ శిక్షణా తరగతుల్లో పాల్గొని



వివిధ అంశాల్లో శిక్షణ పొందిన విద్యార్థుల మధ్య వారు నేర్చుకున్న జ్ఞానంపై వివిధ పోటీలు నిర్వహించగా గెలుపొందిన విద్యార్థులకు ముఖ్య అతిథిగా పాల్గొన్న శ్రీనాథ్ పెదబాబు అక్కా జోస్యుల శ్రీహరిశర్మ అలాగే అక్కజొష్యుల ప్రకాశంల చేతులు మీదగా బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా సుపద ఆశ్రమ నిర్వాహకులు శ్రీహరి శర్మ మాట్లాడుతూ సుపద ఆశ్రమం ఆచార్య యుఏఎన్ రాజు మాస్టర్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసి ఇప్పటికి 22 సంవత్సరాలు కావస్తుందన్నారు. కార్యక్రమంలో స్థానిక కార్యకర్తలు జి.వెంకటరావు, పి.సతీష్ కుమార్, పి.శ్రీనివాస్, ఎం.వెంకటేష్, ఏ.తరుణ్, వి.జగదీష్, ఏ.మహేష్, ఏ.శ్రావణిలు తమ విశేష సేవలనందించిన వారిని సత్కరించారు.

## యువత, విద్యార్థులు టిడిపి 'మహానాడు'కు తరలి రావాలి: డాక్టర్ శంకర్

గుర్ల, మే 25 ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్‌కు ఉజ్వల భవిష్యత్తు అందించగల సమర్థుడు ఒక నారా లోకేష్ అని ఆయన నాయకత్వాన్ని బలపరుస్తూ ఈనెల 27, 28, 29 తేదీలలో కడపలో జరుగుతున్న మహానాడుకు ఉత్తరాంధ్ర విద్యార్థులు, యువత పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని తెలుగుదేశం పార్టీ యువ నాయకులు ఉత్తరాంధ్ర విద్యార్థి సేన వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ శంకర్ రమణమూర్తి పిలుపునిచ్చారు. ఆదివారం పాలవలస గ్రామంలో తన స్వగృహమందు



విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన ప్రియతమ నేత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు భవిష్యత్ తరాల కోసం అనేక ప్రణాళికలతో రాష్ట్ర అభివృద్ధికి కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రతి పల్లెకు సాగు,త్రాగునీరు అందించే దిశగా అడుగులు వేస్తూ చీపురుపల్లి నియోజకవర్గం శాసనసభ్యులు కిమిడి కళావెంకట్రావు లాంటి అనుభవం ఉన్న సీనియర్ నాయకులు సూచన మేరకు అనేక కొత్త ప్రాజెక్టులు ఏర్పాటుకు కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ నేపధ్యంలో పోలవరం నుండి బనకచర్ల లింకేజీ ప్రాజెక్టు 80.112 కోట్ల రూపాయలతో ఏడు లక్షల ఎకరాలకు సాగునీరు 80 లక్షల మందికి త్రాగునీరు అందించడానికి కృషి చేస్తున్నారని తెలిపారు. అదే విధంగా ఉత్తరాంధ్ర,రాయలసీమ జిల్లాలలో భారీ పరిశ్రమలు ఏర్పాటు చేసి ఎక్కువ సంఖ్యలో యువతకు ఉపాధి కల్పన చేయడానికి ముందుకు అడుగులు వేస్తున్నారని తెలిపారు. వల్లూరు బంగారు నాయుడు, మాజీ సర్పంచ్ సుంకరి పైడినాయుడు, గేదెల అప్పలనాయుడు, వల్లూరు భాస్కరరావు, తాడ్డీ భాస్కరరావు, సుంకర సత్యం, అప్పలనాయుడు పొట్నూరు భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

## టిడిపి 'మహానాడు'ను విజయవంతం చేయాలి

### ప్రత్యేక బస్సులు ఏర్పాటు: టీడీపీ సీనియర్ నేత 'కొండపల్లి'



విజయనగరం, మే 25, ప్రభాతవార్త ప్రతినిధి: టిడిపి మహానాడు కార్యక్రమాన్ని విజయవంతం చెయ్యాలని టీడీపీ సీనియర్ నేత కొండపల్లి కొండలరావు పిలుపునిచ్చారు. మహానాడుకి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరు కావాలని ఆయన కోరారు.

## మాతా బుజ్జి క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

విజయనగరం, మే 25, ప్రభాతవార్త: నగరంలోని స్థానిక కణపాక కామాక్షి నగర్ గ్రౌండ్‌లో మాతా బుజ్జి క్రికెట్ టోర్నమెంట్ ను జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయ కార్యదర్శి పూసపాటి రాజేష్ వర్మ



ఆదివారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగర తెలుగు యువత అధ్యక్షుడు మాతా బుజ్జి గత 14 ఏళ్లుగా ఈ టోర్నమెంట్‌ను జరిపించడం, ప్రతి ఏటా 46వ డివిజన్ పరిధిలో పదవ తరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహం అందించడం అభినందనీయమన్నారు. యువతను మంచి దారిలో వెళ్ళేలా తన వంతుగా సమాజానికి మంచి చేయడమే లక్ష్యంగా తాను పని చేస్తున్నట్లు నిర్వాహకుడు మాతా బుజ్జి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అట్టాడ శ్రీను, కోరాడ సత్యనారాయణ, నల్లమారి, సందీప్, చిన్న, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

## అ'పూర్వ' విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

గజపతినగరం, మే 25, ప్రభాతవార్త: వీళ్ళందరూ 23 సంవత్సరాలు క్రితం గజపతినగరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుకున్న విద్యార్థులు. తామంతా ఒకచోట కలుసుకోవాలని, పాత జ్ఞాపకాలను నెమరుసుకోవాలని, తమ గురువులను సత్కరించుకోవాలని అందుకు ఒక వేదికను ఏర్పాటు చేసుకోవాలని అనుకున్నారు. వెంటనే తాము చదువుకున్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలనే వేదికగా చేసుకొని ఆదివారం1997-2002 ఆరోతరగతి నుంచి పదవ తరగతి బ్యాచ్ కలసుకున్నారు. ఒకరిని చూసి మరొకరు మురిసిపోతూ, ఆలింగనం చేసుకుంటూ పాత జ్ఞాపకాలు నెమరేసుకుంటూ ఆనంద డోలికల్లో మునిగి తేలారు. తమ ఆహ్వానం మేరకు అప్పుడే వేదిక వద్దకు వస్తున్న గురువులకు



ఘనంగా స్వాగతం పలికారు. అప్పటి ప్రధానోపాధ్యాయులు అల్లు అప్పలస్వామి దగ్గర నుంచి ఉపాధ్యాయులు వేణు మాస్టర్, అలువాడ రామారావు, భాను ప్రకాష్, రాజేశ్వరరావు, కృష్ణమూర్తి, లక్ష్మణరావు, సంజీవరావు, దైవకృప, పద్మావతి, కాసులమ్మ, లలిత కుమారిలను ఘనంగా సత్కరించి తమ గురుభక్తి చాటుకున్నారు. శిష్యుల గురుభక్తికి గురువులు మురిసిపోయారు. అనంతరం పూర్వ విద్యార్థులు తమ ప్రసంగాల ద్వారా తమ అలనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు పలు సేవా, సామాజిక కార్యక్రమాలు నిర్వహణకు తీర్మానం చేశారు. ఈ ఆత్మీయ సమ్మేళనానికి బెంగళూరు, హైదరాబాద్, చెన్నై, ముంబై వంటి దూర ప్రాంతాల్లోను, స్థానికంగా స్థిరపడిన పూర్వ విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

## ఆశ్రమ పాఠశాల విద్యార్థుల ఆరోగ్యంపై నిర్లక్ష్యపు నీడ!

సాలూరు, మే 25 ప్రభాతవార్త:ప్రభుత్వాలు మారాయిగాని ఆశ్రమ పాఠశాల విద్యార్థులు తలరాతలు మాత్రం మారడం లేదు. అప్పుడు వైసీపీ ప్రభుత్వం ఇప్పుడు కూటమి ప్రభుత్వం జెండా రంగు మారుతుందని కాని స్టూడెంట్స్ గుండెలో బాధ మాత్రం సేమ్ టు సేమ్. కూటమి ప్రభుత్వం పాలన ఏడాది గడుస్తున్న అవే బాధలు అవే వెతలతో విద్యార్థులు అల్లాడుతున్నారు. పార్వతీపురం మన్యం




జిల్లాలో స్వయాన గిరిజన సంక్షేమ మంత్రి ఉన్న ఇలాకాలో ఇలా జరగడం విశేషం. కూటమి ప్రభుత్వం విజయఢంకా మోగించిన వెంటనే గుమ్మిడి సంధ్యారాణి ఎమ్మెల్యేగా గెలవడం తరువాత వెనువెంటనే మహిళా శిశు గిరిజన సంక్షేమ మంత్రిగా ప్రమాణం స్వీకారం చేసినరోజు మొట్టమొదటి సంతకం గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఏఎన్ఎం లు నియమిస్తామని ఎంతో గొప్పగా చెప్పారు. కానీ ఇం తవరకు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉన్నట్టుగా పరిస్థి తి ఉండడంతో ఆదివాసి గిరిజన నాయకులు ఆగ్రహంతో పోరాటబాట పడుతున్నారు. గత ప్రభుత్వం ఆశ్రమ పాఠశాల విద్యార్థుల ఆరోగ్యంపై చేస్తున్న నిర్లక్ష్యమే ఇప్పుడు కూటమి ప్రభుత్వం వంతుగా మోసం చేస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం జిల్లా కమిటీ గౌరవ అధ్యక్షులు శీదరపు అప్పారావు, సభ్యులు మంచాల శ్రీను మాట్లాడుతూ ముఖ్యంగా గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థుల ఆరోగ్యంపై దృష్టి పెట్టాలని వారి సమస్యలు వెంటనే పరిష్కరించాలని లేదంటే పోరాటాలు చేస్తామని హెచ్చరించారు.

## శ్రీసూర్యపీఠంలో అరుణ కేతుకం



పార్వతీపురం, మే 25 ప్రభాతవార్త: స్థానిక శ్రీసూర్య పీఠంలో మిత్ర రవి సూర్య భాను ఖగ పూష హిరణ్యాగర్భ మరీచి ఆదిత్య సవితృ అర్క భాస్కర ద్వాదశాదిత్య సహిత ఆదిత్య పంచాయతన ప్రీతికరంగా సౌరదీక్షలో సప్తసూర్య నమస్కారములు, ఆరుణకేతుక హోమములు, రుద్రమన్యుసూక్త సకలదేవతా మంత్రహవనములు, సౌరయాగశాలలో నవనాగార్చనలు నవగ్రహమఖములు జరిగాయి. అశేషశేముషీనిధి బ్రహ్మశ్రీ వేమకోటి నరహరి శాస్త్రి అధ్వర్యంలో వేమకోటి వివేకానంద శర్మ, దా.ఉమామహేశ్వర శర్మ, కేశవ శర్మ, మా.ఆదిత్య శర్మ, భమిడిపాటి జ్యోతిస్వరూ శర్మ, వైద్యభూషణ షణ్ముఖ శర్మ, పెనుమళ్ళ కుమార్ శర్మ, గోడ భరద్వాజ శర్మ, టి.రామక్రిష్ణ శర్మ వైదిక సహకారం అందించారు.

## రహదారులపై గోతుల పూడ్చివేత



కొమరాడ, మే 25 ప్రభాతవార్త: పార్వతీపురం నుంచి కూనేరు వరకు ఉన్న అంతరాష్ట్ర రహదారిపై కొమరాడ మండలంలో పలు ప్రాంతాలలో ఏర్పడిన గోతులను శని, ఆదివారాలలో పూడ్చిపెట్టారు. ముఖ్యంగా కోటిపామ్ సమీపంలో, జంఝావతి నది మీద బ్రిడ్జిపై ఏర్పడిన గోతులలో క్రషర్ డేస్ట్, మేటల్ వేసి గోతులను పూడ్చిపెట్టారు. అలాగే స్వామినాయుడువలస రైల్వే గేట్ నుంచి అర్తం జంక్షన్ వరకు మధ్య మధ్యలో రహదారిపై ఉన్న గోతులను కూడా కురుపాం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ జగదీశ్వరి సూచనల మేరకు తెలుగుదేశం పార్టీ నాయకులు గోతులను పూడ్చి పెట్టడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

## అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే 'బోనెల'



పార్వతీపురం, మే 25, ప్రభాతవార్త: నర్సిపురం గ్రామంలో గ్రామ దుర్గ అమ్మవారిని ఆదివారం ఉదయం పార్వతీపురం శాసనసభ్యులు బోనెల విజయచంద్ర దర్శించుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అమ్మవారు ఆశీస్సులతో ప్రజలందరూ సంతోషంగా ఉండాలని కోరుకుంటున్నానని అన్నారు. ఎమ్మెల్యేతో పాటు టిడిపి సీనియర్ నాయకులు గొట్టాపు వెంకటరమణ, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## నీటిపారుదల ఛానల్స్ జంగిల్ క్లియరెన్స్



కంచిలి, మే 25 ప్రభాతవార్త: మండపల్లి నుండి తలతంపర నీటిపారుదల ఛానల్స్ జంగిల్ క్లియరెన్స్ పనులు మాదీన రామారావు చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వి.తిరుమలరావు, చైర్మన్ దిక్కల గోపి, గ్రామ పెద్దలు దిక్కల దామోదరం, వజ్జ కృష్ణారావు, బొడ్డ మన్మధరావు, మాదిన వెంకటరమణ, దిక్కల కాళిదాసు, మాదిన శేషగిరి, వార్డ్ మెంబర్ మల్లా హరి, దిక్కల అప్పలరాజు మరియు గ్రామ ప్రజలుపాల్గొన్నారు.

## సీతా రామ పిరమిడ్ ధ్యాన కేంద్రం ప్రారంభం



కంచిలి, మే 25 ప్రభాతవార్త: హిమాలయ గిరులు కాశ్మీర్ నుండి వచ్చిన శాంత సదానంద స్వామి సీతారామ పిరమిడ్ ధ్యాన కేంద్రం కంచిలి మండలం బురదపాడు గ్రామంలో ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మరియు ప్రభుత్వ విప్ డాక్టర్ బెందాళం అశోక్‌బాబు, బుడ్డెపు కామేష్‌రెడ్డి, పైల పురుషోత్తంరెడ్డి సరస్వతి, గాంధీ పిరమిడ్ ధ్యాన కేంద్ర నిర్వాహకులు భక్తులు, ప్రజలు హాజరయ్యారు.

## ఐక్యమత్యానికి ప్రతీక క్రీడలు: జడ్పీటిసి మాజీ సభ్యుడు రమేష్

కవిటి, మే 25 ప్రభాతవార్త: ఐకమత్యానికి ప్రతిక క్రీడలంటూ మాజీ జెడ్పిటిసి బెందాళం రమేష్ అన్నారు. ఆదివారం జూనియర్ కళాశాల మైదానంలో శ్రీచింతామణి క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో



నియోజవర్గ స్థాయి క్రికెట్ పోటీలను మాజీ జెడ్పిటిసి బెందాళం రామేష్ ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా మానసిక ఉల్లాసానికి ఐక్యమత్యానికి క్రీడలు దోహదపడతాయని అన్నారు. మీరంతా క్రీడల పోటీల్లో పాల్గొని చక్కని ప్రతిభ కనబరచాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు అరంగి మధు, పాండవ చంద్ర శేఖర్, గ్రామ పెద్దలు బెందాళం రమణమూర్తి, బెందాళం సురేష్, సీనియర్ క్రీడా కారుడు జల్లు రంజిత్‌తో పాటు పలువురు క్రీడాకారులు పాల్గొన్నారు.

## 'క్రీడలే విజయానికి బాట'

కవిటి, మే 25 ప్రభాతవార్త: విద్యార్థులు క్రీడలను కేవలం వినోదంగా కాకుండా వృత్తి మార్గంగా స్వీకరించాలని జిల్లా క్రీడాభివృద్ధి శాఖ జూనియర్ అసిస్టెంట్ మాదిన రాంబాబు పిలుపునిచ్చారు. మంగళవారం ఉదయం బి.గొనపపుట్టుక గ్రామంలో నిర్వహిస్తున్న వేసవి క్రీడా శిక్షణ శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'ఈ శిక్షణ శిబిరం విద్యార్థులకు శారీరక,



మానసిక అభివృద్ధికి ఎంతో ఉపయోగపడుతుంది. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం శిక్షకులు ఇచ్చే శిక్షణను శ్రద్ధగా స్వీకరించి తమలోని క్రీడా ప్రతిభను మెరుగుపర్చుకోవాలి. క్రీడలు శరీరాన్ని దృఢంగా మార్చడమే కాక, జీవితంలో మానసిక శాంతిని అందిస్తాయి' అని అన్నారు. అలాగే 'ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహిస్తూ స్పోర్ట్స్ కోటాను 3 శాతం వరకు పెంచిన సంగతి విద్యార్థులందరూ గుర్తుంచుకోవాలి. ఈ శిక్షణతో అభ్యాసం పొందిన విద్యార్థులు రాబోయే పోటీ పరీక్షల్లో, ఉద్యోగ అవకాశాల్లో మెరుగైన ప్రదర్శన కనబర్చవచ్చు' అని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ప్రధానోపాధ్యాయులు బాబురావు మాస్టర్ అధ్యక్షతన నిర్వహించగా, ఉపాధ్యాయులు ప్రసాద్, వ్యాయామ ఉపాధ్యాయులు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## 'పిల్లలపై తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి సారించాలి'

కోటబొమ్మాళి, మే 25 ప్రభాతవార్త: ప్రస్తుత పరిస్థితుల్లో పిల్లలు నడవడిక, తదితర అంశాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తు వారిపై ప్రత్యేక దృష్టి సారించాలని న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు ల



ఖినేని శ్రీనివాస్ అన్నారు. ఆదివారం అంతర్జాతీయ తప్పిపోయిన పిల్లల దినోత్సవం సందర్భంగా ఆయన కోటబొమ్మాళి ఎన్టీఆర్, ఎర్రన్నాయుడు పార్క్ వద్ద న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ప్రపంచవ్యాప్తంగా పిల్లల అపహరణ సమస్యను గుర్తించడానికి, పిల్లలను సంరక్షణకు తీసుకోవలసిన కొన్ని చర్యల గురించి తల్లిదండ్రులకు ఈ సందర్భంగా తగు సూచనలు, సలహాలు చేశారు. ఈ సదస్సులో పారా లీగల్ వాలంటీర్స్ కూడా పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీచింతామణి సంబర మహోత్సవం



కవిటి, మే 25 ప్రభాతవార్త: మండలం రామయ్యపుట్టుగ గోష్టి సంఘం ఆధ్వర్యంలో శ్రీచింతామణి సంబర మహోత్సవం మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కవిటి గ్రామంలో వెలసిన శ్రీచింతామణి దేవస్థానానికి మేళ తాళాలు, బాజ భజంత్రీలతో భక్తులు శోభాయాత్రగా చేరుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వందలాది భక్తులు కార్యక్రమంలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

## 'పేదకళాకారులకు గుర్తింపు కార్డులు అందించాలి'

### -కళాకారుల సంక్షేమ సంఘం తీర్మానం

ఆముదాలవలస, మే 25 ప్రభాతవార్త: పేద కళాకారులను, సీనియర్ కళాకారులను ప్రభుత్వం గుర్తించి గుర్తింపు కార్డులను అందజేయాలని కళాకారుల సంక్షేమ సంఘం ఏకగ్రీవ తీర్మానం చేసింది. ఆదివారం లక్ష్మీనగర్ పాఠశాల ఆవరణలో టేకి త్రినాధరావు అధ్యక్షతన జరిగిన కళాకారుల సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. అలాగే నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. కళాకారుల సంక్షేమ సంఘం ఆమదాలవలస నియోజకవర్గానికి అధ్యక్ష ప్రధాన



కార్యదర్శులుగా పేడాడ ధనుంజయరావు, బాగాది తేజేశ్వరరావులను ఎన్ను కున్నారు. సంఘ గౌరవ అధ్యక్షునిగా టేకి త్రినాధరావు ఎంపిక కాగా ఉపాధ్యక్షుడిగా బొడ్డేపల్లి జనార్దన్‌రావును ఎంపిక చేశారు. కోశాధికారిగా కొంచాడ రామారావు, ఉపాధ్యక్షులుగా ఎన్.చంద్రశేఖర్, దాస్యం లక్ష్మణరావు, జోగారావు, పివిఎస్ మాస్టర్, టి.విశ్వేశ్వరరావు, ఏ.రామాచారి, సంయుక్త కార్యదర్శి మెరుగాపు ఈశ్వరరావు, కార్యదర్శులుగా కే.రాముల నాయుడు, కే.సంజీవరావు, పిడి కుమార్, ఎన్.వాసు దేవరావు, బి.గోవిందరావు, కే.భాస్కరరావులు ఎంపికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా ఈ గోవిందరావు ఎల్.విశ్వేశ్వరరావు, కె.తిరుపతమ్మ, బి.గోపాలరావు, రాజులు, దుర్గారావు ఆదినారాయణ, టి.సూర్యనారాయణ, బి.సత్యనారాయణలను ఎంపిక చేశారు. నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం అనంతరం పేద సీనియర్ కళాకారులకు గుర్తింపు కార్డులు అందేలా ప్రభుత్వం చర్య తీసుకోవాలని కోరారు.

## కంచమ్మతల్లి అమ్మవారి సంబరాల సమావేశం

కంచిలి, మే 25 ప్రభాతవార్త: స్థానిక రైల్వేస్టేషన్ కూడలి వద్ద కంచమ్మ తల్లి అమ్మవారి సంబరాలు నిమిత్తం గ్రామస్తులు ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. జూన్ 1 నుండి 10వ తేదీ వరకు జరుగు కంచమ్మతల్లి సంబరాల కోసం ఎలాంటి కార్యక్రమాలు చేపట్టాలని కంచమ్మ తల్లి కమిటీ, గ్రామస్తులు



సమావేశం ఏర్పాటు చేసి చర్చించుకున్నారు. గ్రామంలో సంబరాల సమయంలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా యువకులు పెద్దలు పాల్గొని తీసుకోవలసిన చర్యలపై సమావేశంలో మాట్లాడుకున్నారు.


## 'తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే ఐఏఎస్ సాధించా'

జలుమూరు, మే 25 ప్రభాతవార్త: జలుమూరు మండలంలోని అల్లాడపేటకు చెందిన బాన్న వెంకటేష్‌కు సివిల్ సర్వీసులో 15వ ర్యాంకు సాధించిన విషయం పాఠకులకు తెలిసిన విషయమే. ఈ సందర్భంగా తన సొంత గ్రామమైన అల్లాడపేటకు ఆదివారం రావడంతో గ్రామస్తులు ఘనముగా స్వాగతం పలికారు. బాన్న వెంకటేష్, ఐఏఎస్ అతనిని ఆదర్శంగా తీసుకోవాలని జడ్పిటిసి ప్రతినిధి మెండ విజయశాంతి రాంబాబు, ఈఎన్‌టి స్పెషలిస్ట్ సిహెచ్.నారాయణరావు, దుంగ సుధాకర్‌రావు, రిటైర్డ్ జడ్జి ఎం.రామకృష్ణారావు కొనియాడారు. జోగారావు మాస్టారు చెప్పినట్లు ఐఏఎస్ సాధించాలంటే సంకల్పం, నిబద్ధత, పట్టుదల, విశాలమైన హృదయం ఉంటే అది సాధించవచ్చునని, అలా సాధించిన వారిలో బాన్న వెంకటేష్ ఒకరిని కొనియాడారు. బాన్న వెంకటేష్‌ను ఘనముగా దుశ్శాలువలతో, బోకేలతో గ్రామస్తులు, జిల్లా వెలమ సంఘం వారు సత్కరించారు. తల్లిదండ్రులు ప్రోత్సాహంతో నేను ఈ స్థాయికి వచ్చానని బాన్న వెంకటేష్, ఐఏఎస్ పేర్కొన్నారు. గజమాలతో



గ్రామస్తులు వెంకటేష్ సత్కరించారు. ఆయన మాట్లాడుతూ తనకు క్రికెట్ అంటే చాలా ఇష్టమని, నేను జిల్లా స్థాయిలో ఆడానని, రాష్ట్రస్థాయికి వెళ్లలేకపోయానని తెలిపారు. తాను ఐఏఎస్ కావడానికి ప్రధానమైన కారణం నేరుగా ప్రజలకు సేవ చేయుటకు నేను ఎంపిక చేసుకున్నానని తెలిపారు. పేద ప్రజలు వలసలుగా వెళ్లకుండా వారికి తన సొంత ఊరిలోనే ఉపాధి కల్పించుటకు కృషి చేస్తానని పేర్కొన్నరు. గ్రామీణ మధ్యతరగతి కుటుంబాలకు, విద్య అనేది ఒక ఆయుధం కాబట్టి పేద విద్యార్థులకు తన వంతు అభివృద్ధి చేయడానికి కృషి చేస్తానని తెలిపారు. వెంకటేష్ తమ్ముడు కూడా ఇస్రోలో సైంటిస్ట్ గా పనిచేస్తున్నారు. వెంకటేష్ ప్రాథమిక విద్యాభ్యాసం అంతా అల్లాడుపేటలోనే సాగింది. 10వ తరగతి ముసపపేటలో ప్రైవేటు స్కూల్‌లో విద్యను అభ్యసించాడు. అనంతరం ఇంటర్ ఓ ప్రైవేట్ కళాశాలలో పూర్తి చేసాడు. ఐఏఎస్ అనే కాన్సెప్ట్ ఇంజనీరింగ్ రెండో సంవత్సరంలో చదువుతున్నప్పుడే నాకు ఆసక్తి కలిగి ఉందని తెలిపారు. చిన్నతనం నుంచి కృషి పట్టుదలతో చదివి వెంకటేష్ ఈ స్థాయికి చేరుకున్నట్లు ఆయన మిత్రులు, శ్రేయోభిలాషులు పేర్కొన్నారు. వెంకటేష్‌ను గ్రామస్తుల అభినందనలతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి శ్రీనివాసరావు, బంధు వర్గం, గ్రామస్తులు, నీటి సంఘం అధ్యక్షులు కింజరాపు సత్యనారాయణ, దుద్ది రాజేశ్వరరావు, మాజీ సర్పంచ్ రమణమూర్తి, హనుమంత రంగనాథం, వెలమల ఇంద్రసేన, వెలమల సత్యనారాయణ, డిల్లేశ్వరరావు, జ్ఞాన జ్యోతి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాద బాధితునికి ఆర్థికసాయం




ఇచ్ఛాపురం, మే 25 ప్రభాతవార్త: సోంపేట మండలానికి చెందిన గేదెల ఆకాష్ రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. కాళ్లకు సర్జరీ అవసరమైంది. విషయం తెలుసుకున్న జి.ఎస్.ఫౌండేషన్ 2800 రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందజేసింది. సోషల్ మీడియా ద్వారా విషయం తెలుసుకుని ఈ మొత్తాన్ని ఫోన్‌పే రూపంలో అందజేశారు.

## మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

సంతబొమ్మాళి, మే 25 ప్రభాతవార్త: సంతబొమ్మాలి మండలం సుగ్గువానిపేట గ్రామం ఇటీవలే రోడ్డు ప్రమాదానికి గురైన నిరుపేద కార్మికుడు పైల శాంతారావు చనిపోవడం తెలుసుకున్న శ్రీరెయ్యమ్మ తల్లి ఎంటర్‌ప్రైజెస్ ప్రొప్రైటర్ శ్రీనివాసరావు 30వేల రూపాయలు ఆర్థిక సాయం అందజేశారు.



శాంతారావుది నిరుపేద కుటుంబం. ఆసరాగా నిలబడడానికి తండ్రి కూడా లేరు. తల్లి వృద్ధురాలు. ఈ విషయం తెలుసుకున్న శ్రీనివాస్ బాధిత కుటుంబానికి ఆదుకోవడానికి ముందుకొచ్చి ఆర్థిక సాయం అందించారు. అలాగే రెండు నెలలు ఇంటికి సరిపడా నిత్యావసర సరుకులు అందించారు.

# శ్రీకాకుళం వార్త



## 'కూటమి' ప్రభుత్వంతోనే గ్రామాల అభివృద్ధి : ఎమ్మెల్యే 'కోండ్రు'

రేగిడి, మే 25, ప్రభాతవార్త: మాజీ మంత్రి, తెదేపా రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ ఆదివారం రేగిడి ఆమదాలవలస మండలంలో విస్తృతంగా పర్యటించి ఎనిమిది గ్రామాలలో ఏడుకోట్ల పదిలక్షలతో మంజూరైన బీటీ రోడ్లకు శంకుస్థాపన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కోండ్రుకు గ్రామ ప్రజలు పూలవర్షం కురిపించి, మహిళలు మంగళ హారతులు ఇచ్చి ఘన స్వాగతం పలికారు. ముందుగా కొండవలస గ్రామంలో బీటీ రోడ్డుకు శంకుస్థాపన చేసారు. చినకోడిశ,



సరసనాపల్లి, జోడుబందల, పెద కోడిశ, అంబాడ, లక్ష్మీపురం గ్రామాల్లో బీటీ రోడ్లుకు శంకుస్థాపన చేసారు. అనంతరం లింగాలవలస గ్రామంలో నూతన బీటీ రోడ్డుకు శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొని భూమిపూజ చేసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోండ్రు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో అభివృద్ధిని గాలికి వదిలేశారని మండిపడ్డారు. గ్రామాలలైతే పూర్తిగా కుంటిపడ్డాయన్నారు. నేడు కూటమి ప్రభుత్వం పాలనలో గ్రామీణ ప్రాంతాలకు మహర్దశ పట్టి, అభివృద్ధి సంక్షేమంలో పరుగులు పెడుతోందన్నారు. నేడు కూటమి పాలనలో ప్రతీ ఇంటికీ మూడు సిలిండర్లు ఉచితంగా పంపిణీ చేస్తున్నామన్నారు. చంద్రబాబు ముందుగానే మూడు గ్యాస్ సిలిండర్ల సొమ్మును వారి ఖాతాలో జమ చేసేందుకు పూనుకున్నారన్నారు. అలాగే జూన్ నెలలో రైతుల ఖాతాలో 20వేలు జమ చేయనున్నారన్నారు. చదువుతున్న ఆడబిడ్డలకు ఎంతమంది ఉంటే అంతమందికి 15000 అందిస్తారన్నారు. ఆగస్టు 15కు ఉచితంగా బస్సుల్లో మహిళలకు ప్రయాణంకు చంద్రబాబు శ్రీకారం చుట్టారన్నారు. సూపర్ సిక్స్‌లో ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ ప్రజల మన్ననలను పొందుతున్నారన్నారు. రాజాం నియోజకవర్గంలో గల గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న ఏ పనులైనా ఉంటే త్వరలో పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు. ప్రతీ ఇంటికీ త్రాగు నీటితో పాటు, ఇల్లు లేని నిరుపేదలకు ఇంటిస్థలాలు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కోండ్రు జగదీష్, కిమిడి అశోక్ కుమార్, ఇనిగంటి సునీల్ కుమార్, కోడి శశికళ వెంకట అప్పలనాయుడు, అడపా చిరంజీవి కోడి నారపు నాయుడు, మజ్జి శ్రీను తదితర కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## బస్‌షెల్టర్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే అశోక్‌బాబు

కంచిలి, మే 25 ప్రభాతవార్త: తెలుగుదేశం పార్టీ విప్, ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్‌బాబు బస్ షెల్టర్‌ను ప్రారంభించారు. జాతీయ రహదారిపైన మసీదు ఎదురు గా మలిపెద్ది బ్రదర్స్ ప్రజలు



సౌకర్యార్థం ఏర్పాటు చేసిన బస్‌షెల్టర్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. మండల తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

సంతకవిటి, మే 25 ప్రభాతవార్త : పదవ తరగతి ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు వాల్తేరు గ్రామం ఆర్కే గ్రంథాలయం వ్యవస్థాపకులు గురుగుబెల్లి రాజు, సబ్ రిజిస్ట్రార్ ప్రతిభా పురస్కారాలతో పాటుగా నగదు పురస్కారాన్ని అందించారు. ఆదివారం సాయంత్రం ఆర్కే



గ్రంథాలయంలో కార్యక్రమం నిర్వహించారు. జన్మించిన ఊరికి, జన్మనిచ్చిన తల్లిదండ్రులకు, గురువులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఒక లక్ష్యంగా పెట్టుకొని చదివితే భవిష్యత్తు బంగారుమయం అవుతుందని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గోపాలరావు, నారాయణరావు మరియు గ్రామ పెద్దలు స్వామి నాయుడు, రామోజీ పాల్గొన్నారు.

# ఆనాటి ఆ జ్ఞాపకాలు మధురాతి మధురం

## బొరివంకలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కవిటి, మే 25 ప్రభాతవార్త: పదో తరగతిలో కలిసి చదువుకున్న విద్యార్థులంతా ఒక చోట చేరి సందడిగా గడిపారు. కవిటి మండలం బొరివంక జిల్లా పరిషత్ హైస్కూలులో చదువుకున్న 2003-04



పదవ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశారు. ఎక్కడెక్కడో వివిధ రంగాల్లో స్థిరపడిన వారంతా సుమారు 23 ఏళ్ల తర్వాత ఒక్క చోటికి చేరారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఆహ్వానించి వారిని ఘనంగా సత్కరించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు నాటి రోజులను, అప్పటి పరిస్థితులను గుర్తు చేసుకున్నారు. ఈ క్రమంలో కొందరు ఉపాధ్యాయులు, విద్యార్థులు గత స్మృతులను గుర్తు చేసుకుని భావోద్వేగానికి గురయ్యారు. తొలుత పహల్గం మృతులకు, దివంగత ఉపాధ్యాయులకు సంతాపం తెలిపారు. అనంతరం వారంతా ఆటపాటలతో ఆనందోత్సాహాలతో మధ్య గడిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం రామకృష్ణ, రిటైర్డ్ టీచర్స్ వాసుదేవరావు, శంకరరావు, ఇతర ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ఇచ్ఛాపురం, మే 25 ప్రభాతవార్త: స్థానిక ఎం.తోటూరు సత్యసాయి రెసిడెన్షియల్ హైస్కూల్ 1998-99 పదవ తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆత్మీయ కలయిక జరిగింది. 25 ఏళ్ల తర్వాత స్థానిక వీజే ఫంక్షన్‌హాల్‌లో వారంతా కలుసుకున్నారు. గత జ్ఞాపకాలు నెమరువేసుకున్నారు. ప్రస్తుతం వివిధ



వృత్తుల్లో ఉన్నవారు వారి వారి కుటుంబ సభ్యులతో నేపథ్యాన్ని పరిచయం చేసుకుని భవిష్యత్ ప్రణాళిక రూపొందించారు. తమతో పాటు చదువుకున్న విద్యార్థులు ఆర్మీలో సేవలందిస్తున్నందుకు గాను ఇటీవల జరిగిన ఆపరేషన్ సింధూర్‌లో భాగంగా విజయానికి సూచికగా సైనికోద్యోగులను సన్మానించారు. సత్యసాయి సంస్థల వ్యవస్థాపకులు దివంగత సాహుకారి కృష్ణమూర్తి మరణం పట్ల నివాళులు అర్పించారు. స్కూల్ కరస్పాండెంట్ లక్ష్మి, గురువులు కొనతాల దివాకర్‌రెడ్డి, ఉప్పిలి నాగేశ్వరరావు, పీత లోహిదాసు, యు.దేవరాజు, దుదిష్టి, తదితరులను సత్కరించారు. భవిష్యత్తులో తోటి స్నేహితులతో చేపట్టబోయే ప్రణాళికపై చర్చించుకున్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

బూర్జ, మే 25 ప్రభాతవార్త: అలనాటి మధుర జ్ఞాపకాలు ప్రతి ఒక్కరిని ఉక్కిరి బిక్కిరి చేశాయని పూర్వపు విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. మండల కేంద్రమైన బూర్జ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1992-93 స్నేహ మిత్ర బ్యాచ్ విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదువుకున్న విద్యార్థులందరూ ఆదివారం బూర్జ హైస్కూల్లో కలుసుకున్నారు. ఇతర రాష్ట్రాలు, ఇతర దేశాలలో స్థిరపడిన విద్యార్థులు కూడా ఇక్కడకు చేరుకున్నారు. నాటి విద్యార్థిని విద్యార్థులు అందరూ అప్పటి ఉపాధ్యాయులతో సహా కుటుంబ సమేతంగా హాజరై ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. ప్రధానోపాధ్యాయుడు లక్ష్మినారాయణ, గంగూ రామచంద్రరావు (రాంబాబు) గోడె ఫణీంద్ర, కలివరపు శ్రీనివాసరావు, తొత్తడి సురేష్, మజ్జి సత్యనారాయణ, తొత్తడి మధుబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు.



## స్మృతుల్లోకి అలనాటి రోజులు...

కవిటి, మే 25 ప్రభాతవార్త: మండలంలోని ముత్యాలపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2005-2006 విద్యా సంవత్సరంలో చదువుకున్న విద్యార్థులు ఆదివారం ఒకే వేదికపై ఆత్మీయంగా



సమావేశమయ్యారు. 20సంవత్సరాల తర్వాత పాఠశాలలో మళ్లీ కలుసుకున్న పూర్వ విద్యార్థులు ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఈ సందర్భంగా అలనాటి గురువులను ఆహ్వానించి ఘనంగా సన్మానించారు. ముఖ్య అతిథిగా హాజరైన గురువు సేనాపతి తిరుపతిరావు మాట్లాడుతూ 'మీ అందరిని మళ్లీ ఒక్కచోట చూడటం ఎంతో ఆనందంగా ఉంది. మీరు మీ పిల్లలు జీవితంలో ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆశిస్తున్నాను. ఈ స్థాయిలో గురువులను సత్కరించడం గర్వకారణం' అన్నారు. కార్యక్రమంలో అనేకమంది పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

# సెలవుల్లో సరదాగా..



రెండు జట్లు.. ఏడు రాళ్లు లేదా పెంకులు.. ఒక టెన్నిస్ బంతి. ఆ రాళ్లను ఒకదానిపై ఒకటి టవర్‌లా పేర్చి ఒక జట్టు దాన్ని పడగొట్టి మళ్లీ కడుతూ ఉంటే ప్రత్యర్థి జట్టు ఈ రాళ్లను చెదరగొడుతూ ఉండాలి. ఆడటానికి ఓపిక ఉండాలే గానీ వయసుతో సంబంధంలేదు. ఆడేవాళ్లంతా చురుకుగా అలర్ట్‌గా ఉంటూ ఆ రాళ్లను పేరుస్తూ ఉంటే వేరే వాళ్లు చెదరగొడుతూ ఉంటారు. దీన్నే లగోరీ అనీ, ఏడు రాళ్లాట అనీ పిలుస్తారు. సరదాగా ఆరుబయట ఆడే ఈ లగోరీకి దేశవిదేశాల్లో కూడా మంచి క్రేజ్ ఉందని తెలుసా! అంతేనా.దీనికి జాతీయ స్థాయిలో ఛాంపియన్స్ ఉన్నారు. అంతర్జాతీయ స్థాయిలో టోర్నమెంట్లు జరుగుతాయి. దీనికి ప్రపంచకప్ కూడా ఉంది. చాలా చోట్ల ఈ ఏడురాళ్లాటని విద్యాసంస్థల్లో కూడా భాగం చేశారట. ఇంత చరిత్ర ఉన్న ఈ లగోరీ ద్వాపరి యుగం నుంచే ఉందట. శ్రీకృష్ణుడు తన స్నేహితులతో ఎక్కువగా ఈ ఏడు పెంకులాటే ఆడేవాడట. దాన్ని రిఫరెన్స్‌గా తీసుకునే ఈ లగోరీని రూపొందించారట.



గోవాలో జాతీయక్రీడలకి ఒక ఆటని ఎంపిక చేయాల్సి వచ్చినప్పుడు అక్కడి క్రీడల మంత్రి ఈ లగోరీని ఎంపిక చేశాడట. ఆ తర్వాత దీన్ని గురించి ప్రధాన మంత్రి మోదీ కూడా మన్‌కీబాత్‌లో ప్రస్తావించి తన చిన్ననాటి రోజులను గుర్తుచేసుకున్నారు. ఇంతటి చరిత్ర గల ఈ ఏడు రాళ్లాట మన భారత సంతతికి చెందినది. తలుచుకుంటేనే ఎంతో గర్వంగా అనిపిస్తుంది కదూ.. ఇంకెందుకు ఆలస్యం.. ఈ లగోరీని పిల్లలకి నేర్పించండి. ఈ వేసవి సాయంత్రాల్లో మీరూ వాళ్లతో కలిసి ఆడేసేయండి. □

# సంప్రదాయ ఆహారం.. కోట్ల వ్యాపారం



వేసవి వచ్చిందంటే చింత చిగురు, మామిడి పండ్లు, తాటిముంజలు... నోరూరించే రుచులెన్నో! దేశం దాటినవారు ఈ రుచుల్ని మిస్ అవ్వాల్సిందే. ఇవేకాదు, ఇంకెన్నో సంప్రదాయ రుచులకూ దూరమవుతుంటారు. వాటిని వాళ్లకి అందించాలనుకున్నారు ప్రగతి. 20 దేశాల వారికి అందిస్తూ... రూ. వంద కోట్ల వ్యాపారంగానూ తీర్చిదిద్దారు.

కామర్స్ లో పీజీ చేస్తుండగానే పెళ్లైంది. తరవాత చదువు కొనసాగిద్దామన్నా కుదరలేదు. ఈ బాధ్యతలు, పిల్లల చదువులతో సమయం గడిచిపోయింది. అయితే ఇంట్లోవాళ్లకి రుచిగా వండిపెట్టాలి అనుకునేదాన్ని అదే నన్ను వ్యాపారవేత్తను చేసింది. మాది ఏలూరు దగ్గర వట "అనే గ్రామం. ప్రస్తుతం హైదరాబాద్‌లో కొండాపూర్‌లో నివసిస్తున్నాం. మావారు ముప్పా రమేష్‌కి పాత తరం పచ్చళ్లు, పొడులంటే ఇష్టం. ఆయన ప్రోత్సాహంతో నాలుగేళ్ల క్రితం 15 మందితో చౌటుప్పల్ మండలం దండుమల్కాపురంలోని హరిత పారిశ్రామిక పార్కులో మా చిన్న అమ్మాయి పేరుమీదుగా 'శ్వేత తెలుగు ఫుడ్స్' ప్రారంభించాం. పచ్చళ్ళు, చిరుతిళ్లు, పొడులు వంటివి తయారు చేస్తున్నాం సొంత భవనం, యంత్ర సామగ్రినీ సమకూర్చుకున్నాం. దీంతో రైతులకు లాభం చేకూరుస్తున్నామన్న సంతృప్తి. నేను ప్రొడక్షన్ పనులు చూసుకుంటుంటే మావారు పరిశ్రమ నిర్వహణ బాధ్యత తీసుకున్నారు. పెద్దమ్మాయి నిఖిత ఫ్రాన్స్‌లో ఎంబిఎ చేసింది. మార్కెటింగ్ వ్యవహారాలు తనే చూసుకుంటోంది. స్థానికంగానే కాదు, ఇతర రాష్ట్రాలు, విదేశాలకూ మా ఉత్పత్తులు వెళ్తున్నాయి. రోజుకు సుమ్మా 10 టన్నుల ఉత్పత్తులను మార్కెట్‌కి పంపుతాం. తమిళనాడు, కర్ణాటక సహా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో 240 మంది పంపిణీదారులు ఉన్నారు. విదేశాల్లోనూ మాకు డిస్ట్రిబ్యూటర్లు ఉన్నారు. దుబాయ్, ఢిల్లీ, హైదరాబాద్, యూరప్... ఇలా దేశవిదేశాల్లో స్టాళ్లనూ ఏర్పాటు చేస్తారు. ఆ ఏటా రూ.100కోట్లకుపైగా వ్యాపారం చేస్తున్నాం. సీజన్‌ను బట్టి ఉత్పత్తులనూ మారుస్తుంటాం.. ఉదాహరణకు వేసవి కాలంలో తాటి ముంజలు, చింత చిగురు, మామిడి కాయలు వస్తుంటాయి ఈ కాలంలో తప్ప మళ్లీ దొరకడం కష్టం. అందుకే వాటిని సేకరించి శుద్ధి చేసి, ఫ్రోజెన్



ఉత్పత్తులుగా మార్చి, విదేశాలకు ఎగుమతి చేస్తున్నాం. ఏ దేశంలో ఉన్నా... మన రుచులు తెలుగు వారందరికీ అందేలా చూడాలన్నదే నా ప్రయత్నం. 300 మంది మహిళలకు ఉపాధి కల్పిస్తున్నా. మహిళల్లో ప్రతిభా సామర్థ్యాలకు కొదవేం లేదు. అందుబాటులో ఉన్న సమయం, అవకాశాలను బట్టి ప్రయత్నించలేగానీ స్టార్టప్లు పెట్టొచ్చు, వ్యాపారవేత్తలుగానూ రాణించవచ్చు మీ లక్ష్యమేంటో ముందు తెలుసుకోండి. మీరు ఎదగడమే కాదు, ఎంతోమందికి స్ఫూర్తిగానూ నిలుస్తారు. □

# వంటింట్లో చల్లచల్లగా..



ఉదయం, రాత్రి వంటింట్లో పని చేస్తుంటాం. వేసవి ప్రతాపానికి పొయ్యి వేడి తోడై ఉక్కబోతతో తీవ్రంగా ఇబ్బంది పడుతుంటాం. చెమటతో ఉక్కిరిబిక్కిరి అవుతాం. పోనీ ఫ్యాన్ వేద్దామంటే పొయ్యి ఆరుతుంది. లేదా మంట సరిగ్గా తగలక వంట త్వరగా అవదు ఇలాకాకుండా.. చెమట పట్టకుండా ఆహ్లాదంగా ఫీల్ అవుతూ వంట చేయాలంటే వంటింట్లో ఇవి ఉండాల్సిందే.





**కూలింగ్ ఫ్యాన్...**

ఈ డ్యూయెట్‌ఐ కిచెన్ కూలింగ్ ఫ్యాన్ను టచ్‌స్క్రీన్‌తో ఆపరేట్ చేయొచ్చు. ఎక్కడికైనా తేలికగా తీసుకెళ్లొచ్చు. దృఢమైన బేస్తో చిన్న గదుల్నీ క్షణాల్లో చల్లగా మార్చగలదు. తక్కువ శబ్దంతో వంట చేసేటప్పుడు అంతరంగానూ అనిపించదు. ఇందులో నీటి పరిమాణాన్ని చూపించే సూచికతో సులభంగా పరిశీలించొచ్చు. కావాల్సినప్పుడు నీటిని నింపితే సరిపోతుంది. వంట వేగంగా పూర్తిచేయొచ్చు. అలసటా ఉండదు. ఇంకెందుకాలస్యం. వేసవిలోనూ వంటింట్లో పనులు పూర్తిచేయడానికి దేనిని ఉత్సాహపరుస్తున్నారు మరి!

**పోర్టబుల్ కూలర్స్ ...**

కరెంటుతో పనిచేసే వీటిని పొయ్యి గట్టుపై పక్కగా ఉంచితే చాలు. మన చుట్టూ వాతావరణం చల్లగా మారిపోతుంది. పరిమానంలోనూ చిన్నగా ఉండటంతో ఎక్కువ చోటు కూడా వీటికి అవసరం ఉండదు. ఓవైపు చల్లదనాన్ని ఆస్వాదిస్తూ మరోవైపు ఉత్సాహంగా వంటపని ముగించేయొచ్చు. కరెంటులో పనిచేసే వీటిని పొయ్యి గట్టుపై పక్కగా ఉంచితే చాలు. మన చుట్టూ వాతావరణం చల్లగా మారిపోతుంది. పరిమాణంలోనూ చిన్నగా ఉండటంతో ఎక్కువ చోటు కూడా వీటికి అవసరం ఉండదు. ఓవైపు చల్లదనాన్ని ఆస్వాదిస్తూ మరో వైపు ఉత్సాహంగా వంటపని ముగించేయొచ్చు.

# నీటిలో వ్యాయామం

**ఆక్వా ఏరోబిక్స్..**

వర్కవుట్స్ లో ఇప్పుడో ట్రెండ్. వ్యాయామంపై ఆసక్తి పెంచుకోవాలనుకునే వారూ, తక్కువ సమయంలో బరువు తగ్గాలనుకునే మహిళలూ.. నాణ్యమైన సమయాన్ని గడపగలుగుతారు. సరదాగా ప్రయత్నించే ఈ వర్కవుట్ సంతోషాన్నే కాదు.. తెలియకుండానే శరీరానికి తగిన శ్రమనూ అందిస్తుంది. వ్యాయామంపై ఆసక్తినీ పెంచుతుంది. ఫలితంగా హ్యాపీ హార్మోన్లు విడుదలై ఒత్తిడినీ తగ్గిస్తాయి.

★ నీళ్లల్లో వ్యాయామం చేయడం వల్ల గ్రావిటీ, ఫ్రిక్షన్ తక్కువగా ఉంటాయి. దీంతో కీళ్ల దగ్గర ఒత్తిడి పడదు. కండరాలు దృఢంగా మారతాయి. నీటిని ముందుకీ, వెనక్కీ నెట్టడం వల్ల భుజబలం పెరుగుతుంది.

★. ఈ ఆక్వా ఏరోబిక్స్ మంచి కార్డియో వ్యాయామం. తక్కువగా అలసిపోవడం వల్ల ఎక్కువ సమయం ఇందుకోసం కేటాయించు కోవచ్చు. దీంతో శరీరం మొత్తానికీ రక్తప్రసరణ సరిగా. జరుగుతుంది. ఊపిరితిత్తుల సామర్థ్య పెరుగుతుంది. అధికరక్తపోటు అదుపులో ఉంటుంది.

★ వాటర్ ఏరోబిక్స్ వల్ల కెలోరీలువేగంగా ఖర్చవుతాయి. అంతేకాదు, ఈ కసరత్తులు గాయాల ప్రమాదాన్ని తగ్గిస్తాయి. మంచి నిద్రపడుతుంది. □



ఈ కసరత్తుల్ని ఎంచుకుని చూడండి. ఇవి ఒత్తిడిని తగ్గిస్తాయి.

★ నడుము లోతు నీళ్లల్లో నిలబడి మంద్రంగా వినిపించే సంగీతాన్ని ఆస్వాదిస్తూ నెమ్మదిగా వ్యాయామం చేయడమే దీని స్టైల్. ఇందుకోసం ఫిట్‌నెస్ సంస్థలు ప్రత్యేక తరగతులనూ ఏర్పాటు చేస్తున్నాయి. వీటికి కుటుంబ సభ్యులంతా కలిసి వెళ్లగలిగితే.. అక్కడ

# ఇవన్నీ బిస్కెట్లే !









జంతికలూ, బూందీ అందరికీ నచ్చకపోవచ్చు. కొబ్బరి బూరెలూ, అరిసెలూ తినకూడని వాళ్లుండొచ్చు. కానీ బిస్కెట్లు అలా కాదు. ఎవరికైనా నచ్చేస్తాయి. ఏ పిండివంటలు ఉన్నా లేకున్నా మనందరి ఇళ్లల్లో బిస్కెట్ ప్యాకెట్లు తప్పనిసరిగా ఉంటాయి. భోజనం ఆలస్యమయ్యేట్లుంటే అవే మనకు తక్షణ ఆహారం. చాయ్‌లో ముంచుకుని తింటాం. ఉత్తినే కాలక్షేపానికీ ఆరగిస్తాం. ఒక్కోసారి ఇవే మన స్నాక్స్. వాటిల్లో అసంఖ్యాక రుచులూ ఆకృతు ఉన్నాయి. బిస్కెట్లు ఇష్టంగా తింటూనే వాటితో కుర్చీలూ బల్లలూ చేసి ఆనందిస్తున్నారు. చిచ్చరపిడుగులు. ఎంత కళాహృదయం కదూ! మీ చిన్నారులను ఒకసారి ప్రయత్నించి చూడమనండి!













## చెలి చిట్కా

భోజనం చేసిన తర్వాత ఒక పచ్చి క్యారెట్ తినడంవలన నోటి నుంచి దుర్వాసనరాదు. దంతక్షయం చిగుళ్లవాపు వంటిరోగాల నుంచి రక్షిస్తుంది.

# శంభో హర హర

త్రిమూర్తులలో శివునికి ఉన్న ప్రత్యేకత వేరు. చాలా వరకు శివ భక్తులే మనకు ఆగుపడుతుంటారు. శివాలయములు కూడా భారత దేశంలో మిక్కుటం. శివాలయం ఉన్న ప్రతి చోట జలం పుష్కలంగా ఉంటుంది. అందుకే శివునికి జలాభి శేఖరుడు అని మరో పేరు. కోరిన కోరికలు తీర్చేది శివుడే. ఆయన మానవుడా, దానవుడా అని చూడడు. తనను సంతృప్తి ఎవరూ పరుస్తారో వాళ్ళకు లొంగి పోయే భోళా శంకరుడు. మన పురాణాలలో శివునికి భక్తులు అధికం.రావణాసురుడు తన లంకలో శివునికి అందమైన పాలరాయితో కట్టిన కట్టడమే అందుకు ఉదాహరణ.తనను కొలిచేది ఎటువంటి వారైనా వారి హృదయాన్ని శివుడు చూస్తాడు. వారి మనసులలో చెడు భావాలు ఉంటే కరుణించడు. శివునికి చాలా ప్రత్యేకమైన మాసం కార్తీకం.మాసాలలో కార్తిక మాసానికి ఉన్న ప్రత్యేకత వేరు. ఈ మాసంలో చాలావరకు అందరూ శివ పూజలలో లీనమై ఉంటారు. ఏ మాసంలో లేకపోయినా ఈ మాసంలో చాలా నిష్టగా ఉంటారు. మాంసాహారం ముట్టరు. పూజలకు ప్రత్యేక ప్రాముఖ్యం ఇస్తారు. దాన ధర్మాలు చేస్తారు. ఒకరి ఇంటి లో పూజకు మరొకరు వెళతారు. ఆధ్యాత్మిక విషయాలు చర్చిస్తారు. కుటుంబాలు సంతోషంగా ఉసిరి చెట్టు కింద భోజనాలు ఆరగిస్తారు. ప్రతి శివాలయంలో అందరూ ముక్త కంఠంతో "శంభో హర హర శంకర "అనే నినాదలు చేస్తారు.గుడి గంటలు మొగిస్తారు. ఆ గణ గణ సవ్వడికి పరమ శివుడు మేలుకొంటాడు. భక్తులు కోరే కోరికలు వింటాడు. ప్రతి భక్తుని సంతృప్తి పరచడమే శివయ్య కు ఇష్టం. ఆ శివ దర్శనంతో చెంపలేసు కుంటూ, మొక్కులు మొక్కుతూ, శివ నామస్మరణతో శివాలయం వీడతాం. ఈ కార్తికం హిందువులకు ఎంతో ప్రీతికరం. వృద్ధులు,చేత కాని వారు ఈ కార్తి కంలో శివుణ్ణి కొలవాలని తలంపు ఉన్నాబాధపడరాదు. వారి శక్తి మేరకు కార్తిక పురాణం,చదువుతూ, మనసులో శివ శంకర, శంభో హర హర అనుకుంటే అనంతమైన ఫలితం ఉంటుంది.దూర్జటి రాసిన శ్రీ కాళహస్తీశ్వర శతకం లో శివదేవుని వైశిష్టం గురించి వర్ణింపబడింది. అందులో శివుణ్ణి గురించి, పూజా విధానం గురించి చెప్పబడింది. శివ కథ విన్నా, చూసినా ఎంతో పుణ్య ఫలం కలుగుతుంది. శివరాత్రి రోజు "శివా కరుణించవా, నువ్వే మాకు శరణం శంభో హర హర "అని మనం ఉచ్చరించే మాటలు శివునికి ప్రీతి. మనమందరం ఆ పరమ శివునికి ముకుళిత హస్తాలతో, భక్తి ప్రపత్తులతో పూజిద్దాం.

- కనుమ ఎల్లారెడ్డి,

ఆధ్యాత్మికం

# స్కిన్ కేర్‌పై ఆసక్తి



అడపాదడపా పలకరించే యాక్నే, స్నేహితుల ప్రభావం ఏదైతేనేం. టీనేజర్లలో తెలియకుండానే స్కిన్ కేర్‌పై ఆసక్తి మొదలవుతుంది. వీళ్లకి పిల్లలవీద వాడలేము, అలాగని పెద్దవాళ్లవీ సరిపడవు. కాస్త పెద్దయ్యాక స్కిన్ రేర్ రొటీన్ అనుకుంటిం. కానీ, ఇప్పటినుంచి ప్రారంభించొచ్చు అంటారు నిపుణులు. హార్మోనుల్లో మార్పులతో చర్మ తీరులో మారు లొస్తాయి. అతిగా విడుదలయ్యే నూనెలు యాక్నేకి దారి తీస్తాయి. మనకు చిన్నవే కానీ వారి ఆత్మ విశ్వా సాన్ని దెబ్బ తీస్తాయి. పైగా ఇప్పటి నుంచి తీసుకునే జాగ్రత్త దీర్ఘ కాలంలో సాయపడుతుంది కూడా! మామూలుగానే వీరికి సీబమ్ ఎక్కువగా విడుదలవుతుంది. అంతమాత్రాన జిడ్డు చర్మం అనుకోవాల్సిన పనిచేలేదు. అందుకోసం జిడ్డు, పొడి కాంబినేషనల్ వాళ్లది ఏ చర్మతీరో ఒక రోజంతా గమనించండి. దాని ఆధారంగా ఫేస్‌వాష్‌నో సబ్బునో ఎంపిక చేస్తే సరి. ఉదయం, రాత్రి నిద్రపోయే ముందు తప్పక ముఖం శుభ్రం చేసుకునేలా చూడాలి. జిడ్డు చర్మతత్వం అయినా సరే, మాయిశ్చరైజర్ తప్పక వాడాలి. లైట్ వెయిట్ రకాలను ఎంచుకుంటే చర్మానికి తేమా అందుతుంది. యుకె కూడా దరిచేరదు. వాటితోపాటు ఎండలో తిరిగే అవకాశముంటే సన్‌స్క్రీన్‌నీ జోడిస్తే సరి పోతుంది. వీళ్ల చర్మం చాలా సున్నితంగా ఉంటుంది. కాబట్టి, అలర్జీలు, దురదలకు అస్కారమెక్కువ. కాబట్టి, ఉత్పత్తుల్లో ఆల్కహాల్, సల్ఫేట్లు, గాఢ రసాయనాలు, కృత్రిమ సువాసనలు లేకుండా చూసుకోవాలి. బిపిఎ, థాలేట్లు, పారాబెన్లు ఉన్నవాటికీ దూరంగా ఉంచాలి. □

# బీట్‌రూట్ ఖర్జూరం హల్వా

కావాలసినవి : బీట్‌రూట్ రసం-కప్పు, ఖర్జూరం-10 (వేడి నీళ్లల్లో కడిగి..కాసేపు నానబెట్టి, గుజ్జులా చేసుకోవాలి) పంచదార- పావు కప్పుపైనే, నెయ్యి-పావు కప్పు, ఏలకులు 2 . జీడి పప్పు-15 పైనే ఫుడ్‌కలర్- కొద్దిగా,



ముందుగా స్టవ్ ఆన్ చేసుకుని.. మంట చిన్నగా పెట్టుకోవాలి. కళాయి వేడికా గానే.. 1 టేబుల్ స్పూన్ నెయ్యి వేసుకుని.. అందులో జీడిపప్పు దోరగా వేయించుకుని పక్కన పెట్టుకోవాలి. అనంతరం కళాయిలో ఇంకాస్త నెయ్యి వేసి.. ఖర్జూరం గుజ్జు వేసుకుని తిప్పుతూ ఉండాలి. మధ్యమధ్యలో నెయ్యి వేసుకుంటూ బాగా కలపాలి. తర్వాత సరిపడా పంచదార, బీట్‌రూట్ రసం, ఫుడ్ కలర్ వేసుకుని చిన్నగా గరిటెతో తిప్పుతూ ఉడికించుకోవాలి. మళ్లీ కొద్దిగా నెయ్యి వేసుకుని తిప్పాలి . ఏలకులు, జీడిపప్పు వేసుకుని కలపాలి. మిగిలిన నెయ్యి మొత్తం వేసుకుని. తప్పుతూ దగ్గర పడగానే స్టవ్ ఆఫ్ చేసుకోవాలి. ఇప్పుడు ఒక బౌల్ లోపలంతా నెయ్యిరాసి. .ఆ మొత్తం మిశ్రమాన్ని.. దానిలోకి తీసుకోవాలి. కాస్త చల్లారాక నచ్చిన షేప్‌లో కట్ చేసుకుంటే సరిపోతుంది. □

# 'షష్టి పూర్తి' ట్రైలర్ లాంచ్



**నటకిరీటి** డా. రాజేంద్ర ప్రసాద్, అర్చన కాంబినేషన్ లో రూపేశ్, ఆకాంక్ష సింగ్ హీరో హీరోయిన్లుగా పవన్ ప్రభ దర్శకత్వంలో మా ఆయి ప్రొడక్షన్స్ పతాకంపై రూపేష్ నిర్మించిన చిత్రం 'షష్టిపూర్తి'. ఈ సినిమా మే 30న విడుదల కానుంది. ఈ క్రమంలో ప్రమోషన్స్‌లో భాగంగా రిలీజ్ చేసిన పాటలు, టీజర్ ఇలా అన్నీ కూడా ఆడియెన్స్‌లో బజ్‌ను క్రియేట్ చేశాయి. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విజయవాడ ఈస్ట్ శాసన సభ్యులు గద్దె రామ్మోహన్, పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ముఖ్య అతిథులుగా విచ్చేశారు. 'మనం ఎవరో తెలియకుండానే ప్రేమించేది తల్లి.. తనకు తెలియని ప్రపంచాన్ని కూడా భుజాలపై ఎక్కించుకుని మరీ మనకు చూపించేది తండ్రి'.. అంటూ ట్రైలర్ ప్రారంభంలో హీరో చెప్పే డైలాగ్ అందరినీ ఆకట్టుకుంటుంది. ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ.. ..'షష్టి పూర్తి' టైటిల్‌తో కథ నా వద్దకు వచ్చినప్పుడు ఆశ్చర్యపోయాను. వయసుకు తగ్గ పాత్రలు నాకు ఒక్కడికే వస్తున్నాయా? అని ఆశ్చర్యం వేసింది. నేను నిజ జీవితంలో షష్టి పూర్తిని తప్పించుకోవాలని ప్రయత్నించాను. కానీ ఇలా సినిమా రూపంలో 'షష్టి పూర్తి' జరిగింది. పెళ్లి సమయంలో నా పాటే.. చావు సమయంలో నా పాటే.. ఇక షష్టి పూర్తి టైంలో పాట లేదండి అని కొందరు అనేవాళ్లు. ఇప్పుడు ఆ 'షష్టి పూర్తి' పాట కూడా వచ్చింది. తెలుగు సంస్కృతి, సంప్రదాయాల్ని చాటి చెప్పేలా మా చిత్రంఉంటుంది. తల్లిదండ్రుల పెళ్లిని బిడ్డలు చూడలేరు.. అలా బిడ్డలు చూడగలిగే తల్లిదండ్రుల పెళ్లే మా ఈ 'షష్టి పూర్తి'. అర్చనతో ఇన్నేళ్ల తరువాత కలిసి నటించడం ఆనందంగా ఉంది. మా హీరో, నిర్మాత రూపేశ్ ఈ చిత్రం కోసం ఎంతో కష్టపడ్డారు. మే 30న మా చిత్రం రాబోతోంది. అందరూ చూసి ఆదరించండి' అని అన్నారు. శాసనసభ సభ్యులు గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ.. .. 'షష్టి పూర్తి' లాంటి చక్కటి కార్యక్రమంలో పాలు పంచుకోవడం ఆనందంగా ఉంది. మా అన్నయ్య రాజేంద్ర ప్రసాద్ గారు నాకు ఎప్పుడూ అండగా నిల్చున్నారు. కుటుంబ విలువల్ని కాపాడాలని 'ఆ నలుగురు' సినిమాతో సందేశాన్ని ఇచ్చారు. పిల్లలే తల్లిదండ్రులకు మళ్లీ పెళ్లి అంటూ 'షష్టి పూర్తి' చేస్తే కలిగే ఆనందం గురించి మాటల్లో చెప్పలేం. మళ్లీ కుటుంబ విలువల్ని చాటి చెప్పేందుకు ఈ చిత్రం వస్తుంది. ఇలాంటి చిత్రాలు సమాజం కోసం సక్సెస్ అవ్వాలి' అన్నారు. శాసనసభ సభ్యులు బోడె ప్రసాద్ మాట్లాడుతూ.. .. 'సినిమా ఫంక్షన్లో పాల్గొనడం ఇదే మొదటి సారి. రూపేశ్ గారికి ఈ చిత్రంతో మంచి విజయం దక్కాలి. చైతన్య ప్రసాద్ పాటలు నాకు చాలా ఇష్టం. ఆ నలుగురు సినిమా అన్నా, ఆయన రాసిన పాటలన్నా నాకు చాలా ఇష్టం. 'షష్టి పూర్తి' చిత్రం పెద్ద విజయం సాధించాలి. అందరికీ ఆల్ ది బెస్ట్' అన్నారు. హీరో, నిర్మాత రూపేశ్ మాట్లాడుతూ.. ..'ఇంత మంచి కథ నా వద్దకు రావడం నా అదృష్టం. ఈ క్రెడిట్ అంతా కూడా దర్శకుడు పవన్‌దే అవు తుంది. రాజేంద్ర ప్రసాద్ గారితోనే ఇకపై అన్ని చిత్రాలు చేయాలనిపిస్తుంది. అర్చనమ్మతో షూటింగ్ చేస్తుంటే.. ఇంట్లో అమ్మతో ఉన్నట్టు అనిపించేది. మా లాంటి కొత్త వారితో పని చేసేందుకువచ్చిన ఆకాంక్ష గారికి థాంక్స్. చైతన్య ప్రసాద్ గారు ఈకథను మాకంటే ఎక్కువగా నమ్మారు. మే 30న మా చిత్రం విడుదల అవుతోంది. రెండ్రోజుల్లోనే నా డబ్బులన్నీ తిరిగి వస్తాయి'అని అన్నారు. దర్శకుడు పవన్‌ప్రభ మాట్లాడుతూ.. 'షష్టి పూర్తి' సినిమా ఇంత బాగా రావడానికి సహకరించి పని చేసిన ప్రతీ ఒక్కరికి థాంక్స్. అందరికీ మా సినిమానచ్చుతుందని భావిస్తున్నాను. రాజేంద్ర ప్రసాద్‌గారు, అర్చన గారి లాంటి గొప్పవారితో పనిచేసే అవకాశం ఇచ్చిన రూపేశ్ గారికి థాంక్స్. మే 30న మా చిత్రం రాబోతోంది. అందరూ చూసి సక్సెస్ చేయండి' అని అన్నారు. నటి అర్చన మాట్లాడుతూ.. ..మా 'షష్టి పూర్తి' సినిమా కోసం వచ్చిన ప్రతీ ఒక్కరికి ధన్యవాదాలు. రాజేంద్ర ప్రసాద్ గారు ఓ సినిమాలో ఉంటే.. అందులో అన్నీ ఉన్నట్టే. ఏ పాత్రలోకైనా, ఏ సినిమాలోకి అయినా ఆయన పరకాయ ప్రవేశం చేస్తారు. 1మళ్లీ ఇళయరాజా గారి సంగీత సారథ్యంలో పని చేయడం సంతోషంగా ఉంది. మా అందరినీ పవన్ ప్రభ ఒక చోటకు తీసుకు వచ్చారు. హీరోగా, నిర్మాతగా రూపేశ్ ఈ చిత్రానికి వంద శాతం న్యాయం చేశారు. మే 30న మా చిత్రం రాబోతోంది. అందరూ చూసి సక్సెస్ చేయండి' అన్నారు.

# 'అనగనగా' సక్సెస్ సెలబ్రేషన్స్



**సుమంత్ కుమార్** హీరోగా సన్నీ సంజయ్ దర్శకత్వంలో రూపొందిన ఫీల్ గుడ్ ఎంటర్ టైనర్ 'అనగనగా'. కాజల్ చౌదరి కథానాయిక. రాకేశ్ రెడ్డి గడ్డం, రుద్రా మదిరెడ్డి నిర్మించారు. ఇటీవలే ప్రముఖ ఓటీటీలో రిలీజ్ అయిన ఈ సినిమా అందరినీ ఆకట్టుకొని ఘన విజయాన్ని సాధించింది. ఈ సందర్భంగా మేకర్స్ సక్సెస్ సెలబ్రేషన్‌ని నిర్వహించారు. సక్సెస్ సెలబ్రేషన్‌లో హీరో సుమంత్ కుమార్ మాట్లాడుతూ.. 'సినిమాకి ఇంత సపోర్ట్ ఇచ్చిన మీడియా మిత్రులకు థాంక్యూ. ఈ 'అనగనగా'. దర్శకుడు సన్నీ, రచయిత దీప్తి ఎంతో చక్కగా తీర్చిదిద్దారు. ఈ సినిమాని శేష్‌కి చూపించాను. అప్పుడు తను చాలా ఎమోషనల్‌గా సినిమాలో విషయం ఉందని చెప్పాడు. ఆ విషయాన్ని ప్రేక్షకులు అందరూ కూడా బలపరిచినందుకు ధన్యవాదాలు. మేము అనుకున్న దానికంటే అద్భుతమైన రెస్పాన్స్ ఇచ్చారు. బేసిగ్గా సినిమాలు థియేటర్స్‌లోకి వచ్చిన తర్వాత ఓటీటీలోకి వస్తాయి. అయితే ఈ సినిమాకి వస్తున్న రెస్పాన్స్ చూసి ఇప్పుడు సినిమాని కొన్ని థియేటర్స్‌లో రిలీజ్ చేస్తున్నాం. ఆడియన్స్ అందరు కూడా బిగ్ స్క్రీన్ మీద చూడాలని కోరుకుంటున్నాను' అన్నారు. హీరో అడివి శేషు మాట్లాడుతూ.. 'నా ఫస్ట్ సినిమాకి సుమంత్ గెస్ట్‌గా వచ్చారు. ఆయన అప్పటినుంచి నాకు ఫ్యామిలీనే. ఈ చిత్రంలో వ్యాస్ పాత్రను సుమంత్ అంత బాగా చేయడానికి కారణం ఆయన నిజ జీవితంలోనూ చాలావరకూ అలా ఉండటమే. సన్నీ ఈ కథను అద్భుతంగా తెరకెక్కించారు. నాకు ఈ సినిమా చూస్తున్నంత సేపూ దీన్ని థియేటర్లో కదా చూడాల్సింది అనిపించింది. ఈ చిత్రంలో రామ్ పాత్ర నాతో కూడా కంటతడి పెట్టిం చింది. విద్యా వ్యవస్థ మారాలని కోరుకునేలా చేయించింది. ఈ సినిమాని మీ ఇంటిల్లిపాది చూడండి. కుదిరితే బిగ్ స్క్రీన్ లో చూడండి. ఈ సినిమాలో పనిచేసిన అందరికీ పేరుపేరునా కంగ్రాచ్యులేషన్స్'అన్నారు. ప్రొడ్యూసర్ వంశీ నందిపాటి మాట్లాడుతూ.. 'అనగనగా ఒక సినిమా కాదు ఇది ఒక జీవితం. అన్ని ఎమోషన్స్ ఇందులో ఉన్నాయి. ఒక ఎడ్యుకేషన్ సిస్టం సంబంధించిన సినిమా ఇది. చాలా ఆలోచన రేకెత్తించేలా ఉంది. సన్నీ ప్రతి క్యారెక్టర్‌ని అద్భుతంగా మలిచాడు. సుమంత్ గారు వ్యాస్ పాత్రలో ఒదిగిపోయారు. తప్పకుండా చూడాల్సిన సినిమా ఇది'అన్నారు నిర్మాత రాహుల్ యాదవ్ నక్క మాట్లాడుతూ... ఇంత మంచి మూవీ ఇచ్చినందుకు టీమ్ అందరికీ థాంక్యూ. సుమంత్ నా ఫస్ట్ హీరో. అప్పుడు కూడా ద బిగ్గెస్ట్ కాన్ఫిడెన్స్ అడివివిశేష గారు ఇచ్చారు. అందరికీ కంగ్రాట్యులేషన్స్ అన్నారు. దర్శకుడు సన్నీ సంజయ్ మాట్లాడుతూ.. ఈ కథ మా అందరికీ అమ్మలా రోజూ జోల పాడింది. నాన్నలా ధైర్యాన్నిచ్చింది.నన్ను ఎంతగానో సపోర్ట్ చేసిన సుమంత్ గారికి థాంక్ యూ. వ్యాస్ పాత్రలో ఆయన్ని తప్పా మరొకని వూహించలేను. సినిమాని ఇంత సూపర్ హిట్ చేసిన ఆడియన్స్‌కి థాంక్ యూ అన్నారు. ప్రొడ్యూసర్ రాకేష్ రెడ్డి గడ్డం మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. ఈ వేడుకకు వచ్చిన శేష్ గారికి థాంక్యూ. ఈ ఇంత పెద్ద సక్సెస్ సుమంత్ గారి వల్లే సాధ్యమైంది. ఈ స్క్రిప్ట్ ని నమ్మినందుకు ఆయనకి థాంక్యూ. ఈ సినిమాకి పనిచేసిన అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు అన్నారు.

# '3 బిహెచ్‌కె' నుంచి సాంగ్ రిలీజ్

**సిద్ధార్థ్ హీరోగా** శ్రీ గణేష్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఫ్యామిలీ ఎంటర్ టైనర్ '3బిహెచ్‌కె'. బ్లాక్ బస్టర్ హిట్ 'మావీరన్' నిర్మాత అరుణ్ విశ్వ శాంతి టాకీస్‌పై తెలుగు తమిళ్‌లో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. శరత్‌కుమార్, దేవయాని, యోగి బాబు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన టైటిల్ టీజర్‌కి చాలా మంచి రెస్పాన్స్ వచ్చింది. తాజాగా మేకర్స్ 'కలలన్నీ' సాంగ్‌ని రిలీజ్ చేసి మ్యూజిక్ ప్రమోషన్స్ స్టార్ట్ చేశారు. అమృత్ రామ్‌నాథ్ ఈ పాటని బ్యూటీఫుల్ ఫ్యామిలీ మెలోడీగా కంపోజ్ చేశారు. రాకేందు మౌళి రాసిన రిలీజ్ అందరికీ కనెక్ట్ అయ్యేలా వుంది. హేమచంద్ర వేదాల, గోపికా పూర్ణిమ, సాహితీ చాగంటి, పివిఎన్ఎస్ రోహిత్ ప్లజెంట్ వోకల్స్‌తో ఆకట్టుకున్నారు. సిద్ధార్థ్, శరత్‌కుమార్, దేవయాని క్యారెక్టర్స్, ఫ్యామిలీ ఎమోషన్స్ సాంగ్ లో ప్రత్యేకంగా నిలిచాయి. ఫ్యామిలీ ఆడియన్స్ ను ఆకట్టుకునే అన్ని కమర్షియల్ ఎలిమెంట్స్‌తో ఈసినిమా రూపొందుతోంది. ఈ చిత్రానికి అమృత్ రామ్‌నాథ్ మ్యూజిక్ అందిస్తున్నారు. దినేష్ కృష్ణన్ బి జితిన్ స్టానిస్లాస్ డీవోపీగా పని చేస్తున్నారు. గణేష్ శివ ఎడిటర్. రాకేందు మౌళి డైలాగ్ రైటర్.

ఈ ఫ్యామిలీ ఎంటర్ టైనర్ జూలై 4న వరల్డ్ వైడ్ గ్రాండ్‌గా రిలీజ్ కానుంది.

నటీనటులు: సిద్ధార్థ్, శరత్‌కుమార్, దేవయాని, యోగి బాబు, మీతా రఘునాథ్ , చైత్ర, రచన, దర్శకత్వం: శ్రీ గణేష్,నిర్మాత : అరుణ్ విశ్వ, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ఆర్. సిబి మారప్పన్, ఫోటోగ్రఫీ డైరెక్టర్: దినేష్ కృష్ణన్ బి జితిన్ స్టానిస్లాస్, సంగీతం: అమృత్ రామ్‌నాథ్, ఎడిటర్: గణేష్ శివ, డైలాగ్స్: రాకేందు మౌళి, ఆర్ట్ డైరెక్టర్: వినోద్ రాజ్‌కుమార్ ఎన్, కాస్ట్యూమ్ డిజైనర్: అశోక్ కుమార్ ఎస్ కిరుతిక ఎస్, పీఆర్వో: వంశీ శేఖర్



# 'ఆంధ్రా కింగ్ తాలూకా' షూటింగ్‌లో ఉపేంద్ర



**ఎనర్జిటిక్ స్టార్** రామ్ పోతినేని యూనిక్ ఎంటర్‌టైనర్ 'ఆంధ్రా కింగ్ తాలూకా'. మహేష్ బాబు పి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రాన్ని మైత్రి మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. రామ్ పుట్టినరోజు సందర్భంగా విడుదలైన టైటిల్ గ్లింప్స్‌కి అద్భుతమైన స్పందన లభించింది. ఈ గ్లింప్స్‌లో సినిమా పట్ల అపారమైన అభిమానం ఉన్న యువకుడిగా రామ్ పోతినేని పాత్ర ప్రేక్షకుల మనసుల్ని తాకింది. గ్లింప్స్‌లో కన్నడ సూపర్‌స్టార్ ఉపేంద్ర భారీ కటౌట్ రూపంలో కనిపించి మరింత ఇంపాక్ట్ క్రియేట్ చేశారు. ఈ చిత్రంలో ఉపేంద్ర పాత్రకు చాలా ప్రాధాన్యం ఉంది. ఇటీవల విడుదలైన ఆయన క్యారెక్టర్ పోస్టర్ ఇప్పటికే హ్యూజ్ బజ్ క్రియేట్ చేసింది. పాత్రల ఎంపికలో ఎప్పుడూ ప్రత్యేకతకు ప్రాధాన్యం ఇచ్చే ఉపేంద్ర, ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతున్న షెడ్యూల్‌లో జాయిన్ అయ్యారు. ఆయన ఈ చిత్రంలో సూపర్ స్టార్ సూర్యకుమార్ అనే పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రంలో రామ్ సరసన భాగ్యశ్రీ బోర్సే కథా నాయి కగా నటిస్తోంది. ఇంత అద్భుతమైన తారాగణం, ఆసక్తికరమైన కథాంశంతో ఈ సినిమా భారీ అంచనాలని పెంచుతోంది.

# 'స్పిరిట్' లో హీరోయిన్ గా త్రిప్తి డిమ్రీ



**పాన్ ఇండియా** బ్లాక్‌బస్టర్‌లతో దూసుకుపోతున్న రెబెల్ స్టార్ ప్రభాస్, సెన్సేషనల్ డైరెక్టర్ దర్శకుడు సందీప్ రెడ్డి వంగా కలసి చేస్తున్న యాక్షన్ థ్రిల్లర్ 'స్పిరిట్'. యానిమల్ ఫేం త్రిప్తి డిమ్రీ ఈ చిత్రంలో ప్రభాస్ సరసన హీరోయిన్‌గా ఎంపికైనట్లు మేకర్స్ అఫీషియల్‌గా అనౌన్స్ చేశారు. యానిమల్ చిత్రంలో తన అద్భుతమైన నటనతో ప్రేక్షకులను ఆకట్టుకున్న త్రిప్తి, దర్శకుడు సందీప్ రెడ్డి వంగాతో మళ్లీ పనిచేయడం పట్ల, అలాగే ప్రభాస్‌తో స్క్రీన్ షేర్ చేయడం పట్ల ఎంతో ఆనందాన్ని వ్యక్తం చేశారు. దర్శకుడు సందీప్ రెడ్డి వంగా 'స్పిరిట్'ను తొమ్మిది భాషల్లో విడుదల చేస్తామని అనౌన్స్ చేశారు. ఇది పాన్ వరల్డ్ విజన్‌ని తెలియ జేస్తోంది. భద్రకాళి పిక్చర్స్ ప్రొడక్షన్స్, టీసిరీస్ ఫిల్మ్స్ బ్యానర్లపై ప్రణయ్ రెడ్డి వంగా, భూషణ్ కుమార్, కృష్ణన్ కుమార్, మురాద్ ఖేతానీ నిర్మిస్తున్న ఈ చిత్రం, భారత సినిమా చరిత్రలోనే ఒక గొప్ప ప్రాజెక్టుగా నిలవనుంది. రెబెల్ స్టార్ ప్రభాస్, సెన్సేషనల్ డైరెక్టర్ సందీప్ రెడ్డి క్రేజీ కాంబినేషన్‌లో రాబోతున్న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా సెన్సేషన్ క్రియేట్ చేయబోతోంది.

# 'సర్దార్- 2' నుంచి హీరో కార్తి పోస్టర్ రిలీజ్



**హీరో కార్తి** 'సర్దార్' సినిమా తమిళం, తెలుగు భాషల్లో బ్లాక్ బస్టర్ హిట్ అయ్యింది. ప్రస్తుతం 'సర్దార్ 2' షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ప్రీక్వెల్‌కి దర్శకత్వం వహించిన పిఎస్ మిత్రన్ 'సర్దార్ 2'కి దర్శకత్వం వహిస్తున్నారు. ప్రిన్స్ పిక్చర్స్ గ్రాండ్‌గా నిర్మిస్తోంది. ఈ చిత్రంలో మాళవిక మోహన్, ఆషికా రంగనాథ్, రజిషా విజయన్ ఫిమేల్ లీడ్స్‌గా నటిస్తుండగా ఎస్ జె సూర్య ఓ పవర్ ఫుల్ పాత్రలో కనిపిస్తున్నారు. ఈ రోజు హీరో కార్తి బర్త్‌డే సందర్భంగా మేకర్స్ స్పెషల్ పోస్టర్ రిలీజ్ చేశారు. కార్తి మ్యాసీవ్ మిషన్ గన్ పట్టుకొని రగ్గడ్‌లుక్‌లో కనిపించిన పోస్టర్ అదిరిపోయింది. సినిమాలో కార్తి క్యారెక్టర్ ఎంత పవర్ ఫుల్‌గా ఉండబోతోందో ఈ పోస్టర్ తెలియజేస్తోంది. ప్రస్తుతం ఈ పోస్టర్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. సర్దార్ 2 భారీ బడ్జెట్‌తో హ్యూజ్ స్కేల్‌లోతెరకెక్కుతోంది. ఈ సినిమాకి టాప్ టెక్నిషియన్స్ పని చేస్తున్నారు. 'సర్దార్ 2' చిత్రానికి యువన్ శంకర్ రాజా సంగీతం అందించనున్నారు.




# 'విటి15' హైదరాబాద్ షెడ్యూల్ పూర్తి

**మెగా ప్రిన్స్** వరుణ్ తేజ్, మేర్లపాక గాంధీ దర్శకత్వంలో ఇండోకొరియన్ హారర్‌కామెడీ 'విటి15'తో సర్ ప్రైజ్ చేయబోతున్నారు. ఈ సినిమా పై ఇప్పటికే భారీ అంచనాలున్నాయి. వరుణ్ తేజ్ పుట్టినరోజున విడుదలైన విజువల్లీ స్టన్నింగ్ పోస్టర్ అభిమానులను ఆకట్టుకుంది. యూవీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్ సంయుక్తంగా భారీగా నిర్మిస్తున్న ఈ సినిమాకు ఎస్.థమన్ సంగీతం అందిస్తున్నారు.

హైదరాబాద్‌లో పూజా కార్యక్రమంతో గ్రాండ్‌గా ప్రారంభమైన ఈ చిత్రం షూటింగ్, హైదరాబాద్ అనంతపూర్‌లో జరిగిన రెండు షెడ్యూల్స్ విజయవంతంగా పూర్తి చేసుకుంది. అనంతపూర్‌లోని ప్రముఖ కియా గ్రౌండ్స్, అందమైన గ్రామీణ ప్రాంతాల్లో చిత్రీకరణ జరిగింది. సినిమా ఫస్ట్ హాఫ్‌లోని థ్రిల్లింగ్ సన్నివేశాలు, పంచ్ హ్యూమర్‌తో కూడిన సీన్స్‌ని ఈ షెడ్యూల్స్‌లో చిత్రీకరించారు. రీతికా నాయక్, సత్య, మిర్చి కిరణ్ తదితర నటీనటులు ప్రతీ సన్నివేశంలో కామెడీ మెరుపులు నింపారు. వరుణ్ తేజ్, రీతికా నాయక్‌పై పల్లెటూరి బ్యాక్‌డ్రాప్‌లో చిత్రీకరించిన ఒక అద్భుతమైన అనంతపూర్ షెడ్యూల్ హైలైట్ నిలుస్తుంది. ఇప్పుడు ఎక్సయిట్మెంట్ మరింత పెరుగుతోంది, 'విటి15' నెక్స్ట్ ఇంటర్నేషన్ షెడ్యూల్ కోసం సిద్ధమవుతోంది. ఆ షెడ్యూల్ కొరియాలో జరుగుతుంది. ఈ పార్ట్ ద్వారా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఇండో కొరియన్ హారర్ కామెడీ ప్రేక్షకుల ముందుకు రానుంది. గ్రాండ్ స్కేల్, స్టైల్, హారర్ బ్లెండ్ తో 'విటి15' జానర్ డిఫైనింగ్ సినిమాగా వుండబోతోంది.



# 'యుఫోరియా' నుంచి 'ఫ్లై హై' సాంగ్ లాంచ్

**గుణ హ్యాండ్ మేడ్ ఫిల్మ్స్** బ్యానర్ మీద నీలిమ గుణ నిర్మాణంలో గుణశేఖర్ తెరకెక్కిస్తున్న చిత్రం 'యుఫోరియా'. నూతన నటీనటులతో గుణశేఖర్ ఓ ట్రెండీ టాపిక్ మీద ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రంలో భూమిక చావ్లా, సారా అర్జున్, నాసర్, రోహిత్, విఘ్నేష్ గవిరెడ్డి, లిఖిత యలమంచలి, అడ్డాల పృథ్వీరాజ్, కల్పలత, సాయి శ్రీనికా రెడ్డి, అశ్రిత వేము గంటి, మాథ్యూ వర్గీస్, ఆదర్శ్ బాలకృష్ణ, రవి ప్రకాష్, నవీనా రెడ్డి, లికిత్ నాయుడు వంటి వారు ముఖ్య పాత్రల్ని పోషించారు. ఈ చిత్రం నుంచి 'ఫ్లై హై' అంటూ ఫస్ట్ సింగిల్‌ను రిలీజ్ చేశారు. 'ఫ్లై హై' అంటూ సాగే ఈ పాటను కిట్టు విస్సాప్రగడ రచించారు. కాలభైరవ అందించిన బాణీ ట్రెండీగా ఉంది. ఇక ఈ పాటను కాల భైరవ, పృథ్వీ చంద్ర, గాయత్రి నటరాజన్ ఆలపించారు. ఈ పాట పిక్చరైజేషన్ చూస్తుంటే నేటి యూత్, మత్తులో మునగడం, నైట్‌అవుట్స్, ఫ్రెండ్స్‌తో చిల్‌అవ్వడం వంటి అంశాలను చూపిం చారు. ఈ కార్యక్రమంలో దర్శకుడు గుణశేఖర్ మాట్లాడుతూ.. ఆడియెన్స్ చూపించే ఎనర్జీయే 'యుఫోరియా'. ఇదేఎనర్జీ సినిమాలోనూ ఉంటుంది. ఈ 'ఫ్లై హై' లానే ఇంకో మూడు పాటలు ఉంటాయి. కాలభైరవ అద్భుతమైన పాటలు ఇచ్చారు. మా హీరో విఘ్నేశ్, మా విలన్ పృథ్వీని అందరూ ఆశీర్వదించాలి. మా చిత్రం అందరికీ నచ్చుతుందని, ఆడియెన్స్‌ను మెప్పిస్తుందని చెబుతున్నా అని అన్నారు. నిర్మాత నీలిమ గుణ మాట్లాడుతూ .. అందరికీ మా ఫస్ట్ సింగిల్ 'ఫ్లై హై' నచ్చిందని భావిస్తున్నాను. ఇంత మంచి పాటను ఇచ్చిన కాల భైరవ గారికి థాంక్స్ అన్నారు. కాల భైరవ మాట్లాడుతూ . 'ఫ్లై హై' పాట అందరికీ నచ్చుతుందని నేను కాన్ఫిడెంట్‌గా చెబుతున్నాను. ఇది అన్ని సినిమాల్లా నార్మల్‌గా ఉండదు. చాలా డిఫరెంట్‌గా ఉంటుంది. అందుకే నేను కూడా చాలా డిఫరెంట్ మ్యూజిక్ ఇచ్చేందుకు ట్రై చేశాను. సినిమా కూడా అందరికీ నచ్చుతుంది' అని అన్నారు. విఘ్నేష్ గవిరెడ్డి మాట్లాడుతూ .. 'ఫ్లై హై' సాంగ్ అందరికీ నచ్చుతుందని భావిస్తున్నాం. ముందు ముందు ఇంకా మరిన్ని అప్డేట్లతో వస్తాం.అని అన్నారు.



26-5pg10.qxd:26-5pg10.qxd 1/1/02 7:51 AM Page 1



# జెనీవా ఓపెన్‌లో ఛాంపియన్‌గా జోకోవిచ్

**న్యూఢిల్లీ:** జెనీవా ఓపెన్ టెన్నిస్ ఛాంపియన్‌గా టెన్నిస్ దిగ్గజం, సెర్బియాకు చెందిన నోవాక్ జోకోవిచ్ నిలిచాడు. జెనీవాలో జరిగిన పురుషుల సింగిల్స్ ఫైనల్లో రెండో సీడ్ జోకోవిచ్ 5-7, 7-6 (7/2)తో పోలాండ్‌కు చెందిన హబర్ట్ హుర్కాజ్‌పై విజయం సాధించాడు. తొలి సెట్‌లో పరాజయం పాలైన జోకో హోరాహోరీగా సాగిన మిగిలిన రెండు సెట్‌లను టై బ్రేకర్ ద్వారా గెలుచుకున్నాడు. ఓవరాల్‌గా ఈ మ్యాచ్‌లో హుర్కాజ్ 19 ఏస్‌లు సంధించగా, జోకోవిచ్ 6 ఏస్‌లకే పరిమితమైనా కీలక సమయాల్లో పాయింట్లు కొల్లగొట్టాడు. హుర్కాజ్ 112 పాయింట్లు నెగ్గగా, జోకో 121 పాయింట్లు సాధించాడు. 2024 పారిస్ ఒలింపిక్స్‌లో 99వ టైటిల్‌ను తన ఖాతాలో వేసుకున్న జోకోవిచ్ ఫ్రెంచ్ ఓపెన్ ప్రారంభానికి ముందు సెంచరీ పూర్తి చేసుకున్నాడు. దీంతో జెనీవా ఓపెన్ టెన్నిస్ ఛాంపియన్‌గా నిలవడంతో తన ఖాతాలో 100వ సింగల్స్ టైటిల్‌ను వేసుకున్నట్లయింది. తద్వారా ఓపెన్ ఎరాలో వందో సింగిల్స్ టైటిల్స్ సాధించిన మూడో ప్లేయర్‌గా జోకోవిచ్ రికార్డుల్లోకి ఎక్కాడు. జిమ్మి కానర్స్ 109, అమెరికా), రోజర్ ఫెదరర్ (103, స్విట్జర్లాండ్) తొలి రెండు స్థానాల్లో ఉన్నారు. కాగా మరొక టోర్నీ ఫ్రెంచ్ ఓపెన్ ప్రారంభమైన నేపథ్యంలో మరోసారి విజేతగా నిలిచేందుకు సిద్ధమవుతున్నాడు. మట్టి కోర్టులో జరగనున్న ఈ ఫ్రెంచ్ ఓపెన్ టోర్నీ తొలి రౌండ్‌లో ఈ నెల 26వ తేదీన అమెరికాకు చెందిన మెకెంజీ మెక్‌డోనాల్డ్‌తో జోకోవిచ్ తలపడనున్నాడు.



# డ్యూరాండ్ కప్‌కు వేదిక ఖరారు

## 5 రాష్ట్రాల్లో ఫుట్‌బాల్ టోర్నీ




**న్యూఢిల్లీ:** ఆసియాలోనే పురాతనమైన ఫుట్‌బాల్ టోర్నమెంట్ అయిన డ్యూరాండ్ కప్ -2025 ఎడిషన్ ఖరారైంది. ఈ టోర్నీ జూలై 23 నుండి ఆగస్టు 23 వరకు దేశంలోని ఐదు రాష్ట్రాల్లో జరుగుతుందని పోటీ నిర్వాహకులు ఆదివారం ప్రకటించారు. ఈ టోర్నమెంట్ కోసం పశ్చిమ బెంగాల్, అస్సాం, మణిపూర్, మేఘాలయ మరియు జార్ఖండ్‌లలో ఆరు వేదికలను ఖరారు చేశారు. నార్త్ ఈస్ట్ యునైటెడ్ ఎఫ్‌సి డిఫెండింగ్ ఛాంపియన్, గత సంవత్సరం జరిగిన ఉత్కంఠభరితమైన ఫైనల్‌లో అత్యధిక టైటిల్ విజేత మోహన్ బగాన్ సూపర్ జెయింట్‌ను ఓడించి చారిత్రాత్మక తొలి టైటిల్‌ను సాధించింది. రెండేళ్ల తర్వాత ఇంఫాల్ ఈ టోర్నమెంట్‌కు వేదికగా తిరిగి రాగా, కోక్రాఝర్ వరుసగా మూడో సంవత్సరం ఆతిథ్యం ఇవ్వనుంది. గత సంవత్సరం జార్ఖండ్‌లోని జంషెడ్‌పూర్ మరియు మేఘాలయలోని షిల్లాంగ్ ఆతిథ్య దేశాలుగా చేర్చబడ్డాయి. మూడు సర్వీసుల తరపున భారత సైన్యం యొక్క తూర్పు కమాండ్ నిర్వహిస్తున్న ఈ టోర్నమెంట్, భారతదేశంలోని అత్యుత్తమ ఫుట్‌బాల్ క్లబ్‌లతో సర్వీసెస్ జట్లను పోటీ పడుతోంది. మరియు గత రెండు ఎడిషన్‌లలో, పొరుగు దేశాల నుండి ఆర్మీ జట్లతో విదేశీ భాగస్వామ్యం కూడా కనిపించింది.

### మహిళల ఎయిర్ రైఫిల్‌లో..

# శాంభవికి స్వర్ణం

## ఓజస్వికి రజతం.. 8 పతకాలతో టాప్‌లో భారత్

**న్యూఢిల్లీ:** ఐఎస్ఎస్ఎఫ్ జూనియర్ షూటింగ్ ప్రపంచకప్‌లో భారత షూటర్ల పతక ప్రదర్శన దిగ్విజయంగా కొనసాగుతున్నది జూనియర్ ప్రపంచ కప్-2025లో మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఈవెంట్‌లో భారత్‌కు చెందిన శాంభవి శ్రవణ్ క్షీ ర్‌సాగర్ బంగారు పతకం సాధించింది. జర్మనీ లోని సుహ్ల్‌లో ఆదివారం జరిగిన ఈ రైఫిల్ ఈవెంట్‌లో శాంభవితో పాటు, మరో భారతీయ క్రీడాకారిణి ఓజస్వి ఠాకూర్ రజత పతకాన్ని గెలుచుకుంది. తన సహచరురాలు ఓజస్వి ఠాకూర్ నుండి గట్టి సవాలు ఎదురైనప్పటికీ, క్షీ ర్‌సాగర్ ప్రారంభం నుండే ఆధిక్యంలో ఉండటంతో ఆమె విజయం మరింత



సులభతరమైంది. ఈ జంట చైనాకు చెందిన లి షిజియాతో కలిసి బాగా ఆరంభించింది, ఇటలీకి చెందిన కార్లోటా సలాఫియా మరియు చైనాకు చెందిన ఒలింపిక్ రజత పతక విజేత హువాంగ్ యుటింగ్ ఆ తర్వాతి స్థానాల్లో నిలిచారు. అదేవిధంగా పురుషుల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఈవెంట్‌లో నరెయిన్ ప్రణవ్ వనితా సురేష్ కాంస్యం గెలుచుకోవడం ద్వారా బంతిని రోలింగ్ చేసింది, ఆ తర్వాత పురుషుల 25 మీటర్ల రాపిడ్ ఫైర్ పిస్టల్ ఈవెంట్‌లో ముఖేష్ నెలవల్లి తన పతకాన్ని సాధించాడు.

పురుషుల 10మీటర్ల ఎయిర్ రైఫిల్ ఈవెంట్‌లో యువ షూటర్ నరేన్ ప్రణవ్ కాంస్యపతకంతో మెరిశాడు. ఇటీవలే ఖేలోఇండియా యూత్‌గేమ్స్‌లో మెరిసిన ప్రణవ్ 227.9 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచాడు. దీంతో భారత్ 2 స్వర్ణాలు, 3 రజతాలు, 3 కాంస్యాలతో సహా మొత్తం



# ఐపిఎల్‌లో అట్టర్ ఫ్లాప్

## సెలక్టర్ల దృష్టిలో సూపర్ హిట్

### టీమిండియాలో ఈ ప్లేయర్లు రాణించేనా?

**న్యూఢిల్లీ:** ప్రస్తుత ఐపీఎల్ 2025లో అట్టర్ ఫ్లాప్ అయిన ప్లేయర్లకు భారత్ కొత్త టీమ్‌లో అగ్రస్థానం లభించింది. పేలవ ప్రదర్శనతో ఇచ్చిన కొంతమందికి ఇండియా టెస్ట్ టీమ్‌లో స్థానం కల్పించారు. జూన్ 20 నుండి ఇంగ్లండ్‌తో జరిగే 5 టెస్ట్‌ల సిరీస్‌లో ఈ ఆటగాళ్లు ఎలా రాణిస్తారో అనేదానిపై పెద్ద ఎత్తున చర్చ సాగుతోంది. ఐపీఎల్‌లో వీరి ప్రస్తుత ఫామ్‌ను బట్టి చూస్తే, క్లిష్టమైన ఇంగ్లండ్ పర్యటన భారత జట్టుకు చాలా కష్టంగా ఉండబోతోందనేది మాత్రం స్పష్టమవుతోంది. ప్రస్తుత ఐపీఎల్‌లో తీవ్రంగా విఫలమవుతోన్న 6 గురు ఆటగాళ్ళు ఉన్నారు. రెండు ఫార్మాట్లు భిన్నంగా ఉన్నప్పటికీ, ఈ ఆటగాళ్ళు ఇంగ్లాండ్‌లో ఎలా రాణిస్తారనేది సందేహాస్పదమవుతోంది. ఈ ఐపీఎల్‌లో రిషబ్ పంత్ బ్యాట్‌తో ఇబ్బంది పడుతున్నాడు. ఇది అతని జట్టును కూడా ప్రభావితం చేసింది. లక్నో సూపర్ జెయింట్స్ ఐపీఎల్ మొదటి రౌండ్‌లోనే నిష్క్రమించింది. ఐపీఎల్‌లో అత్యంత ఖరీదైన ఆటగాడైన పంత్ ఈ సీజన్‌లో 13 మ్యాచ్‌లు ఆడాడు. ఇందులో అతను 13.72 సగటుతో 153 పరుగులు మాత్రమే చేశాడు. అతని పేలవమైన ప్రదర్శన ఉన్నప్పటికీ, అతన్ని భారత్ టెస్ట్ జట్టుకు వైస్ కెప్టెన్‌గా నియమితుడయ్యాడు. ఇక సన్‌రైజర్స్ హైదరాబాద్ ఆల్ రౌండర్ నితీష్ కుమార్ ఈ ఐపీఎల్‌లో ఒక్క హాఫ్ సెంచరీ కూడా చేయలేకపోయాడు. అతను 12 మ్యాచ్‌ల్లో 182 పరుగులు చేసి రెండు వికెట్లు మాత్రమే పడగొట్టగలిగాడు. అయితే, అతను ఇప్పటివరకు 5 టెస్ట్ మ్యాచ్‌ల్లో 37.25 సగటుతో 298 పరుగులు చేశాడు. ఇది కాకుండా 5 వికెట్లు కూడా తీసుకున్నాడు. అలాగే ఈ ఐపీఎల్‌లో తన తొలి మ్యాచ్‌లో అద్భుతమైన ప్రదర్శన తర్వాత, కరుణ్ నాయర్ బ్యాట్ మూగబోయింది. అతను 7 మ్యాచ్‌ల్లో కేవలం 22 సగటుతో 154 పరుగులు చేశాడు. అతని ప్రస్తుత ఫామ్‌ను పరిశీలిస్తే, అతను ఇంగ్లాండ్‌లో కఠినమైన పరీక్షను ఎదుర్కోవలసి ఉంటుంది. గుజరాత్ టైటాన్స్‌కు చెందిన ఆల్ రౌండర్ వాషింగ్టన్ సుందర్ ఈ సీజన్‌లో బ్యాటింగ్, బంతితో దారుణంగా విఫలమయ్యాడు. 5 మ్యాచ్‌ల్లో కేవలం 85 పరుగులు మాత్రమే చేసి 2 వికెట్లు పడగొట్టాడు. అతను టెస్ట్ క్రికెట్‌లో 9 మ్యాచ్‌లు ఆడాడు. ఇందులో 468 పరుగులు చేసి 25 వికెట్లు పడగొట్టాడు. లక్నో సూపర్ జెయింట్స్ ఫాస్ట్ బౌలర్ ఆకాష్ దీప్ ప్రదర్శన ఈ సీజన్‌లో చాలా నిరాశపరిచింది. 6 మ్యాచ్‌ల్లో కేవలం 3 వికెట్లు మాత్రమే తీయగలిగాడు. టెస్ట్ క్రికెట్‌లో 7 టెస్ట్ మ్యాచ్‌ల్లో 15 వికెట్లు పడగొట్టాడు. కాగా లక్నో సూపర్ జైయింట్స్ ఫాస్ట్ బౌలర్ శార్దూల్ ఠాకూర్ ఐపీఎల్ ప్రారంభ మ్యాచ్‌లలో అద్భుతంగా రాణించాడు. కానీ, ఆ తర్వాత అతను వైఫల్యం చెందాడు. ఈ సీజన్‌లో 10 మ్యాచ్‌ల్లో 13 వికెట్లు పడగొట్టాడు. ఇది కాకుండా, అతను టెస్ట్ క్రికెట్‌లో 11 మ్యాచ్‌లు ఆడి 31 వికెట్లు పడగొట్టాడు.

# టెస్ట్‌లో ఇంగ్లండ్ విజయం

## జింబాబ్వే 45 పరుగుల తేడాతో ఓటమి

**న్యూఢిల్లీ:** టీమిండియాతో టెస్టు సిరీస్‌కు ముందు సొం గడ్డపై ఇంగ్లండ్ అదరగొట్టింది. జింబాబ్వేతో 22 ఏళ్ల తర్వాత ఆడిన ఏకైక టెస్టు మ్యాచ్‌లో ఇంగ్లండ్ ఇన్నింగ్స్, 45 పరుగుల తేడాతో విజయం సాధించింది. మూడు రోజుల్లోనే ముగిసిన ఈ నాలుగు రోజుల టెస్టు మ్యాచ్‌లో అటు బౌలింగ్, ఇటు బ్యాటింగ్‌లో ఇంగ్లండ్ సంపూర్ణ ఆధిపత్యం కనపర్చగా, జింబాబ్వే ఏ మాత్రం ప్రభావం చూపలేక



పోయింది. ఓవర్ నైట్ స్కోరు 30/2తో మూడో రోజు ఫాలోఆన్‌లో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన జింబాబ్వే చివరకు 59 ఓవర్లలో 255 పరుగులకు ఆలౌట్ అయింది. సీన్ విలియమ్స్ 82 బంతుల్లో 88 పరుగులు, 16 ఫోర్లు, సికిందర్ రజా 68 బంతుల్లో 60 పరుగులు, 10 ఫోర్లు చేసి అర్ధ శతకాలతో పోరాడారు. ఈ జంట బ్యాటింగ్ చేస్తున్న సమయంలో మెరుగ్గా కనిపించిన జింబాబ్వే, ఇన్నింగ్స్ పరాజయం తప్పించుకునేలా అనిపించినా, ఇంగ్లండ్ స్పిన్నర్ షోయబ్ బషీర్ ఈ ఇద్దరిని పెవిలియన్‌కు పంపి జింబాబ్వే ఆశలపై నీళ్లు చల్లాడు.

ఈ జంట మూడో వికెట్‌కు 122 పరుగులు జోడించింది. బెన్ కరన్ 37 పరుగులు, వెస్లీ మధెవెరె 31 పరుగులతో ఫర్వాలేదనిపించినా, కెప్టెన్ ఇర్విన్ 2 పరుగులు, బెనెట్ 1 పరుగు, తఫద్జా 4 పరుగులు, బ్లెస్సింగ్ ముజరబానీ 4 పరుగులతో విఫలమయ్యారు. ఇంగ్లండ్ బౌలర్లలో బషీర్ 6 వికెట్లుతో సత్తా చాటాడు. అంతకు ముందు ఇంగ్లండ్ 6 వికెట్లు నష్టపోయి 565 పరుగుల వద్ద తొలి ఇన్నింగ్స్ డిక్లేర్ చేయగా, జింబాబ్వే తొలి ఇన్నింగ్స్‌లో 265 పరుగులకే ఆలౌటై ఫాలోఆన్‌లో పడింది. రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి 9 వికెట్లు తీసిన బషీర్‌కు ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు దక్కింది.

# అత్యధిక గోల్డ్ నిల్వలున్న దేశాలివే..


**ముంబై, మే 25:** ప్రపంచంలోనే అత్యంత విలువైన లోహాలలో బంగారం ఒకటి. పురాతన కాలం నుండి బంగారాన్ని వివిధ ప్రయోజనాల కోసం ఉపయోగిస్తున్నారు. ఈ లోహాన్ని కనీసం 5,000 సంవత్సరాల క్రితం పురాతన ఈజిప్టు నుండి ఉపయోగించారు. అక్కడ దీనిని సమాధులు, దేవాలయాలు, ఇతర వస్తువులను అలంకరించడానికి ఉపయోగించారు. ఆధునిక కాలంలో కూడా బంగారాన్ని కరెన్సీ, ఆభరణాలు, ఎలక్ట్రానిక్స్‌లో ఉపయోగిస్తున్నారు. ప్రపంచంలో అత్యధిక బంగారు నిల్వలు కలిగిన మొదటి ఉంది. రెండవ అతిపెద్ద కంపెనీ రియో టింటో, ఆస్ట్రేలియాలో అనేక గనులను కలిగి ఉంది. రష్యా యుఎస్‌జిఎస్ జాబితా ప్రకారం ప్రపంచంలోనే అతిపెద్ద బంగారు నిల్వలు కలిగిన దేశాల జాబితాలో రష్యా 5,300 టన్నులతో రెండవ స్థానంలో ఉంది. 2019లో రష్యా మూడవ అతిపెద్ద బంగారు ఉత్పత్తిదారుగా నిలిచింది. రష్యాలోని తూర్పు సైబీరియాలోని క్రాస్నోయార్స్క్ ప్రాంతంలో ఉన్న పాలియస్ గోల్డ్ ఒలింపియాడా బంగారు గని, ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద బంగారం ఉత్పత్తి చేసే దేశంగా ఉండేది. 1970లో, దక్షి ణాఫ్రికా ఇప్పటివరకు అత్యధికంగా 995 టన్నుల బంగారు ఉత్పత్తిని ఉత్పత్తి చేసింది. దీని ఉత్పత్తి 2018లో 117 టన్నుల నుండి 2019లో 90 టన్నులకు తగ్గింది. అమెరికా యునైటెడ్ స్టేట్స్ 3,000 టన్నుల బంగారు నిల్వలను కలిగి ఉంది. ప్రపంచంలో నాల్గవ స్థానంలో ఉంది. దీని ఉత్పత్తి స్థాయి 2018లో 226 టన్నుల నుండి 2019లో 200



ఐదు దేశాల గురించి తెలుసుకుందాం. ఆస్ట్రేలియా యుఎస్ జియోలాజికల్ సర్వే (యుఎస్‌జిఎస్) డేటా ప్రకారం, ఆస్ట్రేలియా ప్రపంచంలోనే అతిపెద్ద బంగారు నిల్వలను కలిగి ఉంది. 10,000 టన్నులు, ఎస్ఎస్ ఎనర్జీ నివేదించింది. 2019లో, చైనా, భారతదేశం తర్వాత ఆస్ట్రేలియా రెండవ అతిపెద్ద బంగారు ఉత్పత్తిదారుగా నిలిచింది. దాని ఉత్పత్తి స్థాయిని 2018లో 315 టన్నుల నుండి 330 టన్నులకు పెంచింది. న్యూ సౌత్ వేల్స్‌లోని న్యూక్రెస్ట్‌లో ఉన్న కాడియా వ్యాలీ గని ప్రపంచంలోని అతిపెద్ద బంగారు నిక్షేపాలలో ఒకటి. ప్రపంచంలోనే అతిపెద్ద మైనింగ్ కంపెనీ అయిన బిహెచ్‌పి ప్రధాన కార్యాలయం మెల్ బోర్న్‌లో ఆపరేటింగ్ బంగారు గని. దక్షి ణాఫ్రికా 3,200 టన్నుల బంగారు నిల్వలతో దక్షి ణాఫ్రికా అతిపెద్ద బంగారు గనుల నిల్వల జాబితాలో మూడవ స్థానంలో ఉంది. 2006 వరకు, దక్షి ణాఫ్రికా ప్రపంచంలోనే అత్యధికంగా

# బ్యాంకుల స్కామ్‌కు చెక్!


**న్యూఢిల్లీ, మే 25:** భారతదేశంలో త్వరలో బ్యాంకులు ఇన్‌కమింగ్ కాల్ సామర్థ్యాలతో వ్యక్తిగత జాతీయ కాలింగ్ నంబర్‌లను ఉపయోగించే అవకాశం ఉందని పలు నివేదికలు వెల్లడిస్తున్నాయి. ఈ చర్యలు ద్వారా అధికారిక కాల్స్‌ను కస్టమర్‌లు సులభంగా గుర్తించవచ్చు. అలాగే బ్యాంకింగ్ రంగ మోసాలు కూడా తగ్గే అవకాశం ఉందని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ప్రస్తుతం బ్యాంకులు 1600 ఎక్స్‌ఎక్స్ సిరీస్‌లోని మల్టీ అవుట్‌బౌండ్‌ఓన్లీ నంబర్‌లను ఉపయోగిస్తున్నాయి. అయితే ఇవి ఇన్‌కమింగ్ కాల్స్‌కు మద్దతు ఇవ్వవు. కాబట్టి ప్రస్తుతం బ్యాంకులు ప్రతి బ్యాంకుకు ఒక ప్రత్యేకమైన జాతీయ నంబర్‌ను కేటాయించే వ్యవస్థను ప్రతిపాదించాయి. ముఖ్యంగా 1600 ఎక్స్‌ఎక్స్ సిరీస్‌లో ఉండే నంబర్ ద్వారా ఇన్‌కమింగ్, అవుట్ గోయింగ్ సామర్థ్యాలతో వస్తుంది. ప్రతి బ్యాంకుకు ఒక జాతీయ నంబర్, అలాంటి నంబర్లకు ఇన్‌బౌండ్ కాల్‌లను అనుమతించడం వల్ల కస్టమర్ భద్రత, అనుభవం మరింత మెరుగుపడుతుందని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఇప్పటికే బ్యాంకులు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కేంద్ర ప్రభుత్వంతో చర్చలు జరిపాయని, త్వరలోనే సానుకూల నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. అయితే రుణ రికవరీ కోసం ఈనంబర్లనే ఉపయోగించే అవకాశం ఉందని చెబుతున్నారు. కానీ ఈ విధానాన్ని కొన్ని బ్యాంకులు వ్యతిరేకిస్తున్నాయి. ముఖ్యంగా బ్యాంకులు తమ రికవరీ ప్రక్రియలను అవుట్‌సోర్స్ చేస్తున్నందున మూడో పార్టీ ఏజెంట్లు కూడా 1600ఎక్స్‌ఎక్స్ సిరీస్‌ను ఉపయోగించాల్సి ఉంటుందా. లేదా? అనే దానిపై అనిశ్చితి ఉంది. ఈ విషయంపై ఆర్‌బీఐ, టెలికం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (ట్రాయ్) నుంచి స్పష్టత కోరుతున్నట్లు పలువురు నిపుణులు స్పష్టం చేస్తున్నారు. అదనంగా బ్యాంకులు 1600 ఎక్స్‌ఎక్స్ నంబర్‌ల వాడకంపై స్పష్టమైన మార్గదర్శకాలను, సంప్రదించడానికి ముందస్తు అనుమతి ఇచ్చిన క్లయింట్‌లకు మినహాయింపులను అభ్యర్థిస్తున్నాయని పేర్కొంటున్నారు.




# వాణిజ్యం

# అందుబాటులోకి శాటిలైట్ ఇంటర్నెట్

**ముంబై, మే 25:** దేశంలో శాటిలైట్ ఇంటర్నెట్ సేవలు త్వరలో అందుబాటులోకి రానున్నాయి. ఎలాన్ మస్క్‌కు చెందిన స్టార్ లింక్‌తో పాటు ఇతర కంపెనీలు ఈ సేవలను ప్రారంభించేందుకు సన్నద్ధమవుతున్నాయి. అయితే, తొలి దశలో యూజర్లను ఆకట్టుకునేందుకు తక్కువ ధరలోనే డేటా సేవలను ఆయా కంపెనీలు అందించే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు పేర్కొంటున్నాయి. నెలకు 10 డాలర్ల కంటే తక్కువ అంటే రూ.840లోపే ఈ ప్లాన్ ధరలు ఉండొచ్చని చెబుతున్నారు. ఆ ధరకే అపరిమిత డేటా అందించే అవకా శం ఉందనిపేర్కొంది. తొలుత ఆయా కంపెనీలు తమ యూజర్ బేస్‌ను పెంచుకోవడంపై దృష్టి సారించే అవకాశం ఉంది. 10 మిలియన్ కస్టమర్లను చేరుకోవడం ద్వారా స్పెక్ట్రమ్ కాస్ట్‌ను భర్తీ చేసుకోవడం సాధ్యమవుతుందని విశ్లేషకులు పేర్కొంటున్నారు. శాటిలైట్ కమ్యూనికేషన్ సేవలకు సంబంధించి ఒక్కో అర్బన్ యూజర్ నుంచి రూ.500 చొప్పున ఫీజు వసూలు చేయాలని ట్రాయ్ ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. సాధారణ సర్వీసులతో పోలిస్తే ఈ మొత్తం చాలా అధికం. దీనికితోడు సర్దుబాటు చేసిన స్థూల ఆదాయంలో 4 శాతం లెవీగా చెల్లించాలని ట్రాయ్ పేర్కొంది. లీబ్రీ స్పెక్ట్రానికి ఏడాదికి కనీసం రూ.3500 వార్షిక ఫీజును ట్రాయ్ ప్రతిపాదించింది. దీనికి ఇంకా ప్రభుత్వం నుంచి ఆమోదం లభించాల్సి ఉంది. ఈ స్థాయిలో లైసెన్స్ ఫీజు, స్పెక్ట్రమ్ ఛార్జీలు ఉన్నప్పటికీ వినియోగదారులను పెంచుకునేందుకు తక్కువ ధరకే శాటిలైట్ ఇంటర్నెట్ సేవలను ప్రారంభించొచ్చని విశ్లేషకులు పేర్కొంటున్నారు. మరోవైపు దేశీయంగా సర్వీసులు ప్రారంభించడానికి స్టార్ లింక్‌కు టెలికాం విభాగం నుంచి అనుమతులు లభించాయి. ఇంకా ఇండియన్ నేషనల్ స్పేస్ ప్రమోషన్ అండ్ ఆథరైజేషన్ సెంటర్ ఆమోదం తెలపాల్సి ఉంది. స్టార్‌లింక్‌తో పాటు యూటెల్సాట్ వన్‌వెబ్, జియో శాటిలైట్ కమ్యూనికేషన్స్ కూడా డాట్ నుంచి అనుమతులు పొందినా ఇన్‌స్పేస్ నుంచి తుది అనుమతుల కోసం వేచి చూస్తున్నాయి. ఈ అనుమతులు లభిస్తే శాటిలైట్ ఇంటర్నెట్ సేవలు త్వరలోనే పౌరులకు అందుబాటులోకి రానున్నాయి.



# వజ్రాలకు పెరుగుతున్న డిమాండ్

**ముంబై, మే 25:** భారత్‌లో వజ్రాల వినియోగం 2030 నాటికి రెట్టింపు అవుతుందని భావిస్తున్నట్లు డీబీర్స్ గ్రూప్ కంపెనీ సిఇఒ తెలిపారు. భారత్‌లో ఫరెవర్ మార్క్ బ్రాండ్‌ను విడుదల చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. సహజ వజ్రాభరణాలకు భారత్ ప్రపంచంలో రెండో అతిపెద్ద మార్కెట్‌గా ఉన్నట్లు తెలిపారు. గతేడాది చైనాను అధిగమించినట్లు చెప్పారు. యేటా 12 శాతం చొప్పున డిమాండ్ పెరుగుతున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం భారత్‌తో సహజ వజ్రాభరణాల డిమాండ్ 10 బిలియన్ డాలర్లలోపు ఉన్నట్లు చెప్పారు. భవిష్యత్ వృద్ధి పట్ల ఆశావహంగా ఉన్నట్లు పేర్కొన్నారు. ఢిల్లీ ముంబైలో రెండు చొప్పున మొత్తం నాలుగు ఫరెవర్‌మార్క్ స్టోర్లను తెరవనున్నట్లు వచ్చే ఐదేళ్లలో 100 స్టోర్లను లక్ష్యంగా పెట్టుకున్నట్లు ప్రకటించారు. కంపెనీ సొంత స్టోర్లతో పాటు, ఫ్రాంచైజీ రూపంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాల పరిధిలో ఇవి ఉంటాయన్నారు. ల్యాబ్ గ్రోన్ వజ్రాలకు వాణిజ్యపరంగా భవిష్యత్ ఉంటుందని అంచనా వేస్తున్నట్లు కుక్ చెప్పారు. ఎల్‌జిడిల టోకు ధరలు 90శాతం వరకు పడిపోయినట్లు తెలిపారు.



# సుజుకీ ఇ-యాక్సెస్ తయారీ షురూ

**ముంబై, మే 25:** ప్రముఖ ద్విచక్ర వాహన తయారీ సంస్థ సుజుకీ మోటార్ సైకిల్ ఇండియా తన పాపులర్ స్కూటర్ యాక్సెస్‌లో ఈవీ వేరియంట్‌ను తీసుకొస్తోంది. భారత్ మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పో 2025లో తొలిసారిగా ప్రదర్శించిన ఇయాక్సెస్ తయారీని గురుగ్రామ్ ప్లాంట్‌లో ప్రారంభించినట్లు తెలిపింది. త్వరలోనే ఈవీకి మార్కెట్లోకి విడుదల చేయనుంది. విద్యుత్ స్కూటర్ విభాగంలోకి సుజుకీ అడుగుపెట్టాలని చాలా కాలంగా చూస్తోంది. ఇయాక్సెస్‌తో ఎంట్రీ ఇవ్వాలని ప్రణాళికలు రచిస్తోంది. దీర్ఘకాల మన్నిక, అత్యుత్తమ థర్మల్ స్టెబిలిటీతో కూడిన ఇటెక్నాలజీతో ఈ విద్యుత్తు స్కూటర్‌ను రూపొందిస్తున్నట్లు పేర్కొంది. లిథియం ఐరన్ ఫాస్పేట్ బ్యాటరీ ఈ స్కూటర్‌ను తీసుకొస్తున్నారు. రీ జెనరేటివ్ బ్రేకింగ్, ఫ్రీ బెల్ట్ డ్రైవ్ సిస్టం, రివర్స్ మోడ్ తో పాటు (ఎకో మోడ్, రైడ్ మోడ్ ఏ, రైడ్ మోడ్ బీ) అనేక రకాల రైడింగ్ మోడ్స్‌తో రానుంది. సుజుకీ కొత్త విద్యుత్ స్కూటర్ ఇ యాక్సెస్ 3కెడబ్ల్యూహెచ్ బ్యాటరీతో తీసుకొస్తున్నారు.




ఇది 95 కిలోమీటర్ల రేంజ్ ఇస్తుందని కంపెనీ చెబుతోంది. పోర్ట బుల్ ఛార్జర్‌తో 6 గంటలు 12 నిమిషాల్లో ఫుల్ ఛార్జ్, ఫాస్ట్ ఛార్జర్‌తో అయితే 2గంటల 12 నిమిషాల్లో ఛార్జ్ పూర్తవు తుందని కంపెనీ వెల్లడించింది.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at Flat.No. 22, G Block ,Industrial park Auto Nagar , Gajuwaka, Visakhapatnam-530 012, Phones:2706784,2706785,2706786,2706787,2706622, Fax: 2706522, RNI No.64864/96, Editor : *Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act. Regd.No. H/SD/337/12-14.